

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 185

బుధవారం 25-9-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నిరీక్షణ ముగిసె...

కెరీర్‌లో తొలి డబుల్స్ టైటిల్ నెగ్గిన భారత టెన్నిస్ ప్లేయర్ విజయ్ - 14లో



'క్విక్' విస్తరణ!

భారీగా డార్క్ స్టోర్లను ఏర్పాటు చేస్తున్న క్విక్ కామర్స్ సంస్థలు - 15లో



సిద్ధరామయ్యకు షాక్

ముడా భూ కుంభకోణం కేసులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు హైకోర్టులో చుక్కెదురైంది. గవర్నర్ నిర్ణయాన్ని కోర్టు సమర్థించింది.

- వివరాలు 6లో▶



శ్రీలంక ప్రధానిగా హరిణి

శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమర సూర్య ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడు అనూర ఆమెతో ప్రమాణం చేయించారు.

- వివరాలు 6లో▶



కోల్‌కతాలో ట్రామ్‌లకు సెలవు

150 ఏళ్లుగా కొనసాగుతున్న ట్రామ్‌ల సేవలను త్వరలో పూర్తిగా నిలిపివేయాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది.

- వివరాలు 6లో▶



ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి

ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు.

- వివరాలు 6లో▶



'మూసీ' నిర్వాసితులకు 'డబుల్' ఇళ్లు!

చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నివసిస్తున్న అర్హులైన పేదలకూ కేటాయింపు

- మూసీ రివర్‌ఫ్రంట్‌పై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- జల వనరుల పరిరక్షణ చర్యల్లో పేదలు రోడ్డున పడొద్దు
- వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపాలి
- ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురవకుండా గట్టి పర్యవేక్షణ
- సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలని ఆదేశం
- శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోరైల్ విస్తరణ

సాక్షి, హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతంతోపాటు హైదరాబాద్‌లోని చెరువులు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నివసిస్తున్న అర్హులైన పేదలెవరూ నిరాశ్రయులు కావడానికి వీల్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. జల వనరుల పరిరక్షణలో పేదలు రోడ్డున పడవద్దని, అర్హులైన వారికి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు. నీటి వనరుల పరిరక్షణకు వారు సహకరించేలా ఒప్పించడంతోపాటు అర్హులైన పేదలకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు అర్హులైన పేదల వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణను బాధ్యతగా చేపట్టాలని.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తుపెట్టుకోవాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్, మెట్రో రైలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షణను మిగతా 2వ పేజీలో ▶

నేటి నుంచే 'మూసీ' పునరావాస ప్రక్రియ!

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే కుటుంబాలకు 16 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీ రివర్ బెడ్ (నదీ గర్భం), బఫర్ జోన్లలో నివాసమున్న వారికి పునరావాసం కల్పించేందుకు వీటిని ఉపయోగిస్తారు. మూసీ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని సీఎం రేవంత్ ప్రకటించిన నేపథ్యంలో.. పునరావాస ప్రక్రియను బుధవారం ప్రారంభించనున్నారు. 10,200 మందిని నిర్వాసితులుగా గుర్తించారు. బుధవారం నుంచి రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు.. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎక్కడెక్కడ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించారో వివరించనున్నారు. తొలుత రివర్ బెడ్‌లోని 1,600 ఇళ్లను తొలగిస్తారు. వారిలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తారు. ఇక మూసీ బఫర్ జోన్‌లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే సదరు నిర్మాణ ఖర్చుతోపాటు పట్టా ఉన్న భూమి విలువను పరిహారంగా చెల్లిస్తారు. డబుల్ బెడ్రూమ్ ఇంటిని కూడా కేటాయిస్తారు.

16న విచారణకు హాజరుకండి

'ఓటుకు కోట్లు' కేసులో సీఎం రేవంత్‌కు నాంపల్లి కోర్టు ఆదేశం

విచారణకు గైర్హాజరు కావడంపై న్యాయమూర్తి అసహనం 2లో


సిట్.. బాబు స్కిట్

చంద్రబాబు స్క్రిప్ట్‌కు అనుగుణంగా నివేదిక రెడీ

అందుకే సిట్ ఇన్‌చార్జ్‌గా జీ హుజూర్.. అనే అధికారికి బాధ్యతలు

టీడీపీ కార్యాలయంలో తయారైన నివేదికపై సంతకమే తరువాయి.. తద్వారా తిరుమల ఆలయ ప్రతిష్టపై మరో మచ్చకు కుట్ర

- ఎన్నికల్లో టీడీపీ కూటమి అక్రమాలకు బహిరంగంగా సదరు ఐజీ వత్తాసు
- నాడు పల్నాడులో పచ్చమూకల అరాచకానికి అండ.. ఊళ్లు రావణకాష్టంగా మారినా స్పందించని వైనం
- ఇలాంటి అధికారి నిష్పక్షపాతంగా పని చేస్తారన్నది నీటిపై రాతలే



శ్రీవారి లడ్డూపై దుష్ప్రచారం తన మెడకే చుట్టుకుంటుండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. దాన్నుంచి తప్పించుకోవడానికి తన నమ్మకస్తులతో కూడిన సొంత టీమ్‌కు తూతూ మంత్ర దర్యాప్తు బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశమైంది. చంద్రబాబు అండ్ గ్యాంగ్ ఆరోపిస్తున్నట్లు తిరుమల లడ్డూ తయారీలో నిజంగానే కల్తీ నెయ్యి వాడి ఉంటే అత్యున్నత స్థాయి దర్యాప్తు జరిపించడానికి ఎందుకు వెనకాడుతున్నారనే ప్రశ్నలకు వారి వద్ద సమాధానం లేదు. ఈ వ్యవహారంపై సీబీఐ లేదా సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రపంచ వ్యాప్తంగా యావత్ హిందూ భక్తులందరూ ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రభుత్వ పెద్దల తీరు పట్ల, టీటీడీ ఈవో రెండు నాల్కల ధోరణిపై సర్వత్రా అనుమానాలు పెల్లుబుకుతుండటంతో చంద్రబాబు నష్ట నివారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ బృందానికి నాయకత్వం వహించే ఐజీ.. సర్వం భ్రష్టు పట్టించే అధికారిగా ఇప్పటికే పేరుగాంచారు. 12లో

ఇప్పుడు ఈ అధికారి టీడీపీ కేంద్ర కార్యాలయంలో తయారయ్యే నివేదికపై సంతకం మాత్రమే చేయాల్సి ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

న్యూస్‌రీల్

మరోసారి తెరపైకి 'గోల్కొండ వజ్రం'



18వ శతాబ్దం నాటి అరుదైన నెక్లెస్ నవంబర్‌లో వేలానికి వస్తోంది. మూడు వరుసల నెక్లెస్‌లో దాదాపు 500 వజ్రాలు ఉన్నాయి. ఈ వజ్రాలు గోల్కొండ గనుల నుంచి సేకరించినవేనని భావిస్తున్నారు. ఇది 2.8 మిలియన్ డాలర్ల గరిష్ట ధర పలుకుతుందని అంచనా.

వివరాలు 3లో▶

అనుమతి లేకుండానే బ్యాంకు గ్యారంటీల విడుదల



రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన రూ.159 కోట్ల బ్యాంకు గ్యారంటీలను ఎల్ అండ్ టీకి నీటిపారుదల శాఖ మహదేవ్‌పూర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ తిరుపతిరావు విడుదల చేశారు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణలో ఈ విషయం వెల్లడైంది.

వివరాలు 2లో▶

కొనసాగిన దాడులు, ప్రతిదాడులు



ఇజ్రాయెల్ ఆర్మీ, లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ల మధ్య దాడులు, ప్రతిదాడులు మంగళవారం కూడా కొనసాగాయి. మరోవైపు సోమవారం నాటి ఇజ్రాయెల్ దాడుల్లో మృతుల సంఖ్య 558కి చేరింది. 1,835 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో▶

38 కాలేజీల్లో జాబ్ గ్యారంటీ కోర్సులు



- యూజీతోపాటు కొత్తగా నైపుణ్య డిగ్రీ కోర్సు.. బీఎఫ్ఎస్ఐ కోర్సులున్న కాలేజీల జాబితా విడుదల
- ఇందులో 18 ఇంజనీరింగ్, 20 నాన్ ఇంజనీరింగ్ కాలేజీలు.. కోర్సు ముగిశాక ఆన్‌లైన్‌లోనే నేరుగా సెలెక్షన్ ప్రక్రియ
- నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కచ్చితమైన ఉపాధి కల్పించే ప్రయత్నాల్లో భాగంగా బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ)రంగాల్లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్దిష్ట కాలేజీల్లో ప్రస్తుత 2024–25 విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జాబ్ గ్యారంటీ కోర్సులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. రెగ్యులర్ డిగ్రీతోపాటు మినీ డిగ్రీ కోర్సుగా 'బీఎఫ్ఎస్ఐ' నైపుణ్య శిక్షణను అందించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 38 కాలేజీల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఉన్నత విద్యామండలి గుర్తించిన 18 ఇంజనీరింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో చదువుతున్న 10వేల మంది విద్యార్థులకు శిక్షణ అందనుంది. ఈ కాలేజీల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం మిగతా 3వ పేజీలో ▶

హిందువులంతా ఏకం కావాలి



- సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించను
- హిందువులు కనీసం కోపం తెచ్చుకోకపోతే ఏం చేయగలం?
- సెక్యులరిజం వన్‌వే కాదు టూ వే
- అల్లా, జీసస్‌ను ఎవరైనా.. ఏమైనా అనగలరా?
- సున్నితాంశాలపై ప్రకాశ్‌రాజ్ తెలుసుకొని మాట్లాడాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ వ్యాఖ్యలు

12లో

ఎట్టకేలకు ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ షురూ



- మెరిట్ లిస్ట్ విడుదల చేసిన కాళోజీ వర్సిటీ.. రేపట్నుంచి వెబ్ ఆప్షన్లు
- స్థానికతపై కోర్టుకెక్కిన 132 పిటిషనర్లకు అనుమతి.. మరో 9 మందికి ఏపీలోనూ స్థానికత ఉన్నందున తిరస్కృతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎట్టకేలకు ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ మొదలైంది. ఇందుకోసం దరఖాస్తు చేసుకున్న 16,679 మంది విద్యార్థుల వివరాలతో ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం రాత్రి విడుదల చేసింది. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా అన్ని సాక్ష్యాలతో వర్సిటీ ఈ–మెయిల్ knrugadmission@gmail.comకు పంపించాలని వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి సూచించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం గురువారం తుది మిగతా 3వ పేజీలో ▶

డీఎస్సీ-2008 బీఈడీ అభ్యర్థులకు ఊరట



- కాంట్రాక్టు సర్వీసుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వ నిర్ణయం
- సుమారు 1,300 మందికి ఉపాధ్యాయులుగా లభించనున్న అవకాశం

సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ–2008లో ఉద్యోగాలు పొందని బీఈడీ అభ్యర్థులను ఉమ్మడి జిల్లాలవారీగా కాంట్రాక్టు సర్వీసుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 1,300 మంది అభ్యర్థులకు ఈ ఉత్తర్వులతో కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా అవకాశం లభించనుంది. డీ.ఎడ్ విద్యార్హతగల అభ్యర్థులకు ఎస్‌జీటీ పోస్టుల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 2009 జనవరి 29న జారీ చేసిన జీవో–28 కారణంగా ఉద్యోగాలు పొందని బీఈడీ అభ్యర్థుల వివరాలను ప్రభుత్వం పాఠశాల విద్య డైరెక్టర్‌ను కోరింది. ఈ మేరకు మిగతా 3వ పేజీలో ▶

ప్రభుత్వం పేదల గూడు కూలుస్తోంది

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




- రేవంత్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకొని పంచుకుంటోంది
- వారి దౌర్జన్యాలతో 'రియల్'రంగం కుప్పకూలింది.. హైడ్రా బాధితులకు అండగా నిలుస్తాం

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైడ్రా పేరిట పేదల బతుకులను రోడ్డు పాలు చేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయం అనే రీతిలో ప్రభుత్వ తీరు ఉందని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూలిస్తే తాము ఊరుకోబోమన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ అన్ని సీట్లనూ గెలుచుకోవడంతో కాంగ్రెస్‌కు ఓటేయలేదనే కక్షతో రేవంత్.. ప్రజలపై కక్ష కట్టారని ఆరోపించారు. రేవంత్ కుటుంబం, ఆయన సోదరులు రాష్ట్రాన్ని పంచుకొని స్వైర విహారం చేస్తున్నారని.. వారి దౌర్జన్యాలతో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని దుయ్యబట్టారు. మాదాపూర్‌లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి కమీషన్ల దుకాణం తెరిచారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తనకు చెప్పారన్నారు. నోటీసు డ్రామా ఆడి తిరుపతిరెడ్డి ఇల్లు కూల్చకుండా స్టే తెచ్చుకొనేందుకు ప్రభుత్వం ఆయనకు సహకరించిందని కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. పేదల పిల్లలు కనీసం తమ పుస్తకాలు కూడా తీసుకొనే వ్యవధి ఇవ్వని హైడ్రా అధికారులు.. సీఎం సోదరుడి ఇంటిని మాత్రం ముట్టుకోవట్లేదని మండిపడ్డారు.

త్వరలో గ్రేటర్ ఎమ్మెల్యేల సమావేశం..

'ప్రభుత్వానికి దమ్ముంటే మంత్రి పొంగులేటి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తదితరుల ఇళ్లు కూల్చాలి. పేదలకు దిక్కులేక నాలాలపై ఇళ్లు కట్టుకుంటే కనీసం నోటీసు కూడా ఇవ్వట్లేదు. గత ప్రభుత్వం నిర్మించిన 40 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు ఇవ్వాలి. పేదలకు అండగా నిలిచేందుకు త్వరలో మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి




ఏదో ముఖ్యమైన విషయంలో కేజ్రీవాల్ గారితో చర్చిస్తున్నారట!

బాబు తెచ్చిన నెయ్యే

సాక్షి, అమరావతి: జరగని తప్పు జరిగిందంటూ పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిచ్చి ప్రేలాపనలు పేలుతూ ఘోర అపచారానికి ఒడిగట్టారు. లడ్డూల తయారీలో స్వచ్ఛమైన ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యిని వాడారంటూ నిరాధారమైన, దారుణ ఆరోపణలు చేశారు. ఎన్‌డీడీబీ (నేషనల్‌ డెయిరీ డెవలప్‌మెంట్‌ బోర్డు) కాల్ఫ్‌ (సెంటర్‌ ఫర్‌ ఎనాలసిస్‌ అండ్‌ లెర్నింగ్‌ లైవ్‌ స్టాక్‌, ఫుడ్‌) టెస్ట్‌ రిపోర్ట్‌లను సీఎం చంద్రబాబు ఆధారంగా చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో పాల ఉత్పత్తులు, ఆహార నాణ్యత సంస్థలలో పనిచేస్తూ విశేష అనుభవం గడించిన పలువురు నిపుణులను ఎన్‌డీడీబీ కాల్ఫ్‌ రిపోర్టుపై 'సాక్షి'సంప్రదించింది. జంతువుల కొవ్వు ఆనవాళ్లు ఆ నెయ్యిలో లేవని వారంతా ముక్తకంఠంతో స్పష్టం చేశారు.

- నాలుగు శాంపిళ్లను పరీక్షించి ఎన్‌డీడీబీ కాల్ఫ్‌ ఇచ్చిన నాలుగు టెస్ట్‌ రిపోర్టులలో మిల్క్‌ ఫ్యాట్‌ వరుసగా 99.584, 99.610, 99.618, 99.677 శాతం ఉందని.. మిగిలిన 0.416, 0.390, 0.382, 0.323 శాతం మాయిశ్చర్‌ (తేమ), ఇతరాలు (విటమిన్స్‌, కెరటిన్‌, మినరల్స్‌ తదితరాలు) ఉంటాయని నిపుణులు విశ్లేషించారు.
- కేజీ నెయ్యిలో ఏ సరఫరా సంస్థైనా 20 నుంచి 30 గ్రాముల వెజిటబుల్‌ ఆయిల్‌, జంతువుల కొవ్వు కలిపే స్థాయికి దిగజారదని స్పష్టం చేశారు.
- కల్తీ నెయ్యి సరఫరా చేసినందుకు ఎన్‌డీడీబీ కాల్ఫ్‌ టెస్ట్‌ రిపోర్టుల ఆధారంగా ఎందుకు బ్లాక్‌ లిస్ట్‌లో పెట్టకూడదో చెప్పాలంటూ ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌కు టీటీడీ మార్కెటింగ్‌ విభాగం జనరల్‌ మేనేజర్‌ పి.మురళీకృష్ణ జూలై 27న జారీ చేసిన షోకాజ్‌ నోటీసులోనూ.. దానికి ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌ ఇచ్చిన జవాబును తిరస్కరిస్తూ జూలై 28న ఇచ్చిన రిజాయిండర్‌ షోకాజ్‌ నోటీసులోనూ జంతువుల కొవ్వు ఆ నెయ్యిలో కలిసిందని ఎక్కడా స్పష్టంగా తేల్చిచెప్పకపోవడాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. వెజిటబుల్‌ ఆయిల్‌తో పాటు ఫారిన్‌ ఫ్యాట్స్‌ కలిసి ఉండొచ్చునంటూ అనుమానం మాత్రమే వ్యక్తం చేశారని పేర్కొంటున్నారు.

- చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన జూన్‌ 12 నుంచే టీటీడీకి నెయ్యి సరఫరా ప్రారంభించిన తమిళనాడు డెయిరీ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క గ్రాము నెయ్యిని కూడా టీటీడీకి సరఫరా చేయని ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌



- సీఎం చంద్రబాబు మాత్రం టీటీడీ వెనక్కి పంపేసిన ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని, దాన్ని శ్రీవారి లడ్డూల తయారీలో వాడారని.. వాటిని భక్తులకు పంపిణీ చేశారని.. భక్తులు వాటిని తినేశారంటూ పచ్చి అబద్ధాలు వల్లె వేస్తుండటంపై నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- దీన్ని బట్టి చూస్తే.. సున్నితమైన అంశంపై ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలన్న స్వార్థంతోనే పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని సీఎం చంద్రబాబు అపవిత్రం చేసి ఘోర అపరాధం చేశారన్నది స్పష్టమవుతోంది.

బాబు ప్రభుత్వంలోనే కల్తీ నెయ్యి సరఫరా..

- స్పెషల్‌ గ్రేడ్‌ ఆగ్‌ మార్క్‌ ఆవు నెయ్యి కోసం 2024 మార్చి 12న టీటీడీ ఈ–టెండర్లు పిలిచింది. అయితే ఎన్నికల సంఘం మార్చి 16న సాధారణ ఎన్నికల షెడ్యూలును విడుదల చేయడంతో అదే రోజు నుంచి ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. దాంతో ప్రభుత్వానికి ఎలాంటి నిర్ణయాధికారం ఉండదు.
- ఈ టెండర్లు 2024 మే 8న టెండర్లు ఖరారయ్యాయి. కేజీ రూ.319.80 చొప్పున పది లక్షల కిలోల నెయ్యి సరఫరా కాంట్రాక్టును తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌ దక్కించుకుంది. టీటీడీకి నెయ్యి సరఫరాను జూన్‌ 12 నుంచి ఆ సంస్థ ప్రారంభించింది. అదేరోజు సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేశారు. దీన్ని బట్టి ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌ సంస్థ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేజీ కాదు కదా కనీసం ఒక గ్రాము నెయ్యిని కూడా టీటీడీకి సరఫరా చేయలేదన్నది స్పష్టమవుతోంది.
- చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జూన్‌ 12, 21, 25, జూలై 4వ తేదీలలో ఏఆర్‌ ఫుడ్స్‌ సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో ఒక్కో ట్యాంకర్‌ నుంచి మూడు శాంపిళ్లను తీసుకుని తిరుమలలోని టీటీడీ ల్యాబొరేటరీకి టీటీడీ మార్కెటింగ్‌ విభాగం అధికారులు పంపారు. టెండర్‌లో పేర్కొన్న ప్రమాణాల మేరకు ఆ నెయ్యి ఉందని తేల్చడంతో ఆ నాలుగు ట్యాంకర్లను టీటీడీ అధికారులు గోదాములోకి అనుమతించి నెయ్యిని అన్‌లోడ్‌ చేసుకున్నారు.
- ఈ క్రమంలో జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 15న రెండు ట్యాంకర్ల నెయ్యిని టీటీడీకి ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌ పంపింది. ఆ ట్యాంకర్ల నెయ్యి శాంపిళ్లను పరీక్షించిన టీటీడీ ల్యాబొరేటరీ టెండర్‌లో పేర్కొన్న ప్రమాణాల మేరకు లేదని తిరస్కరించింది. దాంతో ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యిని టీటీడీ అధికారులు వెనక్కి పంపేశారు. అంటే.. కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో అసలు వాడలేదన్నది స్పష్టమవుతోంది. సీఎం చంద్రబాబు మాత్రం శ్రీవారి లడ్డూల తయారీలో జంతుకొవ్వు కలిసిన నెయ్యిని వాడారంటూ పచ్చి అబద్ధాలు వల్లె వేస్తుండటం గమనార్హం.

మరిన్ని వివరాలకు క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయండి

నివేదికలో ఒకలా.. షోకాజ్‌ నోటీసుల్లో మరోలా

కల్తీ నెయ్యి వ్యవహారంపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు గత ఆదివారం సీఎం చంద్రబాబుకు నివేదిక ఇచ్చారు. ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరాను జూన్‌ 12 నుంచి ప్రారంభించిందని.. 8 ట్యాంకర్ల నెయ్యిని సరఫరా చేసిందని నివేదికలో పేర్కొన్నారు. ఇందులో 4 ట్యాంకర్ల నెయ్యి నాణ్యంగా ఉందని టీటీడీ ల్యాబొరేటరీ తేల్చిందని వెల్లడించారు. జూలై 6, 15న సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో నాణ్యంగా లేదని.. ఆ నెయ్యి శాంపిళ్లను ఎన్‌డీడీబీ కాల్ఫ్‌కు పరీక్షల నిమిత్తం పంపామని వివరించారు. ఎన్‌డీడీబీ జూలై 23న టెస్ట్‌ రిపోర్టులు ఇచ్చిందని.. ఆ నెయ్యిలో వెజిటబుల్‌ ఆయిల్స్‌తోపాటు జంతువుల కొవ్వు కలిసి ఉండొచ్చునని అనుమానం వ్యక్తం చేసిందన్నారు. దాంతో 4 ట్యాంకర్లను వెనక్కి పంపేశామని.. సరఫరాను ఆపేశామని పేర్కొన్నారు. కానీ.. ఇదే అంశంపై ఎన్‌డీడీబీ టెస్ట్‌ రిపోర్టులు ఇచ్చిన రోజు అంటే జూలై 23న తిరుమలలో ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. 4 ట్యాంకర్లలో నెయ్యి కల్తీ అయినట్లు నివేదికలో తేలిందని.. ఏఆర్‌ డెయిరీ ఫుడ్స్‌కు జూలై 27న ఇచ్చిన షోకాజ్‌ నోటీసులోనూ.. 28న ఇచ్చిన రిజాయిండర్‌ షోకాజ్‌ నోటీసులోనూ నెయ్యిలో వెజిటబుల్‌ ఆయిల్‌ కలిసిందని, ఫారిన్‌ ఫ్యాట్‌ కలిసి ఉండే అవకాశం ఉండొచ్చునని టీటీడీ పేర్కొంది. కానీ.. రెండు నెలల తర్వాత సీఎంకు ఇచ్చిన నివేదికలో టీటీడీ ఈవో శ్యామలరావు మాట మార్చడం గమనార్హం. సీఎంవో నుంచి తీవ్ర స్థాయిలో వచ్చిన ఒత్తిడికి తలొగ్గే ఈవో శ్యామలరావు జూలై 23న మీడియాతో ఒకలా మాట్లాడి.. ఈనెల 22న సీఎంకు మరోలా నివేదిక ఇచ్చారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా...

9న లాభాల వాటా చెల్లింపు

సింగరేణి సీఎండీ బలరామ్‌ ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌/సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇస్తామని ప్రకటించిన 33% వాటాను వచ్చే నెల 9వ తేదీన చెల్లించనున్నారు. ఈ విషయమై అమెరికా పర్యటనలో ఉన్న సింగరేణి సీఎండీ బలరామ్‌ వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా మంగళవారం డైరెక్టర్లు, జీఎంలకు ఆదేశాలు జారీచేశారు. నికర లాభంలో 33 శాతం అనగా రూ.796 కోట్లు కార్మికులకు చెల్లించనున్నట్లు ఇటీవల ప్రకటించారు. సంస్థలోని సుమారు 42వేల మంది ఉద్యోగులకు గత ఆర్థిక సంవత్సరం హాజరు ఆధారంగా వాటా చెల్లించనున్నారు. సగటున ఒక్కొక్కరికి రూ.1.90లక్షలు వస్తాయని అంచనా. ఇక తొలిసారిగా ఈ ఏడాది కాంట్రాక్ట్‌ కార్మికులు 25 వేల మందికి రూ.5 వేల చొప్పున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు కార్మికుల హాజరు, ఇతర వివరాలు సేకరించాలని సీఎండీ సూచించారు.

3న దసరా అడ్వాన్స్‌

సింగరేణి కార్మికులకు (హిందువులకు) దసరా అడ్వాన్స్‌ రూ.25 వేలు, బదిలీ వర్కర్లకు రూ.12,500 చొప్పున చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కంపెనీ రోల్స్‌లో ఉన్న కార్మికులకు మాత్రమే వర్తిస్తుందని, మెడికల్‌ ఇన్‌వాలిడేషన్‌ అయిన కార్మికులకు అడ్వాన్స్‌ ఇవ్వబోమని తెలిపింది. కార్మికులకు ఇచ్చే మొత్తాన్ని నవంబర్‌ నుంచి 10 నెలలపాటు వారి వేతనాల్లో రికవరీ చేస్తామని వెల్లడించింది.

ప్రభుత్వ న్యాయవాదులను నియమించండి

సీఎం రేవంత్‌కు పొన్నం అశోక్‌గౌడ్‌ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్‌: హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదులు (జీపీ), అసిస్టెంట్‌ ప్రభుత్వ న్యాయవాదుల (ఏజీపీ)తో పాటు వివిధ కార్పొరేషన్లకు స్టాండింగ్‌ కౌన్సిల్‌ను వెంటనే నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ లీగల్‌ సెల్‌ చైర్మన్‌ పొన్నం అశోక్‌గౌడ్‌ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎంకు లేఖరాశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా కాంగ్రెస్‌ ప్రభుత్వం నియామకం చేపట్టకపోవడంతో బీఆర్‌ఎస్‌ హయాంలో బాధ్యతలు చేపట్టిన వారే స్టాండింగ్‌ కౌన్సిల్‌లో కొనసాగుతున్నారని చెప్పారు. ఏళ్లుగా కాంగ్రెస్‌కు సేవలందిస్తున్న న్యాయవాదులకు కౌన్సిల్‌ బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

నగరంలో రాత్రి ఒంటి గంట వరకు పని వేళలు

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌ నగరంలో పని వేళలు పొడిగిస్తూ కొత్వాల్‌ సీవీ ఆనంద్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం దుకాణాలు, బార్లు, పబ్స్‌ మినహా మిగిలిన అన్ని వ్యాపార సంస్థలు ఇకపై అర్ధరాత్రి ఒంటి గంట వరకు పని చేయనున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

టీజీఐసెట్‌-2024 తుది కౌన్సెలింగ్‌ పూర్తి

సాక్షి, హైదరాబాద్‌: మాస్టర్‌ ఆఫ్‌ బిజినెస్‌ అడ్మినిస్ట్రేషన్‌ (ఎంబీఏ), మాస్టర్‌ ఆఫ్‌ కంప్యూటర్‌ అప్లికేషన్స్‌(ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి టీజీఐసెట్‌–2024 తుది విడత కౌన్సెలింగ్‌ పూర్తయింది. తుది విడత కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు మంగళవారం సీట్లు కేటాయించినట్లు ఐసెట్‌ కన్వీనర్‌ దేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఐసెట్‌–2024లో 71,647 మంది అర్హత సాధించగా, 39,647 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. మొత్తం 35,311 సీట్లు ఉండగా.. 31,842 మంది అభ్యర్థులు సీట్లు పొందారు. 3,469 సీట్లు ఖాళీగా మిగిలాయి. మొత్తంగా ఎంబీఏ కోర్సుల్లో 28,345, ఎంసీఏ కోర్సుల్లో 6,966 సీట్లు అందుబాటులో ఉండగా.. ఎంబీఏలో 25,747 సీట్లు, ఎంసీఏలో 6,095 సీట్లు భర్తీ అయ్యాయి.

అనుమతి లేకుండానే బ్యాంకు గ్యారంటీల విడుదల

జస్టిస్‌ పీసీ ఘోష్‌కు తెలిపిన నీటిపారుదల శాఖ డిప్యూటీ సీఈ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన రూ.159 కోట్ల బ్యాంకు గ్యారంటీలను నిర్మాణ సంస్థ ఎల్‌ అండ్‌ టీకి నీటిపారుదల శాఖ మహదేవ్‌పూర్‌ డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ సీహెచ్‌ తిరుపతిరావు విడుదల చేశారు. శాఖ ఉన్నతాధికారులకు కూడా ఆయన సమాచారం ఇవ్వలేదు. కాళేశ్వరం ప్రాజెక్టుల్లోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్‌ పినాకి చంద్రఘోష్‌ కమిషన్‌కు నీటిపారుదల శాఖ డిప్యూటీ చీఫ్‌ ఇంజనీర్‌ అజ్మల్‌ఖాన్‌ ఈ విషయాన్ని తెలియజేశారు. మంగళవారం కమిషన్‌ నిర్వహించిన క్రాస్‌ ఎగ్జామినేషన్‌లో ఆయన పాల్గొన్నారు. బ్యాంకు గ్యారంటీలు విడుదల చేసే ముందు నిర్మాణ సంస్థ నుంచి అండర్‌టేకింగ్‌ తీసుకున్నారా? అని కమిషన్‌ ప్రశ్నించగా, ఈ విషయంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద ఎలాంటి సమాచారం లేదని బదులిచ్చారు.

- తాను విధుల్లో చేరకముందే మేడిగడ్డ బరాజ్‌ పూర్తయిందని మాజీ డిప్యూటీ ఎస్‌ఈ ఎస్‌.సత్యనారాయణ కమిషన్‌కు తెలిపారు.
- 2022 జూలైలో బరాజ్‌లకు భారీ వరదలు రావడంతో అప్రాన్‌, సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయని ఎస్‌ఈగా పనిచేసిన కరుణాకర్‌ చెప్పారు. మరమ్మతులు చేయాలని నిర్మాణ సంస్థలకు లేఖలు రాశామన్నారు. బరాజ్‌ల నిర్మాణం తర్వాత రెండేళ్ల పాటు డిఫెక్ట్‌ లయబిలిటీ పీరియడ్‌ అమల్లో ఉంటుందని, మూడేళ్ల పాటు నిర్వహణను ఆ సంస్థలే చూడాల్సి ఉంటుందన్నారు.
- బరాజ్‌లు డ్యామేజీకి కారణం ఏమిటని కమిషన్‌ ప్రశ్నించగా, మోడల్‌ స్టడీస్‌లో బరాజ్‌లకు వరద ప్రవాహ వేగాన్ని అంచనా వేయలేకపోయారని, ప్రతీ సెకనుకు 4.35 మీటర్ల వేగంతో వరద వస్తుందని అంచనా వేయగా, 12–14 మీటర్ల వేగంతో వచ్చిందని చెన్నూరు ఈఈ–2 బి.విష్ణుప్రసాద్‌ బదులిచ్చారు. బరాజ్‌లలో సీపేజీని గుర్తించి 2019 డిసెంబర్‌ 16న సెంట్రల్‌ పవర్‌ రీసెర్చ్‌ స్టేషన్‌కు లేఖ రాయగా, 2020 డిసెంబర్‌ 22న ఆ సంస్థ ప్రతినిధులు అధ్యయనం కోసం అయ్యే అంచనాలను అందించారని బదులిచ్చారు.

నేడు కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు

సాక్షి, హైదరాబాద్‌: మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం ప్రభావం వల్ల ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా తీరం, పశ్చిమ–మధ్య బంగాళాఖాతం, వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీంతో బుధవారం కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో గంటకు 40–50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం వుంది.

దేవరుప్పులలో 11.5 సెం.మీ.

మంగళవారం రాత్రి 8 గంటల వరకు రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. జనగాం జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో అత్యధికంగా 11.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెంలో 10.9 సెం.మీ., దామరచర్ల మండలం తిమ్మాపూర్‌లో 9.9, శాలిగౌరారంలో 9.1, రంగారెడ్డి జిల్లా నాగోల్‌లోని రాక్‌టౌన్‌ కాలనీలో 8.9, మహబూబ్‌నగర్‌ జిల్లా బాలానగర్‌ మండలం ఉదిత్యాల్‌లో 8.8, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మండలపల్లిలో 8.7, రంగారెడ్డి జిల్లా ఎలిమినేడులో 8.5 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

సీనియర్‌ జీహెచ్‌ఎంలకు మండల విద్యాధికారి బాధ్యతలు

ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణను క్షేత్రస్థాయిలో మరింత కట్టుదిట్టం చేసే క్రమంలో పాఠశాల విద్యాశాఖ మండల విద్యాధికారి పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. మండల పరిధిలోని సీనియర్‌ గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయుడికి మండల విద్యాధికారి (ఎంఈఓ) పోస్టును పూర్తి అదనపు బాధ్యతల కింద కట్టబెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 632 మండలాలకు ఇదే తరహాలో ఎంఈఓలను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి గత కొన్నేళ్లుగా సీనియర్‌ ప్రధానోపాధ్యాయులనే ఇన్‌చార్జ్‌ ఎంఈఓలుగా ప్రభుత్వం నియమిస్తూ వచ్చింది. తాజాగా పాఠశాల విద్యాశాఖలో భారీగా బదిలీలు జరగడం.. చాలాచోట్ల నాలుగైదు మండలాలకు ఒక ఇన్‌చార్జ్‌ ఎంఈఓ మాత్రమే ఉండటంతో ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ గాడి తప్పింది. దీనిపై క్షేత్రస్థాయి నుంచి వస్తున్న ఫిర్యాదులు, ఇతర సూచనలను పరిగణించిన పాఠశాల విద్యాశాఖ ఇన్‌చార్జ్‌ ఎంఈఓల నియామకానికి కసరత్తు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, కార్మికులకు చెల్లింపులు, పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, టీచర్లకు అన్యువల్‌ గ్రేడ్‌ ఇంక్రిమెంట్లు, సెలవుల మంజూరు తదితర అంశాల్లో ఎంఈఓల పాత్ర కీలకం.

అమృత్‌ టెండర్లపై కేటీఆర్‌ను తప్పుదోవ పట్టించారు: కందాల ఉపేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: అమృత్‌ టెండర్ల అంశంలో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చి మాట్లాడించి ఉంటారని ఆ పార్టీకి చెందిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో త్వరలో కేటీఆర్‌ను కలిసి పూర్తి వివరాలు అందిస్తానన్నారు. కేటీఆర్‌ ఆరోపించినట్లు సూదిని సృజన్‌రెడ్డి సీఎం రేవంత్‌ సొంత బావమరిది కాదని... తన చిన్న కూతురు భర్త అని ఉపేందర్‌రెడ్డి వివరణ ఇచ్చారు. మంగళవారం రాత్రి సృజన్‌రెడ్డి తండ్రి, తన వియ్యంకుడు మనోహర్‌రెడ్డితో కలిసి ఉపేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజకీయం, వ్యాపారం వేర్వేరు అంశాలని.. అమృత్‌ టెండర్లలో అవకతవకలేవీ జరగలేదని స్పష్టం చేశారు. ఈహెచ్‌పీ కంపెనీతో కలిసి తన అల్లుడు సృజన్‌రెడ్డికి చెందిన శోధా కంపెనీ మరో కంపెనీ జాయింట్‌ వెంచర్‌గా 'అమృత్‌'పనుల్లోని ఒక ప్యాకేజీలో రూ. 1,100 కోట్ల విలువ చేసే పనులను టెండర్‌ ద్వారా దక్కించుకుందని ఉపేందర్‌రెడ్డి చెప్పారు.

'మూసీ' నిర్వాసితులకు 'డబుల్‌' ఇళ్లు!



సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌

▶ మొదటి పేజీ తరువాయి

మరింత కట్టుదిట్టం చేయాలని సీఎం రేవంత్‌ ఆదేశించారు. నగరంలోని అన్ని చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్‌ కంట్రోల్‌ సెంటర్‌కు అనుసంధానం చేయాలన్నారు.

ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్లు తేల్చండి: ఔటర్‌ రింగ్‌ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు అన్నింటినీ గుర్తించి ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్లను గుర్తించాలని.. ఆక్రమణల వివరాలన్నీ సేకరించాలని సీఎం రేవంత్‌ అధికారులను ఆదేశించారు. దీనిపై పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని సూచించారు. అదే సమయంలో నిజమైన, అర్హులైన పేదలకు నష్టం జరగకుండా ప్రభుత్వం చేపట్టే చర్యలు ఉండాలని పేర్కొన్నారు.

ఫ్యూచర్‌ సిటీకి మెట్రో రైలు: శంషాబాద్‌ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌ సిటీకి మెట్రో మార్గం ఏర్పాటు చేయాలని, దీనిపై పూర్తిస్థాయి నివేదికను రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. పాతబస్తీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలన్నారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకులపై ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కరించాలని సూచించారు. దసరాలోపు మెట్రో విస్తరణపై పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలన్నారు.

26న జలసౌధకు సీఎం రేవంత్‌

సాక్షి, హైదరాబాద్‌: నీటిపారుదల శాఖలో అసిస్టెంట్‌ ఇంజనీర్లుగా నియమితులైన 700 మందికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జలసౌధలో నియామక పత్రాలను అందజేయనున్నారు. 1,800 లస్కర్ల నియామకంపై ఈ సందర్భంగా ఆయన ప్రకటన కూడా చేస్తారు. నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై సైతం సమీక్ష నిర్వహించనున్నారు.

16న విచారణకు హాజరుకండి

- 'ఓటుకు కోట్లు'కేసులో సీఎం రేవంత్‌కు నాంపల్లి కోర్టు ఆదేశం
- విచారణకు గైర్హాజరు కావడంపై న్యాయమూర్తి అసహనం

సాక్షి, హైదరాబాద్‌: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు కోట్లు'కేసు విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంపై నాంపల్లి కోర్టు అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణ జరిగే అక్టోబర్‌ 16న న్యాయస్థానం ఎదుట తప్పకుండా హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో మంగళవారం జరిగిన విచారణకు మత్తయ్య ఒక్కరే హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి, వేం కృష్ణ కీర్తన్‌, ఉదయ్‌ సింహ, సండ్ర వెంకటవీరయ్య, సెబాస్టియన్‌ హాజరుకాలేదు. ఒకరోజు విచారణకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ నిందితులు వేసిన పిటిషన్లను కోర్టు అనుమతించింది. అయితే అభియోగాల నమోదుపై విచారణ కోసం వచ్చే నెల 16న మాత్రం హాజరుకావాల్సిందేనని రేవంత్‌ సహా నిందితులందరికీ స్పష్టం చేసింది.

ఏసీబీ, ఈడీ విచారణలతో..

2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్‌ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను టీడీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలంటూ రూ.కోట్లు ఆశచూపిన ఆరోపణలపై నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. స్టీఫెన్‌సన్‌ ఇంట్లో రేవంత్‌ డబ్బు సంచులతో ఉన్న వీడియోలు అప్పట్లో తీవ్ర సంచలనంగా మారాయి. ఈ కేసులో రేవంత్‌ జైలుకు వెళ్లి, తర్వాత బెయిల్‌పై బయటికి వచ్చారు. రేవంత్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో ఆయన వద్ద రూ.50 లక్షల నగదును ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఈ నగదు అక్రమ మార్గాల్లో వచ్చిందన్న ఏసీబీ ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఈడీ) కూడా కేసు నమోదు చేసింది. ఏసీబీ, ఈడీ రెండు విచారణలు సుదీర్ఘంగా కొనసాగుతున్నాయి. ఈ వ్యవహారంలో నిందితులు మంగళవారం విచారణకు గైర్హాజరవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. తదుపరి విచారణకు హాజరు కావాలని రేవంత్‌తో పాటు సెబాస్టియన్‌, ఉదయ్‌ సింహ, మత్తయ్య జెరూసలేం, సండ్ర వెంకటవీరయ్య, వేం కృష్ణ కీర్తన్‌లను ఆదేశించింది.

దీప్తికి రూ.కోటి చెక్‌ అందించిన సీఎం రేవంత్‌

సాక్షి, హైదరాబాద్‌: పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్‌ దీప్తి జీవాంజికి రూ.కోటి, కోచ్‌కు రూ.10లక్షల చెక్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం అందచేశారు. పారాలింపిక్స్‌లో కాంస్య పథకం సాధించిన దీప్తి జీవాంజికి ఈ నెల 7న గ్రూప్‌–2 ఉద్యోగం, రూ.కోటి నగదు బహుమతి, వరంగల్‌లో 500 చదరపు గజాల స్థలంతోపాటు, కోచ్‌కు రూ.10 లక్షల నగదు బహుమతి ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా వారికి తన నివాసంలో సీఎం రేవంత్‌ చెక్‌లను అందచేశారు. రెండు వారాల్లోనే తమకు నగదు బహుమతి ఇవ్వడంపై అథ్లెట్‌ దీప్తి, కోచ్‌ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాట్‌ చైర్మన్‌ శివసేనారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



దీప్తికి చెక్‌ అందజేస్తున్న సీఎం రేవంత్‌


వైద్య కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్‌ అమలు

ఎంసీఐ మార్గదర్శకాలను పాటిస్తామని హైకోర్టుకు చెప్పిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్‌: మెడికల్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా (ఎంసీఐ) మార్గదర్శకాల మేరకు వైద్య విద్యా కోర్సుల్లో సీట్ల భర్తీకి ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్‌) కోటా వర్తింపజేస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది సీట్ల భర్తీకి చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. 'ఎంబీబీఎస్‌, బీడీఎస్‌, పీజీ కోర్సుల్లో 2024–25 అడ్మిషన్లలో ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్లు అమలు చేయడం లేదు. మార్గదర్శకాలు రూపొందించాలని జనవరి 31న కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం లేఖ రాసినా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన లేదు. నేను ఆగస్టు 28న సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇచ్చినా పరిగణనలోకి తీసుకోలేదు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. ఈడబ్ల్యూఎస్‌ కోటా అమలుకు మార్గదర్శకాలు రూపొందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలి'అని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ తరఫు న్యాయవాది బుచ్చిబాబు వాదనలు వినిపిస్తూ.. 'ఆగస్టు 3 నుంచి ఆగస్టు 13 వరకు ఎంబీబీఎస్‌, బీడీఎస్‌ ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్లకు నోటిఫికేషన్‌ ఇచ్చారు. ఇందులో రిజర్వేషన్ల వారీగా కటాఫ్‌ మార్కులను ఇచ్చినా.. ఈడబ్ల్యూఎస్‌ కటాఫ్‌ మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ విద్యార్థులకు నష్టం కలుగుతుంది. 2021, మార్చిలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 65కు ఇది విరుద్ధం. అన్ని మెడికల్‌ కాలేజీల్లో ఈ కోటా అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలి'అని చెప్పారు. ఎంసీఐ మార్గదర్శకాలను పాటిస్తామని అడ్వొకేట్‌ జనరల్‌ తెలపడంతో ధర్మాసనం వాదనలను ముగించింది.

కార్టూన్లు వేయడం చాలా ఇష్టం

- ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ సోమనాథ్‌
- పిల్లలు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచన
- స్పేస్‌టూన్‌ కార్టూన్‌ ఎగ్జిబిషన్‌ ప్రారంభం



కార్టూన్‌ గీస్తున్న ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ సోమనాథ్‌

సాక్షి, హైదరాబాద్‌: తాను చిన్నప్పుడు కార్టూనిస్టు కావాలని అనుకునేవాడినని, ఇప్పటికీ కార్టూన్లు వేయడం అంటే చాలా ఇష్టమని ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ సోమనాథ్‌ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో జరిగిన స్పేస్‌టూన్‌ కార్టూన్‌ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన స్కూల్‌ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేరళలో కార్టూనిస్టులు ఎక్కువగా ఉండటంతో కార్టూన్లు అంటే చాలా ఆసక్తి ఉండేదని పేర్కొన్నారు. చంద్రయాన్‌–3 ప్రయోగం సమయంలో చాలా ఒత్తిడికి లోనయ్యామని, ఆ ప్రయోగం విజయవంతం కావడంతో ఊపిరి పీల్చుకున్నామని చెప్పారు. ప్రపంచ పటంలో ఇస్రోకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఏదైనా విషయాన్ని సులువుగా అర్థమయ్యేలా చెప్పే సత్తా కార్టూనిస్టులకు ఉందని, కార్టూనిస్టులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనలకు సంబంధించి పలువురు ప్రముఖ కార్టూనిస్టులు గీసిన కార్టూన్లను సోమనాథ్‌ తిలకించారు. ఆ తర్వాత ఆయన కూడా స్వయంగా ఓ కార్టూన్‌ గీశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఏదైనా విషయాన్ని నవ్వుకొంటూనే సులువుగా అర్థమయ్యేలా చెప్పడం కార్టూనిస్టులకే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యా శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ బుర్రా వెంకటేశం, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ మామిడి హరికృష్ణ, కేరళ కార్టూన్‌ అకాడమీ చైర్మన్‌ సుధీర్‌నాథ్‌, హైదరాబాద్‌ పొలిటికల్‌ కార్టూనిస్టుల ఫోరం గౌరవ అధ్యక్షుడు నర్సిమ్‌, కార్టూనిస్టు శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

వాయుగుండాలు.. పెనుగాలులు.. క్లౌడ్‌ బరస్ట్‌!

ఏటూరునాగారం అడవుల్లో 50 వేల చెట్లు కుప్పకూలడానికి కారణాలివే

- అటవీశాఖ వర్క్‌షాప్‌లో శాస్త్రవేత్తలు, నిపుణుల అభిప్రాయం
- సారవంతమైన భూమి ఉన్నందున చెట్ల పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టాలని సూచన



సాక్షి, హైదరాబాద్‌: ములుగు జిల్లా ఏటూరునాగారం–తాడ్వాయి అటవీ ప్రాంతంలోని 332 హెక్టార్ల పరిధిలో ఆగస్టు 31న సుమారు 50 వేల చెట్లు నేలకూలడానికి గల శాస్త్రీయ కారణాలపై శాస్త్రవేత్తలు, నిపుణులు అటవీశాఖ అధికారులతో చర్చించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో పీసీసీఎఫ్‌ డోబ్రియాల్‌ ఆధ్వర్యంలో ఈ అంశంపై వర్క్‌షాప్‌ జరిగింది. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు, రిటైర్డ్‌ అధికారులు, నేషనల్‌ రిమోట్‌ సెన్సింగ్‌ సెంటర్‌ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ), జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల (ఎన్‌ఏఆర్‌ఎల్‌), ఎన్‌జీఆర్‌ఐ, ఐఎండీ శాస్త్రవేత్తలు, ఎన్‌ఐటీ వరంగల్‌, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఏకకాలంలో ఏర్పడిన వాయుగుండాల వల్ల పెను గాలులు వీయడంతోపాటు కుంభవృష్టి (క్లౌడ్‌ బరస్ట్‌) వర్షాలు కురవడం వల్లే ఈ ఘటన చోటుచేసుకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ఏటూరునాగారం అటవీ ప్రాంతంలోని సారవంతమైన నేల కూడా భారీ స్థాయిలో చెట్లు కుప్పకూలేందుకు దారితీసిందని భావిస్తున్నట్లు చెప్పారు. అక్కడి నేలలో చెట్లు త్వరగా ఎదగడం వల్ల వాటి వేర్లు భూమి లోపలకు బదులు అడ్డంగా విస్తరించడం వల్ల చెట్లు 130–140 కి.మీ. వేగంతో వీచిన పెను గాలులను తట్టుకోలేక పడిపోయి ఉండొచ్చన్నారు. వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పులతో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. అయితే చెట్లు కూలిన ప్రదేశంలో సారవంతమైన భూమి ఉన్నందున చెట్ల పునరుజ్జీవనానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

త్వరలో కేంద్ర, రాష్ట్రాలకు నివేదిక..

పీసీసీఎఫ్‌ ఆర్‌.ఎం.డోబ్రియాల్‌ మాట్లాడుతూ చెట్లు నేలకొరిగిన ప్రాంతంలో కలుపు మొక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని తద్వారా చెట్లు త్వరగా పెరిగే అవకాశం ఉంటుందని అటవీ సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు ములుగు డీఎఫ్‌వో రాహుల్‌ కిషన్‌ పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా అటవీ నష్టాన్ని శాస్త్రవేత్తలకు వివరించారు. వర్క్‌షాపులో వెల్లడైన అభిప్రాయాలు, సూచనలతో త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పించాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



మరోసారి తెరపైకి 'గోల్కొండ వజ్రం'

- జెనీవాలో అరుదైన మూడు వరుసల నెక్లెస్ నవంబర్‌లో వేలం
- 18వ శతాబ్దికి చెందిన ఈ నగలో 500 వజ్రాలు
- అవి గోల్కొండ గనుల్లోవే అయ్యి ఉంటాయని ప్రకటించిన వేలం సంస్థ
- గతంలోనూ అధిక ధరలు పలికిన 'మన వజ్రాలు'

సాక్షి, హైదరాబాద్: 'అసలు సిసలైన వజ్రం కావాలంటే గోల్కొండ గనుల్లోనే దొరకాలి'ఇది ఒకప్పుడు ప్రపంచం మాట. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో విస్తరించిన గోల్కొండ గనుల్లో లభించే వజ్రాలకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. వజ్రం అనగానే గుర్తుకొచ్చే 'కోహినూర్' ఇక్కడ దొరికిందే. ఇప్పుడు మరోసారి గోల్కొండ వజ్రాల అంశం తెరపైకి వచ్చింది. బ్రిటిష్ రాజకుటుంబం నగల కలెక్షన్లలో భాగంగా ఉన్న 18వ శతాబ్దం నాటి అరుదైన నెక్లెస్ నవంబర్‌లో వేలానికి వస్తోంది. వేలం నిర్వహణలో ఖ్యాతిగాంచిన సోథెబైస్ జెనీవాలో దీనిని వేలం వేస్తోంది. మూడు వరుసలతో ఉన్న ఈ నెక్లెస్‌లో దాదాపు 500 వజ్రాలున్నాయి. అవి ప్రఖ్యాత గోల్కొండ గనుల నుంచి సేకరించినవే అయ్యి ఉంటాయంటూ తాజాగా వేలం నిర్వహణ సంస్థ సోథేబైస్ ప్రకటించింది. ఈ నెక్లెస్‌కు వేలంలో 2.8 మిలియన్ డాలర్ల గరిష్ట ధర పలుకుతుందని వేలం సంస్థ అంచనా వేస్తోంది. గోల్కొండ వజ్రాల స్వచ్ఛత ఆధారంగా వాటికి వేలం పాటల్లో అధికంగా ధరలు పలుకుతాయి. దీంతో ఇప్పు డు మరోసారి గోల్కొండ వజ్రాలు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా గోల్కొండ వజ్రాలు ప్రజలను విపరీతంగా అకట్టుకుంటున్నాయి.

- అసలైన వజ్రం స్వచ్ఛతకు మారుపేరుగా ఉంటుందని, 'గోల్కొండ వజ్రాలు కన్నీళ్లంత స్వచ్ఛమైనవి'అని నిపుణులు చెబుతారు. వజ్రాల వ్యాపారంలో టైప్ టూ ఏ కేటగిరీని అత్యంత అరుదైన, స్వచ్ఛమైనదిగా భావిస్తారు. అందుకే గోల్కొండ వజ్రాలను ఆ కేటగిరీకి చెందినవిగా పేర్కొంటారు. కాకతీయుల కాలంలో గోల్కొండ వజ్రాలను వెలికితీయటం ప్రారంభించారు. ప్రస్తుతం కర్ణాటకలోకి రాయచూరు నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా నందిగామ వరకు ఉన్న ప్రాంతాన్ని గోల్కొండ గనులుగా పరిగణిస్తారు. కృష్ణానది పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వజ్రాలు లభించేవి. ఈ వజ్రాలు అధికంగా ఉన్న ప్రాంతాలను తన పరిధిలో ఉంచుకునేందుకు నిజాం తహతహలాడేవాడు. ప్రస్తుతం

టైప్ టూ ఏ కేటగిరీ..

ఆంధ్రప్రదేశ్‌లోని భూభాగాన్ని అప్పట్లో నిజాం ఆంగ్లేయుల పరం చేశాడు. ఆ సమయంలో ప్రస్తుతం ఆంధ్రాప్రాంతంలో ఉన్న పరిటాల ప్రాంతాన్ని నిజాం తన పరిధిలోకి వచ్చేలా చేసుకున్నాడు. అక్కడ వజ్రాలు అధికంగా లభిస్తుండటమే దీనికి కారణం. ప్రస్తుతం తెలంగాణలో భాగంగా ఉన్న మునగాలను నిజాం సర్కారు బ్రిటిష్ పరిధిలోకి మార్చింది. రాష్ట్రాల పునర్విభజన సమయంలో భౌగోళికంగా ఈ తీరు సరిగ్గా లేకపోవటంతో పరిటాలను ఆంధ్రప్రదేశ్‌కు, మునగాలను తెలంగాణకు కేటాయించారు.

కోహినూర్‌తో..

గోల్కొండ వజ్రాలకు అంతగా ఖ్యాతి రావటానికి కోహినూర్ వజ్రం ప్రధాన భూమిక పోషించింది. ప్రపంచం మొత్తానికి రెండున్నర రోజుల పాటు భోజన ఏర్పాట్లు చేసినందుకు ఎంత ఖర్చవుతుందో కోహినూర్ వజ్రం విలువ అంత ఉంటుందని మొఘల్ చక్రవర్తులు వ్యాఖ్యానించారట. గత పదేళ్లలో కొల్లాపూర్, నారాయణపేటలో జీఎస్ఐకి ముడి వజ్రాలుండే కింబర్ లైట్ డైక్స్ లభించాయి. ఈ ప్రాంతాల్లో వజ్రాలుంటాయనటానికి ఇది ఓ ఆధారం. మూసీ పరీవాహకంలో కూడా వజ్రాలు భూగర్భంలో ఉన్నాయని కొందరు నిపుణులు పేర్కొంటున్నారు. బ్రిటిష్ పాలన కాలంలో గుంతకల్ సమీపంలోని వజ్రకరూరులో భారీ వజ్రాల గని తవ్వారు. ఇప్పటికీ అక్కడ 90 మీటర్ల లోతుతో భారీ గుంత నీటితో నిండి ఉంటుంది.

- కుతుబ్‌షాహీల కాలంలో వజ్రాల వ్యాపారం ముమ్మరంగా సాగింది. విస్తారంగా గనులు తవ్వి వజ్రాలు వెలికితీశారు. దాదాపు లక్ష మంది కార్మికులు ఈ గనుల్లో పనిచేసేవారట.
- ఈ గనులు స్థానిక సుబేదారుల అధ్వర్యంలో రోజువారీగా లీజుకు తీసుకొని హైదరాబాద్‌లోని వ్యాపారులు వజ్రాలు వెలికి తీసేవారు. ఒక క్యారెట్ కంటే ఎక్కువ బరువు తూగే వజ్రం లభిస్తే రాజుకు చెందుతుంది అన్న విధానం అమలులో ఉండేది. అలా కుతుబ్‌షాహీలు చాలా విలువైన, పెద్ద సైజు వజ్రాలు సొంతం చేసుకున్నారు.
- గోల్కొండ వజ్రాల్లో నైట్రోజన్, బోరాన్ ఉండదు. ఈ కారణంగా వజ్రం అధిక కాంతివంతంగా ఉంటుంది.
- కోహినూర్ తర్వాత అతిపెద్ద వజ్రం నిజాం జాకబ్ వజ్రమే. ఇది 420 క్యారెట్ బరువు ఉండేది.
- గోల్కొండ గనుల నుంచి 12 మిలియన్ క్యారెట్ల వజ్రాలు తవ్వారని బ్రిటిష్ కాలంలో నిపుణులు అంచనా వేశారు. ఇప్పటికీ గోల్కొండ గనుల ప్రాంతంలో చిన్నసైజు వజ్రాలు లభిస్తూనే ఉన్నాయి.
- గోల్కొండ డైమండ్స్ అన్నీ ఇప్పుడు యూరోపియన్ రాజకుటుంబాల సేకరణలో భాగంగా ఉన్నాయి. వాటిలో కొన్ని ఇరాన్ ట్రెజరీలో ఉన్నాయి. ఒకటి రెండు నైజాం కలెక్షన్లలో ఉన్నాయి

ఇప్పటి వరకు వేలంలో అత్యధిక ధరకు అమ్ముడైన మూడు ప్రధాన వజ్రాలు

2008: విట్టెల్స్‌బాచ్ డైమండ్
23.7 మిలియన్ డాలర్లు

1995: ఓర్లోవ్ డైమండ్
20.7 మిలియన్ డాలర్లకు

1995: జాకబ్ డైమండ్
13.4 మిలియన్ డాలర్లు

ప్రధాన గోల్కొండ వజ్రాల నమూనాలు

ప్రజలు సందర్శించేందుకు వీలుగా కొన్ని ప్రధాన గోల్కొండ వజ్రాలకు నమూనాలు రూపొందించారు.

- లండన్ నేచురల్ హిస్టరీ మ్యూజియంలో కోహినూర్ నకలు వజ్రం ఉంది
- మాస్కోలోని క్రెమ్లిన్ ఆర్మరీలో ఓర్లోవ్ డైమండ్ నమూనా ఉంది
- టెహరాన్స్ నేషనల్ మ్యూజియంలో దరియా–ఇ–నూర్ వజ్రం నమూనా ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా...

త్వరలో మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ

- 2 టీచర్స్, ఒక గ్రాడ్యుయేట్ స్థానానికి వచ్చే ఏడాది ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇద్దరు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలు, మరో పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలంలో వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుండగా ఆలోగా మళ్లీ ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను ప్రకటించింది. మెదక్–నిజామాబాద్–ఆదిలాబద్–కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతోపాటు మెదక్–నిజామాబాద్–ఆదిలాబద్–కరీంగనర్, వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయల ఎమ్మెల్సీ స్థానాలకు కొత్త ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ప్రారంభించింది. 2024 నవంబర్ 1ని అర్హత తేదీగా పరిగణించింది. ఈ నెల 30 నుంచి నవంబర్ 6 వరకు ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించనుంది. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనుంది.

మా మీద కోపంతో ప్రాజెక్టు పనులు ఆలస్యం చేయొద్దు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తమ మీద కోపంతో ప్రాజెక్టు పనులు ఆలస్యం చేయొద్దని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బొమ్మెర రామమూర్తితో కలిసి శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. 90 శాతం పనులు కేసీఆర్ హయాంలోనే జరిగాయని, పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. బీఆర్ఎస్ పిలిచిన టెండర్లు కొనసాగించి ఉంటే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయ్యేదని, ఈ వానాకాలం పంటలకు నీళ్లు వచ్చేవన్నారు. ప్రభుత్వం కనీసం వచ్చే పంటకైనా నీళ్లు ఇవ్వాలని కోరారు. కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోనని ప్రాజెక్టు పనులు పెండింగ్‌లో పెట్టారని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మంత్రులు పాలమూరు ప్రాజెక్టు పనులు చూడటానికి వస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన పాలమూరు రైతులకు భరోసా ఇచ్చేలా ఉండాలని, విమర్శలకు తావివ్వొద్దన్నారు.

హైడ్రాపై శ్వేతపత్రం విడుదల చేయండి: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: చెరువులు, ప్రభుత్వ భూములపై సర్వే చేపట్టి, అందులో పేదలు, పెద్దల నిర్మాణాలు, పట్టాలు ఉన్నవారు ఎంత మంది ఉన్నారో ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైడ్రాతో చిన్నవారు బలికాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ భూముల వద్ద పేదలు ఇళ్లు వేసుకున్నారని, వారు ఆ భూములపై లేకపోతే కబ్జాకు గురయ్యేవని తెలిపారు. ప్రభుత్వ పట్టాలు పొందిన వారు కూడా ప్రస్తుతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కొన్ని చెరువులను పూడ్చి పేదలకు విక్రయించారని, అలాంటి పేదల నుంచి డబ్బులు తీసుకుని కొనుగోలు చేశారని కూనంనేని వెల్లడించారు. 80 శాతం మంది పేదలపైన వేటు పడుతుందని వారు బాధపడుతున్నారని తెలిపారు. శ్రీలంకలో మార్క్సిస్ట్ జనతా విముక్తి పేరమూన పార్టీ నాయకుడు అనూర కుమార దిస్సనాయకే ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ జర్మనీ, జపాన్ దేశాల్లో కూడా కమ్యూనిస్టు పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఇటీవల సింగరేణి కార్మికుల లాభాలు వాటాకు సంబంధించి ప్రభుత్వంపై విమర్శ చేసే క్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ బాధ్యత వహించాలని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు.

38 కాలేజీల్లో జాబ్ గ్యారంటీ కోర్సులు

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం విడుదల చేసింది.

ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌తో..

రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 'బీఎఫ్ఎస్ఐ' కోర్సులు అందేవిధంగా కాలేజీలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక జాబ్ డిమాండ్ ఉన్న బీఎఫ్ఎస్ఐ సంస్థలకు అవసరమైన నిపుణులను తీర్చిదిద్దేందుకు ఈ కోర్సు ఉపయోగపడనుంది. ఖరీదైన ఈ కోర్సును డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉచితంగా అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రోగ్రాంలో భాగంగా శిక్షణను అందుకోనున్న 10 వేల మంది విద్యార్థుల వివరాలతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందిస్తోంది. విద్యార్థుల బయోడేటాతోపాటు చదువుతున్న కాలేజీ, వారి విద్యార్హతలు, సాంకేతిక కోర్సుల అనుభవం వివరాలన్నీ అందులో పొందుపరుస్తారు. బీఎఫ్ఎస్ఐ రంగంలో పేరొందిన కంపెనీలు తమకు అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు ఈ పోర్టల్ వారధిగా పనిచేయనుంది. ఆ కంపెనీలు ఈ పోర్టల్‌లో ఉన్న విద్యార్థులతో నేరుగా వీడియో కాల్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ నైపుణ్యాలతో డిగ్రీ, ఇంజనీరింగ్‌లో కోర్సులు చేసిన విద్యార్థులకు ఉద్యోగ భరోసా దక్కనుంది.

జాబితాలోని నాన్ ఇంజనీరింగ్ కాలేజీలు ఇవే

- పింగళి ప్రభుత్వ మహిళా కాలేజీ– వడ్డేపల్లి, హనుమకొండ
- ఎస్ఆర్–బీజీఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ– ఖమ్మం
- నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల– నల్లగొండ
- ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, హైదరాబాద్
- భవన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, హైదరాబాద్
- ప్రభుత్వ సిటీ కాలేజీ, హైదరాబాద్
ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సిద్దిపేట
- ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ, బేగంపేట
- ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఖైరతాబాద్
- ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీ, నాంపల్లి
- నిజాం కాలేజీ, హైదరాబాద్
- ఆర్‌బీవీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ, హైదరాబాద్
- సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కాలేజీ, మెహిదీపట్నం, హైదరాబాద్
- సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా డిగ్రీ కాలేజీ, హైదరాబాద్
- సెయింట్ పీఎస్ ఎక్స్ మహిళా డిగ్రీ కాలేజీ, నాచారం హైదరాబాద్
- తారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, సంగారెడ్డి
- ఎంవీఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, మహబూబ్‌నగర్
- ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, కరీంనగర్
- తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి, హైదరాబాద్
- గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ, నిజామాబాద్

జాబితాలోని ఇంజనీరింగ్ కాలేజీలు ఇవే..

- బీవీఆర్ఐటీ హైదరాబాద్ ఇంజనీరింగ్ కాలేజీ (జేఎన్టీయూహెచ్)
- జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జేఎన్టీయూహెచ్)
- గోకరాజు రంగరాజు ఇంజనీరింగ్–టెక్నాలజీ కాలేజీ (జేఎన్టీయూహెచ్)
- జేబీ ఇంజనీరింగ్– టెక్నాలజీ కాలేజీ (జేఎన్టీయూహెచ్)
- జేఎన్టీయూ కూకట్‌పల్లి ప్రధాన క్యాంపస్ (జేఎన్టీయూహెచ్)
- కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జేఎన్టీయూహెచ్)
- మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జేఎన్టీయూహెచ్)
- వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ (జేఎన్టీయూహెచ్)
- వల్లూరుపల్లి నాగేశ్వరరావు విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్–టెక్నాలజీ (జేఎన్టీయూహెచ్)
- కిట్స్ వరంగల్ (కాకతీయ వర్సిటీ)
- చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఓయూ)
- మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీ (ఓయూ)
- మాటూరి వెంకట సుబ్బారావు ఇంజనీరింగ్ కాలేజీ (ఓయూ)
- మెథడిస్ట్ ఇంజనీరింగ్–టెక్నాలజీ కాలేజీ (ఓయూ)
- ఉస్మానియా వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ (ఓయూ)
- స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్–టెక్నాలజీ కాలేజీ (ఓయూ)
- ఆర్జీయూకేటీ బాసర (ఆర్జీయూకేటీ)
- బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నర్సాపూర్ (జేఎన్టీయూహెచ్)

ఎట్టకేలకు ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

మెరిట్ లిస్టును విడుదల చేస్తామన్నారు. అదేరోజు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు.. వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. గతేడాదికి సంబంధించిన కాలేజీలవారీ సీట్ల కేటాయింపు వివరాలు వర్సిటీ వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

జీవో 33 ప్రకారమే కౌన్సెలింగ్...: స్థానికతకు సంబంధించిన జీవో–33ని సవాల్ చేస్తూ కొందరు విద్యార్థులు హైకోర్టుకు వెళ్లడం.. కోర్టు తీర్పును ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేయడం వల్ల ఈసారి కౌన్సెలింగ్ ఆలస్యమైంది. జీవోను సవాల్ చేసిన పిటిషనర్లలో అర్హత ఉన్న వాళ్లను కౌన్సెలింగ్‌కు అనుమతిస్తామని.. సమయం లేనందున ఈ ఒక్కసారికి జీవో–33 నుంచి పిటిషనర్లకు మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ప్రభుత్వ వాదనను అంగీకరించిన కోర్టు.. జీవో 33 ప్రకారమే కౌన్సెలింగ్ నిర్వహణకు అనుమతినిస్తూ మధ్యంతర ఉత్వర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం విడుదల చేసిన మెరిట్ జాబితాలో కోర్టుకు వెళ్లిన 132 మంది పిటిషనర్లకు కూడా చోటు కల్పించింది. మరోవైపు తెలంగాణలో దరఖాస్తు చేసుకున్న పిటిషనర్లలో మరో 9 మందికి ఏపీలోనూ స్థానికత ఉన్నట్లు తేలింది. దీంతో వారిని తెలంగాణ జాబితా నుంచి తిరస్కరించినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. కాగా, అఖిల భారత స్థాయిలో ఎస్టీ విభాగంలో టాప్ ర్యాంకు సాధించిన గుగులోత్ వెంకట నృపేష్ కాళోజి వర్సిటీ విడుదల చేసిన జాబితాలో మొదటి స్థానంలో నిలిచాడు. రెండో స్థానంలో ఎల్లు శ్రీశాంత్‌రెడ్డి, మూడో స్థానంలో మహమ్మద్ ఆజాద్ సాద్, నాలుగో స్థానంలో లావుడ్య శ్రీరాం నాయక్ ఉన్నారు.

ప్రజాస్వామిక విలువలను కాపాడాలి

ఎమ్మెల్సీ కోదండరాం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యమకారులపై ప్రజాస్వామిక విలువల్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని చూస్తున్నానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన సదస్సులో కోదండరాం పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల డీఏలు, పీఆర్‌సీలు, పెండింగ్ బిల్లులు తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడటం వల్ల రూ.4 లక్షల కోట్లు అప్పులపాలయ్యామని, అనేక బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని తీసుకువచ్చిందని, ఎలాంటి బెదిరింపులు, ట్యాంపరింగ్‌లు కూడా లేవని చెప్పారు. అంతకుముందు కోదండరాంను ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, పీఎస్‌యూటీఎఫ్ చావ రవి తదితరులు పాల్గొన్నారు.



జేఏసీ సదస్సులో ఎమ్మెల్సీ కోదండరాంను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

'సీపీఎస్ రద్దు చేయించండి'



మహేశ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అమలవుతున్న సీపీఎస్ రద్దు చేయించాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్ ఈయూ) కోరింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసిన ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ఇంటి పత్రం అందజేశారు. మహేశ్‌గౌడ్‌ను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తదితరులున్నారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించారు.

ప్రభుత్వం పేదల గూడు కూలుస్తోంది

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ అనుమతితో గ్రేటర్ హైదరాబాద్‌పరిధి లోని ఎమ్మెల్యేలతో సమావేశమై కార్యాచరణ సిద్ధం చేస్తాం. అరికెపూడి గాంధీని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారు. మరి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పింది ఎవరో శ్రీధర్‌బాబు చెప్పాలి. పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి బతుకు బస్టాండ్‌లా తయారైంది. ఏ పార్టీలో ఉన్నా నో చెప్పుకోలేని స్థితిలో అరికెపూడి ఉన్నారు. దమ్మింటే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు చేప ట్టి ఉపఎన్నికలు నిర్వహించాలి. శేరిలింగంపల్లిలో ఎప్పుడు ఉపఎన్నిక వచ్చినా కార్యకర్తల నుంచే అభ్యర్థిని ఎంపిక చేస్తాం'అని కేటీఆర్ ప్రకటించారు.

సీఎంకు కుర్చీపై భరోసా లేదు..

రైతు భరోసాకు హామీ ఇచ్చిన రేవంత్‌కు ఆయన కుర్చీపైనే భరోసా లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తన పదవిని ఖమ్మం, నల్లగొండ బాంబులు తీసుకుంటాయనే భయంతో ఉన్నారని ఎగతాళి చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చిట్టి నాయుడు తరహాలో రేవంత్ సవాళ్లు చేస్తున్నారని.. కానీ తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కొత్త కమిటీ ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు గోపీనాథ్, మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

బండి సంజయ్‌వి చిల్లర మాటలు

కేంద్ర పథకమైన అమృత్‌లో అవినీతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వైఖరి దొంగలుపడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగిన చందంగా ఉందని కేటీఆర్ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. అమృత్‌లో అవినీతి జరిగిందని మొదట చెప్పింది బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డేనని.. అయినా పాలు తాగుతున్న దొంగ పిల్లిలా బండి కళ్లు మూసుకున్నారని విమర్శించారు. పథకంలో అవినీతిని ఆధారాలతో తాము బయట పెట్టాక ఆయన చిల్లర మాటలు మాట్లాడటం దేనికని ప్రశ్నించారు.

'ములుగు' బిల్లును ఆమోదించండి

గవర్నర్‌ను కోరిన మంత్రి సీతక్క



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను శాలువాతో సత్కరిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్

సాక్షి, హైదరాబాద్: ములుగు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు ఆమోదముద్ర వేయాలని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విజ్ఞప్తిచేశారు. సాంకేతికపరమైన చిక్కులతో బిల్లు ఇంతకాలం పెండింగ్‌లో పడిందని గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లులోనే ములుగు అంశాన్ని గత ప్రభుత్వం చేర్చిందని, అదే బిల్లులో జీహెచ్ఎంసీ చట్టానికి సవరణల ప్రతిపాదనలతో ములుగు మున్సిపాలిటీ బిల్లు గందరగోళంగా మారిందన్నారు. మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ సందర్భంగా సీతక్క ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. న్యాయ, సాంకేతికపరమైన అంశాల నేపథ్యంలో బిల్లును గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్లు సమాచారం. అనంతరం రాజ్‌భవన్ వద్ద సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. ములుగు బిల్లుతోపాటు పెండింగ్‌లో ఉన్న ఇతర బిల్లులకు ఆమోదం తెలపాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్‌లోని చెంచు ప్రాంతాల్లో పర్యటించాలని కోరానన్నారు. ములుగులో ఓ గ్రామాన్ని దత్తత తీసుకునే ఆలోచనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉన్నారని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు గవర్నర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఉన్నారు.

ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- చౌటుప్పల్ జంక్షన్ రింగు విస్తీర్ణాన్ని పెంచొద్దు
- గతంలో కోమటిరెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- హరీశ్‌రావును కలిసిన ట్రిపుల్ ఆర్ బాధితులు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) భూ సేకరణలో నష్టపోతున్న రైతులు, బాధితులకు న్యాయం చేయాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో వారికి ఇచ్చిన హామీని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. ట్రిపుల్ ఆర్‌తో నష్టపోతున్న రైతులు మంగళవారం హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్ భరోసా ఇవ్వడంతోపాటు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 'బాధితులకు న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాక్షాత్తూ భువనగిరి సభలో ప్రియాంకాగాంధీ హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగంలో జంక్షన్‌ను 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని రైతులు నష్టపోతున్నారు. గతంలో జంక్షన్ రింగును 78 ఎకరాల్లో ప్రతిపాదించగా, ప్రస్తుతం 184 ఎకరాలకు పెంచడంతో నష్టం పెరుగుతుంది. గతంలో ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నా చేశారు. కానీ ఇప్పు డు పోలీసు బలగాలతో నిర్బంధంగా సర్వే చేసి ఒప్పంద పత్రాల మీద సంతకాలు చేయాలని ఒత్తిడి చేయడం దుర్మార్గం. కాంగ్రెస్ మాట నిలుపుకునేంత వరకు బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది. బాధితుల పక్షాన పోరాటం చేస్తాం'అని హరీశ్‌రావు చెప్పారు.

30న రైతు హామీల సాధన దీక్ష

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఈనెల 30న ఉదయం 11 గంటలకు ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేపీ రైతు హామీల సాధన దీక్ష చేపడుతున్నట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. అన్నదాతలకు అండగా 24 గంటల పాటు నిర్వహించనున్న (అక్టోబర్ 1 ఉదయం దాకా) దీక్షలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలు పాల్గొంటారని వెల్లడించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు, అన్నదాతలకు అండగా బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. 'ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి అసెంబ్లీలో కనీసం చర్చకు పెట్టలేదు. రైతులకు రుణమాఫీ చేస్తాం అని మోసం చేశారు. రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవసరం అవుతాయని నిపుణులు చెప్పారు. రేవంత్‌రెడ్డి సర్కార్ కేబినెట్ రూ.30 వేల కోట్లకు ఆమోదం తెలిపింది. రైతుల కోసం ఇప్పటికి ఖర్చు చేసింది కేవలం రూ.17 వేల కోట్లే. సీఎం రుణమాఫీ అయింది అని చెప్పంటే మంత్రులు కాలేదు అంటున్నారు. రైతు భరోసాకు రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇప్పటికీ దాని ఊసేలేదు. మళ్లీ రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారా?'అని ఏలేటి ప్రశ్నించారు.

ఆదివాసీ చట్టాలను గౌరవించాలి

- ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంత ముస్లింలతో ప్రభుత్వం చర్చలు
- శాంతి నెలకొల్పేందుకు త్వరలో ఉమ్మడి సమావేశం

సాక్షి, హైదరాబాద్ : ఆదిలాబాద్ జిల్లా జైనూరులో ఆదివాసీ, మైనారిటీ వర్గాల మధ్య సయోధ్య కుదుర్చడానికి ప్రభుత్వం వరుస భేటీలు నిర్వహిస్తోంది. ఇటీవల ఉట్నూర్‌లో ఆదివాసీ సంఘాలతో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ చర్చలు జరపగా, తాజాగా మైనారిటీ వర్గానికి చెందిన పెద్దలతో మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి సమావేమయ్యారు. సమస్య మూలాలతో పాటు పరిష్కారమార్గాలు సూచించాలని కోరగా, మైనారిటీ పెద్దలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కొన్ని రాజకీయ పక్షాలు ప్రయత్నిస్తున్నాయని, ఆ శక్తులను కట్టడి చేసేలా బందోబస్తు పెంచాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. ఆదివాసీలకు ప్రత్యేక చట్టాలున్నందున వాటిని మైనారిటీలు గౌరవించాలని మంత్రి సీతక్క కోరారు. కొంత మంది యువకులు చేస్తున్న చేష్టలను చూపి.. మైనారిటీల పట్ల వ్యతిరేక భావనను కలిగించేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తాయ న్నారు. రెండువర్గాల మధ్య నెలకొన్న అపనమ్మకాన్ని పోగొట్టేలా ఇరుపక్షాల పెద్దలతో త్వరలో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తామని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆదివాసీ ఏరియా అభివృద్ధి, శాంతిని నెలకొల్పడంలో మైనారిటీలు సహకరించాలని కోరారు.

డీఎస్సీ–2008 బీఈడీ అభ్యర్థులకు ఊరట

▶ మొదటి పేజీ తరువాయి

డీఎస్సీ–2008లో ఎఫెక్ట్ అయిన బీఈడీ అభ్యర్థుల వివరాలను ఉమ్మడి జిల్లాలవారీగా సేకరించి జాబితా రూపొందించినట్లు పాఠశాల విద్య డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెరిఫికేషన్ ఫాంలను కూడా రూపొందించి www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ వెబ్‌సైట్ నుంచి వెరిఫికేషన్ ఫాంలను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపడంతోపాటు కాంట్రాక్టు సేవల్లో పనిచేయడానికి సమ్మతి తెలియజేస్తూ పూర్వ జిల్లా డీఈవోకు సమర్పించాలన్నారు. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 10 వరకు ఉమ్మడి జిల్లా డీఈవో వద్ద సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. ఆ తరువాత దరఖాస్తులను అనుమతించబోరని స్పష్టం చేశారు.



ప్రాణులన్నీ తమ కర్మలకు తామే బాధ్యులు.
మంచో, చెడో తమ స్వబుద్ధితో చేసే కర్మలకు వాళ్లు వారసులు అవుతారు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 25 సెప్టెంబర్ 2024

ఇది స్వర్ణయుగం

ప్రతి రంగంలో కొన్ని చరిత్రాత్మక క్షణాలు ఉంటాయి. చదరంగంలో మన దేశానికిప్పుడు అలాంటి క్షణాలే. బుడాపెస్ట్‌లో ముగిసిన 45వ చెస్ ఒలింపియాడ్ భారతీయ చదరంగంలోనే కాదు... యావత్ భారత క్రీడారంగ చరిత్రలోనే చిరస్మరణీయం. మన ఆటగాళ్ళు తొలిసారిగా అటు ఓపెన్, ఇటు మహిళల కేటగిరీల్లో బంగారు పతకాలు సాధించి, దేశానికి మరువలేని కానుక ఇచ్చారు. చైనా, సోవియట్ రష్యా తర్వాత చెస్ ఒలింపియాడ్‌లో ఒకే ఏడాది ఇలా రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు గెలిచిన మూడో దేశం మనదే. అలాగే, గుకేశ్, అర్జున్, దివ్య, వంతికల 4 వ్యక్తిగత స్వర్ణాలతో టోర్నీలో భారత్ తిరుగులేని ఆధిక్యాన్ని చాటింది. విశ్వనాథన్ ఆనందన్ బాటలో నడిచిన ఆయన శిష్యబృందం దేశాన్ని సమున్నతంగా నిలిపింది. కేవలం పదేళ్ళ క్రితం ఆశ్చర్యకరంగా కాంస్యం గెలిచి ఒలింపియాడ్‌లో బోణీ కొట్టిన దేశం, గడచిన 2022లో రెండు విభాగాల్లోనూ కాంస్యాలకే పరిమితమైన దేశం ఇవాళ ఈ స్థాయికి ఎదగడం అసామాన్యం. ఒక్కమాటలో నిన్న మొన్నటి దాకా చెస్‌లో సాగిన యూరోపియన్ ప్రపంచ ఆధిపత్యానికి తెరపడింది. ఆటకు భవిష్యత్ చిరునామాగా భారత్ ఆవిర్భవించింది. చదరంగంలో అక్షరాలా మన స్వర్ణయుగం ఆరంభమైంది.

ఒలింపిక్స్ పోటీల్లో స్థానం లేని చెస్‌కు సంబంధించినంత వరకు ఈ చెస్ ఒలింపియాడే... ఒలింపిక్స్. అలాంటి అత్యున్నత స్థాయి పోటీల్లో... 193 దేశాలకు చెందిన అంతర్జాతీయ జట్లు పాల్గొన్న ఓపెన్ విభాగంలో, 181 దేశాలు పోటీపడ్డ మహిళా విభాగంలో మన జట్లు స్వర్ణాలు సాధించడం ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రతి దేశం నుంచి అయిదుగురు అగ్రశ్రేణి క్రీడాకారుల జట్లు ఆ యా విభాగాల్లో పోటీ పడతాయి. అలాంటి చోట ఓపెన్ విభాగంలో తొమ్మిదో రౌండ్‌లో ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన ఆటను డ్రా చేయడం తప్ప, మొత్తం 11 రౌండ్లకు గాను 10 రౌండ్లు మన భారత జట్టు గెలిచింది. టైటిల్ విజేతగా నిలిచింది. అంతేకాక 21 పాయింట్ల రికార్డ్ స్కోర్ సాధించి, రెండోస్థానంలో నిలిచిన 17 పాయింట్ల అమెరికా కన్నా చాలా పైన మనం నిలవడం విశేషం. మహిళా విభాగంలోనూ మొత్తం 11 రౌండ్లలో, ఒక్క 8వ రౌండ్‌లో పోలండ్‌తోనే మన జట్టు ఓడింది. అమెరికాతో ఆటను డ్రా చేసి, మొత్తం 19 పాయింట్లు సాధించి, స్వర్ణం సాధించింది. కనివిని ఎరుగని ఈ జంట విజయాల కారణంగానే ఇవాళ మన క్రీడా ప్రపంచం సంబరాలు చేసుకుంటోంది.

మొత్తం మీద భారతీయుల ఆటగా పేరొందిన చదరంగంలో ఇప్పుడు మళ్ళీ పుట్టినింటికి పూర్వ వైభవం వచ్చింది. ఈ ఒలింపియాడ్ విజయాలు దేశవ్యాప్తంగా మన యువతరంలో దాగిన చదరంగ ప్రతిభాపాటవాలకు అద్దం పడుతున్నాయి. గుకేశ్ దొమ్మరాజు లాంటి మన ఆటగాళ్ళు కొందరు వ్యక్తిగత స్వర్ణాలు సైతం సాధించడం అందుకు నిదర్శనం. ఒకప్పుడు విశ్వనాథన్ ఆనంద్ లాంటి కొందరి పేర్లే వినిపించిన దేశంలో ఇటీవల దాదాపు 85 మంది గ్రాండ్ మాస్టర్లు ఉద్భవించారు. వారిలో పలువురు 20వ పడిలో వారే. అయిదుసార్లు ప్రపంచ చెస్ ఛాంపియనైన మ్యాగ్నస్ కార్ల్‌సెన్‌ను పలుమార్లు ఓడించిన ప్రజ్ఞానంద లాంటి టీనేజ్ వండర్లు మనకున్నారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రశ్రేణిలో నిలిచిన అర్జున్ ఇరిగైసి, విదిత్ గుజరాతీ, హరికృష్ణ తదితరులు మన పురుషుల జట్టులో ఉన్నారు. అలాగే, అనుభవమున్న కోనేరు హంపి జట్టులో లేకున్నా, ఒకట్రెండు తడబాట్లు ఎదురైనా సరే పట్టువదలక పోరాడి, ఒలింపియాడ్ విజయం సాధించిన ఆడపిల్లల జట్టు ఈ రోజున మనకుంది. అంతకంతకూ పెరుగుతున్న మన బలానికీ, బలగానికీ అది గీటురాయి.

పోగుబడ్డ ప్రతిభావంతులకు నిరంతర సాధన, నిరుపమానమైన టీమ్ స్పిరిట్ కూడా తోడై తాజా అందలాన్ని ఎక్కించాయి. అదే సమయంలో మన ప్రస్తుత విజయ పరంపరకు స్ఫూర్తి... ప్రజ్ఞానంద, గుకేశ్ లాంటి పలువురికి చేయూతనిచ్చిన దీప్తి... శిక్షణకు ఎంతో ఖర్చయ్యే ఈ ఆటలో వర్ధిష్ణువులెందరికో స్పాన్సర్‌షిప్‌లు దక్కేలా తోడ్పడ్డ తెర వెనుక దీప్తి... 15వ వరల్డ్ చెస్ ఛాంపియనైన విశ్వనాథన్ ఆనంద్ అని మర్చిపోలేం. ప్రతిభ గల పిల్లల్ని తీర్చిదిద్దడానికి వీలుగా ఒక వాతావరణాన్నీ, వ్యవస్థనూ కల్పించిన ఆలిండియా చెస్ ఫెడరేషన్ కృషినీ చెప్పుకొని తీరాలి. పెరిగిన సోషల్ మీడియా, హద్దులు లేని డిజిటల్ వ్యాప్తి సైతం మన యువతరాన్ని చెస్ వైపు ఆకర్షించిందీ నిజమే. భారతీయ స్ట్రీమింగ్ వేదికల్లో బాగా పాపులరైన చెస్‌బేస్ ఇండియాకు దాదాపు 19 లక్షల మంది సబ్‌స్క్రైబర్లున్నారు. ఆ వేదిక వివిధ టోర్నీల నిర్వహణతో పాటు క్రౌడ్ ఫండింగ్ ద్వారా పలువురు ఆటగాళ్ళకు ఆర్థికంగా అండగా నిలవడం చెప్పుకోదగ్గ విషయం. ఇప్పుడీ ఒలింపియాడ్ డబుల్ ధమాకా స్వర్ణాలు చెస్ ప్రాచుర్యంతో పాటు పిల్లల్లో ఆసక్తి పెంచడం ఖాయం.

భారత చదరంగానికి ఇది శుభతరుణం. త్వరలో జరిగే వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రస్తుత చైనీస్ ఛాంపియన్‌తో 18 ఏళ్ళ మన గుకేశ్ పోరు కోసం అంతా ఆసక్తిగా చూస్తున్నారు. ఇప్పటికే ఉన్నవారు కాక, కనీసం మరో అరడజను మంది ఒలింపియాడ్‌లో స్థానం కోసం పోటీపడుతున్న స్థాయికి చేరాం. అయితే, ఇది చాలదు. ఆడపిల్లల్లో మన చెస్ బలగం ఇంకా పెరగాల్సి ఉంది. ఇదే అదనుగా కేంద్రం, రాష్ట్రాలు మరింత ప్రోత్సాహం అందించాలి. పాఠశాలల స్థాయి నుంచే చెస్ పట్ల పిల్లల్లో ఆసక్తిని పెంచాలి. బడుల్లోనే కాక గ్రంథాలయాల్లో, స్థానిక పట్టణ కేంద్రాల్లోనూ చెస్‌కు వసతులు కల్పించాలి. అలాగే మన దేశంలోనూ అగ్రశ్రేణి టోర్నీలు జరిగేలా చూడాలి. చెన్నై ఇవాళ చదరంగ ప్రతిభకు కేంద్రంగా మారిందంటే తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన చేయూత కారణం. అందరికీ అది ఆదర్శప్రాయం. స్వర్ణయుగం సుదీర్ఘంగా కొనసాగాలంటే ఇలాంటి చర్యలే కీలకం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.అష్టమి సా.4.56 వరకు
తదుపరి నవమి, **నక్షత్రం:** ఆరుద్ర రా.3.31 వరకు
తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ప.12.01 నుండి 1.33 వరకు,
దుర్ముహూర్తం: ఉ.11.29 నుండి 12.17 వరకు,
అమృత ఘడియలు: సా.5.44 నుండి 7.19 వరకు

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.53
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

శ్రీలంక చరిత్రలోనే కొత్తమలుపు

విశ్లేషణ



టంకశాల అశోక్

శ్రీలంక చరిత్ర, వారు బ్రిటిష్ వలస పాలన నుండి 1948లో స్వతంత్రులైన 74 సంవత్సరాల తర్వాత ఈ నెల 22న కొత్త మలుపు తిరిగింది. ఆ దేశాన్ని ఇంతకాలం మధ్యే మార్గానికి చెందిన, లేదా భారతదేశపు కాంగ్రెస్ వలె కొద్దిగా వామపక్షపు మొగ్గు గల పార్టీలు పాలించగా, ఈ ఆదివారం నాటి ఎన్నికలలో స్పష్టంగా మార్క్సిస్టు సిద్ధాంతాలు గల జనతా విముక్తి పెరమున (జేవీపీ) పార్టీ విజయం సాధించింది. ఆ మరునాడే జేవీపీ నాయకుడు అనూర కుమార దిస్సనాయకే దేశాధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. జేవీపీ ఇండియా వ్యతిరేకి. చైనాకు అనుకూలం. తమిళ టైగర్లపై ఊచకోతను బలపరిచింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంతో సంబంధాలకు గట్టి ప్రయత్నం అవసరం.

శ్రీలంకలో జనతా విముక్తి పెరమున (జేవీపీ) విజయంలో గమనించవలసిన ముఖ్యమైన అంశాలు కొన్నున్నాయి. ఓటింగ్ శాతం అసాధారణంగా 75 శాతానికి చేరింది. జేవీపీకి లభించిన ఓట్లు 42.3 శాతం. వారి ప్రధాన ప్రత్యర్థి, మాజీ అధ్యక్షుడు ప్రేమదాస వారసుడైన సజిత్ ప్రేమదాస రెండవ స్థానంలో నిలవగా ఆయనకు వచ్చినవి 32.71 శాతం. అధ్యక్షునిగా ఇపుడు పదవీ విరమణ చేసిన రణిల్ విక్రమసింఘే తెచ్చుకున్నవి 17.27 శాతం కాగా, రాజపక్షే వారసుడు నమల్ రాజపక్షే కేవలం 3 శాతానికి పరిమితమయ్యాడు. అనూర దిస్సనాయకే పేరు మనకిక్కడ తెలియదుగానీ, తక్కిన వంశాలన్నీ సుపరిచితమే. ఎన్నికల ఫలితాలకు సంబంధించి గమనించవలసిన మరో విషయం, జేవీపీ మొదటిసారిగా దేశంలోని అన్ని ప్రాంతాలలో బలం సంపాదించటం. అక్కడ ఆ పార్టీకి మొదటినుంచి పునాది ఉన్నది దక్షిణ, మధ్య ప్రాంతాలలో మాత్రమే. తూర్పు, పడమరలలోగానీ, ఉత్తరానగానీ బలహీనం. ఇది నేను శ్రీలంకలో పర్యటించినపుడు స్వయంగా గమనించాను. దక్షిణాన, మధ్య ప్రాంతాలలో గ్రామాలు, పట్టణాలు అన్నీ జేవీపీ కంచుకోటలు. అదే ప్రాంతాన గల పెరెదేనియా అనే అతి సుందరమైన యూనివర్సిటీకి వెళ్లగా, సీలింగ్ నుంచి కింది వరకు వేలాడే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ చిత్రాలు! ఆ యూనివర్సిటీ పూర్తిగా జేవీపీ విద్యార్థి సంఘపు స్థావరం. అది చూసి నాకు ఆ కాలపు కాకతీయ యూనివర్సిటీ గుర్తుకు వచ్చింది. అటువంటి దశ నుంచి జేవీపీ ఇపుడు అన్ని ప్రాంతాలకు పాకిపోయింది.

అయితే, అదే సమయంలో గుర్తించవలసిన వాస్తవం ఒకటున్నది. జేవీపీ ఈ విధమైన బలాన్ని మొదటిసారిగా సాధించటానికి కొన్ని కారణాలున్నాయి. ఒకటి, దేశాన్ని మొదటి నుంచి పాలించిన అన్ని పార్టీలు వరుసగా విఫలమవుతూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోవటం; ఆర్థిక స్థితి తీవ్రంగా దెబ్బ తిని, భారీగా అప్పులపాలై, కొంత కాలం క్రితం దివాళా పరిస్థితికి చేరిన సంక్షోభం గురించి, ఫలితంగా పెద్ద ఎత్తున ప్రజాందోళనలు, హింస, సైన్యం ద్వారా అణచివేత, దేశం నుంచి అధ్యక్షుడు రాజపక్షే పరారీల వార్తలు చూశాం. ఆ పరిస్థితుల్లో సైన్యం సహా అన్ని పార్టీల రాజీతో మరొక మాజీ అధ్యక్షుడైన రణిల్ విక్రమసింఘేకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఐఎంఎఫ్ భారీ రుణంతో ఆయన ఆర్థిక స్థితిని చక్కబెట్టజూశారు గానీ ఆయన వల్ల కాలేదు. ప్రజల పరిస్థితులు క్షీణించటం, ధరలు ఆకాశానికి చేరటం, తీవ్ర నిరుద్యోగం వంటి కారణాలతో ఇతర పార్టీలన్నీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. ఒక శూన్యం ఏర్పడింది. రెండు, తాము ఆర్థిక స్థితిని చక్కబెట్టడంపై దృష్టిని కేంద్రీకరించగలమనీ, సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రయత్నించగలమనీ జేవీపీ నమ్మబలికిన మాటలను ప్రజలు నమ్మటం. మూడు, తమది మార్క్సిస్టు సిద్ధాంతం కాగా, డెమోక్రటిక్ సోషలిజం (మన దగ్గర సోషలిస్టు పార్టీల వలె), సామాజిక న్యాయం, అవినీతి నిర్మూలన అజెండాతో మార్పు, సంస్కరణ అనే లక్ష్యాలతో పనిచేయగలమని ప్రకటించటం.



శ్రీలంక నూతన అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకే

జేవీపీ సిద్ధాంతాలు మొదటి నుంచి ప్రజానుకూలమైనవి. నిరాడంబరులు, నీతిపరులు, కష్టించి పనిచేసేవారు, ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటారన్న పేరున్నది. పార్టీ వ్యవస్థాపకుడైన రోహణ విజేవీర యువకులకు రహస్యంగా సాయుధ శిక్షణలు ఇచ్చి ఒకసారి 1971లో, తర్వాత అంతకన్నా భీకరంగా 1987–89లో రెండవసారి ఆకస్మిక గెరిల్లా దాడులతో దేశాన్ని స్తంభింపజేశాడు. ఆయన గెరిల్లా బలాన్ని శ్రీలంక సైన్యం సైతం ఆపలేక పోవటంతో ఇతర దేశాలు సైన్యాలను పంపవలసి వచ్చింది. ఆ సైన్యాలన్నీ కలిసి దాదాపు 70 వేల మంది గెరిల్లాలను కాల్చివేసినట్లు అంచనా. ఆ కాలంలో ఇదంతా ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనాన్ని సృష్టించింది. ఆ తర్వాత జేవీపీ సాయుధ పోరాటాన్ని వదలివేసింది. మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతంతోనే పార్లమెంటరీ రాజకీయాలలోకి మళ్లింది.

ఇటువంటి నేపథ్యం నుంచి వచ్చిన అనూర ఒక మారుమూల గ్రామానికి, అతి సాధారణ కుటుంబానికి చెందినవాడు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలలో పాల్గొంటూ క్రమంగా పార్టీలో గుర్తింపు పొంది ఎదుగుతూ వచ్చాడు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించగలడనే పేరు తెచ్చుకున్నాడు. ఎప్పుడు ఏ విషయంలోనూ చెడ్డ పేరు తెచ్చుకోలేదు. ఈ విధమైన వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా ఉన్నవాడు గనుకనే ఆదివారం నాటి ఎన్నికలలో అన్ని ప్రాంతాల ప్రజలు తనకు, తన పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారు. ఆధిపత్యవాదపు సింహళ జాతీయులు, తమిళులు, ముస్లిములు, దక్షిణ–మధ్య ప్రాంతాల వాసులుగా విడిపోయి ఉండే అక్కడి దేశీయులు ఈ విధంగా మూకుమ్మడిగా ఒక పార్టీని బలపరచటం ఒక మేరకు దేశ స్వాతంత్ర్యానంతరం బండారనాయకే కుటుంబ కాలంలో మినహా ఎపుడూ జరగలేదు. ఇపుడు జేవీపీ తన చిన్న మిత్ర పక్షాలతో కలిసి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పేరిట ఒక ఏకీభావం గల కూటమితో ఆ ఘనతను సాధించింది. 'ఇది దేశాభ్యుదయం, పునర్నవీకరణల సరికొత్త శకం దిశగా ఒక ముందడుగు' అని, 'సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు ద్వారా దేశాన్ని కొత్త మలుపు తిప్పగలమనే నమ్మకం మాకున్న'దని ఈ సందర్భంగా అనూర ప్రకటించారు.

అయితే, శ్రీలంకను 1948లో దేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే సమస్యలకు గురిచేస్తూ, 1976లో వేలుపిళ్ళై ప్రభాకరన్ నాయకత్వాన లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్టీటీఈ) స్థాపన తర్వాత మహా తీవ్ర దశకు చేరిన తమిళుల సమస్యపై జేవీపీ పరిష్కార మార్గం ఏమిటన్నది ఒక ముఖ్యమైన ప్రశ్న. నేను కొలంబో శివార్లలోని జేవీపీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి అక్కడి నాయకులతో మాట్లాడినపుడు, వారు తమిళులకు ప్రత్యేక రాజ్యం కాదు గదా కనీసం వారి ప్రాంతాలకు ఫెడరల్ హక్కులు ఇచ్చేందుకు కూడా వ్యతిరేకులని అర్థమైంది. అది మార్క్సిజం అవగాహనకు భిన్నం కదా అని నేను గుర్తు చేసినా వారు అంగీకరించలేదు. నాకు అర్థమైన దానిని బట్టి ఇతర సింహళీయులు, బౌద్ధ గురువుల వలెనే జేవీపీ పూర్తిగా జాతీయవాద పార్టీ. తమ దేశ ఐక్యతకు, భౌగోళికతకు చిన్నమెత్తు భంగపాటు అయినా కలగరాదన్నది వారి వైఖరి. అందు కోసం బౌద్ధ గురువులు బుద్ధుని బోధనలనైనా పక్కకు పెట్టినట్లు, జేవీపీ వారు మార్క్సిస్టు సూత్రాలనైనా విస్మరిస్తారు. అందుకే వీరు ఇరువురూ, తమిళ ప్రాంతాలకు ఫెడరల్ అధికారం కోసం రాజీవ్ గాంధీ, జయవర్ధనేల మధ్య ఒప్పందంతో శ్రీలంక రాజ్యాంగానికి జరిగిన 13వ సవరణను తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళ టైగర్లపై ఊచకోతను పూర్తిగా బలపరిచారు. అప్పటితో పోల్చితే ప్రభాకరన్ గానీ, ఈలం పోరాటంగానీ లేనందున ఈ మారిన పరిస్థితులలో అనూర ప్రభుత్వ విధానం ఏమి కాగలదో వేచి చూడాలి.

శ్రీలంక పొరుగు దేశమైన ఇండియాకు వారి విదేశాంగ విధానం ముఖ్యమైనది. యథాతథంగా జేవీపీ మొదటినుంచి ఇండియా వ్యతిరేకి. చైనాకు అనుకూలం. అందుకు కారణాలను వారి కార్యాలయాన్ని సందర్శించినపుడు నాకు చెప్పారు. అదట్లా ఉంచితే, నిజానికి ఇంతకు ముందటి అధ్యక్షులు కూడా చైనా పట్ల ఎంతో కొంత మొగ్గు చూపిన వారే తప్ప ఇండియా పట్ల కాదు. ఆ విధంగా ఇండియాకు నాలుగు వైపుల గల దేశాలన్నింటిలో భూటాన్ తప్ప మనకు నిజంగా అనుకూలమున్నది ఒక్కటైనా లేదు. బంగ్లాదేశ్ కొంతమేర అట్లా ఉండగా షేక్ హసీనా పదవీచ్యుతితో పరిస్థితి మారింది. అటువంటప్పుడు శ్రీలంక కొత్త ప్రభుత్వంతో సంబంధాల అభివృద్ధికి గట్టి ప్రయత్నమే చేయవలసి ఉంటుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం మారలేదు!



గోవాలో పోర్చుగీసువాళ్లు: మీరు మతం మార్చుకోకపోతే మీ ఆస్తుల్ని జప్తు చేస్తాం. ఢిల్లీలో రాజకీయ నాయకులు: మా పార్టీలో చేరకపోతే మీ ఆస్తుల్ని జప్తు చేస్తాం.

– దేవ్‌దత్ పట్నాయక్, కాలమిస్ట్

ఇది రాచరికమా?



ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఆతిశీ, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కుర్చీలో కూర్చోకుండా దాన్ని ఖాళీగా వదిలేశారని వార్త. ఇది అర్థంపర్థం లేని డ్రామా. అది ముఖ్యమంత్రి కుర్చీ, రాజు తిరిగి రావడానికి ఎదురుచూస్తున్న సింహాసనమేమీ కాదు!

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

చైనాకు లాభం... మనకు?



అన్నింట్లోకీ చౌకైనది ఇరాన్ చమురు. 'బ్రెంట్' సూచీ కంటే చాలా డిస్కౌంటులో అమ్ముతోంది. ఇరాన్ మీద అమెరికా ఆంక్షలు విధించడం వల్ల అత్యంత లాభం పొందింది చైనా. ఇరాన్ చమురును దాదాపుగా ఆ ఒక్క దేశమే కొంటోంది. అమెరికా ఆంక్షలకు కట్టుబడి ఇరాన్ చమురును ఇండియా కొనడం ఆపేసింది. అయితే రష్యా చమురు మీద ఆంక్షలు లేవు.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

ఇది మాత్రం మనదా?



లౌకికవాదం అనేది యూరప్ భావన అని తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యాఖ్యానించారు. ఆఖరికి మోదీ రాజ్ దుర్వినియోగం చేసిన గవర్నర్ కాన్సెప్ట్ కూడా బ్రిటిష్ రాజ్ నుంచి ఇండియా స్వీకరించిందే!

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ సభ్యురాలు

ఎదిగే దారి



మనం ఎంత నడిస్తే అంత బాగవుతాం. ఎంత బరువు ఎత్తితే అంత బలవంతులమవుతాం. ఎంత ప్రకృతితో ఉంటే అంత సంతోషంగా ఉంటాం. ఎంత కష్టమైన పనులు చేస్తే, జీవితం అంత సులభతరం అవుతుంది. నడువు, ఎత్తు, బయటికి వెళ్లు, కష్టమైన పనులు చెయ్యి. ఎదగడానికి ఇదే దారి!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

దానికే కలవాలా?



కోవిడ్ తర్వాత నా భర్త మద్యపానం మానేశారు. ఆశ్చర్యంగా తన స్నేహితులు మా ఇంటికి రావడం మానేశారు. ఆయన్ని ఎప్పుడోగానీ 'గెట్ టుగెదర్స్'కు పిలవరు. స్నేహితులు కలవడానికి మద్యపానం ఒక్కటే దారి అన్నంతగా మనం దాన్ని సాధారణీకరించాం.

– ఎ. అనామిక, వ్యాఖ్యాత

మరో ప్రపంచం కోసం...



79 ఏళ్లలో ఉన్నవాడిగా, తర్వాతి ప్రపంచానికి నన్ను తీసుకెళ్లే విమానం కోసం విమానాశ్రయంలోని నిష్క్రమణ గదిలో ఎదురుచూస్తున్నాను. గొప్ప హిందీ కవి రహీమ్ అన్నాడు: 'చాహ్ గఈ, చింతా మిటీ, మనుఆ బేపరవాహ్! జిన్‌కో కుఛ్ న చాహిఏ, వె సాహన్ కె సాహ్!!' (కోరికలు లేవు, చింతలు లేవు, మనసుకు ఏ ఫర్వాలేదు! ఎవరికి ఏమీ వద్దో వారు సాహసుల్లో కెల్లా సాహసులు.)

– మార్కండేయ ఖట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

జనం సెంటిమెంట్లతో ఆటలా!

అభిప్రాయం



తెంపల్లె వేణుగోపాలరావు

అబద్ధం ఆడదల్చుకున్నవాడికి జ్ఞాపకశక్తి దండిగా ఉండాలి. ఆ పనే ఒక ముఠాగా చేయదల్చుకుంటే జ్ఞాపకశక్తితోపాటు ఆ ముఠా సభ్యుల మధ్య సమన్వయం ఉండాలి. అదేమీ లేక పోబట్టి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రిగా ఉంటున్న బాబు తనయుడు లోకేశ్ తామే సృష్టించిన 'కల్తీ నెయ్యి' ఊబిలో చిక్కుకుని బయటపడే మార్గం తోచక అర్థరహితంగా మాట్లాడుతున్నారు. వీరికి టీటీడీ ఈఓ శ్యామలరావు తోడయ్యారు. కల్తీ నెయ్యి ట్యాంకర్లు వచ్చి రెండు నెలలు దాటిందన్నవారు అంత వరకూ దర్యాప్తు జోలికి ఎందుకు పోలేదు? పోనీ బయట పెట్టాకైనా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నా ఆ పని ఎందుకు చేయటం లేదు?

మళ్లీ 1995 నాటి చంద్రబాబును చూస్తారంటూ బాబు మొదట్లో చెప్పినప్పుడు అందరూ అయోమయంలో పడ్డారు. తానే సీఎం కదా... ఇక పడగొట్టడానికి ఎవరున్నారని ప్రశ్నించుకున్నారు. కానీ ఈ వ్యవహారం చూస్తుంటే ఆయన దేవదేవుడికే వెన్నుపోటు పొడవదల్చుకున్నారన్న సంశయం కలుగుతోంది. కానీ రోజులు మారాయి. 24 గంటల చానెళ్లతోపాటు సోషల్ మీడియా ప్రవేశించటంతో నోటి వెంబడి మాట రావటం తడవు తాటాకులు కట్టేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల ముందు చెప్పిందేమిటి... ఇప్పుడు మాట్లాడుతున్నదేమిటని వీడియోల సాక్షిగా అడుగుతున్నారు. కొందరైతే వెనక్కి వెనక్కి పోయి మరీ పాత వీడియోలతో వాతలు పెడు తున్నారు.

'తన కుట్రలో ప్రజలందరినీ భాగస్వాముల్ని చేయగల నేర్పరి చంద్రబాబు. కనుక పాలించే యోగ్యత ఆయనకు మాత్రమే ఉంటుంది' అని ప్రఖ్యాత రచయిత కేఎన్‌వై పతంజలి ఒకప్పుడు వ్యంగ్యంగా అన్నారు. ఎటొచ్చీ కలియుగ దైవం ముందు బాబు ఎత్తులు పని కొచ్చినట్టు లేదు. ఏపీలో టీడీపీ అనుకూల మీడియా సరే... జాతీయ మీడియా సైతం నెయ్యి వివాదంలో మౌలిక ప్రశ్నలు వేసుకోకుండా, కనీసం తమ రిపోర్టర్లను నలుదిక్కులకూ పంపి నిర్ధారణ చేసుకోకుండా డిబేట్లు పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నెయ్యిని స్వీకరించటానికి టీటీడీ ఎలాంటి ప్రమాణాలు అనుసరిస్తున్నదో, కల్తీ ఉందని తేలినపక్షంలో ఏం చేస్తున్నారో వారిలో ఎవరూ తెలుసుకోలేదు. 2014–19 మధ్య 14 సార్లు, 2019–2024 మధ్య 18 సార్లు వెనక్కి పంపినప్పుడు ఇప్పటి మాదిరే టెస్టింగ్ ల్యాబరేటరీలకు పంపారా అని అడగలేదు. అసలు కల్తీ నెయ్యి ట్యాంకర్లు ఎప్పుడొచ్చాయి... వాటిని తిప్పి పంపారా, లడ్డూలో వాడటానికి కొండపై గల గోడౌన్‌కు పంపారా అని ఆరా తీయలేదు. పొరుగునున్న మైసూర్‌లోని కేంద్ర ప్రభుత్వ టెస్టింగ్ ల్యాబరేటరీ లేదా హైదరాబాద్‌లోని గుర్తింపు పొందిన మరో ల్యాబ్‌నూ కాదని ఎక్కడో గుజరాత్‌లో ఉన్న ఎన్‌డీడీబీకి టీటీడీ ఎందుకు పంపవలసి వచ్చిందని ప్రశ్నించలేదు. ఆ కల్తీ నెయ్యితో లడ్డూ తయారైందని చెప్పే దుస్సాహసానికి చంద్రబాబు పూనుకోగా, ఈవో శ్యామలరావు 'అబ్బబ్బే... అదేం లేద'ని తాజాగా తేల్చారు. ఇందులో ఎవరిది నిజం?



బీజేపీ మతత రాజకీయం

ఏపీలో ఉమ్మడి మేనిఫెస్టో చేతితో కూడా తాకకుండానే పోటీ చేసిన సీట్లన్నీ బీజేపీ జోలెలో పడ్డాయి. ప్రభుత్వంలో కూడా చేరి కులాసాగా రోజులు వెళ్లదీస్తున్న బీజేపీ ఈ వివాదంలో యథాశక్తి బహుళ పాత్రాభినయం చేస్తున్న వైనం కనబడుతోంది. తిరుపతితో మొదలుపెట్టి రెండు రాష్ట్రాల్లోనూ ఉన్న బీజేపీ నాయకులు తలో మాటా మాట్లాడుతున్నారు. వీళ్లెవరూ అసలు న్యాయవిచారణ లేదా సీబీఐ దర్యాప్తు కావాలని కేంద్రాన్ని అడగటం లేదు. చంద్రబాబునూ అడగరు. సనాతన ధర్మం, హిందూ మత పరిరక్షణ గురించి కొత్తగా తెచ్చిపెట్టుకున్న ఆవేశంతో మాట్లాడుతున్న పవన్‌ది సైతం ఇదే బాణీ. ఈ రంకెలెందుకు... లడ్డూ కల్తీ జరిగివుంటే తగిన విచారణ జరిపించి బాధ్యుల్ని గుర్తించి కఠినంగా శిక్షించవచ్చు కదా అని నటుడు ప్రకాశ్‌రాజ్ అడిగినందుకు పవన్‌కు రోషం పొడుచుకొచ్చింది. విచారణ సంగతి విడిచిపెట్టి 'మాకు బాధ వుండదా... మేం గొంతెత్త కూడదా' అంటూ విరుచుకు పడుతున్నారు. అసందర్భంగా వేరే మతాలను కూడా గౌరవిస్తానని, విరాళాలిస్తానని ఆయన చెబుతున్నారు. ఇదంతా ఎవరిక్కావాలి? హిందువును అంటున్నావు గనుక, దానికోసమే తపించి పోతున్నానని మాట్లాడుతున్నావు గనుక, ప్రభుత్వం మీది గనుక అందరూ అడుగుతున్నట్టు సీబీఐతో దర్యాప్తు చేయించాలి. ప్రకాశ్‌రాజే కాదు, ప్రజలంతా దాన్నే కోరుతున్నారు. బాధ్యులైన సిబ్బందినీ, వారి వెనకున్న నాయకులనూ గుర్తించి కేసులు పెట్టాలి. దాన్ని మరిచి ఇంత కాకిగోల అవసరమా? జనాన్ని వెల్లువలా రావాలని చెప్తున్న మీరు తప్పించుకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు?


అధికారం రాకముందే ఆరోగ్యశ్రీ నుంచి క్రిటికల్ కేర్‌తో పాటు కొన్ని వ్యాధుల చికిత్సలను తొలగించిన బాబు ఇప్పుడు మెడికల్ విద్యను అంగట్లో సరుకుగా మారుస్తున్నారు. హత్యలు, దౌర్జన్యాలు, విధ్వంసాలు కూడా అధికారం చేతికి రాకముందునుంచే మొదలయ్యాయి. సూపర్ సిక్స్ హామీలన్నీ మరిచినట్టే ప్రవర్తిస్తున్నారు. బడిచదువులు చట్టుబండలయ్యాయి. బుడమేరు, ఏలేరు వరదల పాపం ప్రభుత్వానిదేనని ప్రజలకు అర్థమైంది. విశాఖ ఉక్కులో రెండు ఫర్నేస్‌లను పూర్తిగా నిలిపివేసి, ఉత్పత్తి తగ్గేలా చేసి... నష్టాలు ఎందుకొస్తున్నాయో ఆత్మవిమర్శ చేసుకోవాలంటూ సూక్తులు వల్లిస్తున్నారు. ఈవీఎంల బండారం బయటపడినా దాన్ని గురించి నోరెత్తరు. తమ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసహనాన్ని గమనించి ఈ వివాదం రేకెత్తించి దృష్టి మరలించే ప్రయత్నం చేస్తున్నారు.

బీజేపీ ఒకటి గ్రహించాలి. టీడీపీని హైజాక్ చేసి, అధికారాన్ని గుంజుకోవటంతో చంద్రబాబు అధికార ప్రస్థానం మొదలైంది. కనుక ఆయన ప్రతిష్ఠకు ఇప్పుడు కొత్తగా భంగం వాటిల్లేదేమీ లేదు. ఎటొచ్చీ బీజేపీకే ఇది ప్రాణాంతకమవుతుంది. దుర్బుద్ధితో సెంటిమెంట్లు రెచ్చగొట్టాలని చూస్తే భక్తకోటి క్షమించదు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు
venujourno@gmail.com

వర్తమానమే... నిజం!

అరణ్యంలో ఉన్న ఓ జ్ఞాని దగ్గరకు వెళ్లిన ఒక యువకుడు తనకు నిజమంటే ఏమిటో చెప్పాలని కోరాడు. వెంటనే జ్ఞాని 'నిజం సంగతి ఇప్పటికి పక్కనపెట్టు. నేనడిగిన దానికి జవాబు చెప్పు. మీ ఊళ్ళో బియ్యం ధర ఎంతో చెప్పు' అన్నాడు. అందుకు యువకుడు వినమ్రంగా 'స్వామీ! నన్ను మన్నించండి. మర్యాద మరచి మాట్లాడుతున్నానని అనుకోకండి. ఇటువంటి ప్రశ్నలు ఇక మీదట నన్ను అడక్కండి . ఎందుకంటే నేను గతకాలపు దారులు మరచిపోయాను. గతానికి సంబంధించినంత వరకు నేను ఇప్పుడు మరణించాను. ఇదిగో ఇప్పుడు నడిచొచ్చిన మార్గాన్ని కూడా నేను మరచిపోయాను' అన్నాడు. 'నువ్వు గత కాలపు భారాన్ని ఇంకా మోస్తున్నావా... లేదా అనేది తెలుసుకోవడానికే బియ్యం ధర ఎంతని అడిగాను. నువ్వు దానికి జవాబు చెప్పి ఉంటే వెంటనే నిన్ను ఇక్కడి నుంచి పంపించేసేవాడిని. నిజం గురించి మాట్లాడటానికి తిరస్కరించే వాడిని' అన్నాడు. 'అయితే ఇపుడు చెప్పండి నిజమంటే ఏమిటో' అని అడిగాడు యువకుడు.



'వర్తమానంలో బతకడం తెలీని మనిషిని ఓ తోటలోకి తీసుకు వెళ్ళి ఓ గులాబీ పువ్వుని అతనికి చూపించు. ఈ గులాబీ ఎంత అందమైనదో అని అతనితో అను. వెంటనే అతను దీని వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదు. సాయంత్రంలోపు వాడి రాలిపోతుంది అంటాడు. యవ్వనం ఎంతటి సుఖమైనదో చెప్పమని అడిగితే అది నిజమే కావచ్చు కానీ ముసలితనం త్వరగా వచ్చేస్తుందిగా అంటాడు. సంతోషం గురించి మాట్లాడితే అదంతా వట్టి మాయ అంటాడు. కానీ వర్తమానంలో బతకడం తెలిసిన వ్యక్తిని ఓ ఉద్యానంలోకి తీసుకు వెళ్తే అక్కడి రంగు రంగుల పువ్వులను చూపిస్తే వాటిని చూసి అతనెంతగా ఆనందిస్తాడో తెలుసా... ఎన్ని కబుర్లు చెప్తాడో తెలుసా! ఇవి చూడటానికి వచ్చిన దారులను గురించి ఆలోచించవలసిన అవసరమేముందంటాడు. రాలిపోయే పువ్వులైనా సరే ఇప్పుడు ఎంత అందంగా ఉన్నాయో అంటాడు. వికసించే పువ్వులు అందమైనవా... రాలిపోయే పువ్వులు అందమైనవా అని అడిగితే గతించిన కాలాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటే వర్తమానంలోని నిజాన్ని గ్రహించలేమంటాడు. అది నిజం. ఏది నిజమో అది ఈ క్షణంలో ఉంది. నిజమనేది గతించిన, రానున్న కాలాలకు సంబంధించినది కాదు. వర్తమానమే నిజమైన కాలం' అని చెప్పాడు జ్ఞాని. యువకుడికి విషయం అర్థమైంది. ఆనందంగా వెనుతిరిగాడు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

యూట్యూబర్ హర్ష సాయిపై యువతి ఫిర్యాదు



మణికొండ: పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో సావాసం చేసి ఇప్పుడు మొహం చాటేస్తున్నాడని యూట్యూబర్ హర్ష సాయిపై బిగ్‌బాస్ ఫేం అయిన ఓ యువతి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. విజయనగరంకు చెందిన యూ ట్యూబర్ హర్ష సాయి తన చానల్‌లో పలువురికి ఆర్థిక సాయం చేస్తూ పాపులర్ అయ్యారు. అతను తనతో ప్రేమాయణం సాగించటంతో పాటు తాను తీస్తున్న సినిమాలో హీరోయిన్‌గా అవకాశం ఇస్తానని, తన వద్ద రూ. 2 కోట్లు తీసుకుని వాడుకున్నాడని యువతి ఫిర్యాదు చేసింది. హర్ష సాయితో పాటు ఆయన తండ్రి రాధాకృష్ణ సైతం తనను మోసం చేశాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వాట్సాప్ చాటింగ్, వీడియోకాల్స్, ఫొటోలు ఆమె తన న్యాయవాది సమక్షంలో పోలీసులకు అందజేసినట్టు సమాచారం. ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి కేసు నమోదు చేసిన పోలీసులు బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గోల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారుకు గీతలు గీశారని 8 మంది పిల్లలపై కేసు

వరంగల్ పోలీసుల తీరుపై విమర్శలు

వరంగల్ క్రైం: చిన్న పిల్లలు ఆడుకుంటూ కారుకు గీతలు గీసిన ఘటనలో ఎనిమిది మంది పిల్లలపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి రాంనగర్ టవర్స్ (అపార్ట్‌మెంట్)లో సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ కారుకు అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న పిల్లలు ఆడుకుంటూ గీతలు పెట్టారు. దీనిపై అతను సుబేదారి పీఎస్‌లో గత నెల 5న ఫిర్యాదు చేయగా 8 మంది పిల్లలపై కేసు నమోదైంది. అయితే చిన్నపిల్లలపై కేసులు నమోదు చేసిన సుబేదారి పోలీసుల తీరుపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మోటారు వైర్లు సరిచేస్తూ ఒకరు.. గడ్డి కోస్తూ మరొకరు..

- విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి
- ఖమ్మం, సిద్దిపేట జిల్లాల్లో ఘటనలు

నేలకొండపల్లి/దుబ్బాక రూరల్: విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి చెందారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాధారానికి చెందిన రైతు పరిటాల లింగయ్య(57) మంగళవారం తన పొలానికి వెళ్లాడు. అక్కడ బోర్ మోటారు వైర్లను కర్రకు కట్టడంతో కిందకు వాలిపోయి ఉండటంతో వాటిని సరిచేసే క్రమంలో ఆయన విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. లింగయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పశువుల మేతకు గడ్డికోస్తుండగా...

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లి గ్రామానికి చెందిన రైతు గౌరి అంజయ్య(71) పొలం వద్ద సోమవారం సాయంత్రం పశువుల మేతకు గడ్డిని కొడవలితో కోస్తున్నాడు. గడ్డితోపాటు బోరు మోటారు వైర్‌ను చూసుకోకుండా కోసేయడంతో కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న కుమారుడు గమనించి స్టార్టర్ డబ్బాలోని ఫీజ్‌లను తీసేసి దగ్గరకు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు.మంగళవారం మృతుడి కుమారుడు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమరోత్సాహంతో కార్యక్రమాలు నిర్వహించండి

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు

చర్ల: మావోయిస్టు పార్టీ ఏర్పాటై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వీటిని సమరోత్సాహంతో జరపాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఆర్.కొత్తగూడెం, సత్యనారాయణపురం గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కరపత్రాలు వెలిశాయి. మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన 'కగార్'ను వ్యతిరేకించాలని కోరింది. రాష్ట్రంలో మావోయిస్టు పార్టీ రెండు దశాబ్దాలుగా అనేక కష్ట, నష్టాలు ఎదుర్కొందని, అయినప్పటికీ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడుతామని ప్రకటించింది. రాజకీయ, నిర్మాణ కృషిలో కొన్ని విజయాలు సాధించామని, తెలంగాణలోనూ బలమైన రాజకీయ ఉద్యమాలు చేస్తామని వెల్లడించింది. సామ్రాజ్యవాదుల లాభాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రపంచీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్నామని, ప్రజాస్వామిక హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపింది. మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో ఈ 20 ఏళ్ల కాలంలో గ్రీన్‌హంట్, సమాధాన్, ప్రహార్ పేర్లతో అనాగరిక, నరహంతక ఆపరేషన్లను పాలకులు కొనసాగించారని, ఈ క్రమంలో ఈ సంవత్సరం 180 మందికి పైగా పార్టీ శ్రేణులు, గెరిల్లా యోధులు ప్రాణాలర్పించారని వెల్లడించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే 10 మంది పార్టీ ప్రముఖులను పొట్టన పెట్టుకుందని ఆరోపించింది. కాగా, మావోయిస్టుల కరపత్రాలు వెలిశాయన్న సమాచారం అందుకున్న పోలీసులు వాటిని తొలగించారు.



క్యూలో నిల్చున్న విద్యార్థినులు

139 మంది విద్యార్థులకు ఒకే మూత్రశాల

- బహిర్భూమికి ఇంటికెళ్లాల్సిందే
- జగిత్యాల రూరల్ జాబితాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో దయనీయ పరిస్థితి.. తమ పిల్లల టీసీల కోసం తల్లిదండ్రుల డిమాండ్

జగిత్యాల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థినులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే కరువయ్యారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 77 మంది విద్యార్థులున్నారు. వీరిలో 37 మంది బాలికలు, 40 మంది బాలురు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో 62 మంది విద్యార్థుల్లో 36 మంది బాలికలు, 26 మంది బాలురు ఉన్నారు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు శిథిలావస్థకు చేరడంతో కూల్చేశారు. వాటి స్థానంలో ఉపాధి హామీ కింద పాఠశాలకు ఒకటి చొప్పున రెండు మూత్రశాలల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు కొనసాగుతుండగానే జిల్లా అధికారులు నిధులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫలితంగా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి రెండు పాఠశాలల్లో ఉన్న మొత్తం 139 మంది విద్యార్థులకు ఒకే మూత్రశాల గతి అయ్యింది. బహిర్భూమికి విద్యార్థులు ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనిస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు టీసీలు ఇవ్వాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నారు. పిల్లలకు టీసీలు ఇస్తే పాఠశాల ఎలా నడిపేదని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

633 ఫార్మసిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్

- వచ్చే నెల 5వ తేదీ నుంచి 21 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 30న పరీక్ష.. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో 633 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీ కోసం 'మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు' మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. బోర్డు సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. అభ్యర్థులు అక్టోబర్ ఐదో తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులో ఏవైనా పొరపాట్లు ఉంటే మార్చుకునేందుకు 23, 24వ తేదీల్లో అవకాశం ఉంటుందని వివరించారు. నవంబర్ 30న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

నోటిఫికేషన్‌లోని కీలక అంశాలు, వివరాలివీ..

- మొత్తం 633 పోస్టులు ఉండగా.. అందులో 446 ప్రజారోగ్య సంచాలకులు, వైద్యవిద్యా సంచాలకుల (డీఎంఈ) విభాగంలో ఉన్నాయి. మరో 185 తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో, ఇంకో 2 హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రిలో ఉన్నాయి.
- జోన్ల వారీగా చూస్తే.. జోన్-1లో 79, జోన్-2లో 53, జోన్-3లో 86, జోన్-4లో 98, జోన్-5లో 73, జోన్-6లో 154, జోన్-7లో 88 పోస్టులు ఉన్నాయి.
- ఈ పోస్టులకు పేస్కేల్ రూ.31,040 నుంచి రూ.92,050 మధ్య ఉంటుంది.
- రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాలు.. హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేటలలో పరీక్షా కేంద్రాలు ఉంటాయి.
- ఫలితాల అనంతరం మెరిట్ జాబితాను బోర్డు వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.
- అభ్యర్థులు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఫార్మా డీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో తప్పక రిజిస్ట్రేషన్ చేసి ఉండాలి.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిజేసే వారికి వెయిటేజీ ఉంటుంది. వారు అనుభవపూర్వక ధ్రువీకరణపత్రం సమర్పించాలి.
- అభ్యర్థుల వయసు ఈ ఏడాది జూలై 1 నాటికి 46 సంవత్సరాలకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు.. దివ్యాంగులకు పదేళ్లు సడలింపు,ఎన్‌సీసీ, ఎక్స్ సర్వీస్‌మన్లకు మూడేళ్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు (ఆర్టీసీ, మున్సిపల్ ఉద్యోగులు అనర్హులు) ఐదేళ్ల సడలింపునిచ్చారు.
- రాత పరీక్షకు 80 మార్కులు ఉంటాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసినవారికి వెయిటేజీ కింద 20 పాయింట్స్ కేటాయిస్తారు. ఇందులో గిరిజన ప్రాంతాల్లో పని చేసిన ప్రతి ఆరు మాసాలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే ప్రతీ ఆరు నెలలకు 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు.
- పూర్తి వివరాలను అభ్యర్థులు www.mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు.



పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ

పొన్నారి పాఠశాలకు ఉపాధ్యాయుడి కేటాయింపు

సాక్షి ఎఫెక్ట్

తాంసి: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలకు మరొక ఉపాధ్యాయుడిని విద్యాశాఖ అధికారులు కేటాయించారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత విషయాన్ని 'సాక్షి' గత మంగళవారం '73 మంది.. ఒకే టీచర్' శీర్షికన మెయిన్‌లో ఫొటో కథనాన్ని ప్రచురించింది. ఈమేరకు జిల్లా విద్యాశాఖ స్పందించింది. డీఈవో ఆదేశాల మేరకు అధికారులు తలమడుగు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణను ఇక్కడికి డిప్యుటేషన్‌పై కేటాయించారు. వెంటనే ఆయన పాఠశాలకు వచ్చి విధుల్లో చేరారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. 'సాక్షి' చొరవను పలువురు అభినందించారు.

ఫస్ట్ ప్రైజ్ పొట్టేలు.. సెకండ్ ప్రైజ్ మేకపోతు.. థర్డ్ ప్రైజ్ జానీవాకర్

బోయపల్లి వారి దసరా ధమాకా... మంచిర్యాల జిల్లాలో దసరా పోటీలకు బంపర్ ఆఫర్ ప్రకటించిన యువకులు



తాండూర్: ఇటీవల కాలంలో పలు ఉత్సవాల సందర్భంగా బహుమతుల పేరిట స్కీములు, బంపర్ డ్రాలు నిర్వహించడం సాధారణమైంది. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం బోయపల్లి గ్రామ యువకులు ఈసారి దసరా నవరాత్రి ఉత్సవాలకు ఓ వినూత్న ఆలోచన చేశారు. బోయపల్లి వారి దసరా ధమాకా పేరిట లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఒక్కో కూపన్‌ను రూ.వందకు కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. లక్కీ డ్రాలో ఫస్ట్ ప్రైజ్ కింద పొట్టేలు, సెకండ్ ప్రైజ్ మేకపోతు, థర్డ్ ప్రైజ్ జానీవాకర్ మద్యం బాటిల్‌ను ఇస్తున్నట్లు ప్రకటించారు. వివిధ రకాల మద్యం బాటిళ్లు, నాటుకోడి పుంజులు, పెట్టలు లాంటివి కూడా బహుమతుల్లో ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. అక్టోబర్ 10న డ్రా తీస్తామని వెల్లడించారు. కూపన్లను 600 మందికి మాత్రమే విక్రయిస్తామని తెలిపారు. సోమవారం నాటికి 500 కూపన్లు అమ్ముడయ్యాయని తెలిపారు. ఈ బంపర్ డ్రా ప్రకటన గ్రామంలో సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

రైతుపై బ్యాంకు అధికారుల దౌర్జన్యం

రుణం చెల్లించాలని ఇంటి తలుపుల తొలగింపు



ఇంటి నుంచి తొలగించి పక్కన పెట్టిన తలుపు

నెన్నెల: మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రానికి చెందిన రైతు గట్టు శివలింగయ్యపై జిల్లా సహకార బ్యాంకు అధికారులు దౌర్జన్యానికి దిగారు. తీసుకున్న రుణం చెల్లించాలని గతేడాది నోటీసులు జారీ చేశారు. ఈ ఏడాది పంట చేతికి వచ్చాక చెల్లిస్తానని రైతు తెలిపాడు. అయితే పంట చేతికి రాకముందే ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేశారు. బాధిత రైతు కథనం ప్రకారం.. శివలింగయ్య తన రెండు ఎకరాల సాగుభూమి అభివృద్ధి కోసం 2019లో ఆదిలాబాద్ జిల్లా సహకార బ్యాంకు బెల్లంపల్లి శాఖ నుంచి రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాడు. మూడు కిస్తీలుగా రూ.80 వేలు తిరిగి చెల్లించాడు. గతేడాది పంటలు పండక పోవడం, కూతురు పెళ్లి చేయడంతో కిస్తీ డబ్బులు చెల్లించలేదు. దీంతో బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేయడంతో ఈ ఏడాది పంట చేతికి రాగానే చెల్లిస్తానని తెలిపాడు. అయితే పంటకాలం పూర్తి కాకముందే.. మంగళవారం శివలింగయ్య ఇంటికి వచ్చిన బ్యాంకు అధికారులు రుణం చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో రైతు బయట డబ్బులు తీసుకురావడానికి వెళ్లాడు. ఇంతలో అధికారులు రైతు ఇంటి తలుపులు తొలగించారు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి భూమి కోసం రుణం ఇచ్చి.. ఇంటిపై దౌర్జన్యం చేయడం ఏంటని నిలదీశారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రైతు ఇంటికి వచ్చేసరికి తలుపులు తొలగించి ఉండటంతో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు ఫిర్యాదు చేశాడు. నెన్నెల పోలీస్ స్టేషన్‌లో కూడా బ్యాంకు అధికారుల దౌర్జన్యంపై బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

హైదరాబాద్‌లో ఐటీ సోదాలు



సోదా నిర్వహించింది ఈ రెయిన్‌బో విస్టాస్‌లోనే..

సాక్షి, హైదరాబాద్/మూసాపేట: హైదరాబాద్‌లోని ఎనిమిది ప్రాంతాల్లో మంగళవారం ఏక కాలంలో ఆదాయపన్ను శాఖ అధికారుల సోదాలు కొనసాగాయి. మూసాపేటలోని రెయిన్‌బో విస్టాస్ కమ్యూనిటీ ఫేజ్-2లోని ఐ బ్లాక్ 101లో నివాసం ఉంటున్న వ్యాపారవేత్త బొల్ల రామకృష్ణ నివాసంలో ఉదయం ఐదున్నర గంటల నుంచి ఐటీ అధికారులు సోదాలు ప్రారంభించారు. అదే సమయంలో ఏ బ్లాక్ 407లో నివాసం ఉంటున్న రామకృష్ణ బంధువు గట్టు రాజేశ్ ఇంట్లో కూడా సోదాలు జరిగాయి. అధికారులు రెండు బృందాలుగా విడిపోయి సోదాలు చేశారు. బొల్ల రామకృష్ణ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, న్యూస్ చానల్ చైర్మన్‌గా, సీఎం పెళ్లాం అనే సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు. రామకృష్ణ నాలుగు నెలల నుంచి రెయిన్‌బో విస్టాస్‌లో ఉంటున్నారు. 50 మందికి పైగా అధికారులు ఎనిమిది బృందాలుగా విడిపోయి సోదాలు చేశారు. బషీర్‌బాగ్ పైగా ప్లాజాలోని ఫైనాన్స్ ఆఫీస్ సహా కూకట్‌పల్లి, మూసాపేట్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, మాదాపూర్‌లోని కార్యాలయాల్లో సోదాలు కొనసాగాయి. ఈ కంపెనీలకు చెందిన ఆర్థిక వ్యవహారాలపై ఆరా తీశారు. డాక్యుమెంట్లను కొన్నింటిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

అట్టుడికిన కామారెడ్డి

- ఆరేళ్ల విద్యార్థినిపై పీఈటీ అసభ్యకర ప్రవర్తన
- జీవదాన్ స్కూల్‌లో ఘటన.. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల ఆందోళన
- రాళ్లదాడిలో సీఐతోపాటు పలువురు పోలీసులకు తీవ్ర గాయాలు
- తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయిన ఎస్సై



ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు (ఇన్‌సెట్) గాయపడిన సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్ / కామారెడ్డి క్రైం: ఆరేళ్ల చిన్నారిపై పీఈటీ అసభ్యకర ప్రవర్తన కామారెడ్డిని అట్టుడికించింది. న్యాయం కావాలంటూ విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, బంధువులు పెద్దఎత్తున పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఆందోళనకారుల రాళ్లదాడి, పోలీసుల లాఠీచార్జ్‌తో దాదాపు ఆరుగంటల పాటు పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో యూకేజీ చదువుతున్న ఆరేళ్ల చిన్నారి పట్ల అదే పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న నాగరాజు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. విషయం తెలియడంతో పలు విద్యార్థి సంఘాల వారు మంగళవారం ఉదయం పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలో పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాంకురియన్, వైస్ ప్రిన్సిపాల్ వీసీ థామస్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాల లోపలికి దూసుకెళ్లారు. ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఫర్నిచర్ ధ్వంసం చేశారు.

పీఈటీపై ఫిర్యాదు చేసినా...

పలుమార్లు ఫిర్యాదు చేసినా సదరు పీఈటీని తొలగించలేదన్నారు. ఈ విషయాన్ని గతంలోనే డీఈవో, ఎంఈవోల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదని మండిపడ్డారు. అప్పటికే పాఠశాలకు చేరుకున్న పోలీసులు వారిని సముదాయిస్తున్న సమయంలోనే బయట నుంచి పెద్దఎత్తున యువకులు అక్కడకు చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకున్నా వినలేదు. పలుమార్లు పోలీసులకు, ఆందోళన చేస్తున్న వారితో తోపులాట జరిగింది. ఆగ్రహంతో ఉన్న కొందరు పాఠశాల భవనంపై రాళ్లు రువ్వడంతో కిటికీల అద్దాలు ధ్వంసం అయ్యాయి. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించే క్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్ తలకు రాయి బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే సీఐని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తోపులాటలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కాళ్లు విరగడంతో పాటు, పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. ఎస్ఐ రాజారాం సొమ్మసిల్లి పడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ సింధు శర్మ ఆందోళకారులను సముదాయించారు. సాయంత్రం ఆరుగంటల వరకు జిల్లా కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి.

పిడుగుపాటుకు ముగ్గురు బలి



కృష్ణకుమార్



కట్టం నాగశ్రీ



సున్నం అనూష

దమ్మపేట/హుజూరాబాద్ రూరల్/లోకేశ్వరం: భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్ జిల్లాల్లో పిడుగుల కారణంగా ముగ్గురు మృత్యువాతపడ్డారు. భద్రాద్రిజిల్లా దమ్మపేట మండలం జగ్గారం పంచాయతీ పరిధి బూర్గుగుంపు గ్రామానికి చెందిన కట్టం నాగశ్రీ (21), సున్నం అనూష (23) మరికొందరితో కలిసి జగ్గారం శివారు అరటి తోటలో కూలి పనికి వెళ్లారు. మధ్యాహ్నం నుంచి కుండపోతగా వర్షం కురుస్తుండటంతో త్వరగా పనులు ముగించుకొని బయలుదేరిన క్రమంలో వారు నిల్చున్న చోటే పిడుగు పడింది.దీంతో నాగశ్రీ, అనూష ఒక్కసారిగా కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. సీతమ్మ, ఊకే రత్తమ్మ, కల్లూరి రాజమ్మ తీవ్ర అస్వస్థతకు గురికాగా సత్తుపల్లి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. మరోఘటనలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన రైతు కంకణాల కృష్ణకుమార్ (33) పిడుగుపాటుతో మృతిచెందాడు. కృష్ణకుమార్ తన పాడి గేదెలను తీసుకొని గ్రామ శివారులోని మైదానంలో మేపుతుండగా ఒక్కసారిగా పిడుగుపాటుకు గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పిడుగుపాటుకు కాడెద్దు మృతి

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాయాపూర్ కాండ్లీకి చెందిన రైతు ఆరె లింగురాం పటేల్‌కు చెందిన కాడెద్దు, లేగదూడ సోమవారం రాత్రి పిడుగుపాటుతో మృతిచెందాయి. లింగురాం తనకున్న ఐదెకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, సోయా పంటలు సాగుచేశాడు. సోమవారం ఉదయం కాడెడ్లను చేను వద్దకు తీసుకెళ్లాడు. పనులు పూర్తయ్యాక సాయంత్రం ఇంటికి తీసుకొచ్చాడు. ఇంటిపక్కనే వాటిని కట్టేసి రాత్రి నిద్రపోయాడు. అర్ధరాత్రి పిడుగు పడటంతో కాడెడ్లతోపాటు లేగదూడ మరణించాయి. ఆర్ఐ బాలకిషన్ పంచనామా నిర్వహించారు.

నెలల శిలరేడు!

త్వరలో భూ కక్ష్యలోకి బుల్లి గ్రహశకలం

రెణ్నెల్లపాటు భూమి చుట్టూ చక్కర్లు

ఇప్పటిదాకా అది కేవలం ఒక అంతరిక్ష శిలే. కానీ త్వరలో ఓ రెండు నెలల పాటు తాత్కాలికంగా 'చందమామ' హోదా పొందనుంది! ఎవరా బుల్లి చంద్రుడు? ఏమిటా విశేషాలు? చూద్దాం రండి...

భూ కక్ష్యను సమీపిస్తున్న ఒక బుల్లి గ్రహశకలాన్ని సైంటిస్టులు తాజాగా గమనించారు. అది ఇంకొద్ది రోజుల్లో తాత్కాలికంగా భూమ్యాకర్షణ శక్తికి లోనవనుంది. సెప్టెంబర్ 29 నుంచి భూ కక్ష్యలోకి ప్రవేశించి మన గ్రహం చుట్టూ పరిభ్రమించడం మొదలు పెడుతుంది. దాని చక్కర్లు నవంబర్ 25 దాకా కొనసాగుతాయని అంతరిక్ష శాస్త్రవేత్తలు వివరించారు. ఆ మీదట తిరిగి సౌర కక్ష్యలోకి ప్రవేశించి ఎప్పట్లా సూర్యుని చుట్టూ తిరుగుతుంది. దక్షిణాఫ్రికాలోని నాసా అబ్జర్వేటరీ ద్వారా సైంటిస్టులు దీన్ని గత ఆగస్టు 7న గమనించారు. దీని వ్యాసం 37 అడుగులని అంచనా వేసినా 16 నుంచి 138 అడుగుల దాకా ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ బుల్లి తాత్కాలిక చంద్రున్ని 2024పీటీ5గా పిలుస్తున్నారు. భూ కక్ష్యలోకి దాని రాకపోకలను గురించిన సమాచారం అమెరికన్ ఆస్ట్రనామికల్ సొసైటీ తాజా సంచికలో ప్రచురితమైంది.

ఆ ప్రమాదమేమీ లేనట్టే...

65 అడుగుల వ్యాసంతో కూడిన ఇలాంటి గ్రహశకలమే ఒకటి 2013లో పెద్ద భయోత్పాతమే సృష్టించింది. భూ వాతావరణంలోకి ప్రవేశించి రష్యాలో చెలియాబిన్స్క్ ప్రాంతంలో ఒక్క ఉదుటున పేలిపోయింది. రెండో ప్రపంచయుద్ధ కాలంలో హిరోషిమాపై ప్రయోగించిన తొలి అణు బాంబు కంటే 30 రెట్లు ఎక్కువ శక్తిని, సూర్యున్ని తలదన్నేంతటి ప్రకాశాన్ని విడుదల చేసింది. దాని తాలూకు శకలాలు శరవేగంగా వచ్చి పడటంతో చెలియాబిన్స్క్‌లో ఏకంగా 7,000 పై చిలుకు భవనాలు భారీగా దెబ్బ తిన్నాయి. 1,000 మందికి పైగా గాయపడ్డారు. కానీ 29న భూ కక్ష్యలోకి ప్రవేశించనున్న 2024పీటీ5తో మాత్రం ప్రస్తుతం గానీ, కొద్ది దశాబ్దాల తర్వాత గానీ అలాంటి ముప్పేమీ ఉండబోదని సైంటిస్టులు భరోసా ఇస్తున్నారు. నవంబర్ 25న మన కక్ష్యను వీడిన మీదట అది చూస్తుండగానే భూమికి 42 లక్షల కిలోమీటర్ల దూరానికి లంఘించి సౌర కక్ష్యలోకి వెళ్లిపోనుందట. అనంతరం మళ్లీ 2055లో, ఆ తర్వాత 2084లోనూ ఈ బుల్లి జాబిల్లి భూ కక్ష్యలోకి ప్రవేశిస్తుందట. ఆ రెండుసార్లూ కొద్ది రోజుల పాటు మాత్రమే చక్కర్లు కొట్టి తన మాతృ కక్ష్యలోకి వెళ్లిపోతుందని సైంటిస్టులు వివరించారు.

అంత ఈజీ కాదు...

గ్రహశకలాలు ఇలా తాత్కాలికంగా ఉపగ్రహం అవతారమెత్తడం అంత సులువు కాదు. అందుకు చాలా విషయాలు కలిసి రావాల్సి ఉంటుంది. ముఖ్యంగా సరిగ్గా భూమ్యాకర్షణ శక్తికి ఆకర్షితమయ్యేందుకు అవసరమైనంత వేగంతో, అవసరమైన దిశలో ప్రయాణిస్తూ ఉండాలి. అంతేగాక భూ కక్ష్యకు దగ్గరవుతున్న కొద్దీ దాని వేగం కాస్త నెమ్మదిస్తూ రావాలి. ఇవన్నీ జరిగితే సదరు గ్రహశకలం దాని పరిమాణం, బరువుతో నిమిత్తం లేకుండా భూ కక్ష్యలోకి వచ్చేస్తుంది. సాధారణంగా గంటకు 3,600 కి.మీ. వేగంతో భూమికి 45 లక్షల కిలోమీటర్ల భూమి సమీపానికి వచ్చే గ్రహశకలాలు ఇలా భూ కక్ష్యలోకి ప్రవేశిస్తుంటాయి.

ప్రతి పదేళ్లలో ఒకట్రెండుసార్లు...

ఇలాంటి బుల్లి చంద్రులు భూమిని పలకరించడం అరుదేమీ కాదు. 2020 ఫిబ్రవరిలో 2020సీడీ3 అనే గ్రహశకలం ఇలాగే రెండు నెలల పాటు భూ కక్ష్యలోకి చొచ్చుకొచ్చింది. రెండు నెలల పాటు ప్రదక్షిణం చేసిన మీదట గుడ్‌బై చెప్పి వెళ్లిపోయింది. దశాబ్దానికి రెండు మూడుసార్లు ఇలాంటివి జరుగుతూనే ఉంటాయట. కొద్ది రోజులు, వారాలు, మహా అయితే ఒకట్రెండు నెలలు కక్ష్యలో ప్రయాణించిన మీదట అవిఇలా పలాయనం చిత్తగిస్తుంటాయి. కొన్నిసార్లు మాత్రం భూ కక్ష్యలోకి వచ్చిన మీదట కనీసం ఒకట్రెండు ప్రదక్షిణలైనా పూర్తి చేస్తాయి. అంటే ఒకట్రెండేళ్లపాటు భూ కక్ష్యలోనే కొనసాగుతాయి. అయితే ఇలాంటి ఉదంతాలు అరుదు. మహా అయితే 10 నుంచి 20 ఏళ్లలో ఒకసారి జరిగితే గొప్పే. అయితే, ''ఏ సమయంలో చూసినా భూ కక్ష్యలో అత్యంత చిన్న గ్రహశకలాలు తిరుగుతూనే ఉంటాయి. కాకపోతే అవి మరీ పళ్లాలంత చిన్నవిగా ఉంటాయి గనుక వాటి ఉనికిని గుర్తించడం దాదాపుగా అసాధ్యం'' అని సౌరవ్యవస్థ నిపుణుడు రాబర్ట్ జేడిక్ తెలిపారు. అంతేకాదు, కూడా అప్పుడప్పుడు బుల్లి చంద్రులు వచ్చి భూమిని పలకరిస్తుంటాయి. 2024పీటీ5ను నిశితంగా పరిశీలించి వీలైనంత విస్తారంగా డేటాను సేకరించేందుకు సైంటిస్టులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్పెయిన్‌లోని కానరీ ద్వీపంలో ఉన్న రెండు భారీ టెలిస్కోపులను రెండు నెలల పాటు పూర్తిగా ఈ పని మీదే ఉండనున్నాయి.



'అర్జున' పథం నుంచి...

తాజాగా మనల్ని పలకరించనున్న 2024పీటీ5 గ్రహశకలం ఎక్కణ్నుంచి వస్తోందో తెలుసా? 'అర్జున' గ్రహశకల పథం నుంచి! అది అసంఖ్యాకమైన బుల్లి బుల్లి గ్రహశకలాలకు నిలయం. భూమి మాదిరిగానే అవి కూడా సూర్యుని చుట్టూ తమ నిర్ణీత కక్ష్యలో తిరుగుతుంటాయి. ఇవేగాక అంగారకునికి, బృహస్పతికి మధ్యనుండే ప్రధాన ఆస్టిరాయిడ్ బెల్ట్ నుంచి

''2024పీటీ5 కనీసం 10 మీటర్ల కంటే పొడవుంటుందని దాదాపుగా తేలిపోయింది. కనుక ఇప్పటి దాకా సైంటిస్టుల దృష్టికి వచ్చిన 'తాత్కాలిక చందమామ'ల్లో ఇదే అతి పెద్దది'' అని వివరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సిద్ధరామయ్యకు షాక్



ముడా కేసులో ఆయనపై విచారణ జరగాలి
- గవర్నర్ అనుమతి సబబే
- కర్నాటక హైకోర్టు తీర్పు
- సీఎంగా రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్
- మోదీ ప్రభుత్వ కుట్ర: సిద్ధూ

బెంగళూరు: ముడా భూ కుంభకోణం కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయనను విచారించేందుకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ అనుమతించడం తెలిసిందే. ఆ ఉత్తర్వుల చట్టబద్ధతను సవాలు చేస్తూ సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను కర్నాటక హైకోర్టు మంగళవారం కొట్టేసింది. గవర్నర్ నిర్ణయం చట్టబద్ధమేనని స్పష్టం చేసింది. ''గవర్నర్ మంత్రిమండలి సలహా మేరకు నడుచుకోవడం రివాజే అయినా ప్రత్యేక పరిస్థితులు తలెత్తినప్పుడు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఆయనకుంది. ఇది అలాంటి కేసే'' అని అభిప్రాయపడింది. ''ఈ కేసులో లబ్ధిదారు స్వయానా పిటిషనర్ కుటుంబానికి చెందిన వ్యక్తే. కనుక అభియోగాలపై విచారణ అవసరమన్నది నిస్సందేహం'' అని న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న పేర్కొన్నారు. గవర్నర్ ఏమాత్రం ఆలోచన లేకుండా, రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొనడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. బాగా ఆలోచించిన మీదటే దర్యాప్తుకు అనుమతిస్తూ ఆయన నిర్ణయం తీసుకున్నారన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద ముడా కేసులో సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ ఆగస్టు 16న అనుమతించారు. హైకోర్టు తీర్పుపై న్యాయ నిపుణులతో సంప్రదిస్తానని సిద్ధరామయ్య చెప్పారు. విచారణకు తానేమీ వెనకాడటం లేదన్నారు. అయితే, ''నేనెందుకు రాజీనామా చేయాలి? అవినీతి ఆరోపణల్లో బెయిల్‌పై తిరుగుతున్న కేంద్ర మంత్రి కుమారస్వామి రాజీనామా చేశారా?'' అని ప్రశ్నించారు. ''ఈ కేసు నాపై, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై మోదీ ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాల్లో భాగం. అందుకోసం గవర్నర్ అధికారాలను కూడా దుర్వినియోగపరుస్తున్నారు'' అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు కాంగ్రెస్ అధిష్టానం కూడా తనకు దన్నుగా ఉందని చెప్పారు.

రాజీనామా చేయాలి: బీజేపీ

హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ''మీ అబద్ధాల సామ్రాజ్యం కుప్పకూలింది. గౌరవప్రదంగా రాజీనామా చేయండి. దర్యాప్తు నిష్పాక్షికంగా జరిగేందుకు వీలు కల్పించండి'' అని పార్టీ నేత రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. ఈ డిమాండ్‌ను కాంగ్రెస్ తోసిపుచ్చింది. ఆయన రాజీనామా చేయబోరని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ''ఇదో కుట్ర. సిద్ధరామయ్య నిర్దోషిత్వాన్ని నిరూపించుకుంటారు'' అన్నారు.

ఏమిటీ ముడా వివాదం?

సిద్ధరామయ్య మెడకు చుట్టుకున్న మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కేటాయింపు వివాదానిది మూడు దశాబ్దాల పై చిలుకు నేపథ్యం. మైసూరు జిల్లా కెసెరె గ్రామంలో సీఎం భార్య పార్వతికి 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. దేవనూర్ 3ఫేజ్ లేఔట్ కోసం ముడా ఈ భూమిని సేకరించింది. పరిహారంగా 50:50 నిష్పత్తి పథకం కింద 2021లో మైసూర్‌లోని ఖరీదైన విజయనగర ప్రాంతంలో ఏకంగా 14 ఖాళీ ప్లాట్లను కేటాయించింది. ''పార్వతి నుంచి తీసుకున్న భూమి కంటే వీటి విలువ ఏకంగా రూ.45 కోట్లు ఎక్కువ. 50: 50 పథకంలోని లోపాలను వాడుకుని సిద్ధరామయ్య కుటుంబం ఎక్కువ ప్లాట్లను సొంతం చేసుకుంది'' అంటూ అబ్రహాం అనే ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదు చేశాడు. కెసెరె భూమిని పార్వతికి ఆమె సోదరుడు మల్లికార్జున స్వామి బహుమతిగా ఇచ్చారని సిద్ధరామయ్య చెప్పగా ఇతరుల భూమిని అక్రమంగా లాక్కున్నట్టు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. 2014లో పార్వతి పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు సిద్ధరామయ్యే సీఎం. ఆమెకు ప్లాట్లు కేటాయించాలని 2017లో ముడా నిర్ణయించింది. ఇది కచ్చితంగా అధికార దుర్వినియోగమేనని విపక్షాలంటున్నాయి. సిద్ధరామయ్య మాత్రం, ''నేను సీఎంగా ఉన్నంతకాలం పరిహారమివ్వడం కష్టమని అధికారులు చెప్పారు. 2021లో బీజేపీ హయాంలో మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ప్లాట్లు కేటాయించారు'' అని వాదించారు. ఈ ఆరోపణలపై జూలైలో సిద్ధరామయ్యకు గవర్నర్ షోకాజ్ నోటీసిచ్చారు. అనంతరం విచారణకు అనుమతిచ్చారు.

దాడులు, ప్రతిదాడులు

హెజ్బొల్లా సీనియర్ కమాండర్ మృతి

బీరుట్: ఇజ్రాయెల్ ఆర్మీ, లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ల మధ్య దాడులు, ప్రతిదాడులు మంగళవారం కూడా కొనసాగాయి. మంగళవారం బీరుట్ దక్షిణప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌పై చేపట్టిన లక్షిత దాడిలో హెజ్బొల్లా కమాండర్ ఇబ్రహీం మహ్మద్ అల్ కుబాసీ చనిపోయారని ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. ఈయన హెజ్బొల్లా మిస్సైల్ యూనిట్ చీఫ్‌గా ఉన్నారని తెలిపింది. కుబైసీతోపాటు హెజ్బొల్లా క్షిపణి, రాకెట్ విభాగానికి చెందిన మరికొందరు కూడా మరణించారని పేర్కొంది. ఇజ్రాయెల్‌పైకి ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న దాడులకు ఈయనే బాధ్యుడని ప్రకటించింది. మంగళవారం బీరుట్‌కు దక్షిణాన ఉన్న ఘబెయిరీ ప్రాంతంపై ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఆరుగురు చనిపోగా 15 మంది గాయపడినట్లు లెబనాన్ తెలిపింది.

ఇజ్రాయెల్‌పైకి 110 రాకెట్లు

లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌లోకి మంగళవారం ఐదు విడతలుగా రాకెట్లు దూసుకువచ్చాయి. హైఫాపైకి 50 రాకెట్లు వచ్చి పడ్డాయి. హెజ్బొల్లా మంగళవారం ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపైకి 110 రాకెట్లు ప్రయోగించినట్లు ఆర్మీ తెలిపింది. కొన్ని భవనాలు దెబ్బతిన్నాయని వివరించింది. ఓ హైవేపై పేలుళ్లు సంభవించడంతో వాహనాలను పక్కన నిలిపివేసి, డ్రైవర్లు నేలపై పడుకోవడం వంటి దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. జిక్రోన్‌లోని ఆయుధాల ఫ్యాక్టరీ సహా 8 లక్ష్యాలపైకి రాకెట్లను ప్రయోగించినట్లు హెజ్బొల్లా ప్రకటించింది.

564కు చేరిన మృతులు

ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు సోమవారం లెబనాన్ వ్యాప్తంగా చేపట్టిన భీకర దాడుల్లో మృతుల సంఖ్య 564కు చేరుకుంది. వీరిలో 50 మంది చిన్నారులు, 94 మంది మహిళలు ఉన్నట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. గాయపడిన 1,835 మందిని దేశవ్యాప్తంగా ఉన్న 54 ఆస్పత్రుల్లో చేర్పించామని తెలిపింది.

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి

ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష
- న్యూయార్క్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశం
- అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి పయనమైన మోదీ



జెలెన్‌స్కీతో మోదీ కరచాలనం

న్యూయార్క్: ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణపై, సాధారణ ప్రజల మరణాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ సాధ్యమైనంత త్వరగా యుద్ధం ముగిసిపోవాలని, శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై మూడు గంటలకుపైగా చర్చించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రధానంగా ఉక్రెయిన్‌లో సంక్షోభానికి త్వరగా తెరపడేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చక్కటి పరిష్కార మార్గం కోసం అంకితభావంతో ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఉక్రెయిన్ విజ్ఞప్తితోనే మోదీ–జెలెన్‌స్కీ మధ్య ఈ సమావేశం జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. జెలెన్‌స్కీతో భేటీ అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత్–ఉక్రెయిన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడమే లక్ష్యంగా గత నెలలో జరిగిన పర్యటనలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నామని వివరించారు. ఉక్రెయిన్‌లో సంక్షోభానికి తెరపడి, శాంతి, స్థిరత్వం నెలకొనాలని కోరుకుంటున్నామని, అందుకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. శాంతి కోసం దౌత్య మార్గాల్లో ప్రయతి్నంచాలన్నారు. ఉక్రెయిన్–రష్యా మధ్య శాంతి చర్చలు జరగాలని సూచించారు. తమ దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్మేనియా ప్రధానితో భేటీ

ప్రధాని నరేంద్ర మోదీ న్యూయార్క్‌లో ఆర్మేనియా ప్రధానమంత్రి నికోల్ పాషిన్యాన్‌తో భేటీ అయ్యారు. భారత్– ఆర్మేనియా మధ్య సంబంధాలపై చర్చించారు. నికోల్‌తో అద్భుతమైన చర్చ జరిగిందని మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. అలాగే వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌ను సైతం మోదీ కలుసుకున్నారు. ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు.

సిక్కులతో మోదీ సమావేశం

ప్రధాని మోదీ న్యూయార్క్‌లో పలువురు సిక్కు పెద్దలతో సమావేశమయ్యారు. భారత్‌లో సిక్కు సామాజిక వర్గం అభ్యున్నతికోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారంటూ మోదీకి సిక్కులు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన మూడు రోజుల పర్యటన

ప్రధానమంత్రి మోదీ మూడు రోజుల అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం న్యూయార్క్ నుంచి భారత్‌కు తిరుగుపయనమయ్యారు.

పశ్చిమాసియాలో కాల్పుల విరమణ పాటించాలి: మోదీ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతుండడం, పెద్ద సంఖ్యలో జనం మరణిస్తుండడం పట్ల ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన న్యూయార్క్‌లో పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్‌తో భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరపడాలని, అన్ని పక్షాలు తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని చెప్పారు. చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయాలని హమాస్‌కు మోదీ విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్–పాలస్తీనా మధ్య శాంతికి చర్చలే మార్గమని పునరుద్ఘాటించారు.



శ్రీలంక ప్రధానిగా మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తున్న హరిణి

శ్రీలంక ప్రధానిగా హరిణి

కొలంబో: శ్రీలంక నూతన ప్రధానమంత్రిగా హరిణి అమరసూర్య(54) ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష పదవికి ఎన్నికలు ముగియడంతో సోమవారం ప్రధాని దినేశ్ గుణవర్ధనే పదవికి రాజీనామా చేశారు. నూతన అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకే మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో హరిణితో ప్రధానిగా ప్రమాణం చేయించారు. ఎన్‌పీపీకే చెందిన విజితా హెరత్, లక్ష్మణ్ నిపుణ రచ్చిలతోపాటు అధ్యక్షుడు దిస్సనాయకే కూడా మంత్రిగా ప్రమాణం చేయడం గమనార్హం. నవంబర్ 14 పార్లమెంట్ ఎన్నికలు జరిగేదాకా తాత్కాలిక కేబినెట్ పనిచేస్తుంది. పార్లమెంటును రద్దు చేస్తూ నూతన అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకే మంగళవారం రాత్రి నిర్ణయం ఉత్తర్వులు జారీ చేశారు.

బండారునాయకే తర్వాత: సిరిమావో బండారు నాయకే (2000) తర్వాత శ్రీలంక ప్రధాని అయిన తొలి మహిళగా హరిణి నిలిచారు. ఆమె హక్కుల కార్యకర్త. యూనివర్సిటీ లెక్చరర్‌గా చేస్తున్నారు.

డిగ్రీ చదివింది ఢిల్లీలోనే..

శ్రీలంక నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణి అమరసూర్య డిగ్రీ చదివింది ఢిల్లీ యూనివర్సిటీ లోనే. ఇక్కడి హిందూ కాలేజీలో 1991– 1994 సంవత్సరాల్లో సోషియాలజీలో బీఏ పూర్తి చేశారు. హిందూ కాలేజీ పూర్వ విద్యార్థిని శ్రీలంక ప్రధాని కావడం తమకెంతో గర్వకారణమని కాలేజీ ప్రిన్సిపాల్ అంజు శ్రీవాస్తవ హర్షం వ్యక్తం చేశారు. హరిణి బ్యాచ్‌మేట్, బాలీవుడ్ డైరెక్టర్ నళినీ రంజన్ సింగ్ కూడా సంతోషం వ్యక్తం చేశారు.

దొంగగా ముద్ర వేసేందుకే జైల్లో: కేజ్రీవాల్



చండీగఢ్: కేవలం దొంగగా తనపై ముద్ర వేసేందుకే మోదీ ప్రభుత్వం తనను జైలులో పెట్టిందని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ విమర్శించారు. హరియాణాలోని సిర్సాలో మంగళవారం ఆయన రోడ్‌షోలో పాల్గొన్నారు. ''నేను అవినీతిపరుడిని కాదని నా బద్ధశత్రువుకు కూడా తెలుసు. నన్ను ఐదున్నర నెలలు జైలులో ఎన్నో ఇబ్బందులు పెట్టారు. అయినా పెట్టినా వెనుకడుగు వేయలేదు. నేను హరియాణా వాడిని. ఎవరితోనైనా పెట్టుకోవచ్చు కానీ, హరియాణావాలాతో కాదు'' అన్నారు.

యువత అక్రమ వలసలు ఎందుకు?

బీజేపీని నిలదీసిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: హరియాణా సహా దేశంలోని యువతకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో తీరని అన్యాయం చేసిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఉద్యోగావకాశాలను లాగేసుకుని, యువతను విదేశాల్లో చిత్రహింసల బాట పట్టేలా చేసిందని ఆరోపించారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో హరియాణాకు చెందిన వలసదారులతో జరిపిన సంభాషణ వీడియోను మంగళవారం ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోవడం వల్లే తాము అమెరికా తదితర దేశాల్లో బతుకుపోరాటం సాగించాల్సి వస్తోందని వారు ఆవీడియోలో పేర్కొన్నారు. 'హరియాణా యువత దొంగచాటుగా విదేశాలకు ఎందుకు వెళ్లాల్సి వచ్చింది'అని ప్రశ్నించారు. గతేడాది రిలీజైన షారుఖ్ ఖాన్ సినిమాలోని 'డుంకీ'అనే మాట బాగా పాపులర్ అయ్యింది. 'బీజేపీ వ్యాపింపజేసిన 'నిరుద్యోగ వ్యాధి'తో తమ ఆత్మీయులకు దూరంగా ఉంటూ లక్షలాది కుటుంబాలు మూల్యం చెల్లించుకుంటున్నాయి'అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రధానిపై రాహుల్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

మోదీపై 140 కోట్ల మంది ప్రజలకు విశ్వాసం ఉందన్న కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కశ్మీర్ ఎన్నికల ప్రచారం వేళ ప్రధాని మోదీపై విపక్షనేత రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మోదీ సైకాలజీని విపక్షాల 'ఇండియా' కూటమి దెబ్బకొట్టిందని, ఇప్పుడు 56 అంగుళాల ఛాతి అని మోదీ ఎక్కడా చెప్పుకుని తిరగట్లేరని రాహుల్ గాంధీ జమ్మూకశ్మీర్ ర్యాలీలో వ్యాఖ్యానించడం తెల్సిందే. బీజేపీ జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఉన్న కిషన్ రెడ్డి దీనిపై స్పందించారు. ' మోదీజీ ఆత్మవిశ్వాసం తగ్గిందా, దృఢమైందా అని మాట్లాడటానికి మాకు రాహుల్ గాంధీ నుంచి సర్టిఫికెట్ అక్కర్లేదు. 140 కోట్ల మంది భారతీయుల మద్దతు పొందాకే మోదీ మూడోసారి ప్రధాని అయ్యారు. మోదీజీకి ఇంతటి ఆత్మవిశ్వాసం ఎక్కడి నుంచి వస్తుందో రాహుల్‌కు తెలియాలంటే ఆయన రైతులు, సైనికులు, శాస్త్రవేత్తలు, యువత, మహిళలను అడిగితే చెబుతారు'' అని అన్నారు.

నేడే జమ్మూకశ్మీర్‌లో రెండో విడత పోలింగ్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో భాగంగా రెండో విడత పోలింగ్ బుధవారం 26 నియోజకవర్గాల్లో జరగనుంది. 239 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని దాదాపు 25 లక్షల మంది ఓటర్లు తేల్చనున్నారు. మూడు కశ్మీర్ లోయ జిల్లాల్లో, మూడు జమ్మూ డివిజన్ జిల్లాల్లో ఈ రోజు పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 3,502 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిల్లో 1,056 పట్టణ ప్రాంతాల్లో, 2,446 గ్రామీణ ప్రాంతాల్లో నెలకొల్పారు. ఈ దఫాలో మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, జమ్మూకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా, బీజేపీ జమ్మూకశ్మీర్ చీఫ్ రవీందర్ రైనాలు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. ఒమర్ ఈసారి గందేర్‌బల్, బుద్గామ్ చోట్ల నుంచి బరిలో నిలిచిన సంగతి తెలిసిందే.

కోల్‌కతాలో ట్రామ్‌లకు సెలవు

- 150 ఏళ్లుగా కొనసాగుతున్న సేవలు త్వరలో నిలిపివేత
- బెంగాల్ ప్రభుత్వం నిర్ణయం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా అనగానే వెంటనే గుర్తుకొచ్చేవి ట్రామ్‌లు. రహదారుల మధ్యలో పట్టాల మీదుగా పరుగులు తీసే ట్రామ్‌ల్లో ప్రయాణించడం ఒక మధురమైన జ్ఞాపకం. నగరంలో 150 సంవత్సరాలుగా కొనసాగుతున్న ట్రామ్‌ల సేవలను త్వరలో పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు పశ్చిమ బెంగాల్ రవాణా శాఖ మంత్రి స్నేహాశిష్ చక్రబర్తి వెల్లడించారు. ఆయన తాజాగా మీడియాతో మాట్లాడారు. ఆధునిక కాలంలో నగరంలో వేగవంతమైన ప్రయాణ సాధనాల అవసరం నానాటికీ పెరుగుతోందని అన్నారు. తక్కువ వేగంతో ప్రయాణించే ట్రామ్‌ల వల్ల రోడ్లలో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని, తరచుగా ట్రాఫిక్ జామ్‌ల వల్ల జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అందుకే ట్రామ్‌ల సేవలు నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ''ట్రామ్‌లు 1873 నుంచి కోల్‌కతా సంస్కృతిలో భాగంగా ఉన్నాయి. కానీ నగరంలో వాహనాల రద్దీ భారీగా పెరిగిపోతోంది. అందుకే ఇకపై ట్రామ్‌లను నడపలేం'' అన్నారు. పలు మార్గాల్లో వాటినిప్పటికే పూర్తిగా నిలిపేసినట్లు గుర్తుచేశారు. మిగిలిన మార్గాల్లోనూ ముగింపు పలుకుతున్నట్లు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు తప్పించాలన్న ఉద్దేశంతోనే కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. కేవలం మైదాన్– ఎస్ప్లాండే హెరిటేజ్ మార్గంలో మాత్రమే ఇకపై ట్రామ్‌లు నడుస్తాయని చెప్పారు.

ట్రామ్‌ల కథ కంచికి ప్రత్యేక కథనం ఈ–పేపర్‌లో

'పుల్వామా' నిందితుడు గుండెపోటుతో మృతి



జమ్మూ: 2019లో కశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టన బెట్టుకున్న బాంబు పేలుడు ఘటన కేసులో నిందితుడు బిలాల్ అహ్మద్ కుచే గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. పుల్వామా ఘటనకు సంబంధించి 2020లో ఎన్ఐఏ చార్జిషీటులో పేర్కొన్న 19 మంది నిందితుల్లో బిలాల్ ఒకడు. అలాగే, ఆ కేసులో అరెస్టయిన ఏడుగురిలో ఇతడొకడు. కిష్టవార్ జిల్లా జైలులో ఉన్న బిలాల్‌ను అస్వస్థతకు గురవడంతో ఈ నెల 17వ తేదీన ఆస్పత్రిలో చేర్పించామని, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి గుండెపోటుకు గురై చనిపోయాడని అధికా రులు చెప్పారు. అప్పటి ఘటన కుట్రదా రులకు ఆశ్రయం ఇవ్వడంతోపాటు వారిని తరలించేందుకు ఇతడు సాయపడినట్లు ఎన్ఐఏ ఆరోపిస్తోంది.

కేరళ ఎమ్మెల్యే ముకేశ్ అరెస్ట్, విడుదల



కొచ్చి: కేరళలో అధికార సీపీఎం ఎమ్మెల్యే, నటుడు ఎం .ముకేశ్‌ను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. తనను లైంగికంగా వేధించారంటూ ఒక నటి చేసిన ఫిర్యాదు మేరకు సిట్ ఆయనను అదుపులోకి తీసుకుంది. ముకేశ్‌కు వైద్య, పొటెన్సీ పరీక్షలు జరిపారని, అయితే ఇప్పటికే సెషన్స్ కోర్టు ముందస్తు బెయిలిచ్చినందున విడుదల చేశారని ఆయన లాయర్ ధ్రువీకరించారు. అంతకుముందు ఉదయం , ముకేశ్‌ను సిట్ అధికారులు మూడున్నర గంటలపాటు ప్రశ్నించారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



'సోషల్'గా 'సైబర్'లోకి!

సోషల్ మీడియాలో వచ్చే వ్యక్తిగత వివరాలను నిశితంగా గమనించే సైబర్ నేరగాళ్లు వాటి ఆధారంగానే టార్గెట్లను ఎంచుకుంటున్నారు. -8లో



iSmart హోమ్స్

ఇప్పటి వరకు ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్, బ్యాంకింగ్ వంటి పలు రంగాలకే పరిమితమైన ఆటోమేషన్.. ఇప్పుడు నట్టింట్లోకి చేరిపోయింది. - సిటీ ప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలులతో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32 డిగ్రీ, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



మన్సూరాబాద్-బండ్లగూడ రహదారిలో వరద



దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా టెంపుల్ రోడ్డులో వరద



ఎల్బీనగర్‌లో..



కవాడిగూడ: వర్షపు నీటిలో వాహనదారుల కష్టాలు

నగరంలో వర్షం ఇలా..

ప్రాంతం	సెంటీ మీటర్లు
నాగోల్	8.9
బండ్లగూడ	7.7
హబ్సిగూడ	7.1
రామంతాపూర్	5.2
హయత్‌నగర్	5.0
ఉస్మానియా యూనివర్సిటీ	4.6
నాచారం	4.4
వనస్థలిపురం	4.3
ఎల్బీనగర్	3.6

మళ్లీ కుండపోత

మరో రెండు రోజులు భారీగా వర్షాలు

మహానగరంలో మళ్లీ కుండపోత వర్షం కురిసింది. ఐదురోజులుగా వరుణుడు వెంటాడుతూనే ఉన్నాడు. సగటున ఆరు నుంచి ఎనిమిది సెంటిమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. మంగళవారం అత్యధికంగా సరూర్‌నగర్, రాక్‌టౌన్ నాగోల్‌లో సుమారు 8.9 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డు అయింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన కుంభవృష్టి కురిసింది. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రెండు, మూడు గంటలపాటు నరక యాతన తప్పలేదు. జీహెచ్ఎంసీ, జలమండలి క్షేత్ర స్థాయి అధికారులను అప్రమత్తం చేశాయి. ఉన్నతాధికారులు సైతం రంగంలో దిగారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. 154 మాన్సూన్ ఎమర్జెన్సీ, 252 స్టాటిక్ బృందాలు రంగంలోకి దిగాయి. ఎప్పటికప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్‌ల వద్ద నిలిచిన నీటిని వెంటనే తొలగించే పనులు కొనసాగాయి. మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ కేంద్రం తెలిపింది. - సాక్షి,సిటీబ్యూరో

వెరీగుడ్.. 'బుక్ డాక్టర్'

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కితాబు



సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్

అఫ్జల్‌గంజ్: యువత సోషల్ మీడియాను వదిలి గ్రంథాలయాల బాట పట్టాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళ వారం ఎస్ఎస్ఎస్ 55వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 'గ్రంథాలయ దీప్తి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులచే పుస్తకాలను రిపేరు చేయించే 'బుక్ డాక్టర్'మంచి కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమం దేశమంతా వ్యాప్తి చెందాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో బుక్ డాక్టర్స్‌ను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి: స్పీకర్

63 కమ్యూనిటీలకు గ్రాండ్ గణేశ అవార్డుల ప్రదానం

నాంపల్లి: భారతీయ పండుగలు, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడంలో రెసిడెన్సియల్ సొసైటీలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ యువ(జిల్లా 320ఎ) సంస్థ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్ ఫెడరేషన్ హౌస్‌లో ప్రతిష్టాత్మక గ్రాండ్ గణేశ అవార్డ్స్-2024 ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా సంప్రదాయాలు, ఆధునికతను జోడించి గణేశ్ ఉత్సవాలు నిర్వహించిన 63 గేటెడ్ కమ్యూనిటీలకు ఈ అవార్డులను స్పీకర్ అందజేశారు. ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాదు మినీ ఇండియా లాంటిదని, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడ విలక్షణమైన రీతిలో వినాయకుడిని పూజిస్తారని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ యువ అధ్యక్షులు, ఈవెంట్ కన్వీనర్ లయన్ డాక్టర్ సౌరబ్ సురేఖ, ప్రగతి గ్రూప్ చైర్మన్ డాక్టర్ జీబీకే రావు, స్పిరిచ్యువల్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ అనంతలక్ష్మి, దైవజ్ఞ శర్మ, డాక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మక్తాలో కొత్త పాఠశాల భవనం!

శిథిల భవనాన్ని పరిశీలించిన జిల్లాకలెక్టర్



కలెక్టర్ అనుదీప్‌కు సమస్యలు వివరిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: శిథిలమైన ఎమ్.ఎస్. మక్తా ప్రభుత్వ పాఠశాలను అన్ని వసతులతో పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, స్థానిక కార్పొరేటర్ పి.విజయారెడ్డి విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆయన మక్తా పాఠశాలను సందర్శించారు. రూ.40 లక్షల స్పెషల్ డవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు వెచ్చించి నూతన పాఠశాలను నిర్మించాలని విజయారెడ్డి కోరారు. పాఠశాలతోపాటు పక్కనే ఉన్న కమ్యూనిటీహాల్ కూడా శిథిలమైందని, దానిని కూడా తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ రెండింటి స్థలంలో నూతన పాఠశాలను నిర్మిద్దామని కలెక్టర్ చేసిన ప్రతిపాదనకు కార్పొరేటర్, స్థానికులు అంగీకరించారు. ఆ సమీపంలోనే చెత్త డంపింగ్ కోసం వినియోగిస్తున్న ప్రభుత్వస్థలంలో కొత్త కమ్యూనిటీహాల్ నిర్మించాలని స్థానికులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

అక్రమాలకు 'పొగ'?

ఫాగింగ్ వాహనాల కదలికలకు ఆన్‌లైన్ ట్రాకింగ్

- అవినీతిని అరికడతామంటూ బల్దియా ప్రకటనలు
- ఈసారైనా ఫలితమిచ్చేనా.. మూణ్నాళ్ల ముచ్చటగా ముగిసేనా?
- 60కిపైగా పెద్ద ఫాగింగ్ యంత్రాలు.. రోజుకు 45 లీటర్ల డీజిల్
- నగం డీజిల్ కూడా వాడకుండానే వాడినట్లుగా తప్పుడు లెక్కలు
- 300 ఫాగింగ్ మెషీన్ల డీజిల్, పెట్రోల్‌లోనూ చేతివాటం



సాక్షి, సిటీబ్యూరో: అక్రమాలకు పొగ.. అక్రమార్కులకు సెగ.. అని గ్రేటర్ అధికారులు తెగ ప్రకటనలు గుప్పిస్తున్నారు. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)లోని వివిధ విభాగాల్లో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమాలను అరికడతామంటూ స్పష్టం చేస్తున్నారు. తాజాగా ఫాగింగ్ అంశంపై దృష్టి సారించారు. దోమల నివారణకు ఉపయోగించే వాహనాలకు జీపీఎస్‌తో అనుసంధానమయ్యే కెమెరాలను అమర్చి ఆన్‌లైన్ ద్వారా ట్రాకింగ్ చేస్తూ అక్రమాలను అరికడతామని చెబుతున్నారు. ఆ మేరకు బల్దియా ఏర్పాట్లు కూడా చేసింది.


ఇది కొత్తేమీ కాదు...

అక్రమార్కులకు కళ్లెం వేస్తామంటూ జీహెచ్ఎంసీ ప్రకటనలు చేయడం కొత్తేమీ కాదు. ఫాగింగ్ వాహనాల ట్రాకింగ్ గురించి నాలుగైదేళ్ల క్రితమే చెప్పారు. అంతేకాదు.. నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఫాగింగ్ చేస్తామని, ఫాగింగ్ జరగని ప్రాంతమంటూ ఉండదని, అవినీతికి అసలు తావు ఉండదని గొప్పగా ప్రకటనలు గుప్పించారు. అయితే కింది స్థాయి అధికారుల నుంచి పైస్థాయి వరకు నెలనెలా ఆమ్యామ్యాలందుతాయని ఆ విభాగంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. దోమల నివారణ పేరిట జీహెచ్ఎంసీ ఖర్చు చేసే నిధులు గణనీయంగా పక్కదారి పడుతున్నాయని సిబ్బందే చెప్పుకుంటున్నారు. అందుకే ఇక్కడి ఉద్యోగులు బదిలీ అయినా వెళ్లకుండా ఇక్కడే తిష్ట వేసి ఉంటున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. బదిలీ అయినా సీటు వదలని కూకట్‌పల్లి అధికారిణి లంచావతారం గురించి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చర్యలు తీసుకున్నారు. అవినీతిని అరికడతామనే ఉన్నతాధికారుల ప్రకటనల్లోని డొల్లతనాన్ని ఇది తేటతెల్లం చేస్తోంది.

డీజిల్ తెగ తాగేస్తున్నారు..

జీహెచ్ఎంసీలో దోమల నివారణకుగాను ఫాగింగ్ కార్యక్రమాల్లో 60కిపైగా పెద్ద యంత్రాలు వినియోగిస్తున్నారు. ఒక్కో దానికి రోజుకు దాదాపు 45 లీటర్ల డీజిల్ వినియోగించినట్లు లెక్క చూపుతారు. కానీ, అందులో సగం కూడా వాడరనే ప్రచారం ఉంది. ఆ మేరకు మిగిలించుకున్న డబ్బులన్నీ అధికారుల మధ్య పంపకాలవుతాయనే ఆరోపణలు ఎంతోకాలంగా ఉన్నాయి. దీంతోపాటు పైరిథ్రమ్ వంటి క్రిమిసంహారక మందుల స్ప్రే తదితరమైన వాటిల్లోనూ ఇదే చేతివాటం. కాగితాల్లో చూపినంత డీజిల్ కానీ, స్ప్రే మందులు కానీ వాస్తవంగా క్షేత్రస్థాయిలో వినియోగించరు. చిన్న ఫాగింగ్ మిషన్లు 300 వరకు ఉన్నాయి. వాటి పేరిట కూడా డీజిల్, క్రిమి సంహారక మందులు సైతం పక్కదారి పడుతున్నాయి. ఫాగింగ్‌లో అవినీతిని అరికడతామంటూ ఇటీవల పెద్ద మిషన్లుండే వాహనాలకు కెమెరాలు అమర్చారు. దాంతో ఆన్‌లైన్‌లోనూ ట్రాకింగ్ చేస్తూ ఎక్కడైనా దారి మళ్లితే గుర్తిస్తామంటున్నారు. దీంతోపాటు వాహనాలను ట్రాక్ చేసేలా మరో యాప్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు చెబుతున్నారు.

ఆగని అవినీతి..



జీహెచ్ఎంసీ దోమల నివారణ కోసం ఏటా దాదాపు రూ. 25 కోట్లు, వాహనాల కోసం మరో రూ. 25 కోట్లు ఖర్చు చేస్తోంది. ఫాగింగ్ మెషీన్లు, స్ప్రేయర్లు వాటిల్లో వినియోగించే డీజిల్, పెట్రోల్, కిరోసిన్, పైరిథ్రం, మలాథియన్‌లలో జరిగే అవినీతిని ఇప్పటి వరకు అరికట్టలేకపోయారు.

ప్రజల నెత్తిన భారం

జీహెచ్ఎంసీ దోమల నివారణ పేరిట అధికారులు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయినా దోమలు స్వైరవిహారం చేస్తూనే ఉన్నాయి. ఫలితంగా వాటి బారి నుంచి తప్పించుకునేందుకు నగర ప్రజలు నెలనెలా ఎంతో ఖర్చు చేయాల్సి వస్తోంది. 86 శాతం మంది రెపెల్లెంట్స్ తదితరమైన వాటి కోసం ఖర్చు చేస్తున్నారు. ఇటీవల ఓ సర్వే సంస్థ జరిపిన మేరకు 49 శాతం మంది ఏటా సగటున రూ.2,400కుపైగా ఖర్చు చేస్తున్నారు. 37 శాతం మంది రూ.2,400 వరకు ఖర్చు చేస్తున్నారు. రూ.2400కు పైగా ఖర్చు చేస్తున్నవారిలో నెలకు రూ.200 నుంచి రూ.500 వరకు ఖర్చు చేస్తున్నవారు 29 శాతం మంది, రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు ఖర్చు చేస్తున్నవారు 4 శాతం మంది ఉన్నారు. ఆగస్టు– అక్టోబర్‌ల మధ్య దోమల తీవ్రత ఎక్కువగా ఉంటుందని సర్వే పేర్కొంది.

వరదనీరు నిల్వకుండా చర్యలు

లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలి

- టెలీకాన్ఫరెన్స్‌లో కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు

లక్డీకాపూల్/సాక్షి, సిటీబ్యూరో/రామంతాపూర్: వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలలో వరదనీరు నిలవకుండా చూడాలని, అవసరమైన శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఇతర విభాగాల హెచ్‌వోడీలతో కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమ్రపాలి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందజేయాలన్నారు. నాలా లకల్వర్టుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇసుకమేటలను తొలగించాలని ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్ కమర్షియల్‌గా ఉండి రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్నవారికి నోటీసులు జారీ చేయాలని, అందుకు జోనల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అక్రమంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినవారిపై పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు.

మెరుగైన సేవలు అందించాలి

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నగరంలో పలుచోట్ల భారీగా, మరికొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆమె క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలు కురిసే సందర్భంలో ఇంటికే పరిమితం కావాలని, పిల్లలను, వృద్ధులను వర్షంలో ఎక్కడికీ పంపించవద్దని, అత్యవసరమైన పని ఉంటేనే బయటకు వెళ్లాలని నగరవాసులకు సూచించారు.

సజావుగా పారిశుధ్య నిర్వహణ

అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఎల్బీనగర్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి శానిటేషన్ నిర్వహణ, రోడ్ల స్థితిగతులను పరిశీలించారు. సరూర్‌నగర్, ఎల్బీనగర్, నాగోల్ రోడ్డు మీదుగా ఉప్పల్ భగాయత్, ఉప్పల్ స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్ల మరమ్మతులు, శానిటేషన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. సరూర్‌నగర్ ఉప్పల్, రామంతాపూర్ చెరువులను సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణపై యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంట జోనల్ కమిషనర్లు హేమంత్, కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



రామంతాపూర్ పెద్దచెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

మొబైల్ యాప్..

వాటర్‌వాల్వ్ ఆపరేషన్

ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఆటోమేటిక్ వాల్వ్ పద్ధతి

- వాల్వ్ సెన్సర్‌లు మొబైల్‌కు అనుసంధానం
- పనితీరును పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: తాగునీటి విడుదలలో లైన్‌మెన్ల రోడ్డు ప్రమాదాల నివారణ, నీటి నాణ్యతపై దృష్టి పెట్టేందుకు ప్రయోగాత్మకంగా సనత్‌నగర్‌లోని జేకే కాలనీలో అమలవుతున్న ఆటోమేటిక్ స్మార్ట్ వాటర్ వాల్వ్ ఆపరేషన్ సిస్టమ్స్‌ను విస్తరించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. జేకే లైన్‌లో వాటర్ లైన్‌మెన్లు వాల్వ్‌ల వద్దకు వెళ్లకుండానే మొబైల్ ద్వారా వాటిని ఆపరేట్ చేస్తూ నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో భాగంగా వేలాది వాల్వ్‌ల నిర్వహణ తప్పనిసరి. అధిక శాతం వాల్వులు రహదారులపై ఉండటంతో లైన్‌మెన్లు వాల్వును తిప్పే సమయాల్లో ప్రమాదాలకు గురికావడం, మృత్యువాత పడటం సాధారణమైంది. ఇలాంటి ఘటనలు నివారించడానికి జలమండలి ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టింది.

మొబైల్ యాప్‌తో ఆపరేట్

సరికొత్త విధానంలో లైన్‌మెన్లు క్షేత్ర స్థాయిలో తిరగాల్సిన అవసరం లేకుండానే వాల్వులను మొబైల్ యాప్‌తో ఆపరేట్ చేసే వెసులుబాటు ఉంటుంది. వాల్వ్ సెన్సర్లకు సోలార్ ప్యానళ్లు అమర్చి మొబైల్స్‌కు అనుసంధానిచ్చారు. ఉన్నతాధికారుల మొబైల్‌తోపాటు వాటర్ బోర్డు డాష్‌బోర్డుకు అనుసంధానం ఉండటంతో కేంద్ర కార్యాలయం నుంచి కూడా పర్యవేక్షించవచ్చు. వాల్వ్ ఆపరేషన్‌తోపాటు వాటర్ క్వాలిటీ, క్వాంటిటీ, క్లోరిన్ శాతం వివరాల్ని తెలుసుకునే విధంగా యాప్ రూపకల్పన చేశారు. స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ పూర్తిగా సోలార్ ఎనర్జీతో పనిచేస్తుంది. బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో.. నిర్వహణలో పవర్ సమస్యలు ఉండవు.

స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ పరిశీలన

సనత్‌నగర్‌లోని జేకే కాలనీలోని రెండు లైన్లలో అమలవుతున్న ఆటోమేటిక్ స్మార్ట్ వాటర్ వాల్వ్ ఆపరేషన్ సిస్టమ్స్ పనితీరును జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి పరిశీలించారు. వాల్వ్ నిర్వహణ తదితర విషయాలను క్షేత్రస్థాయి లైన్‌మెన్లతో ముచ్చటించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ జేకే కాలనీలో చేపట్టిన ఈ విధానం సమర్థవంతంగానే పనిచేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ పద్ధతి విజయవంతమైతే.. మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని ఎండీ వెల్లడించారు.

జలమండలి పరిధిలో ఇలా

మొత్తం నీటి నల్లా కనెక్షన్లు	: 13.25 లక్షలు
గృహ వినియోగ కనెక్షన్లు	: 10.24 లక్షలు
మురికివాడల్లో	: 2.47 లక్షలు
వాణిజ్య కనెక్షన్లు	: 52 వేలు



జేకే కాలనీలో ఆటోమేటిక్ వాల్వ్ పనితీరును పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

అన్'ఎక్స్'పెక్టెడ్‌గా!

'ఎక్స్'లో యాక్టివ్‌గా ఉంటున్న కొత్వాల్ సీవీ ఆనంద్

- ఆయన పోస్టులకు నెటిజనుల నుంచి స్పందన
- వారి నుంచి కీలక సూచనలు, సలహాలు
- ఆపరేషన్ రోప్ మళ్లీ మొదలవుతుందన్న కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. ఆయన ఎక్స్ ఖాతాకు 23 వేల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. విధి నిర్వహణతో పాటు సిటీకి సంబంధించిన అనేక కీలకాంశాలను ఆనంద్ తన ఎక్స్ ఖాతాలో పొందుపరుస్తూ ఉంటారు. కేవలం పోస్టు చేసి సరిపెట్టుకోకుండా... దానిపై వస్తున్న స్పందనలనూ నిశితంగా గమనిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఎక్స్ ఖాతాకు నెటిజనుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఎవరూ ఊహించని విధంగా పలువురు కీలక సూచనలు, సలహాలు ఇస్తున్నారు. వీటిలో కొన్ని ట్రాఫిక్, మరికొన్ని పోలీసింగ్‌కు సంబంధించినవి ఉంటున్నాయి.

హై లెవల్ కమిటీ విషయం చెప్తే...

◆ రాజధానిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీసీసీసీ) కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు చెందిన ఉన్నతాధికారులతో హై లెవల్ కమిటీ వేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కొత్వాల్ ఆనంద్ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. దీనిపై శివకుమార్ అనే నెటిజనుడు స్పందిస్తూ... వాటర్ లాగింగ్ ఏరియాల్లో సమస్యల పరిష్కారం కోసం స్థానికుల సహాయం తీసుకోవడంతో పాటు వారినీ భాగస్వాముల్ని చేయాలని సూచించారు. దీనికి ఆనంద్ 'గ్రేట్ ఐడియా' అంటూ కితాబివ్వడం చూస్తే... త్వరలోనే అమలులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

టర్న్‌లు లేకున్నా బోర్డులు ఉన్నాయంటూ...

◆ నగరంలోని రోడ్లపై ట్రాఫిక్ ఇక్కట్లు తప్పించడానికి అధికారులు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. వీటిలో భాగంగా పలు ప్రాంతాల్లో యూ టర్న్‌లు మూసేశారు. అయితే ఆయా చోట్లకు కాస్తా ముందు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు మాత్రం అలానే ఉన్నాయి. వీటిని చూస్తున్న వాహనచోదకులు ఇంకా యూ టర్న్ ఉందని భావించి రోడ్డులో కుడి వైపునకు వస్తున్నారు. చివరకు అక్కడ టర్న్ లేదని గుర్తించి మళ్లీ ఎడమ వైపునకో, రోడ్డు మధ్యకో వెళ్తున్నారు. ఈ 'రాకపోకలు' వారికి అసౌకర్యం కావడంతో పాటు ఇతరులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ అంశాన్ని గుర్తించిన శశిధర్ అనే నెటిజన్ 'ఎక్స్' ద్వారా ఆనంద్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన 'వెరీ గుడ్ అబ్జర్వేషన్-షల్ సీ' అంటూ సమాధానం ఇచ్చారు. ఇలా త్వరలో అవసరం లేని చోట్ల సూచిక బోర్డులు తొలగిస్తామంటూ పరోక్షంగా హామీ ఇచ్చారు.

మరోసారి 'రోప్' మొదలెడతామన్న సీపీ...

◆ కొత్వాల్ ఆనంద్ మంగళవారం ఉదయం ఓ కీలక పోస్టు చేశారు. గతంలో ఆయన పోలీసు కమిషనర్‌గా పని చేసినప్పుడు 2022లో ఆపరేషన్ రోప్‌ను చేపట్టారు. రోడ్లపై ట్రాఫిక్ సజావుగా సాగాలంటే ఫుట్‌పాత్‌కు–ప్రధాన రహదారికి మధ్య ఉండే క్యారేజ్ వే క్లియర్‌గా ఉండాలి. అయితే ప్రధాన రహదారులతో సహా అనేక చోట్ల అక్రమ పార్కింగ్, ఆక్రమణలతో ఈ వే కనిపించట్లేదు. ఈ పరిస్థితి మార్చడం కోసం ఆపరేషన్ రోప్ (రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎన్‌క్రోచ్‌మెంట్స్) చేపట్టారు. ఆ ఏడాది అక్టోబర్ 3 నుంచి మొదలైన ఈ ఆపరేషన్ ఆయన బదిలీ తర్వాత అటకెక్కింది. దీంతో రెండోసారి సీపీగా వచ్చిన ఆయన మళ్లీ ప్రారంభించనున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేశారు.



రూ.500 కోట్ల స్థలానికి విముక్తి

బంజారాహిల్స్ ఏసీబీ ఆఫీస్ ఎదుట అక్రమ నిర్మాణాల కూల్చివేత..


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలంటూ ప్రజావాణిలో గుర్తుతెలియని వ్యక్తి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఏసీబీ కార్యాలయం ఎదురుగా సర్వేనెంబర్ 102/1లో బంజారాకుంజ్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో ఓ గది నిర్మించారని, మరోచోట టెంట్ ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు స్థలాన్ని గతంలోనే జీఓ నెంబర్ 249 కింద క్రమబద్ధీకరించుకోగా, దీనిని నిలిపివేయాలంటూ మరో వ్యక్తి కోర్టు నుంచి స్టే తెచ్చాడని, దీంతో ఈ స్థలంపై క్రమబద్ధీకరణ నిలిచిపోయిందంటూ అప్పటి నుంచి స్థలం రెవెన్యూ ఆధీనంలో ఉందని తహసీల్దార్ తెలిపారు. సుమారుగా 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం తమదని ఇప్పటికే 10 మందికి పైగా కోర్టులో పోరాడుతున్నారు. ఓ వైపు వీరంతా న్యాయస్థానంలో పిటిషన్లు వేయగా, రోజుకు 10 మంది చొప్పున ఈ స్థలానికి సంబంధించి నకిలీ పత్రాలు తీసుకువచ్చి రూ. లక్షలు దండుకుంటూ దీనిని ఒక వ్యాపారంగా మార్చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

మహిళ దారుణ హత్య


శారద మృతదేహం

దుండిగల్: నగలు దోచుకుని ఓ మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ మున్సిపాలిటీ, మల్లంపేటలోని శ్రీ వంశీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో బొద్దుల శారద(50) తన కుమారుడు సాయి వినయ్‌తో కలిసి నివాసం ఉంటూ స్థానికంగా విఘ్నేశ్వర మిల్క్ పాయింట్‌ను నిర్వహిస్తుంది. ఆమె కుమారుడు సాయి వినయ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 23న ఉదయం అతను తల్లిని మిల్క్ పాయింట్ వద్ద వదిలి డ్యూటీకి వెళ్లిపోయాడు. తిరిగి రాత్రి 8 గంటలకు తల్లికి ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో పక్కనే ఉంటున్న నరేష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. అతను వెళ్లి చూసే సరికి శారద బెడ్‌రూమ్‌లో విగతజీవురాలిగా కనిపించడంతో అతను వినయ్‌కు సమాచారం అందించాడు. వినయ్ ఇంటికి వచ్చి చూడగా మృతురాలి ఒంటిపై చెవి కమ్మలు, ముక్కు పుడక కనిపించలేదు. గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హత్య చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. బెడ్‌రూమ్‌లో రక్తపు మరకలు ఉన్నాయి. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా శారద ఓ వ్యక్తితో కలిసి మాట్లాడుకుంటూ వచ్చిన దృశ్యాలు కనిపించాయి. నేరుగా బెడ్‌రూమ్‌లోకి వచ్చిన సదరు వ్యక్తితో ఆమెకు సన్నిహిత సంబంధం ఉండి ఉంటుందని, నగల కోసమే హత్య చేశాడా.. లేదా ఇతర కారణాలు ఉన్నాయా.. అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘సోషల్’గా ‘సైబర్’లోకి!





నేరగాళ్లు డీపీగా వాడిన పోలీసు అధికారుల ఫొటోలు



సోషల్ మీడియా ఖాతాల్లో వ్యక్తిగత వివరాల పోస్టు

- ఫోన్ నంబర్ల ద్వారా వీటిని సంగ్రహిస్తున్న నేరగాళ్లు
- ఆపై పిల్లల కిడ్నాప్, వారిపై కేసుల పేరుతో ఫోన్‌కాల్స్
- వాట్సాప్ డీపీలుగా పోలీసు అధికారుల ఫొటోలు
- నగరంలో హఠాత్తుగా పెరిగిన బెదిరింపు వ్యవహారాలు

లంగర్‌హౌస్: నగరానికి చెందిన మల్లికార్జున్‌రెడ్డికి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. మహారాష్ట్ర పోలీసు అధికారి పరమ్‌బీర్ సింగ్ ఫొటోను డీపీగా పెట్టుకున్న అవతలి వ్యక్తి విజయ్‌కుమార్ పేరుతో మాట్లాడాడు. ‘మీ కుమారుడితోపాటు కొందరు నా కస్టడీలో ఉన్నారు, వారిపై డ్రగ్స్ కేసు నమోదు చేస్తున్నాం. కుమారుడితో మాట్లాడిస్తా’ అంటూ వారిని కొట్టినట్లుగా శబ్దాలు వినిపించాడు. రూ.15 లక్షల చెల్లిస్తే కేసు ఉండదని బెదిరించాడు.

◆ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికల వినియోగం విశృంఖలం కావడం ... నెటిజనులు తమ కుటుంబం, పిల్లల గురించి, అభిరుచులు, విద్య, ఉద్యోగం.. ఇలా ప్రతి అంశాన్నీ, ఫొటోలను వాటిల్లో పోస్టు చేయడం వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలకు ఉదాహరణ ఇది. గత వారంరోజులుగా ఈ తరహా బెదిరింపు ఫోన్ కాల్స్ ఆందోళనకర స్థాయిలో పెరిగాయి.

వాటి ద్వారానే కీలక ఆధారాలు...

సోషల్ మీడియాలో వచ్చే వ్యక్తిగత వివరాలను నిశితంగా గమనించే సైబర్ నేరగాళ్లు వాటి ఆధారంగానే టార్గెట్లను ఎంచుకుంటున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తికి ఎందరు పిల్లలు? వాళ్లు ఏం చేస్తున్నారు? అలవాట్లు ఏంటి? అనే అంశాలను కొన్నాళ్లుగా పరిశీలిస్తున్నారు. టార్గెట్ చేసిన వ్యక్తులను సంప్రదించడానికి అవసరమైన ఫోన్ నెంబర్ సైతం అనేక సందర్భాల్లో సోషల్ మీడియా ద్వారానే సైబర్ నేరగాళ్లకు చేరుతున్నాయి.

వర్చువల్ నెంబర్లతో కాల్స్...

సైబర్ నేరగాళ్లు కొన్ని రకాలైన యాప్స్ నుంచి వర్చువల్ నెంబర్లు యాక్టివేట్ చేసుకుంటున్నారు. వీటిలో +92తో మొదలయ్యే పాకిస్థాన్ సహా అన్ని దేశాలవి ఉంటున్నాయి. వీటి డీపీలుగా ముంబై సహా వివిధ నగరాలకు చెందిన పోలీసు అధికారుల ఫొటోలను ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసి పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ పిల్లల్ని కిడ్నాప్ చేశామనో, వారు నేరం చేస్తూ చిక్కారనో, కేసు పెడుతున్నామనో చెప్తున్నారు. ఎదుటి వాళ్లు తేరుకునే, వెనుకాముందు ఆలోచించే సమయం ఇవ్వకుండా తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తమ వద్ద బందీగా ఉన్న వారిని తిరిగి పంపాలన్నా, కేసు లేకుండా చేయాలన్నా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా కొందరి నుంచి వసూలు కూడా చేస్తున్నారు. ఇలాంటి నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నా కుమార్తెపై డ్రగ్స్ కేసు అన్నారు..



ఉన్నతవిద్య కోసం నా కుమార్తెను ఇటీవల హాస్టల్‌లో చేర్పించా. నాలుగు రోజుల క్రితం ఏసీపీని మాట్లాడుతున్నానంటూ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశారు. నా కుమార్తె డ్రగ్స్ సేవిస్తూ చిక్కిందని, కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.4 లక్షలు పంపాలని బెదిరించారు. ఆందోళనతో హాస్టల్‌కు ఫోన్ చేసి అసలు విషయం తెలుసుకున్నాకే ఊపిరి పీల్చుకున్నా. రెండు రోజులపాటు ఫోన్లు వస్తూనే ఉన్నాయి.

– కల్లూరి స్వామి, ఆర్మీ ఉద్యోగి

యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: ఓ యువకుడు ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్ నాయుడు వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా , చిట్యాల గ్రామానికి చెందిన కృష్ణసాయి(23) రెండు నెలల క్రితం నగరానికి వచ్చి చింతల్ శ్రీనివాస్‌నగర్‌లో అద్దె గదిలో ఒక్కడే ఉంటున్నాడు. సూరారంలోని ఓ ఫార్మా పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం డ్యూటీకి వెళ్లి గదికి వచ్చిన కృష్ణసాయి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. మంగళవారం ఉదయం 10 గంటలకు సాంబమూర్తి కుమారుడు కృష్ణసాయికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చి వారి బంధువుకి విషయాన్ని చెప్పాడు. ఆ బంధువు అక్కడకు చేరుకుని ఎంత పిలిచినా తలుపు తీయలేదు. దీంతో తులుపులు పగులగొట్టి చూడగా.. కృష్ణ లుంగీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కృష్ణసాయి ప్రేమ వ్యవహారం వల్ల ఆత్మహత్య చేసుకున్నాడా?, ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓఆర్‌ఆర్‌పై రోడ్డు ప్రమాదం



సురేశ్ ,రాఘవరావు మృతదేహాలు


నుజ్జునుజ్జయిన కారు

- లారీని ఢీకొన్న కారు
- ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

ఘట్‌కేసర్: ఓఆర్‌ఆర్‌పై వెళుతున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా, ఎడ్లపాడు మండలం, ఉన్నవ గ్రామానికి చెందిన సాంబయ్య నిజామాబాద్ జిల్లా, వర్ని మండలం, హైడియాల్ గ్రామంలో భూమిని కొనుగోలు చేశాడు. ఆదివారం అతను తన సోదరుడు ఇడుపుల పాటి సురేశ్(35)కు చెందిన ఎర్టిగా కారులో తమ గ్రామానికి చెందిన రాఘవరావు(45), అమ్మయ్య, రమేశ్‌తో కలిసి హైడియాల్ గ్రామానికి వెళ్లారు. భూమికి సంబంధించిన పనులు ముగించుకుని సోమవారం సాయంత్రం ఇంటికి బయలుదేరారు. సురేశ్ కారు నడుపుతుండగా, అతడి పక్కన రాఘవరావు కూర్చోగా మిగతా ఇద్దరు వెనక కూర్చున్నారు. ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 9 వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో ముందు కూర్చున్న రాఘవరావు, సురేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వల్పంగా కుంగిన ఫలక్‌నుమా బ్రిడ్జి

భారీ వాహనాల రాకపోకలు నిషేధం


పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

చాంద్రాయణగుట్ట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఫలక్‌నుమా పాత రైల్వే ఓవర్ బ్రిడ్జిపై సోమవారం రాత్రి పగుళ్లు ఏర్పడి స్వల్పంగా కుంగింది. వెంటనే వాహనదారులు గమనించడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జి పైనుంచి వాహనాలను నిలిపివేసి దారి మళ్లించారు. రంగంలోకి దిగిన రైల్వే అధికారులు టిప్పర్ల ద్వారా మట్టిని నింపి మరమ్మతులు చేస్తున్నారు. మరో రెండు రోజులు పనులు జరిగే అవకాశం ఉంది. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు పరిస్థితిని సమీక్షించారు.

నాలుగేళ్లుగా ఇదే సమస్య..

దశాబ్దాల క్రితం నిర్మించిన ఫలక్‌నుమా బ్రిడ్జి 2020వ సంవత్సరంలో కుంగిపోవడంతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి 2021లో జీహెచ్ఎంసీ, రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రెండు లేన్లలో చేపట్టిన ఈ బ్రిడ్జి పనులలో ఒక లేన్‌ను పూర్తి చేశారు. అదికూడా చాంద్రాయణగుట్ట వైపు నుంచి రైల్వే పట్టాల వరకు కొత్త బ్రిడ్జి వేశారు. అక్కడి నుంచి ఫారూక్‌నగర్ వైపు కొద్ది దూరం పాత బ్రిడ్జిని కొనసాగించారు. ప్రస్తుతం దాని పక్క నుంచే కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. పట్టాలపై స్లాబ్ పనులు జరగాల్సి ఉంది. పాత బ్రిడ్జిపై కొద్ది భాగం సైడ్ గోడ లేని కారణంగా గతంలోనే పగుళ్లు ఏర్పడినప్పటికీ...అటువైపు వాహనాలు వెళ్లకుండా సిమెంట్ దిమ్మెలను అడ్డుగా పెట్టారు. తాజాగా భారీ వర్షాలతో పగుళ్లు పెద్దవై మట్టి కిందికి జారిపోతుండడంతో తాత్కాలిక చర్యలను చేపట్టారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తయితేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ఈవ్‌టీజర్‌కు ఐదు రోజుల జైలు శిక్ష

నాంపల్లి: ఈవ్‌టీజింగ్ కేసులో ఓ యువకుడికి నాంపల్లి కోర్టు ఐదు రోజుల జైలు శిక్ష విధించింది. గోల్కొండకు చెందిన సర్ఫరాజ్ ఖాన్ వృత్తి రీత్యా వ్యాపారి. అతను మల్లేపల్లికి చెందిన యువతిని ఫోన్‌లో వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. రెండవ స్పెషల్ మెజిస్ట్రేట్ ఎం.స్వామి నిందితుడికి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

లైంగికదాడి యత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికను అపహరించి లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.12,500 జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పద్మావతి మంగళవారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్టు ఠాణా పరిధిలో ఉంటున్న ఓ బాలిక 2018, మే 3న తన తండ్రి జీతం డబ్బులు తీసుకునేందుకు ఇంటికి సమీపంలో ఉన్న ప్లాస్టిక్ కార్మాగారానికి వెళుతుండగా ఆటో డ్రైవర్ బీమనపల్లి రాజు ఆమెను సమీపంలోని ఓ పాడుబడ్డ భవనంలోకి లాక్కెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ, బాధితురాలికి రూ. 2లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేస్తూ తీర్పు వెలువరించింది.

సీఎం మామ ఇంటి వద్ద పోలీస్ పికెట్

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ పద్మారెడ్డి ఇంటికి పోలీసు భద్రత కల్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 10సీలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే సీఎం మామ పద్మారెడ్డి ఇంటి వద్ద భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం పోలీసు అధికారులు పరిశీలించారు. ఆయన ఇంటి వద్ద 24 గంటలు పోలీసు బందోబస్తు ఉండేలా పికెట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటి వరకు పద్మారెడ్డి ఇంటి వద్ద ఎలాంటి పోలీసు బందోబస్తు లేదు. తాజాగా ఆయన ఇంటి వద్ద భద్రత ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

28న జాతీయ లోక్ అదాలత్

సద్వినియోగం చేసుకోవాలన్న సీపీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం (28న) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నగరపోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న జరిమానా వర్తించే క్రిమినల్ కేసులు సామరస్యంగా పరిష్కరించడమే దీని ఉద్దేశమన్నారు. సంబంధిత కక్షిదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సీపీ కోరారు. ఈ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం చేసుకుని సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని ఆయన సూచించారు.

డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడిన హోటల్ యజమానికి జరిమానా

నాంపల్లి: ఫుడ్ డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడిన హోటల్ నిర్వాహకుడికి రూ.10,050 జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు చెప్పింది. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్, ఫోర్ట్‌వ్యూ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ నాజర్ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. ఈ నెల 21న అతను వినియోగదారుడి ఆర్డర్ తీసుకునేందుకు మల్లేపల్లిలోని మొయిన్ చాట్నా హోటల్ దగ్గరకు వచ్చాడు. ఆర్డర్ కోసం సుమారు 40 నిమిషాల పాటు హోటల్ ఎదుట నిరీక్షించినా యజమాని ఫుడ్‌ను సకాలంలో అందించకపోగా పదే పదే ఆర్డర్ ఇవ్వాలంటూ చిరాకు పెడతావా అంటూ హోటల్ యజమాని సల్మాన్ హుస్సేన్ షేక్ అబ్దుల్ నాజర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి హోటల్ యజమానికి రూ.10,050 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ట్రాఫిక్ సిబ్బందికి రాచకొండ సీపీ అభినందనలు


ట్రాఫిక్ సిబ్బందికి సూచనలు చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఉప్పల్: భారీ వర్షాల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉప్పల్ రహదారులపై పర్యటించి ట్రాఫిక్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపై వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఉప్పల్ చౌరస్తా నుంచి బోడుప్పల్ వరకు రోడ్లు, ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షంలోనూ రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ కోసం నిబద్ధతతో పని చేస్తున్న ట్రాఫిక్ సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

సీవరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం


సీవరేజీ సమస్యను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: నగరంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా మురుగు నీటి సమస్య నివారణకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రెండో రోజైన మంగళవారం కృష్ణానగర్ ‘సి’బ్లాక్ లో సీవరేజీ నెట్ వర్క్ పైపులైన్‌ను పరిశీలించారు. ఇది 30 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్ కావడంతో పాటు.. జీహెచ్ఎంసీ నాలాకు అనుసంధానమై ఉండటంతో ఎల్లారెడ్డి గూడ సెక్షన్ పరిధిలో తరుచూ సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన గుర్తించారు. ఈ ప్రాంతంలో వర్షం పడితే సీవరేజీ పొంగడం, 10 మంది కార్మికులు, రెండు ఎయిర్ టెక్ మిషన్లు మూడు రోజుల పాటు పనిచేసినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. ఈ సెక్షన్ పరిధిలో నిర్వహించే పనులను సైతం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు.

శ్రీనగర్ కాలనీలో..

అమీర్ పేట్ మెయిన్ రోడ్, శ్రీ నగర్ కాలనీ ఆటో స్టాండ్ జంక్షన్ ప్రాంతంలోని మురుగు నీటి సమస్యను పరిశీలించారు. సీవరేజీ ఓవర్ ఫ్లోతో నీరు సెల్లార్లలోకి వస్తున్నాయని స్థానికులు ఎండీకి దృష్టికి తీసుకెళ్లారు.. మెట్రో పనుల కారణంగా జలమండలి సీవరేజీ లైన్ కు కొంతమేరకు అలైన్‌మెంట్ దెబ్బతిని మురుగు రహదారిపై పొంగడం సర్వ సాధారణమైంది. ఈ సమస్యను అధిగమించడానికి రోడ్ కటింగ్ తప్పనిసరి. ప్రధాన రహదారి కావడంతో రోడ్ కట్ చేస్తే వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందని గుర్తించారు. ట్రెంచ్ లెస్ విధానం ఉపయోగించి.. అందుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు సీవరేజీ నెట్ వర్క్ ను బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, డీజీఎం, మేనేజర్, తదితరులు పాల్గొన్నారు

వేతనాల పెంపుపై ప్రజావాణిలో సానుకూల స్పందన


సమస్యలను తెలుకుంటున్న దివ్య, జి. చిన్నారెడ్డి

లక్డీకాపూల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలను పెంచేందుకు ప్రజావాణిలో సానుకూల స్పందన లభించింది. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీకం ప్రభాకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో 361 మంది డైలీవేజ్ కార్మికుల వేతనాల చెల్లింపుల్లో వ్యత్యాసం చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తమ జిల్లాలో కలెక్టర్‌గా వ్యవహరించిన ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్యకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆమె వేతనాలలో చోటు చేసుకున్న వ్యత్యాసం లేకుండా అందరికి సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రెగ్యులర్ కాకుండా మిగిలిపోయిన 466 మంది కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె భరోసా కల్పించారు. గత 24 సంవత్సరాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద అధ్యాపకుల ఆవేదనను ఆ సంఘం అధ్యక్షుడు జి. మధుసూధనరెడ్డి ఆమెకు వివరించారు. ఈ క్రమంలో ప్రజావాణికి మొత్తం 360 దరఖాస్తులు అందాయని ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు. కాగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు.

28న కల్వకుర్తిలో బీసీ మహాధర్నా


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

పంజగుట్ట: రాష్ట్రంలో వెంటనే సమగ్ర కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచి పెంచిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధనకు ఉద్యమ పంథా మార్చాలని మిలిటెంట్ ఉద్యమం తరహాలో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన కల్వకుర్తి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించనున్న బీసీ మహాధర్నా కరపత్రాన్ని, ఎజెండాను మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, కరీంనగర్ మాజీ జెడ్పీటీసీ తుల ఉమ, బీసి మహాసభ వ్యవస్థాపకులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నటి, నిర్మాత బత్తిని కీర్తిలత గౌడ్, దత్తాత్రేయ, పిడికిలి రాజు, అంజయ్య, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్ (బోరబండ): వర్షాల మూలంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. బోరబండలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన అత్యవసర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీలోని అన్ని శాఖలు సమన్వయంతో సేవలందించాలని కోరారు. ప్రధానంగా విద్యుత్తు, జలమండలి, శానిటేషన్ విభాగాల సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఈ స్ట్రీట్ లైట్స్ విభాగం మల్లికార్జున్, ఈఈసీఎల్ జోనల్ ఇన్‌చార్జ్ ఫసియుద్దీన్, వార్డు లెవల్ ఆఫీసర్ విశ్వపతి, టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి నరేష్, ఎస్‌పీసీ ఇంజినీర్ అభినవ్, ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, భాస్కర్, అఖిల్ గణేష్‌తో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాను మితంగా వాడాలి


అవగాహన సదస్సులో పాల్గొన్న సంస్కార్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: సోషల్ మీడియాను మితంగా వాడాలని, వ్యక్తిగత డేటాను పెట్టరాదని దిల్‌సే వలంటీర్ అసోషియేషన్ డైరెక్టర్ కట్ట దుర్గ అన్నారు. ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో మంగళవారం సైబర్ క్రైమ్ అవేర్‌నెస్, సోషల్ మీడియా ద్వారా ఎదురయ్యే అనర్థాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దవారి వరకూ సోషల్ మీడియాలో ఎక్కువగా సమయాన్ని గడిపేస్తున్నారని, వాటి ద్వారా డిప్రెషన్‌తో పాటు పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, సోషల్ మీడియాలో వ్యక్తిగత డేటాను పెట్టడం వల్ల తీవ్రనష్టం వాటిల్లుతుందని చెప్పారు. సనత్‌నగర్ ఎస్ఐ హరీశ్ పలు అంశాల్లో గతంలో జరిగిన పలు విషయాలను వివరించడంతోపాటు సైబర్ క్రైమ్స్ ఎలా జరుగుతున్నాయో, మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహన వంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నాప్‌చాట్‌లో అసభ్య వీడియోలు పోస్టు

ఎలక్ట్రీషియన్‌ను అరెస్ట్ చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: స్నాప్‌చాట్‌లో వీడియో కాల్ చేసి మైనర్ బాలిక వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న ఒక ఎలక్ట్రీషియన్ సైబర్‌క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసినట్లు సైబర్‌క్రైమ్స్ డీసీపీ దార కవిత తెలిపారు. తాలాబ్‌కట్టలో నివాసముండే అఖిల్ ఉద్దీన్‌వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. బండ్లగూడ ప్రాంతంలో ఉండే ఒక మైనర్ బాలికకు స్నాప్‌చాట్ అప్లికేషన్‌తో వీడియో కాల్స్ చేశాడు. ఈక్రమంలో బాలికకు సంబంధించిన వ్యక్తిగతమైన వీడియోలు తీశాడు. ఆ వీడియోలను స్నాప్‌చాట్‌లో కొద్దిరోజులుగా పోస్టు చేస్తున్నాడు. దీనిపై ఈ నెల 7వ తేదీన సైబర్‌క్రైమ్ పోలీసులకు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో ఏసీపీ చాంద్‌పాషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ మధులత బృందం దర్యాప్తు జరిపి నిందితుడిని అరెస్ట్ చేశారు.

సర్కార్ బడుల్లో ఉచిత 'వెలుగులు'

- ఈ నెల నుంచే జీరో బిల్లులు
- తప్పనున్న నిర్వహణ భారం
- హర్షం వ్యక్తం చేస్తున్న టీచర్లు
- ఆనందంలో తల్లిదండ్రులు


బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ప్రభుత్వ పాఠశాల

బంజారాహిల్స్: ప్రభుత్వ రంగ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఇటీవలనే ప్రభుత్వం జీఓ జారీ చేయడంతో ఆయా పాఠశాలలకు ఎంతో మేలు జరగనున్నది. ఖైరతాబాద్ విద్యా శాఖ జోన్ పరిధి కిందికి వచ్చే 63 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు నాలుగు రెసిడెన్షియల్ స్కూళ్లకు ఉచిత వెలుగులు అందనున్నాయి. ఇప్పటి వరకు ఖైరతాబాద్ విద్యాశాఖ జోన్ పరిధిలోని పాఠశాలలకు కరెంటు బిల్లులు గుదిబండగా ఉండేవి. పాఠశాలల నిర్వహణకు ఇచ్చే నిధులు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకే సరిపోతుండేవి. దీని వల్ల చాలా పాఠశాలల్లో బకాయిలు పేరుకుపోయాయి. కొన్ని స్కూళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రతి నెలా ఒక్కో స్కూల్‌కు రూ. 5–8 వేల కరెంటు బిల్లులు వస్తుండేవి. వీటిని చెల్లించేందుకు ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్కూల్ మేనేజింగ్ కమిటీ సమావేశాల్లోనూ కరెంటు బిల్లుల ప్రస్తావన వచ్చేది. తల్లిదండ్రులు కూడా ఈ సమస్యపై తీవ్ర ఆందోళన చెందిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెబుతుండడంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో పాఠశాలలకు మేలు జరనున్నది.

అరకొర నిధులు..

రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ బడుల నిర్వహణకు ఒక్కో పాఠశాలకు రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు చెల్లిస్తుంది. రూ.50 వేలు అంతకన్నా ఎక్కువ నిధులు కూడా వస్తున్నాయి. ఈ నిధులు రెండు దఫాలుగా చెల్లిస్తుండడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటితో పాటు స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, కంప్యూటర్ ఛార్జీలు, చిన్నచిన్న మరమ్మతులు, ల్యాబ్‌ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, మంచినీటి వసతికి ఖర్చు చేయాలనే నియమం ఉంది. సరిపడా నిధులు లేకపోవడంతో చాలాచోట్ల హెచ్ఎంలు సొంతంగా భరించాల్సి వస్తుంది. టీచర్లు కూడా తలాకొంత జమ చేసుకుని ఖర్చు చేసేవారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రతినెలా రూ.20 వేల వరకు బిల్లు వస్తుంది. కంప్యూటర్ సైన్స్ ఉన్న చోట్ల బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. తాజాగా ఉచిత విద్యుత్ వల్ల ఈ సమస్య తప్పింది. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు 7ఏ కేటగిరి కింద విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. బోర్లు, కంప్యూటర్, ప్రయోగశాలలు , ఫ్యాన్లు, డిజిటల్ తరగతులు, ప్రొజెక్టర్లు వంటివి ఉపయోగిస్తున్నారు. వీటన్నింటి వినియోగంతో విద్యుత్ బిల్లులు పెరుగుతూ వస్తున్నాయి. ప్రతియేటా ఈ బిల్లుల చెల్లింపులు కష్టంగా ఉండేదని, ఇప్పుడు ఉచిత వెలుగులు రావడంతో ఖర్చులు తగ్గి తమ కష్టాలు తీరాయని ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే మహాగణపతి కానుకల వివరాలు

హడ్‌హక్ కమిటీ సభ్యులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతికి వినాయక చవితి సందర్భంగా వచ్చిన కానుకల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఖైరతాబాద్ గణేష్ హడ్‌హక్ కమిటీ సభ్యులు మహేందర్‌బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో హడ్‌హక్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను ఈ సంవత్సరం హుండీ లెక్కింపు చేపట్టామని సుమారుగా రూ. 75 లక్షలు వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ప్రకటనలు, ఇతరత్రా ఆదాయం ఎంత వచ్చిందనేది స్పష్టంగా లెక్కించాల్సి ఉందని చెప్పారు. ఖర్చులను సైతం లెక్కించి త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హడ్‌హక్ కమిటీ సభ్యులు మహేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పరీక్షకు వెళ్లివచ్చేలోగా.. ఫోన్, నగదు మాయం

వెంగళరావునగర్: పరీక్షకు వెళ్ళి వచ్చేలోగా ఫోన్, నగదు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఆర్.పవన్‌కుమార్ స్థానిక ఎల్లారెడ్డిగూడ హాస్టల్‌లో ఉంటూ యుపీఎస్‌సీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 20న ఉదయం పరీక్షకు సిద్ధమవుతూ ఫోన్ కోసం చూసుకోగా కనిపించ లేదు. హడావుడిగా పరీక్షకు వెళ్ళి వచ్చి హాస్టల్‌లో వెతకగా కనిపించలేదు. హాస్టల్ ఓనర్ ద్వారా తన రూంలోని లాకర్ తెరిచి చూడగా అందులో ఉండాల్సిన రూ.15 వేలు నగదు, ఆధార్‌కార్డు, ఐడీ కార్డులు, ఫోన్, ఇయర్ పాడ్స్, చార్జర్ తదితర వస్తువులు కూడా మాయమయ్యాయి. అప్పటి వరకు తన రూంలో ఉన్న గుంటూరుకు చెందిన ఎన్.వెంకటేష్ అనే యువకుడు కూడా అదేరోజు ఉదయం నుంచి హాస్టల్‌లో కనబడలేదు. దీంతో వెంకటేష్ తన వస్తువులు, ఫోన్ అపహరించాడని బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లర్లపై సందేశాత్మక చిత్రాలు



నగరంలోని ప్రధాన కూడళ్ళ సుందరీకరణలో భాగంగా పంజగుట్ట ఫ్లై ఓవర్‌కింద గత కొన్ని నెలలుగా పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఫ్లై ఓవర్ పిల్లర్లకు ఉన్న పాత చిత్రాలను తొలగించి పలు సందేశాత్మక చిత్రాలను కళాత్మకంగా వేయిస్తున్నారు. ఈ చిత్రాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ట్రాఫిక్ రూల్స్, అంతరిక్షం, విమానయానం, మహిళల చదువు, వైద్య రంగం, పరిశోధన విభాగాల చిత్రాలను ఇక్కడ భారీ పిల్లర్లకు వేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, బంజారాహిల్స్





మల్లు రవి తన వైఖరి ప్రకటించాలి

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణకు మల్లు రవి అనుకూలమా? వ్యతిరేకమా? వెంటనే ఆయన వైఖరి ప్రకటించాలని, మంత్రి కాని ఆయన వర్గీకరణ కోసం వేసిన మంత్రివర్గ ఉప సంఘం నుంచి తప్పుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. 24 గంటల లోపు ఆయన వైఖరి చెప్పడంతో పాటు మంత్రివర్గ ఉపసంఘం నుంచి తప్పుకోకపోతే ఆయనను మాలల ద్రోహిగా ప్రకటిస్తామని అవసరమైతే ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాల కులం నుంచి టిక్కెట్లు పొంది ఎమ్మెల్యే, ఎంపీలు అయిన మల్లు రవి, భట్టి విక్రమార్కలు 50 లక్షల మంది మాలలకు అన్యాయం జరుగుతుంటే మిన్నకుండడం సరికాదన్నారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం వెంటనే రద్దుచేసి సిట్టింగ్ జడ్జితో కమిటీని ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ ఉపసంఘం జీవో కాపీని వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి కో కన్వీనర్‌లు బేర బాలకిషన్, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, నాను, తాలుక అనీల్, నాయకులు బైండ్ల శ్రీను, భుంగి ఆనంద రావు, పొట్ట మధుకర్, ఎల్ల స్వామి, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలు

బంజారాహిల్స్: తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ 34వ జూనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తుంది. అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సైఫాబాద్ సైన్స్ కాలేజ్ మైదానంలో పోటీలు జరుగుతాయని జనరల్ సెక్రటరీ కిరణ్‌చారి తెలిపారు. 22 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనబోతున్నారని ఆయన వెల్లడించారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ ఒలింపిక్స్ అసోసియేషన్ సౌజన్యంతో ఈ పోటీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్నామన్నారు. యువ అథ్లెట్లు ఈ పోటీలో తమ సత్తా చాటబోతున్నారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తమ నైపుణ్యాన్ని చాటుకోవడానికి యువకులకు ఇదో మంచి వేదిక కానున్నదని వెల్లడించారు.

ఆకట్టుకుంటున్న ది లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో హంస ఎగ్జిబిషన్స్ ఆధ్వర్యంలో ది లైవ్ హ్యాండ్లూమ్ సిల్క్ ఎక్స్‌పో పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను మహిళలను అమితంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారు 70 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని నిర్వాహకురాలు శైలజా యముసామి తెలిపారు. ఈ నెల 26 వరకూ ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.

హార్వెస్టింగ్ సంపు నిర్మాణ పనులు 80 శాతం పూర్తి


హార్వెస్టింగ్ సంప్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న ఎస్ఈ రత్నాకర్

బంజారాహిల్స్: భారీ వర్షాలు వచ్చినప్పుడు ప్రధాన రోడ్లు నీటమునిగి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు నిర్మిస్తున్న హార్వెస్టింగ్ సంప్ నిర్మాణాలు తుది దశకు వచ్చాయని జీహెచ్ఎంసీ ఎస్ఈ రత్నాకర్ అన్నారు. మంగళవారం పంజగుట్ట ప్రధాన రహదారిలోని కేసీపీ జంక్షన్, రాజ్‌భవన్ రోడ్డులో నిర్మిస్తున్న హార్వెస్టింగ్ సంప్‌లను ఆయన పరిశీలించారు. ఇప్పటికే 80 శాతం మేర పనులు పూర్తయ్యాయని మరో 15 రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు. వీటి నిర్మాణం పూర్తయితే చాలా వరకు వరద సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

స్నూకర్ అండ్ బిలియర్డ్ విజేతగా ముస్తాక్ ఖాన్

కాచిగూడ: బషీర్‌బాగ్‌లోని బిలియర్డ్ స్నూకర్ అకాడమీ ఆధ్వర్యంలో స్నూకర్ అండ్ బిలియర్డ్ 2024 తెలంగాణ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 15వ రెడ్ విన్నర్‌గా ముస్తాక్ ఖాన్, రన్నర్‌గా టి.సాయి నిలిచారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నవీన్ గౌడ్, తెలంగాణ క్యూ స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అప్పారావులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అభిలాష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ప్రతిరోజూ వ్యాయామం చేయాలి


క్రీడలను ప్రారంభిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

వెంగళరావునగర్: ప్రతిరోజూ వ్యాయామం చేస్తే ఆరోగ్యవంతులుగా మారుతామని ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ అన్నారు. యూసుఫ్‌గూడలోని తెలంగాణా ఫస్ట్ బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా తొలిరోజు కబడ్డీ, క్రికెట్, చెస్, జావెలిన్ త్రో, వాలీబాల్ తదితర ఆటల పోటీలను పి.మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండవచ్చని సూచించారు. ప్రతి ఏడాది తమ బెటాలియన్‌లో పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా శిక్షణ తీసుకుని క్రీడల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ చంద్రశేఖర్, అప్పారాయ్, భాస్కర్, ఆర్ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, రాజేష్, శ్యామ్, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సభ్యత్వ నమోదులో చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: బీజేపీ సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రికార్డు స్థాయిలో సభ్యత్వాలు నమోదు చేయించే దిశగా కార్యకర్తలు ముందుకుసాగాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ 132 బూత్‌లో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వం పొందేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. ఇందుకు కేంద్రంలో నరేంద్రమోదీ పాలనే నిదర్శనమన్నారు. అలాగే 8800002024 నెంబర్‌కు మిస్ట్ కాల్ ఇచ్చి బీజేపీలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి, నాయకులు కొత్త నీరజ, దండుగుల శ్రీనివాస్, శ్రీనివాస్‌చారి, కుబేర్, అరవింద్, అనిల్, బాలరాజు, గిరి, లలిత తదితరులు పాల్గొన్నారు.

పిక్సెల్లాయిడ్ స్టూడియోస్‌కు అవార్డు



బంజారాహిల్స్: డిస్నీ ఛానల్‌లో ప్రసారమవుతున్న 'షోగన్‌'కు అత్యుత్తమంగా విజువల్ ఎఫెక్ట్స్ చేసినందుకు నగరానికి చెందిన పిక్సెల్లాయిడ్ స్టూడియోస్‌కు ఎమ్మీ అవార్డు వరించింది. ఈ షో కోసం 150 మందితో కూడిన బృందం 2,800 పైగా వీఎఫ్ఎక్స్ షాట్‌లై అవిశ్రాంతంగా పనిచేసినట్లు ఈ సందర్భంగా పిక్సెల్లాయిడ్ స్టూడియోస్ వ్యవస్థాపకుడు రాజ్ పోతుల తెలిపారు. వీఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్ మైకేల్ కొలెట్ సృజనాత్మకత ఎన్నో నూతన ఆవిష్కరణలకు పురిగొల్పిందన్నారు. డిస్నీ షోగన్, అమెరికన్ బోర్న్ చైనీస్, వార్నర్ బ్రదర్స్ వంటి అంతర్జాతీయ సిరీస్ చేశామన్నారు. ఈ రంగంలో 19 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. విభిన్న పోర్ట్‌ఫోలియోతో వందకుపైగా సిరీస్‌లకు పని చేశామన్నారు. కల్కి 2898 ఏడీ వంటి ప్రధాన ప్రాంతీయ చిత్రాలకు విజువల్ ఎఫెక్ట్స్ చేశామన్నారు. ఈ సందర్భంగా పిక్సెలాయిడ్ స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యుసర్ నయిమ్ అక్తర్ మాట్లాడుతూ ఈ గుర్తింపు రావడం తమ బృందానికి ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ప్రపంచ వేదికపై భారతీయ వీఎఫ్ఎక్స్ ప్రభావాన్ని హైలెట్ చేస్తుందన్నారు.

శివచరణ్‌కు నివాళులు


శివచరణ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న సుధాకర్

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన శివచరణ్‌కు సెయింట్ సాల్మాన్ హైస్కూల్లో మంగళవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి ప్రమాదంలో అకాల మరణం చెందడం తమల్ని కలిచి వేసిందన్నారు. ప్రతిభ గల విద్యార్థిగా శివచరణ్ ఉపాధ్యాయులు మన్ననలు పొందాడని వాపోయారు. అనంతరం పాఠశాలకు సెలవు ప్రకటించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు అగస్టీన్, ఎస్.వీ. రమణ, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కులగణనపై రాష్ట్రస్థాయి సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణనపై బుధవారం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం కొనసాగుతుందని బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం తెలిపారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కులగణన మార్చ్‌కు బదులుగా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు లింగంగౌడ్ చెప్పారు. బీసీ మేధావులు, విద్యావంతులు, వివిధ బీసీ కుల సంఘాల అధ్యక్షులు, ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

ఓయూను సందర్శించిన ఆకునూరి మురళి



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వ విద్యా కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి ఓయూను మంగళవారం సందర్శించారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా ఓయూకు విచ్చేసిన ఆయన అధికారులతో సమావేశం అయ్యారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్న సమావేశంలో సుమారు 4 గంటలు సమావేశమై సమస్యలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగాల ఖాళీల వివరాలు, ప్రవేశాలు, పరీక్షలు, బోధన, పరిశోధనలు, నిధులు, హాస్టల్స్ నిర్వహణ, భోజన వసతులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓయూలో 80 శాతం ఉద్యోగ ఖాళీలను గుర్తించినట్లు ఆకునూరి మురళి వెల్లడించారు. పర్మనెంట్ వీసీ నియామకం తర్వాత మరో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా వివిధ సమస్యల పరిష్కారం కోసం అధ్యాపక, ఉద్యోగ సంఘాల నేతలు ఆయనకు వినతి పత్రాలను సమర్పించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీల ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

26న ధర్నాను రైతులు విజయవంతం చేయాలి

తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ తదితరులు

చిక్కడపల్లి: పాల ఉత్పత్తిదారుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ పాల ఉత్పత్తిదారుల సంఘం, టీజీ విజయ డెయిరీ పరిరక్షణ సమితి సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 26న ధర్నాచౌక్‌లో తలపెట్టిన ధర్నాలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో మంగళవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల బిల్లులను 15 రోజులకు ఒకసారి ఖాతాలో జమ చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లీటరుకు రూ.5 ప్రోత్సాహాన్ని అమలు చేయాలన్నారు. పశుపోషణ పథకాన్ని అమలు చేసి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఆరిబండి ప్రసాదరావు, మూడ్ శోభన్ పాల్గొన్నారు.

అంధ మహిళా క్రికెటర్ల కోసం శిక్షణ శిబిరం



సాక్షి, హైదరాబాద్: క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లయిండ్ ఇన్ ఇండియా(సీఏబీఐ) ప్రత్యేకంగా మహిళా అంధ క్రికెటర్ల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. దేశంలో ఈ తరహా కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. తుర్కయాంజాల్ వద్ద జేబీ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ క్యాంప్ మొదలైంది. 'ట్రాన్స్‌ఫార్మింగ్ అండ్ ఎంపవరింగ్ విజువల్లీ ఇంపైర్డ్ ఉమెన్ త్రూ బ్లయిండ్ క్రికెట్' పేరుతో నిర్వహిస్తున్న ఈ క్యాంప్‌కు స్వచ్ఛంద సంస్థ 'సమర్థనమ్ ట్రస్ట్ ఫర్ ది డిసేబుల్డ్' సహకారం అందిస్తోంది. బి1, బి2, బి3 కేటగిరీల్లో ఉన్న 25 మంది తెలంగాణ అంధ మహిళా క్రికెటర్లు ఇందులో శిక్షణ తీసుకుంటున్నారు. మంగళవారం జరిగిన కోచింగ్ ప్రారంభ కార్యక్రమంలో తెలంగాణ అంధ క్రికెట్ సంఘం ప్రతినిధి చంద్రశేఖర్, వీకేవీ ఫౌండేషన్‌కు చెందిన కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వెహికిల్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ్‌జిత్ సింగ్

పంజగుట్ట: 1988 మోటార్ వెహికిల్ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయకపోవడంతోనే ప్రమాదాలను నివారించలేకపోతున్నామని సామాజిక ఉద్యమకారుడు రమణ్‌జిత్ సింగ్ అన్నారు. డ్రంకన్ డ్రైవింగ్ కేసుల విషయంలో పోలీసులు, రవాణాశాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తాను హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశానని, ఈ నెల 20వ తేదీన కోర్టు ఆ కేసును విచారణకు స్వీకరించిందని, పిటిషన్‌లో పేర్కొన్న అంశాలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు రవాణాశాఖ కమిషనర్లకు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాది ఎం.కె పాషాతో కలిసి ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికితే మొదటిసారి అయితే డ్రైవింగ్ లైసెన్స్ 3 నెలలు, రెండవసారి అయితే పర్మనెంట్‌గా రద్దు చేయాలని ఎం.వీ యాక్ట్ చట్టం 19లో ఉందని, కానీ మన వద్ద డ్రైవింగ్ లైసెన్సులు మొబైల్‌లో చూపిస్తారని లేక డుబ్లికేట్ ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోతున్నారని తెలిపారు. మొత్తం ఆన్‌లైన్ నడుస్తున్న ప్రస్తుత నేపథ్యంలో డ్రైవింగ్ లైసెన్స్‌ల ఎలక్ట్రానిక్ సీజింగ్ ఎందుకు చెయ్యలేకపోతున్నారో అర్థం కావడం లేదన్నారు. డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వారు మద్యం తాగారా లేక డ్రగ్స్ తీసుకున్నారా? నిర్ధారించేందుకు యంత్రాలు లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా మోటార్ వెహికిల్ యాక్ట్ కఠినంగా అమలు చేస్తేనే ప్రమాదాలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు.

'ఆదాయాల' బంకు

- అచ్చొచ్చిన ఆయిల్ దందా..
- ఏడాదికి రూ.4 కోట్ల ఆదాయం
- ముస్తాబవుతున్న మరో బంకు



చంచల్‌గూడలోని పెట్రోల్ బంక్

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ ఖైదీల సంస్కరణల్లో విభిన్న ప్రయోగాలు చేసింది.. ప్రస్తుతం చేస్తూనే ఉంది. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైళ్లకు వచ్చే వారిని నేరస్తులుగా పరిగణించకుండా వారిలో మార్పు తీసుకువచ్చేందుకు వివిధ వ్యాపారాలను మొదలు పెట్టింది. అందులో ఖైదీలను భాగస్వామ్యులను చేసింది. జైళ్ల శాఖ ప్రయోగాత్మకంగా 2013లో ఆయిల్ వ్యాపారంలోకి అడుగు పెట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర జైళ్ల శాఖ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పాతబస్తీలోని చంచల్‌గూడ ప్రాంతంలో సుధార్ పేరుతో నెలకొల్పిన పెట్రోల్ బంకు 11 సంవత్సరాలుగా విజయవంతంగా వ్యాపారం కొనసాగిస్తోంది. ప్రతిరోజూ రూ.30 లక్షలు అమ్మకాలు జరుపుతోంది. ప్రభుత్వ బంకు కావడంతో స్వచ్ఛత, తూనికలు కొలతల్లో అవకతవకలకు ఆస్కారం లేకపోవడంతో ప్రజలు ఈ బంకును ఆదరిస్తున్నారు.

ఖైదీలే ఉద్యోగులు..

దశాబ్దం క్రితం వరకు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు బయట ప్రపంచంతో అసలు సంబంధాలు ఉండేవి కాదు. కోర్టులు, ఆస్పత్రులకు తరలిస్తే తప్ప వారికి బయట ప్రపంచం చూసే అవకాశమే ఉండేది కాదు. అలాంటిది జైళ్ల శాఖ నేరుగా వారిని ప్రజల మధ్యకు తెచ్చి అప్పట్లో పెద్ద సాహసమే చేసిందని చెప్పొచ్చు. రాష్ట్రంలోని వివిధ జైళ్లలోని సత్‌ప్రవర్తన కలిగి ఉన్న ఖైదీలను హైదరాబాద్ నగరంలోని చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లకు తరలించి వారికి పెట్రోల్ బంక్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఖైదీలను ప్రజాసేవలో భాగస్వామ్యం చేశారు. ఈ బంకు 24 గంటలు పనిచేస్తుంది. షిఫ్ట్‌కు 20 మంది చొప్పున మొత్తం 60 మంది ఖైదీలు మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. నగరంలోని ఇతర బంకులు బంద్ పాటించినా ఈ బంకుకు వర్తించదు. ప్రస్తుతం శిక్షపడ్డ ఖైదీలు, విడుదలైన ఖైదీలు పని చేస్తున్నారు. నెలకు రూ.15 నుంచి రూ.18 వేల జీతం అందుకుంటున్నారు.

ఏడాదికి రూ.4 కోట్ల ఆదాయం..

నగరంలోని ఇతర పెట్రోల్ బంకులతో పోలిస్తే అమ్మకాలు అధికంగా ఉన్నాయి. జైళ్ల శాఖకు పెద్ద మొత్తంలో ఆదాయం అందించే స్థాయికి అభివృద్ధి చెందింది. మొదటి సంవత్సరంలోనే రూ.50 కోట్ల టర్నోవర్ సాధించి సుమారు రూ.కోటి ఆదాయం గడించింది. ప్రస్తుతం సంవత్సరానికి రూ.100 నుంచి రూ.120 కోట్ల టర్నోవర్‌తో వ్యాపారం కొనసాగిస్తూ రూ.4 కోట్ల ఆదాయం సమకూర్చుకుంటోంది. ఆయిల్ అమ్మకాల్లో తెలంగాణలో నెం.1గా కొనసాగుతోంది.

మరో బంకు ప్రారంభం..

ప్రస్తుతం చంచల్‌గూడలో ఉన్న బంకుకు వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉండటంతో మరో బంకును నెలకొల్పేందుకు అధికారులు ప్రతిపాదించగా ప్రభుత్వం ఆమోదించింది. ఇప్పుడు ఉన్న బంకుకు 10 అడుగుల దూరంలో మరో కొత్త బంకు ముస్తాబయ్యింది. ఈ బంకులో 45 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. ఇందు కోసం శిక్షణ కూడా ఇస్తున్నారు. విడుదలైన ఖైదీలు, ఇతర ప్రైవేటు వ్యక్తులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. దసరా పండగ సందర్భంగా కొత్త బంకును ప్రారంభించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఇతర మంత్రులను ఈ బంకు ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తారని సమాచారం.

26 నుంచి గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ ట్రోఫీ



గోల్కొండ: దేశంలోనే ప్రతిష్టాత్మకమైన గోల్ఫ్ టోర్నమెంట్ అయిన గోల్కొండ మాస్టర్స్–2024 ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా సీఈవో ఉత్తమ్‌సింగ్ ముండి తెలిపారు. గోల్కొండ నయాఖిలాలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో ఆయన గోల్కొండ మాస్టర్స్ వివరాలను మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం రూ.కోటి ప్రైజ్‌మనీ గల ఈ టోర్నమెంట్‌లో అత్యుత్తమ రేటింగ్ గల 126 మంది గోల్ఫర్లు పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో 123 మంది ప్రొఫెషనల్స్, ముగ్గురు ఔత్సాహిక గోల్ఫర్లు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు ఐజీపీఎల్ ప్రజెంటింగ్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం అసోసియేట్ పార్ట్‌నర్‌గా డీఎస్‌ఆర్ బిల్డర్స్ పవర్డ్ బై పార్ట్‌నర్స్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. హోస్ట్‌గా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ బాలంటైమ్స్ అధికారిక భాగస్వామిగా వ్యవహరిస్తున్నాయని ఆయన తెలిపారు. 2015 సంవత్సరం నుంచి జరుగుతున్న ఈ టోర్నమెంట్స్‌కు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ అండదండలు అందిస్తోందని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో టాటా స్టీల్స్ టీజీటీఐ ర్యాంకింగ్ లీడర్ వీర్ అహ్లావత్, మనుగండాస్, ఉదయన్‌మానే, కరణ్‌ప్రతాప్ సింగ్, శౌర్య బీనూ తదితర భారతీయ ఆటగాళ్లతో పాటు చెక్, బంగ్లాదేశ్, శ్రీలంక, అండోరా, నేపాల్, కెనడా, దక్షిణ కోరియా, జపాన్ తదితర దేశాలకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొననున్నారని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు అందుకున్న హైదరాబాద్ గోల్ఫ్ కోర్సు ఈ అంతర్జాతీయ క్రీడలకు వేదిక కానుందని ఆయన అన్నారు. బెస్ట్ టూరిజం ఫ్రెండ్లీ గోల్ఫ్ కోర్సుగా ఈ కోర్సుకు అవార్డు రావడం కూడా ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో డి.అభిషేక్, మానవ్‌జైనీతో పాటు హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ అధ్యక్షుడు బి.వి.కె.రాజు తదితరులున్నారు.

రాష్ట్రంలో తక్షణమే కులగణన ప్రక్రియ చేపట్టాలి

బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

మన్సూరాబాద్: జాతీయ స్థాయిలో కులగణనపై మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తక్షణమే కులగణన ప్రక్రియ చేపట్టాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్స్ పేరిట బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆదేశించాలని కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేతృత్వంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ ఈడబ్ల్యూసీ రిజర్వేషన్లతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆమెకు వివరించినట్లు తెలిపారు. పార్టీ ఎన్నికల హామీ అయిన స్థానిక సంస్థలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. స్పందించిన దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని, ఆందోళన చెందవద్దని తెలిపారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరమ్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, కేవీగౌడ్, కిరణ్ కుమార్, దాసరి కిరణ్, నరేందర్, సంగెం సూర్యారావు, వేణు, కీర్తిలత, నర్సింగ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదల గొంతుక 'ఏచూరి'

సాక్షి, మేడ్చల్ జిల్లా: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నిరుపేదల గొంతుకగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. హైదరాబాద్ ఏఐటీయూసీ కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాపసభను సీపీఐ రాష్ట్ర సమితి మంగళవారం నిర్వహించింది. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్, సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నర్సింహారావు, సీపీఐ నాయకులు పశ్యపద్మ, వనజ, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకుడు మాజీ ఎమ్మెల్సీ పీజే.చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించగా, సభకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సమకాలీన రాజకీయాల్లో సీతారామ్ ఏచూరి ఆదర్శప్రాయుడని, ఆయన సామాన్య కార్యకర్త స్థాయి నుంచి సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదగడం అంటే మామూలు విషయం కాదన్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి కమ్యూనిస్టు భావాలను పుణికి పుచ్చుకుని నమ్మిన సిద్ధాంతం కోసం తాను మరణించేంత వరకు పోరాడిన ధీశాలి సీతారామ్ ఏచూరి అని కొనియాడారు. దేశంలో ఎన్నో విప్లవాత్మక పోరాటాల్లో భాగస్వామ్యమైన ఆయన 2004 సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో, కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకల్పనలో ఆయనది క్రియాశీలక పాత్ర అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత ఉన్నవి రెండు పార్టీలు మాత్రమేనని, అవి కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలేనన్నారు. కానీ దేశస్వాతంత్ర్య ఉద్యమంతో గానీ ప్రజాపోరాటాలతో గానీ ఏ సంబంధం లేని బీజేపీ నేడు మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించి గద్దెనెక్కిందన్నారు. అలాంటి మతతత్వ శక్తులపై రాజీలేని పోరాటం చేసిన ఏచూరి సీతారామ్ శ్లాఘనీయుడని, ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఇలాంటి లౌకికవాదిని కోల్పోవడం బాధాకరం అన్నారు. సీపీఐ నేత అజీజ్ పాషా మాట్లాడుతూ దేశం, దేశ ప్రజల పట్ల గొప్ప ఆలోచన, ముందుచూపు ఉన్న రాజకీయ నాయకుడు సీతారామ్ ఏచూరి అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి కేవలం సీపీఐ(ఎం) పార్టీ నాయకుడు మాత్రమే కాకుండా ఆయన అన్ని కమ్యూనిస్టు పార్టీలకు నాయకుడని అన్నారు. సీపీఎం నేత డీజీ.నర్సింహారావు, సీపీఐ నాయకులు పీజే.చంద్రశేఖరరావు, పశ్యపద్మ, బాలమల్లేష్, ఎస్.జ్యోతి, డీజీ సాయిల్‌గౌడ్, విజయలక్ష్మి పండిత్, మునీర్ పటేల్ పాల్గొన్నారు.



కళ కోసం కాదు.. సమాజం కోసం

- నృత్య ప్రదర్శనతో పాటు సామాజిక కార్యక్రమాలు
- నిధులు సేకరించి స్కూల్‌లో తరగతి నిర్మాణం

లక్డీకాపూల్: కళ కోసం కాదు సమాజం కోసం.. అన్న మాటకు నిదర్శనంగా నిలిచింది ప్రణవి అన్నలూరు. తన ప్రదర్శన ద్వారా విరాళాలను సేకరించి విద్యా అభివృద్ధికి కేటాయించడం గమనార్హం. అమెరికాలో నివసిస్తున్న శశిధర్, సుందరిల కుమార్తె ప్రణవి తన 6వ ఏట నుంచే గురువు శిర్డికాంత్ వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందింది. తల్లిదండ్రులో ప్రోత్సాహంతో 2022లో కాలిఫోర్నియాలో అరంగేట్రం చేసిన నాటి నుంచి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి అందరి మన్ననలు అందుకున్నారు. తన నృత్య ప్రదర్శనల ద్వారా సేకరించిన విరాళాలతో చర్లపల్లిలోని స్ఫూర్తి ఫౌండేషన్‌కు చెందిన పాఠశాలకు తరగతి గదిని నిర్మించి తన దాతృత్వాన్ని చాటుకుంది. కాలిఫోర్నియాలోని మోంటావిస్తా హైస్కూల్‌లో ప్రస్తుతం పన్నెండో తరగతి చదువుతున్న ప్రణవి, చదువుతో పాటు గాత్రం సంగీతంలో కూడా నైపుణ్యాన్ని సాధించారు. బయాలజీ పరిశోధనల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న ప్రణవి తన స్కూలు బ్యాడ్మింటన్ జట్టు సభ్యురాలిగా కూడా రాణిస్తున్నారు.



స్కూల్ గది వద్ద చిన్నారులు

వెస్ట్‌జోన్‌కు 25 మంది ప్రొహిబిషనరీ ఎస్‌ఐలు

ఠాణాల్లో రిపోర్ట్ చేసిన అధికారులు



బంజారాహిల్స్: వెస్ట్‌జోన్ పరిధిలోని ఎనిమిది పోలీస్‌స్టేషన్లకు 25 మంది ప్రొహిబిషనరీ ఎస్‌ఐలను కేటాయించారు. వీరందరూ మంగళవారం తమకు కేటాయించిన ఠాణాల్లో ఇన్‌స్పెక్టర్లకు రిపోర్ట్ చేశారు. శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు వీరందరూ ఆయా పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తారు. అనంతరం నాలుగు నెలలపాటు గ్రేహౌండ్స్‌లో శిక్షణ తీసుకుంటారు. ఆ తర్వాత మరో మూడు నెలలపాటు ఇప్పుడు ఉన్న ఠాణాల్లోనే మళ్లీ పని చేస్తారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తోట అనూష, ఆర్.రాజురాథోడ్, షేక్ వాజిద్, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు సుష్మ, కార్తీక్, రఘురామిరెడ్డి, శివరాజు, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు రవికుమార్, శ్రీశైలం, హరీశ్‌కుమార్, పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు నిఖిత్‌కుమార్, వెస్లీ, తులసి, రమ్య, ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వై.కృష్ణ, శివకృష్ణ, మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు ప్రవీణ్‌కుమార్, రంజిత్‌నాయక్, బోరబండ పోలీస్‌స్టేషన్‌కు రాకేష్, చందనలు రిపోర్ట్ చేశారు.

నష్టాల నుంచి గట్టెక్కేందుకు మార్కెటింగ్‌పై దృష్టి

- ఎప్పుడూ లేనివిధంగా విజయ డెయిరీకి రూ.50 కోట్లు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు
- విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ విజయ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా, నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందించడంతో పాటు పాడి రైతుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ) చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. విజయ డెయిరీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం విజయభవన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాడి రైతులకు బిల్లులు చెల్లించలేని కష్టకాలంలో కొనసాగుతున్న విజయ డెయిరీని ఆదుకునే కార్యక్రమంలో భాగంగా విజయ డెయిరీ 50 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఒకేసారి రూ.50 కోట్లు కేటాయించడంపై చైర్మన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విజయ సంస్థ తన సొంత కాళ్లపై నిలబడేలా వృథా ఖర్చులను తగ్గిస్తూ మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పాల ప్రొక్యూర్‌మెంట్, సేల్స్‌లో ప్రస్తుతం తెలంగాణలో రెండవ స్థానంలో ఉన్న విజయ డెయిరీని ప్రథమ స్థానంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. ఉత్పత్తులకు గిరాకీ పెంచడంలో భాగంగా తెలంగాణలోని బాసర సరస్వతి దేవాలయం, వేములవాడ, భద్రాద్రి, యాదాద్రి వంటి ప్రముఖ దేవాలయాలు, పుణ్యక్షేత్రాలకు విజయ నెయ్యిని సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. గురుకుల పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు విజయ పాలు, పాల ఉత్పత్తులను సరఫరా చేస్తామని పేర్కొన్నారు. పాల బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తామన్నారు. రావిర్యాలలో మెగా డెయిరీలో ట్రయల్స్ కొనసాగుతున్నాయని, వచ్చే మూడు నెలల్లో పూర్తిస్థాయిలో పనులు ప్రారంభం అవుతాయన్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న టర్నోవర్ రూ.750 కోట్ల నుంచి రానున్న రోజుల్లో రూ.1500 కోట్లకు పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటామన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ సేవలను విస్తరించడమే లక్ష్యం

- ప్రజల చెంతకు చేర్చడంలో బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ కీలక పాత్ర
- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి నాగేశ్వర్‌రెడ్డి



గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో మాట్లాడుతున్న ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

చందానగర్: కేన్సర్ స్క్రీనింగ్ సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రి ప్రాంగణంలో గ్రాన్యూల్స్ ఇండియా సంస్థ, ఏషియన్ మెడికల్ ఫౌండేషన్, యూసీ బ్రెస్ట్ ఫౌండేషన్, ఏఐజీ ఆస్పత్రుల భాగస్వామ్యంతో 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్' మొబైల్ యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేదవర్గాల ప్రజల కోసం కేన్సర్ స్క్రీనింగ్‌లో ఇది అతిపెద్ద పురోగతిగా నిలుస్తుందన్నారు. ప్రైవేట్ రంగ భాగస్వాములు క్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ సవాళ్లు, సమస్యలను ఎలా సమర్థవంతంగా పరిష్కరిస్తారు అనే దానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుందన్నారు. 40 ఏళ్లు దాటిన మహిళలంతా విధిగా కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులను చేయించుకుంటే బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. ఏఐజీ ఆస్పత్రి కన్సల్టెంగ్ బ్రెస్ట్ ఆంకాలజిస్ట్, యూసీ బ్రెస్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షలకు మించి రొమ్ము ఆరోగ్యంపై అవగాహనను బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ పెంచుతుందన్నారు.

అక్టోబర్‌లో అవగాహన మాసం..

అక్టోబర్‌లో నిర్వహించబోయే బ్రెస్ట్ కేన్సర్ అవగాహన మాసానికి అనుబంధంగా బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్ రొమ్ము కేన్సర్ నివారణ, ముందస్తుగా గుర్తించడంపై లక్ష్యానికి అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహిస్తుంది. కార్యక్రమంలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, గ్రాన్యూల్స్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉమా చిగురుపాటి ప్రసంగించారు. ఏఐజీ ఆస్పత్రి వైద్య బృందం, ఏషియన్ మెడికల్ ఫౌండేషన్, యూసీ బ్రెస్ట్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నల్సార్ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి

- ఏర్పాట్లపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ సమీక్ష
- అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము త్వరలో రానున్న సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండటంతో పాటు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికగుప్తాతో కలిసి మంగళవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో జిల్లాలోని హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు ముందుగా చేరుకుంటారని, అక్కడ అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. నల్సార్ యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతి విభాగానికి ఒక అధికారిని నియమించడంతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డికి కలెక్టర్ సూచించారు. రోడ్ల మరమ్మతులు, రెడ్ కార్పెట్లు, నిరంతరాయంగా విద్యుత్తు, పుష్పాలంకరణ, వైద్య శిబిరాలు, అంబులెన్స్, సీటింగ్, మొబైల్ టాయిలెట్స్, పాసులు వంటి ఏర్పాట్ల విషయంలో సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేస్తూ.. సకాలంలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నల్సార్ యూనివర్సిటీ అధికారులతో కూడా సమన్వయంతో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ భారత రాష్ట్రపతి తిరిగి వెళ్లేంత వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలను కలెక్టర్ గౌతమ్ చేశారు. సమావేశంలో కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి శ్రీనివాసమూర్తి, పోలీసు, వైద్య, విద్యుత్తు, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

మారిన నిమ్స్ నర్సుల డ్రెస్ కోడ్

- క్యాడర్ మేరకు యూనిఫాం రంగులు
- వైట్ కోట్ తప్పనిసరి.. క్యాప్స్‌కు స్వస్తి
- వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలులోకి..




లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) నర్సుల డ్రెస్ కోడ్ మారింది. ఇప్పటి వరకు డ్రెస్ కోడ్‌గా కొనసాగిన వైట్ శారీస్, క్యాప్‌లకు స్వస్తి పలికారు. నిమ్స్ యాజమాన్యం ఆదేశాల మేరకు నర్సింగ్ క్యాడర్ ప్రకారం డ్రెస్ కోడ్ రంగులను సైతం నిర్ధారించారు. ఇక నుంచి నిమ్స్ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ డ్రెస్ కోడ్ పర్పుల్ రంగులో ఉంటుంది. అదేవిధంగా డిప్యూటీ నర్సింగ్ ఆఫీసర్ డ్రెస్ పీచ్ కలర్‌లోనూ.. సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ డ్రెస్ వైన్ కలర్‌లోనూ, నర్సింగ్ ఆఫీసర్ డ్రెస్ ఆనందం బ్లూ కలర్‌లోనూ ఉంటుంది. ఇప్పటికే ఈ మేరకు ఢిల్లీలోని ఎయిమ్స్‌కి చెందిన నర్సులు ఈ సరికొత్త డ్రెస్ కోడ్‌ను అమలు చేస్తున్నారు. కాగా ఆస్పత్రుల్లో శాంతిదూతల్లా తెల్ల డ్రెస్‌లో కనిపించే నర్సులు ఇక నుంచి తమ తమ హోదాలను బట్టి వివిధ రంగుల్లో కనిపించనున్నారు. నిన్న మొన్నటి వరకు అమలులో ఉన్న తెల్లచీర, నర్సింగ్ క్యాప్‌లను విస్మరించినప్పటికీ వైట్ కోట్‌ను మాత్రం విధిగా వేసుకోనున్నారు. దేశమంతా ఒకే రకమైన యూనిఫాం ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వచ్చే నెల 1వ తేదీ నుంచి ఆచరణలో పెట్టనుంది. ఈ తరహా డ్రెస్ కోడ్ దేశవ్యాప్తంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అమలు పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే నిమ్స్ స్టాఫ్ నర్సులను నర్సింగ్ ఆఫీసర్‌గా గుర్తించింది.

ఇక నుంచి నర్సు పేరు ముందు ఎన్ఆర్

వైద్యుడి పేరుకు ముందు డీఆర్ ఉన్నట్టే, నర్సు వృత్తిలో ఉన్న వారందరికీ వారి వారి పేరు ముందు ఎన్ఆర్ అనే రెండు అక్షరాలను ప్రిఫిక్స్‌గా చేర్చడంపై కూడా కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసర సమయాల్లో వైద్యులను గుర్తించి వారి సేవలను వినియోగించుకునేందుకు వీలుగా బస్సులు, రైళ్లు, విమానాల్లో ప్రయాణించేవారిలో డాక్టర్లు ఉన్నట్లయితే వారి పేరు ముందు విధిగా డీ.ఆర్ అనే అక్షరాలను పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వారి సేవలను వినియోగించుకునే వీలు ఉంటుంది. ఇప్పుడు నర్సుల విషయంలోనూ అదే విధానాన్ని పాటించాలని కేంద్ర వైద్యారోగ్య శాఖ భావిస్తోంది. అందుకే భారత నర్సింగ్ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంతో సంప్రదింపులు జరిపి అభిప్రాయ సేకరణ ప్రక్రియను చేపట్టింది. ఎన్ఆర్ అనే అక్షరాలను చేర్చడంపై తెలంగాణ ఎలా అభిప్రాయపడుతుందో తెలుసుకున్న తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

సాక్షి 11
హైదరాబాద్, బుధవారం, 25, సెప్టెంబర్, 2024
సిటీ ప్లస్





హైదరాబాద్ వైబ్స్

iSmart హోమ్స్

ఇప్పటి వరకూ ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్, హెల్త్, బ్యాంకింగ్ వంటి పలు రంగాలకే పరిమితమైన ఆటోమేషన్.. ఇప్పుడు నట్టింట్లోకి చేరిపోయింది. భద్రత, ఆదా, సౌకర్యం.. హోమ్ ఆటోమేషన్ లాభాలివే. దీంతో నివసించే నగరమే కాదు ఇళ్లు కూడా హైటెక్‌గా ఉండాలని యువతరం కోరుకుంటోంది. వీరి అభిరుచులకు తగ్గట్టుగానే డెవలపర్లు కూడా స్మార్ట్ హోమ్స్‌ను నిర్మిస్తున్నారు. ఇంటిలోని లైట్లు, ఫ్యాన్లు, ఏసీ, ఫ్రిజ్, గీజర్, టీవీ వంటి ప్రతీ ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని సెల్‌ఫోన్‌తోనే నిర్వహణ చేసే వీలుండటమే స్మార్ట్ హోమ్స్ ప్రత్యేకత. - సాక్షి, సిటీబ్యూరో

- భద్రత, ఆదా, సౌకర్యం.. హోమ్ ఆటోమేషన్ లాభాలివే..
- ఇంట్లో ప్రతి ఎలక్ట్రానిక్ ఉపకరణం ఫోన్‌తోనే నిర్వహణ
- లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాలలో వీటి ఏర్పాటు
- స్మార్ట్ ప్లగ్‌తో పాత గృహాలకూ ఆటోమేషన్ వీలు
- కరోనా తర్వాత స్మార్ట్ హోమ్స్‌పై నగరవాసుల్లో పెరిగిన ఆసక్తి



కరోనా తర్వాత నుంచి హోమ్ ఆటోమేషన్‌పై నగరవాసుల్లో ఆసక్తి పెరిగింది. ప్రతి ఒక్కరూ ఇల్లు ఆధునికంగా, సౌకర్యవంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయింది. రెండు దశాబ్దాలుగా స్మార్ట్ హోమ్స్ సేవలనేవి విలాసవంతమైన వసతుల నుంచి దైనందిన అవసరంగా మారిపోయాయి. దీంతో గతేడాదికి దేశంలో స్మార్ట్ హోమ్ మార్కెట్ రూ.90 వేల కోట్లుగా ఉందని, 2028 నాటికి రూ.1.40 లక్షల కోట్లకు చేరుతుందని రెడ్‌సీర్ నివేదిక అంచనా వేసింది.

ఎలా పనిచేస్తాయంటే..

విప్రో, ఫిలిప్స్, హావెల్స్, ఎంఐ, క్రిస్టాన్, కేఎస్ఎక్స్, స్నైడర్, ల్యూట్రాన్, లెగ్‌గ్రాండ్, పెర్ట్ హోమ్, ఫైబరో వంటి కంపెనీలకు చెందిన వైర్‌లెస్, వైర్డ్ అనే రెండు రకాల హోమ్ ఆటోమేషన్ ఉత్పత్తులు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వైఫై, బ్లూటూత్, జెడ్ వేవ్, జిగ్‌బీ నాలుగు రకాల వైర్‌లెస్ ప్రొటోకాల్స్‌తో ఆటోమేషన్ ఉత్పత్తులు అనుసంధానమై ఉంటాయి. ఆయా ఉత్పత్తులకు చెందిన మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని, ఇంట్లోని ఎన్ని సెల్‌ఫోన్లకైనా అనుసంధానిచవచ్చు. కస్టమర్లు ఇష్టాన్ని బట్టి కేవలం తన వాయిస్‌ను మాత్రమే గుర్తించేలా ఆయా ఉపకరణాలను అనుసంధానించవచ్చు. లేదా ఇంట్లోని ప్రతి ఒక్కరి వాయిస్‌నైనా గుర్తించేలా ప్రోగ్రామింగ్ చేసుకోవచ్చు.



ఇంటి ముందు గేటు నుంచి మొదలుపెడితే తలుపులు, కిటికీ కర్టెన్లు, లైట్లు, ఫ్యాన్లు, టీవీ, ఏసీ, గీజర్, ఫ్రిడ్జ్, గ్యాస్, హోమ్ థియేటర్, గార్డెన్.. ఇలా ప్రతి ఒక్క దాన్నీ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతతో వినియోగించడమే హోమ్ ఆటోమేషన్. అలెక్సా, గూగుల్ హోమ్, సిరి ఈ మూడు వర్చువల్ అసిస్టెంట్ టెక్నాలజీలతో మనం ఎంపిక చేసిన సమయం ప్రోగ్రామింగ్ ప్రకారం ఆయా వస్తువులు పని చేస్తుంటాయి.

ఐఓటీ, ఏఐతోనే..

స్మార్ట్ ప్లగ్‌తో పాత ఇళ్లకు కూడా..

పాత ఇళ్లను కూడా హోమ్ ఆటోమేషన్ చేయవచ్చు. సాధారణంగా మనం ఇళ్లలో వినియోగించే ఎక్స్‌టెన్షన్ బాక్స్‌లాగే 'స్మార్ట్ ప్లగ్'తో ఇంటిని స్మార్ట్‌గా మార్చుకోవచ్చు. ఇంట్లో అల్రెడీ ఉన్న స్విచ్‌లో ఈ స్మార్ట్ ప్లగ్‌ను పెడితే చాలు.. 16 ఏఎంపీ వరకూ విద్యుత్ ఉపకరణాలను స్మార్ట్‌గా వినియోగించుకోవచ్చు. దీని ధర రూ.1,500 నుంచి రూ.5,000 వరకూ ఉంటుంది.

లాభాలెన్నో..

హోమ్ ఆటోమేషన్‌తో విద్యుత్ వృథా ఉండదు. సాధారణ ఇళ్లతో పోలిస్తే స్మార్ట్ హోమ్స్‌లో 20–30 శాతం వరకూ విద్యుత్ ఆదా అవుతుంది. సమయం, డబ్బు ఆదా అవడంతో పాటు భద్రత మెరుగవుతుంది. ఎక్కడి నుంచైనా ఆపరేట్ చేసేలా సౌకర్యవంతంగా వినియోగించుకోవచ్చు. 1,500 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్(ఫ్లాట్)లో వీడియో డోర్ బెల్, ఒక లైట్, ఫ్యాన్, ఏసీ, గీజర్‌తో కూడిన బేసిక్ హోమ్ ఆటోమేషన్‌కు రూ.50 వేలు ఖర్చవుతుంది. ఎలక్ట్రీషన్, ఇంజినీర్, నెట్‌వర్క్, సాంకేతిక నిపుణులు నలుగురు వ్యక్తులు 3–4 రోజుల్లో పూర్తిగా హోమ్ ఆటోమేషన్ పూర్తి చేస్తారు.

సౌకర్యం కావాలంటున్నారు

ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ సౌకర్యవంతం కోరుకుంటున్నారు. హోమ్ ఆటోమేషన్ ఉన్న ఇళ్ల కొనుగోలుకు యువతరం ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఈ తరహా ఇళ్లకు గిరాకీ పెరిగింది.

- నర్సిరెడ్డి, ఎండీ, ఐరా రియల్టీ



స్మార్ట్ హోమ్స్‌కు డిమాండ్

కరోనా తర్వాతి నుంచి ఇల్లు స్మార్ట్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. వాయిస్ కమాండ్స్, యాప్స్ ద్వారా పనిచేసే ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్టులలో హోమ్ ఆటోమేషన్‌కు డిమాండ్ పెరిగింది.

- మారుతీ రావు, వైస్ ప్రెసిడెంట్, పౌలోమీ ఎస్టేట్స్



సిటీలో బ్రిక్ అండ్ బోల్ట్..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సాంకేతిక ఆధారిత నిర్మాణ రంగ కంపెనీ బ్రిక్ అండ్ బోల్ట్ తమ ఉత్పత్తులకు సంబంధించి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను నగరంలో నెలకొల్పింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మాదాపూర్‌లోని జూబ్లీ ఎన్‌క్లేవ్ ఆవరణలో దాదాపు 2,376 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సెంటర్.. గృహ నిర్మాణానికి సంబంధించి అనేక సమస్యలకు పరిష్కాలను అందిస్తుందన్నారు. నగరవాసులు దీనిని సందర్శించడంలో భాగంగా గృహ, వాణిజ్య నిర్మాణ పరిష్కారాల కోసం నిపుణులైన సాంకేతిక సలహాదారులతో సంప్రదింపులు జరపవచ్చన్నారు.

నగరంలో కేఎఫ్‌సీ 100 రెస్టారెంట్లు



లక్డీకాపూల్ : నగరంలో వంద రెస్టారెంట్లను ఏర్పాటు చేసేందుకు కేఎఫ్‌సీ ఇండియా సహయోగ్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించినట్టు కేఎఫ్‌సీ ఇండియా, పార్ట్‌నర్స్ కంట్రీస్ జనరల్ మేనేజర్ మోక్షి చోప్రా తెలిపారు. ఆహార ప్రియుల అభిరుచికి అనుగుణంగా రుచికరమైన వంటకాలను అందిస్తున్న కేఎఫ్‌సీ ఇప్పుడు నగరంలో మరో వంద రెస్టారెంట్లను ఏర్పాటు చేయనుందన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా వెయ్యి రెస్టారెంట్లను నెలకొల్పడమే లక్ష్యంగా కేఎఫ్‌సీ ఇండియా కృషి చేస్తుందన్నారు. 2024 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. ఇప్పటికే ముంబై, బెంగళూరు, ఢిల్లీ, గౌహతి, కోల్కతా నగరాల్లోని 800 లోకల్ రెస్టారెంట్లకు విజయవంతంగా సేవలందిస్తున్నామన్నారు. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఫుడ్ సేఫ్టీ అండ్ ట్రైనింగ్ సర్టిఫికేషన్ (ఎఫ్ఓఎస్‌టీఏసీ)లు నిర్వహిస్తున్నట్లు మోక్షిచోప్రా పేర్కొన్నారు.

28న మొజంజాహీ మార్కెట్ వేదికగా ప్రజా సంబరాలు..

బంజారాహిల్స్: హైదరాబాద్ సాంస్కృతిక, వారసత్వ సంపదను ప్రమోట్ చేసే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ నెల 28 శనివారం సాయంత్రం 6.30 గంటలకు మోజంజాహీ మార్కెట్ వేదికగా 'ప్రజా సంబరాలు' నిర్వహిస్తున్నట్లు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఇందులో భాగంగా వివిధ ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ రెండెజౌస్, గజల్ హౌర్ షాయరీకి షామ్‌ను ఉల్లాసభరితంగా సాగేలా రూపకల్పన చేశామన్నారు. ఈ సంబరాల్లో ప్రజలతో పాటు ప్రాంతీయ కళాకారులు, క్రాఫ్ట్స్‌మెన్, నటులు, క్రియేటర్స్ భాగస్వాములుగా నిలిచి మన వారసత్వ సంపద వైభవాన్ని చాటనున్నట్లు పేర్కొన్నారు.



సిటీలో ఏఐ గేమింగ్ జోన్స్..

మొదటిసారిగా వినూత్న సాంకేతికతతో ■ విద్యార్థులకు ఉచిత ప్రవేశం

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత తరానికి అనుగుణంగా వస్తున్న నూతన ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడంలో హైదరాబాద్ ముందంజలో ఉంటుంది. ఇందులో భాగంగానే నగరంలో మొట్ట మొదటి ఏఐ–గేమింగ్ జోన్ అడుగుపెట్టింది. దేశంలో ప్రఖ్యాతి చెందిన ప్రముఖ కంప్యూటర్ స్టోర్ విశాల్ పెరిఫెరల్స్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ వేదికగా ఏఐ–గేమింగ్ జోన్ మంగళవారం ప్రారంభమైంది. డైరెక్టర్ రాహుల్ మల్హోత్రా, ఇంటెల్ ఇండియా సీనియర్ మేనేజర్ ఛానెల్ డిస్ట్రిబ్యూషన్ అరుణ్ రాఘవన్ ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఏ రంగంలోని విద్యార్థులైనా సరే తమ నైపుణ్యాలను పెంచుకునేందుకు దోహదపడేలా ఈ సెంటర్ రూపొందించడం విశేషం. విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు, ఏఐ గేమింగ్ జోన్‌లో సదుపాయాలను వినియోగించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కంప్యూటింగ్, ఏఐ–గేమింగ్ జోన్‌లో ప్రోగ్రామింగ్, ఏఐ డెవలప్‌మెంట్, గేమింగ్ తదితర విభాగాల్లో సేవలు పొందవచ్చు.

ఐడీ కార్డులు తప్పనిసరి..

నగరంలో ప్రతి విద్యార్థి టెక్నాలజీని అందిపుచ్చుకోవాలనే లక్ష్యంతో ఈ ఏఐ–గేమింగ్ జోన్‌ను ఆవిష్కరించాం. ఈ ఉచిత సేవలు పొందడానికి, అధునాతన టెక్నాలజీ పై అవగాహన పెంచుకోవడానికి విద్యార్థులు తమ ఐడీ కార్డులను వెంట తీసుకురావాలి. ప్రస్తుత టెక్ యుగంలో విద్యార్థులు విజయాలను సాధించేందుకు ఈ ఏఐ–గేమింగ్ జోన్ ఎంతో ఉపయోగపడుతుంది.

- విశాల్ పెరిఫెరల్స్, విశాల్ కంప్యూటెక్ డైరెక్టర్ వికాష్ హిసరియా

సాహసపు.. సవారీ..



గుర్రపు సవారీ అనేదీ ఆటవిడుపు, సాహస క్రీడ, ప్రస్తుతం నగరంలో ఇదే ట్రెండ్‌గా మారుతోంది. యువతతో పాటు చిన్నపిల్లలు సైతం గుర్రపు సవారీ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు హార్స్ రైడింగ్‌లో శిక్షణ ఇప్పించి.. వారు గుర్రాలపై సవారీ చేస్తుంటే చూసి ముచ్చటపడుతుంటారు. యువతకు, వారి తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా హార్స్ రైడింగ్ ట్రైనింగ్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఈ కోవలోనే నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్ కాలనీలో నవీన్ హార్స్ రైడింగ్ స్కూల్ గత కొన్నేళ్లుగా గుర్రపు స్వారీలో అనేక మందికి శిక్షణ ఇస్తూ మన్ననలను పొందుతోంది. - మన్సూరాబాద్


- యువత, చిన్నారుల ఆసక్తి
- హార్స్ రైడింగ్ సెంటర్లకు డిమాండ్
- మానసిక రుగ్మతలకు సంజీవని
- సాహసపు క్రీడపై నగర యువత క్రేజ్

మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి సాహసపు సవారీ సంజీవనిలా పనిచేస్తుంది. ముఖ్యంగా మానసిక వికాసం లోపించిన చిన్నారులకు మంచి ఫలితాలనిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పిల్లలు గుర్రపు స్వారీ చేయడం వల్ల వారిలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. గుర్రం కళ్లెం పట్టుకోవడం, నిటారుగా కూర్చోవడం, అశ్వాన్ని దూకించడం ఒకే లయలో ముందుకుసాగడం వంటి చర్యలతో మెదడుకు, శరీరానికి మధ్య సమన్వయం ఏర్పడి మానసిక ఉత్తేజం కలుగుతుంది. ఫలితంగా అనేక రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయి. అనేక మంది విదేశీయులు కూడ నవీన్ హార్స్ రైడింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంటున్నారు.

సహసక్రీడతో జర జాగ్రత్త..

గుర్రపు స్వారీ అనేది సాహస క్రీడ. ప్రమాదాలకు కూడా ఎక్కువ అవకాశాలున్నాయి. ప్రమాదాలు సంభవించినా కూడా రైడర్‌కు ప్రమాదం జరగకుండా శిక్షకులు పలు జాగ్రత్తలు తీసుకుంటారు. గట్టి నేలల్లో ప్రమాదాలకు ఎక్కువ అవకాశం ఉండటంతో ఇసుక నేలల్లో శిక్షణ ఇస్తుంటారు.

ఎంపిక చేసిన గుర్రాలతో శిక్షణ..



మా శిక్షణా కేంద్రంలో మొత్తం 13 గుర్రాలున్నాయి. పదేళ్ల పాటు సేవలు అందించి విశ్రాంతి తీసుకుంటున్న గుర్రాలను ఎంపిక చేసి ప్రత్యేకంగా చికిత్స కోసం వచ్చే పిల్లల సేవలకు వినియోగిస్తాము. చిన్నపిల్లలతో మంచిగా మసలేందుకు, రౌతు తీరుని గమనించేందుకు గుర్రాలకు ముందే శిక్షణ ఇస్తాము. పిల్లల వైకల్యానికి అనుగుణంగా ఏ గుర్రంతో స్వారీ చేయాలనేది నిర్ణయించి శిక్షణ ప్రారంభిస్తాము. ప్రతి నెలా రాజస్థాన్ నుంచి వచ్చిన నిపుణులతో గుర్రాలకు నాడలను వేయిస్తాం. - నవీన్‌చౌదరీ, హార్స్ రైడింగ్ శిక్షకుడు

మానసిక రుగ్మతలకు..



చిన్నారుల్లో వివిధ మానసిక రుగ్మతలను నయం చేసేందుకు వివిధ వైద్య విధానాల్లో లొంగని వాటికి అరుదైన చికిత్సా విధానం హార్స్ రైడింగ్ అని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. మా పాపను గత కొన్ని నెలలుగా గుర్రపుస్వారీకి తీసుకొస్తున్నాను. గతంలో కన్నా చాలా మెరుగ్గా ఉంటుంది. తనంతట తానుగా పనులు చేసుకుంటుంది. మెదడు, శారీరక ప్రక్రియ మెరుగ్గా అనిపిస్తుంది. మానసికంగా దృఢంగా తయారవుతుంది. - ఎస్.అపర్ణ





సిట్.. బాబు స్కిట్

లడ్డూ వివాదంపై సిట్ ఇన్‌చార్జ్‌గా అత్యంత వివాదాస్పద ఐపీఎస్ అధికారి త్రిపాఠి

చంద్రబాబు అనుకూల వాదనకు బలం చేకూర్చడమే లక్ష్యంగా ఏర్పాటు

సాక్షి, అమరావతి : అనుకున్నంతా అయ్యింది.. తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మరో కుట్రకు తెరతీశారు. లడ్డూ ప్రసాదం వివాదంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పేరిట తిమ్మిని బమ్మిని చేసే కుతంత్రానికి తెరతీశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీతోపాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్‌ను బేఖాతరు చేస్తూ.. తాము చెప్పినట్టుగా దర్యాప్తును ప్రభావితం చేయాలన్న లక్ష్యంతోనే సిట్‌ను నియమించారు. తానే కర్త, కర్మ, క్రియగా మారి తిరుమల లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు.. ఆ కుట్రను కప్పిపుచ్చడమే లక్ష్యంగా ఈ సిట్‌ను ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతోంది. ఎందుకంటే అవాస్తవ ఆరోపణలతో తిరుమల పవిత్రతను టీడీపీ కూటమి ప్రభుత్వం దెబ్బ తీసిందన్నది బట్టబయలైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేసిన ఏ ఆరోపణకు కూడా ఆధారం చూపించలేకపోయారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టు ఎన్‌డీడీబీ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదన్నది స్పష్టమైంది. ఇక కర్ణాటక సహకార పాడి రైతుల సమాఖ్య డెయిరీ (నందిని నెయ్యి)కి ఎందుకు కాంట్రాక్టు ఇవ్వలేదని నిలదీసేందుకు చంద్రబాబు వేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే తొలిసారిగా నందిని డెయిరీకి కాంట్రాక్టు ఇవ్వకుండా మహారాష్ట్రలోని ప్రైవేటు డెయిరీకి కాంట్రాక్టు కట్టబెట్టిందన్నది వెల్లడైంది. జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి విపరీతమైన దుర్వాసన వస్తుందని ఆహార శాస్త్రవేత్తలు సైతం స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో తిరుమల లడ్డూ ప్రసాదంపై అటువంటి ఫిర్యాదులు రాని విషయాన్ని గుర్తు చేశారు. అన్నింటికంటే ప్రధానంగా.. నెయ్యి కల్తీ జరిగినట్టు నివేదిక వస్తే టీడీపీ ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం కింద కేసు ఎందుకు నమోదు చేయాలేదని నిపుణుల ప్రశ్నకు చంద్రబాబు ప్రభుత్వం ఖంగుతింది. దాంతో రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల లడ్డూ ప్రసాదానికి కళంకం ఆపాదించే కుట్ర పన్నారని సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. లడ్డూ ప్రసాదం అంశంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించాలని దేశ వ్యాప్తంగా డిమాండ్ వ్యక్తమవుతోంది. మరోవైపు టీడీపీ దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ సమర్థవంతంగా తిప్పికొట్టింది. లడ్డూ ప్రసాదం అంశంపై హైకోర్టుగానీ సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితోగానీ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. రాజ్యసభ మాజీ సభ్యుడు, తిరుమల వ్యవహారాలపై సాధికారికత ఉన్న సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు వ్యాఖ్యలపై విచారించాలని కోరారు. దేశ వ్యాప్తంగా హిందూ సంస్థలు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లు కూడా ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేస్తున్నారు. దాంతో చంద్రబాబు బెంబేలెత్తారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారానో మరో దర్యాప్తు సంస్థ ద్వారానో విచారణ నిర్వహిస్తే తమ కుట్ర బట్టబయలవుతుందని ఆందోళన చెందారు. ఎందుకంటే చంద్రబాబు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిట్టింగ్ న్యాయమూర్తిగానీ ఇతర దర్యాప్తు సంస్థకు గానీ సమర్పించాలి. కానీ రాజకీయ ప్రయోజనాల కోసం లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఎటువంటి ఆధారాలు చూపించ లేరు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండేట్టుగా.. తాను చెప్పింది చేసేలా సిట్ ఏర్పాటు చేశారు.


కూటమి సేవలో ఘనాపాఠి

ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన త్రిపాఠి తీరుపై 'కూటమి సేవలో ఘనాపాఠి' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనం

సిట్ ఇన్‌చార్జ్‌గా వివాదాస్పద అధికారి

అత్యంత వివాదాస్పద అధికారి, ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి అక్రమాలకు కొమ్ము కాశారని ఆరోపణలు ఎదుర్కొన్న గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడం పట్ల సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ బృందంలో విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజులను సభ్యులుగా నియమించారు. కాగా, ఎన్నికల్లో అక్రమాలకు చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి పక్కా పన్నాగంతో వ్యవహరించి రాష్ట్రంలో కీలక స్థానాల్లో ఉన్న పోలీసు అధికారులపై దుష్ప్రచారం చేశారు. ఎవరెవర్ని బదిలీ చేయాలి.. ఆ స్థానాల్లో ఎవర్ని నియమించాలనే జాబితాను కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు సమర్పించడం గమనార్హం. టీడీపీ కూటమి ఒత్తిడికి లొంగి ఎన్నికల కమిషన్ అప్పటి గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్న పాలరాజును హఠాత్తుగా బదిలీ చేసింది. ఆ స్థానంలో చంద్రబాబు ఆదేశాలతో దగ్గుబాటి పురందేశ్వరి సూచించిన జాబితాలోని సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఐజీగా నియమించింది. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ రౌడీమూకలు చెలరేగిపోయి విధ్వంస కాండ సృష్టించడం తెలిసిందే. ప్రధానంగా పల్నాడులో టీడీపీ కూటమి గుండాలు దాడులు, దౌర్జన్యాలతో బెంబేలెత్తించారు. మాచర్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ రౌడీలు దాడులు చేశారు. అప్పటి గురజాల ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాసు మహేశ్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. గురజాలలో బాంబు దాడులకు పాల్పడ్డారు. పల్నాడు వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఓట్లు వేయకుండా పచ్చ రౌడీలు దాడులతో విధ్వంసం సృష్టించారు. టీడీపీ ఎన్నికల అక్రమాలకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఎంతగా ఫిర్యాదులు చేసినా సరే.. సర్వశ్రేష్ఠ త్రిపాఠి పట్టించుకోలేదు. పోలింగ్ రోజున కనీసం ఫోన్లకు కూడా స్పందించలేదు. అదీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ట్రాక్ రికార్డ్. అంతటి వివాదాస్పద అధికారిని చంద్రబాబు ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం అంశంపై ఏర్పాటు చేసిన సిట్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించడం గమనార్హం. అంటే ఇక సిట్ దర్యాప్తు ఎలా సాగుతుందో.. నివేదిక ఎలా ఉండనుందో ఊహించుకోవచ్చని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నిబద్ధులైన అధికారులను కాదని..

సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించేందుకు ఐజీలు వినీత్‌బ్రిజ్‌లాల్, పీహెచ్‌డీ రామకృష్ణ, ఆకే రవి కృష్ణల పేర్లను పరిశీలిస్తున్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం మీడియాకు లీకులు ఇచ్చింది. కానీ వినీత్ బ్రిజ్‌లాల్ నిజాయితీపరుడు, ముక్కుసూటి అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన తాము చెప్పినట్టుగా తప్పుడు నివేదిక ఇవ్వరని చంద్రబాబు భావించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ అడ్డగోలు వ్యవహార శైలితో విసిగిపోయిన ఆయన డెప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లాలని కూడా భావిస్తున్నారు. ఇక పీహెచ్‌డీ రామకృష్ణ కూడా తాము చెప్పినట్టుగా నివేదిక ఇస్తారని చంద్రబాబుకు నమ్మకం లేదు. ఆకే రవికృష్ణ పేరు పరిశీలించారు గానీ పూర్తి నమ్మకం లేకపోవడంతో పక్కన పెట్టేశారు. అందుకే ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు వత్తాసు పలికిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠినే సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. లడ్డూ ప్రసాదంపై తాము వ్యాప్తిలోకి తెచ్చిన దుష్ప్రచారానికి అధికారిక ముద్ర వేసేలా.. తిరుమల పవిత్రతకు భంగకరంగా నివేదిక ఇచ్చి సర్వభ్రష్టత్వం పట్టించాలన్న చంద్రబాబు పన్నాగంలో భాగంగానే సర్వ శ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించారన్నది స్పష్టమవుతోంది.

హిందువులంతా ఏకం కావాలి

సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఉపేక్షించను

- నేను పోరాటం చేయాలనుకుంటే ఆపేవారెవరూ లేరు
- హిందువులు కనీసం కోపం తెచ్చుకోకపోతే ఏం చేయగలం
- సెక్యులరిజం వన్‌వే కాదు టూ వే
- అల్లా, జీసస్‌ను ఎవరైనా.. ఏమైనా అనగలరా?
- సున్నితాంశాలపై ప్రకాశ్‌రాజ్ తెలుసుకొని మాట్లాడాలి
- ఇంద్రకీలాద్రిపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): సనాతన ధర్మానికి భంగం వాటిల్లితే హిందువులంతా ఏకమై.. కలసికట్టుగా మాట్లాడాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హిందువులు మౌనం వహిస్తే, ఆ మౌనం భవిష్యత్తు తరాలను నాశనం చేస్తుందన్నారు. ధర్మాన్ని పరిరక్షించడం గుడికి వెళ్లే ప్రతి హిందూ బాధ్యత కాదా, నా ఒక్కడి బాధ్యతేనా అంటూ ప్రశ్నించారు. 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా మంగళవారం విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ శుద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కనక దుర్గమ్మవారి దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రిపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సనాతన ధర్మానికి సంబంధించి పోరాటం చేయాలనుకుంటే తనను ఆపేవారు ఎవరూ లేరన్నారు. ధర్మం కోసం పోరాటం చేస్తే చనిపోవడానికి సిద్ధమని, కానీ, అక్కడిదాకా తీసుకెళ్లనని చెప్పారు. సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. సనాతన ధర్మానికి, పవిత్రతకు భంగం కలిగినప్పుడు మాట్లాడడం కూడా తప్పే అన్నట్లు చెబితే ఎలా..? మాట్లాడేవారు ఒకటికి వందసార్లు ఆలోచించి మాట్లాడండి అని చెప్పారు. సెక్యులరిజం అనేది వన్ వే కాదని అది టూ వే అని చెప్పారు. హిందువులు మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. మసీదులో చిన్నపాటి చోరీ జరిగితే ఇలాగే మాట్లాడతారా అని అన్నారు. హిందూ దేవుళ్లపైన మాట్లాడేవారు అల్లాహ్ పైన, మహ్మద్ ప్రవక్తపైన, జీసస్‌పైన మాట్లాడగలరా అంటూ రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. ఇస్లాంపైన మాట్లాడితే ఆ మతం వారు పెద్దఎత్తున బయటకు వస్తారు అంటూ చెప్పారు. హిందువులను రోడ్లపైకి రమ్మని చెప్పడం లేదన్నారు. కనీసం హిందువులకు కోపం రాకపోతే ఏం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సినిమా ఇండస్ట్రీ వారికి కూడా విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మంపై ఇష్టానుసారం జోకులు వేయడం, మీమ్స్ చేయడం సరికాదన్నారు. ఓ సినిమా ఫంక్షన్‌లో జోకులు వేస్తున్నారని, ఎంతోమంది మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాల విషయంలో జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. దేశమంతటికీ కలిపి 'సనాతన ధర్మ రక్షణ బోర్డు' తప్పనిసరి అని చెప్పారు. చిన్నప్పటి నుంచి తాను సనాతన ధర్మం పాటించేవాడినన్నారు. తమ ఇష్టదైవం ఆంజనేయ స్వామి అని, తాము రామభక్తులమని చెప్పారు. ఈ సందర్భంగా పొన్నవోలు సుధాకరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిపైన విమర్శలు చేశారు. అంతకుముందు పవన్ కళ్యాణ్‌కు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం మెట్లను కడిగి, పసుపు రాశారు.

మహిళలను అడ్డుకున్న సిబ్బంది

ఆలయంలో మెట్లను పవన్‌కళ్యాణ్ శుభ్రం చేసే కార్యక్రమానికి అర్ధగంట ముందు, ఆ తర్వాత కూడా మహిళా భక్తులు మెట్ల పూజ చేసుకోకుండా ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. మెట్ల పూజ చేసుకుంటూ వస్తున్న మహిళా భక్తులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని క్యూలైన్‌లోకి పంపేందుకు ప్రయత్నించారు. దీంతో సెక్యూరిటీ సిబ్బందికి, మహిళా భక్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. మెట్ల పూజ మొక్కు పూర్తి చేసుకోకుండా దర్శనానికి వెళ్లమని చెప్పడం ఎంత వరకు సబబని మహిళలు మండిపడ్డారు.



వృద్ధాప్యం వచ్చాక తల్లిదండ్రులు పిల్లలు అవుతారు. కాని వారి కడుపున పుట్టిన పిల్లలు వారికి పూర్తిగా తల్లిదండ్రులుగా మారడంలో విఫలమవుతున్నారు. మనల్ని కని పెంచిన వారికి తల్లిదండ్రులుగా మారాల్సిన సందర్భం వచ్చాక పూర్తి సమయం, శ్రద్ధ ఇవ్వడంలో చాలామంది విఫలం అవుతున్నారు. కాని పెద్దల సంరక్షణ గొప్ప బాధ్యత. దాని గురించి మనల్ని మనం తీర్చిదిద్దుకోవాల్సిందే. ఏం చేయాలి?

● జన్మదాతా సుఖీభవ

కనిపెంచినవారిని కడుపులో పెట్టుకుని

చిన్నప్పుడు మనం 'అమ్మా.. యూనిఫామ్ ఎక్కడా' అనడిగితే వృద్ధులయ్యాక మన తల్లిదండ్రులు 'నాన్నా.. నా కళ్లద్దాలు ఎక్కడున్నాయో చూడు' అంటారు. చిన్నప్పుడు మనం 'అప్పచ్చి కావాలి' అని మారాం చేస్తే వృద్ధులయ్యాక తల్లిదండ్రులు 'కొన్ని అరటి పండ్లు తెచ్చి పెట్టు' అని అడుగుతారు. మనం చిన్నగా ఉన్నప్పుడు వాళ్లు బజారుకు వెళ్లి మనకు కావలసినవన్నీ తెచ్చి పెడతారు. మనం పెద్దవాళ్లయ్యాక వాళ్లకు కావలసిన వాటిని తేవడానికి 'టైమ్ లేదంటాం', 'వచ్చే నెల చూద్దాం' అంటాం... 'ఉన్నవాటితో సర్దుకో' అంటాం. ఎన్నో అంటాం. ఎన్నో అంటే పడాల్సిన వారా వారు? తల్లిదండ్రులు. వయసు మళ్లిన మన జన్మదాతలు.

రెండు రకాల పిల్లలు

వృద్ధులైన తల్లిదండ్రులను చూసుకునే పిల్లలు రెండు రకాలు. తమతో ఉంచుకుని చూసుకునేవారు, వేరే ఏరియా/ఊరు/దేశంలో ఉంటూ చూసుకునేవారు. ఈ రెండు విధాల పిల్లలకు కొన్ని ఇబ్బందులు ఉంటాయి. అయినా సరే తల్లిదండ్రుల విషయంలో ఆ ఇబ్బందులను స్వీకరించి ముందుకు సాగాల్సిందే.

ముందు చేయాల్సిన పని

● తల్లిదండ్రులను చూసుకోవాల్సిన వయసుకు వారు వచ్చి, నిస్సహాయస్థితికి చేరుకున్నాక పిల్లలు చేయాల్సిన పని వారి గత తప్పులు, పొరపాట్లు అన్నీ మన్నించి ఇక వీరి అంతిమక్షణాల వరకు మనదే బాధ్యత అని సంకల్పం చెప్పుకోవడం. మనం చిన్నగా ఉన్నప్పుడు వారు అది చేయకపోవచ్చు, ఇది చేయకపోవచ్చు, మన కలలను భగ్నం చేసి ఉండొచ్చు... కాని ఇప్పుడు ఆ పాత బాకీలు గుర్తు చేసి పేచీ పెట్టే సమయం కాదు. ఇక వారు చిన్నపిల్లలు అయిపోయారు. వారి మీద ప్రేమ మాత్రమే చూపగలం.

● దూరంగా ఉండి చూసుకోవాల్సిన వారు మొదట తమలో ఆ గిల్ట్‌ను తీసేయాలి. మీ భృతి కోసమో మరో కారణం కోసమో మీరు తల్లిదండ్రులతో ఉండే వీలు లేదు. ఆల్‌రైట్. కాని వారిని చూసుకోవడంలో మీకు నిజాయితీ ఉంటే చాలు. మీరు నిజాయితీగా ఏ మేరకు చూసుకోగలరో ఆ మేరకు చూసుకుంటున్నారని మీ తల్లిదండ్రులకు అర్థమైతే వారు ఇక ఫిర్యాదులు ఏమీ చేయరు.

తల్లిదండ్రులతో ఉన్నవారైనా, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చూసుకునేవారైనా తప్పనిసరిగా చేయాల్సిన పనులు

● వారికి హెల్త్ ఇన్సూరెన్సులు చేసి పెట్టడం ● వ్యక్తిగత సహాయానికి, వైద్య సహాయానికి మనుషుల్ని ఏర్పాటు చేయడం ● వారికి ఇష్టమైన వంటలు, ఆహారం తినే ఏర్పాటు చేయడం ● వారి ఎమర్జెన్సీ అవసరాలకు కాల్ చేయదగ్గ మనుషులున్నారని చెప్పడం ● ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా తగినన్ని డబ్బులు వారి ఆధీనంలో కూడా పెట్టడం ● ఆస్తి పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వంటివి వారి అనుమతితో సంరక్షించడం

బంధాలు నిలబెట్టుకోవాలి

దగ్గర ఉండి చూసుకుంటున్నా దూరంగా ఉన్నా రోజూ తల్లిదండ్రులతో మాట్లాడటం తప్పనిసరి. ఈ బంధం ఏమీ మారలేదు అనే భరోసా వారికి సగం బలాన్ని ఇస్తుంది. వీడియో కాల్స్ చేయడం, రోజువారీ ఫొటోలేమైనా పంపడం, మనవలు, మనవరాళ్లతో మాట్లాడించడం, కోడలు/అల్లుడు తప్పకుండా పలకరించేలా చూడటం... ఇవన్నీ పెద్దలకు బెంగ తీరుస్తాయి.

వినోదం

పెద్దలకు బోర్ కొట్టకుండా మంచి ఫోన్‌లు ఇచ్చి అవి ఎలా ఆపరేట్ చేయాలో నేర్పిస్తే వారు కాలక్షేపం చేస్తారు. టీవీలో ఓటీటీ చానల్స్ సబ్‌స్క్రయిబ్ చేసి వాటిని ఎలా చూడాలో నేర్పాలి. అంతే కాదు వారు ఉంటున్న ఏరియాలో వారి వయసు వారు నడిపే వాట్సప్ గ్రూపుల్లో చేరేలా చూడటం, వారి వయసు వారు ఎక్కడైనా కలుస్తూ ఉంటే వెళ్లి వచ్చే ఏర్పాటు చేయడం చాలా ముఖ్యం.

ఆ సమస్య వద్దు

ఒకరి కంటే ఎక్కువ సంతానం ఉంటే ఆ సంతానం మధ్య పొరపొచ్చాలు లేకుండా చూసుకోవాలి. ఒకవేళ ఉన్నా తల్లిదండ్రుల దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడాలి. తాము జీవించి ఉండగా తమ సంతానం కొట్టుకుంటూ తిట్టుకుంటూ ఉండటం తల్లిదండ్రులకు క్షోభ. వారిని వీలైనంత సంతోషం పెట్టాలి. ముఖ్యమైన పండగలకు అందరూ కలుస్తూ ఉంటే అదే పెద్ద పెన్నిధి. పెద్దలు వారి జీవితంలో ఎన్నో మాటలు పడి ఉంటారు. ఇక పిల్లల నుంచి మాటలు పడే శక్తి ఉండదు. పెద్దలను మాటలతో బాధించ రాదు.

పెద్దలు ఉండగా వారి విలువ తెలియదు. వారు లేనప్పుడు అదెంత పెద్ద లోటో తెలుస్తుంది. అందుకే వృద్ధులైన తల్లిదండ్రులకు ప్రతి సంతానం తల్లిదండ్రులుగా మారాలి. ఆ పసివాళ్లను ప్రేమగా చూసుకోవాలి.



సాహసానికి సై యామి

భయమా... డోంట్ ఖేర్

బాలీవుడ్ నటి సయామీ ఖేర్ తన చిరకాల స్వప్నం 'ఐరన్ మ్యాన్ 70.3' గురించి చెప్పినప్పుడు అభినందించిన వాళ్ల కంటే అపహాస్యం చేసిన వాళ్లే ఎక్కువ. 'సినిమాల్లోలాగా అక్కడ డూప్‌లు ఉండరు' అని నవ్వారు కొందరు. అయితే ఇవేమీ తన సాహసానికి అడ్డుగోడలు కాలేకపోయాయి.

ప్రపంచంలోనే అత్యంత కఠినమైన రేస్‌గా 'ట్రయథ్లాన్: ఐరన్‌మ్యాన్' రేస్ గురించి చెబుతారు. 1.9 కిలోమీటర్ల స్విమ్మింగ్, 90 కిలోమీటర్ల బైసికిల్ రైడ్, 21.1 కిలోమీటర్ల పరుగుతో 'ఐరన్ మ్యాన్' రేసు పూర్తి చేసిన తొలి బాలీవుడ్ నటిగా సయామీ ఖేర్ చరిత్ర సృష్టించింది.

ఐరన్ మ్యాన్ ట్రయథ్లాన్

'ఐరన్ మ్యాన్ ట్రయథ్లాన్' అనేది వరల్డ్ ట్రయథ్లాన్ కార్పొరేషన్(డబ్ల్యూటిసి) నిర్వహించే రేసులలో ఒకటి. దీనిని ప్రపంచంలోనే అత్యంత కఠినమైన స్పోర్ట్ ఈవెంట్‌గా చెబుతారు. ఈ రేసు సాధారణంగా ఉదయం ఏడుగంటలకు మొదలై అర్ధరాత్రి ముగుస్తుంది. ఓర్పు, బలం, వేగానికి సంబంధించి ట్రయథ్లెట్లు రేసుకు కొన్ని నెలల ముందు కఠిన శిక్షణ తీసుకుంటారు.

ఫ్రెండ్స్‌కు తన కల గురించి సయామీ ఖేర్ చెప్పినప్పుడు 'నీలాగే చాలామంది కలలు కంటారు. రేస్ పూర్తి చేయని ఫస్ట్ టైమర్‌లు ఎందరో ఉన్నారు' అన్నారు వాళ్లు. వెనక్కి తగ్గిన వారిలో తాను ఒకరు కాకూడదు అనుకుంది ఖేర్. ఫిబ్రవరిలో 'ఐరన్ మ్యాన్' రేస్ కోసం ట్రెనింగ్ మొదలైంది. మొదట్లో 3 కిలోమీటర్లు పరుగెత్తడం, ఈత 'అయ్య బాబోయ్' అనిపించేది. త్వరగా అలిసిపోయేది. సాధన చేయగా... చేయగా... కొన్ని నెలల తరువాత పరిస్థితి తన అదుపులోకి వచ్చింది. అప్పుడిక కష్టం అనిపించలేదు. ముఖ్యంగా క్రమశిక్షణ బాగా అలవాటైంది.



రోజు తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేచి శిక్షణ కోసం సిద్ధం అయ్యేది. ట్రెనింగ్‌లో తాను ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి లోతుగా ఆలోచించేది. 'శిక్షణ బాగా తీసుకుంటే వాటిని అధిగమించడం కష్టం కాదు' అని కోచ్ చెప్పిన మాటను అనుసరించింది.

'ఎన్నో సంవత్సరాలుగా ఎన్నో మారథాన్‌లలో పాల్గొంటున్నాను. అయితే నా దృష్టి మాత్రం ఐరన్ మ్యాన్ రేస్ పైనే ఉండేది. నా కలను నెరవేర్చుకోడానికి సన్నద్ధం అవుతున్న సమయంలో కోవిడ్ మహమ్మారి వచ్చింది. దీంతో నా కల తాత్కాలికంగా వెనక్కి వెళ్లిపోయింది. ఇప్పటికైనా నా కలను నిజం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది' అంటుంది సయామీ ఖేర్.

ఖేర్ మాటల్లో చెప్పాలంటే 'ఐరన్ మ్యాన్ రేస్ అనేది శారీరక సామర్థ్యం, సహనానికి పరీక్ష. 'ఆటలు మానసిక ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. మనసును ప్రశాంతం చేస్తాయి. ఐరన్ మ్యాన్ రేస్ పూర్తి చేయడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఈ ఆత్మవిశ్వాసం నా నట జీవితానికి ఉపయోగపడుతుంది' అంటుంది 32 సంవత్సరాల సయామీ ఖేర్.

అయినసూ ఛేదించవలె...

గత సంవత్సరం బైక్ యాక్సిడెంట్‌లో గాయపడ్డాను. కొన్ని నెలల రెస్ట్. మరోవైపు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. 'ఇలాంటి పరిస్థితుల్లో సాహసాలు అవసరమా!' అనిపిస్తుంది. నాకైతే అలా అనిపించలేదు సరి కదా ఎలాగైనా సాధించాలనే పట్టుదల పెరిగింది. 'ఏదైనా చేయాలి అని మనసు బలంగా అనుకుంటే దానికి అనుగుణంగా శరీరం కూడా సన్నద్ధం అవుతుంది' అంటారు. ఇది నా విషయంలో అక్షరాలా నిజం అయింది. అయితే ప్రతికూల పరిస్థితులు మళ్లీ ముందుకు వచ్చాయి. రేసుకు వారం ముందు కెనడాకు నా ప్రయాణం (వర్క్ ట్రిప్) పీడకలగా మారింది. విమానాలు ఆలస్యం కావడం నుంచి కాంటాక్ట్స్ కోల్పోవడం వరకు ఎన్నో జరిగాయి. నా బ్యాగ్‌లు మిస్ అయ్యాయి. భారత రాయబార కార్యాలయం సహకారంతో ఆ సమస్య నుంచి ఎలాగో బయటపడ్డాను. ఇక 'ఐరన్ మ్యాన్ రేస్‌లో నా గేర్ మొదలైనప్పుడు గాలులు తీవ్రంగా వీచడం మొదలైంది. అయినప్పటికీ ఈత కొట్టడానికి, రైడ్ చేయడానికి వెళ్లాను. నా మార్గంలో వచ్చిన ప్రతిదాన్ని ఆస్వాదించాలని గట్టిగా అనుకున్నాను. నీరు గడ్డకట్టినప్పటికీ రేసును ఒక వేడుకలా భావించాను. కోల్డ్‌వాటర్‌లో 42 నిమిషాలు ఈదాను.

– సయామీ ఖేర్

లీగల్

వారికి కూడా మీతో సమానమైన వాటా వస్తుంది

నా భార్యతో విడాకులు తీసుకున్నాను. నా ఇద్దరు పిల్లలూ తల్లి వద్దనే ఉంటారు. మా తండ్రి గారు ఇటీవలే చనిపోయారు. ఆయన ద్వారా నాకు వచ్చిన ఆస్తిలో నా పిల్లలకి వాటా ఇవ్వాల్సి వస్తుందా?

– శరత్ కుమార్, రాజమండ్రి

మీ తండ్రి నుంచి మీకు సంక్రమించిన ఆస్తి ఆయన స్వార్జితమై ఉండి, వీలునామా ప్రకారం మీకు సంక్రమించి ఉంటే, సదరు ఆస్తిలో మీకు తప్ప మరెవరికీ ఎటువంటి హక్కూ ఉండదు. మీ తదనంతరం వీలునామా రాయకపోతే మాత్రమే పిల్లలకి చెందుతుంది. మీ తండ్రిగారు ఒకవేళ వీలునామా రాయకుండా మరణించినట్లయితే తన స్వార్జితం మొత్తం క్లాస్-1 వారసులు; అంటే చనిపోయిన వ్యక్తి సంతానానికి (ఎంత మంది ఉంటే అన్ని భాగాలు), భార్యకి – తల్లిగారికి సమానమైన హక్కు ఉంటుంది.

అలాకాకుండా మీ తండ్రి గారికి వారి పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి అయి వుంటే, కేవలం అలాంటి పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తి వరకు మాత్రమే మీ పిల్లలకు హక్కు ఉండే అవకాశం ఉంది. అలాంటి సందర్భంలో మీ పిల్లలు మీ వద్ద ఉంటున్నారా లేక వాళ్ల అమ్మతోనే ఉంటున్నారా అనేది అప్రస్తుతం. అలాగే మీ తండ్రి గారికి ఒకవేళ మీతోపాటు ఇతర సంతానం అంటే మీ అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు, మీ అమ్మగారు, అలాగే మీ తండ్రిగారి తల్లిగారు (మీ నాయనమ్మ) ఉంటే వారికి కూడా మీతోపాటు సమానమైన వాటా లభిస్తుంది.

స్త్రీల హక్కులను గౌరవిస్తూ వారికి రావలసిన న్యాయమైన వాటాని స్వచ్ఛందంగా ఇచ్చే పురుషులు తక్కువే! అందుకని తమ న్యాయమైన వాటా కోసం వేల సంఖ్యలో స్త్రీలు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. 'తనకు పెళ్లి చేసేటప్పుడు కట్నం ఇచ్చాము, కాబట్టి అక్కాచెల్లెళ్లకు ఇచ్చేది ఏమీ లేదు' అనే ధోరణి సాధారణంగా కనిపిస్తూ ఉంటుంది. అది తప్పు! హిందూ వారసత్వ చట్టం 2005 సవరణ తర్వాత కొడుకులకు-కూతుళ్లకు ఆస్తిలో సమానమైన హక్కు ఉంటుంది. ఒకవేళ మీకు గనక అక్క చెల్లెళ్లు ఉంటే వారికి చెందవలసిన న్యాయమైన వాటా అడగకముందే వారికి ఇచ్చేయండి. మీ పిల్లలకి మీ స్వార్జితం – మీ తండ్రిగారి స్వార్జితం ఇవ్వాలి అని నిబంధన లేదు కానీ, వారు మైనర్లు అయితే మాత్రం వారికి చట్టరీత్యా మీనుంచి మెయింటెనెన్స్ పొందే హక్కు ఉంటుంది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

● హాబీ

రేకులు విప్పిన కలువ కొలనైంది

లతిక సుధాన్ ఇల్లు కలువల కొలను. కమలాల సరస్సు. ఇంటి చుట్టూ నీరు, నీటిలో తేలుతూ పూలు. ఒకటి కాదు, రెండు కాదు. వంద రకాల కమలాలు, ఎనభై రకాల కలువలు వికసించిన సుమనిలయం ఆమె ఇల్లు. వాటిలో ఒకటి అత్యంత అరుదైన వెయ్యి రేకుల కమలం. ఇవన్నీ ఆమెకు చక్కటి ఆదాయ వనరుగా కూడా మారాయి. నెలకు నలభై వేల రాబడినిస్తున్నాయి. లోటస్ ప్రెన్యూర్ అనే గుర్తింపును తెచ్చాయి. విశ్రాంత జీవితాన్ని ఇంత సుగంధ భరితం చేసుకున్న లతిక ఒక స్కూల్ టీచర్. ఉద్యోగ బాధ్యతల్లో నిమగ్నమైన ఉన్నన్ని రోజులూ తనకిష్టమైన మొక్కల పెంపకం అభిరుచిని పక్కన పెట్టాల్సి వచ్చింది. రిటైర్ అయిన తర్వాత ఆమె తన హాబీకి మొగ్గ తొడిగింది.



మొక్కలకు దూరంగా ఇరవై ఏళ్లు

లతిక సుధాన్‌ది కేరళ రాష్ట్రం, త్రిశూర్. 'చిన్నప్పుడు మొక్కలతోనే ఎక్కువ సమయం గడిపేదాన్ని. కమలం విచ్చుకోవడాన్ని ఆసక్తిగా చూసేదాన్ని. ఒక్కో రెక్క విచ్చుకుంటూ ఉంటే అబ్బురంగా అనిపించేది. చదువు, పెళ్లి, ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగంతో ఇరవై ఏళ్ల పాటు మొక్కలకు దూరమయ్యాను. ఉద్యోగం నుంచి 2018లో రిటైరయ్యాను. అప్పటి నుంచి ఇక మొక్కల మధ్య సీతాకోక చిలుకనయ్యాను. ప్రపంచంలో ఉన్న కలువలు, కమలాల జాతుల మీద ఒక అధ్యయనమే చేశాను. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మొక్కలు తెచ్చి పెంచాను. అలాగే థాయ్‌లాండ్, వియత్నాం, జపాన్ దేశాల నుంచి కూడా తెప్పించుకున్నాను. పెంపకంలో మెళకువలు నేర్చుకోవడానికి అనేక వర్క్‌షాపులకు హాజరయ్యాను. వ్యవసాయాభివృద్ధి శాఖ నిర్వహించే సదస్సులకు వెళ్లి నిపుణుల సూచనలను తెలుసుకున్నాను' అన్నారు లతిక.



మొక్కల పాఠాలు

కమలాలు, కలువల్లో అరుదైన జాతులను సేకరించడం, వాటి పెంపకం గురించి మెళకువలు తెలుసుకోవడంతో ఆ మొక్కల పెంపకం గురించి ఉపన్యసించగలిగినంత పట్టు సాధించారు లతిక. పిల్లలకు పాఠాలు చెప్పిన ఆమె అనుభవం ఇప్పుడు మొక్కల పాఠాలు చెప్తిస్తోంది. ఈ పూల గురించి ఒక్క సందేహం వ్యక్తం చేస్తే చాలు... అనర్గళంగా వివరిస్తుంది. కమలాలు, కలువల మొక్కలు, గింజల కోసం హాస్పిటల్, హోటల్, రిసార్టుల నుంచి భారీ మొత్తంలో ఆర్డర్లు వస్తుంటాయి. హాబీగా మొదలైన కమలాల పెంపకం మంచి లాభాలనిస్తూ ఆమెకు స్థానికంగా లోటస్ ప్రెన్యూర్ అనే గుర్తింపును కూడా ఇచ్చింది.

బ్యూటిప్స్

కురుల మృదుత్వానికి...



● బాగా మగ్గిన అరటిపండును గుజ్జులా చేసి, దాంట్లో గుడ్డులోని తెల్లసొన వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి, అరగంట ఉంచాలి. తర్వాత వెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఈ మిశ్రమం కురులకు సహజసిద్ధమైన కండిషనర్‌లా ఉపయోగపడుతుంది.

● యాపిల్ సైడర్ వెనిగర్‌ను కప్పు నీటిలో కలపాలి. షాంపూతో తలస్నానం చేసిన తర్వాత ఆ నీటితో వెంట్రుకలను తడపాలి. ఈ మిశ్రమం జుట్టుకు మంచి కండిషన్‌ని ఇస్తుంది.

● మందార పువ్వులను మెత్తగా నూరి అందులో అలోవెరా జెల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని కురులకు పట్టించి, అరగంట తర్వాత కడిగేయాలి.

● యాంటీ ఏజింగ్ ట్రీట్‌మెంట్

సమస్యలు కొనితెచ్చుకుంటున్నారా?



డెర్మోరెక్సియా... ఈ పదంలో డెర్మో ఉంది, కానీ ఇది చర్మ సమస్య కాదు. మానసిక సమస్య. ఒకరకంగా అనెరొక్సియా వంటిదే. సాధారణ బరువుతో ఉన్నప్పటికీ లావుగా ఉన్నామనే భ్రాంతికి లోనవుతూ సన్నబడాలనే ఆకాంక్షతో ఆహారం తినకుండా దేహాన్ని క్షీణింపచేసుకోవడమే అనెరొక్సియా. ఇక డెర్మోరెక్సియా అనేది చర్మం అందంగా, యవ్వనంగా, కాంతులీనుతూ ఉండాలనే కోరికతో విపరీతంగా క్రీములు వాడుతూ చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీసుకోవడమే డెర్మోరెక్సియా. ఇటీవల మధ్య వయసు మహిళల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

ఆత్మవిశ్వాసానికి అందం కొలమానం కాదు!

'అందం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది' అనే ప్రచారమే పెద్ద మాయ. సౌందర్య సాధనాల మార్కెట్ మహిళల మీద విసిరిన ఈ వల దశాబ్దాలుగా సజీవంగా ఉంది, ప్రాసంగిక అంశంగానే కొనసాగుతోంది. ఈ తరం మధ్య వయసు మహిళ ఈ మాయలో పూర్తిగా మునిగిపోయిందనే చెప్పాలి. వార్ధక్య లక్షణాలను వాయిదా వేయడానికి, ముఖం మీద వార్ధక్య ఛాయలను కనిపించకుండా జాగ్రత్తపడడానికి యాంటీ ఏజింగ్ క్రీములను ఆశ్రయించడం ఎక్కువైంది. ఒక రకం క్రీము వాడుతూండగానే మరోరకం క్రీమ్ గురించి తెలిస్తే వెంటనే ఆ క్రీమ్‌కు మారిపోతున్నారు. వీటి కోసం ఆన్‌లైన్‌లో విపరీతంగా సెర్చ్ చేస్తున్నారు. క్రమంగా ఇది కూడా ఒక మానసిక సమస్యగా పరిణమిస్తోందని చెబుతున్నారు లండన్ వైద్యులు.

క్రీమ్‌ల వాడకం తగ్గాలి!

లుకింగ్ యూత్‌ఫుల్, ఫ్లాలెస్ స్కిన్ కోసం, గ్లాసీ స్కిన్ కోసం అంటూ ప్రచారం చేసుకునే క్రీమ్‌లను విచక్షణ రహితంగా వాడుతూ యాక్నే, ఎగ్జిమా, డర్మటైటిస్, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. గాఢత ఎక్కువగా ఉన్న గ్లైకోలిక్ యాసిడ్, నియాసినామైడ్, రెటినాల్, సాలిసైలిక్ యాసిడ్, అల్ఫా హైడ్రాక్స్ యాసిడ్స్ చర్మానికి హాని కలిగిస్తున్నాయి. అలాగే చర్మం మీద మృతకణాలను తొలగించడానికి చేసే ఎక్స్‌ఫోలియేషన్ విపరీతంగా చేయడం వల్ల చర్మం మరీ సున్నితమైపోతోంది. కళ్లచుట్టూ ఉండే చర్మం మీద ఈ క్రీమ్‌లను దట్టంగా పట్టించడం వల్ల ఆర్బిటల్ ఏరియాలో ఉండే సన్నని సున్నితమైన రక్తనాళాలు పలుచబడి వ్యాప్తి చెందుతాయి. దాంతో కళ్ల కింద చర్మం ఉబ్బెత్తుగా మారుతుంది. డెర్మోరెక్సియాను గుర్తించే ఒక లక్షణం ఇది. డెర్మోరెక్సియాను నిర్ధారించే మరికొన్ని లక్షణాలిలా ఉంటాయి.

● చర్మం దురదగా ఉండడం, మంటగా అనిపించడం, ఎండకు వెళ్తే భరించలేకపోవడం

● తరచూ చర్మ వ్యాధి నిపుణులను కలవాల్సి రావడం, ఎన్ని రకాల చికిత్సలు తీసుకున్నప్పటికీ సంతృప్తి కలగకపోవడం.

● చర్మం ఆరోగ్యంగా ఉన్నప్పటికీ తరచూ అద్దంలో చూసుకుంటూ అసంతృప్తికి లోనవడం. తళతళ మెరిసే గ్లాసీ స్కిన్ కోసం చర్మం మీద ప్రయోగాలు చేయడం

● షెల్ఫ్‌లో అవసరానికి మించి రకరకాల బ్యూటీ ప్రోడక్ట్స్ ఉన్నాయంటే డెర్మోరెక్సియాకు దారి తీస్తోందని గ్రహించాలి. మధ్య వయసు మహిళలే కాదు టీనేజ్ పిల్లల విషయంలో కూడా ఈ లక్షణం కనిపించవచ్చు. పేరెంట్స్ గమనించి పిల్లలకు జాగ్రత్తలు చెప్పాలి.

ఆ గీతను అర్థం చేసుకోవాలి

ఒక మనిషితో మాట్లాడుతున్నప్పుడు, ఆ సంభాషణ తాలూకు విషయమే ముఖ్యం. అంతే తప్ప వారి ముఖం ఎలా ఉంది అనేది పట్టించుకునే అంశం ఏ మాత్రం కాదు. అందం- ఆత్మవిశ్వాసం ఒకదానితో ఒకటి ముడివడి ఉంటాయనేది కొంతవరకే. ఆత్మవిశ్వాసానికి అందం గీటురాయి కానేకాదు. ఈ సన్నని గీతను అర్థం చేసుకోవాలి. సాధారణంగా వయసుతోపాటు దేహంలో మార్పు వస్తుంటుంది. ఆ మార్పు ప్రభావం చర్మం మీద కనిపిస్తుంటుంది. ఈ మార్పును స్వీకరించాల్సిందే. చర్మం కాంతిమంతంగా ఉండడం కోసం రసాయన క్రీములను ఆశ్రయించడం కంటే మంచి ఆహారం, వ్యాయామం, ఒత్తిడి లేని జీవనశైలి, మంచి నిద్ర ఉండేటట్లు చూసుకోవాలి.



– ప్రొఫెసర్ శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై,
హెచ్‌వోడీ, సైకియాట్రీ విభాగం,
కాకతీయ మెడికల్ కాలేజ్

ఓసీడీగా మారకూడదు

శరీరం అందంగా కనిపించట్లేదనే అసంతృప్తి వెంటాడుతూనే ఉండడం బాడీ డిస్‌మార్ఫోఫోబియా అనే మానసిక వ్యాధి లక్షణం. ముఖం క్లియర్‌గా, కాంతిమంతంగా కనిపించాలనే కోరిక మంచిదే. కానీ అది అబ్సెషన్‌గా మారడం ఏ మాత్రం హర్షణీయం కాదు. ఇది ఎంత తీవ్రమవుతుందంటే... అందంగా కనిపించడానికి రకరకాల ట్రీట్‌మెంట్‌లు తీసుకోవడం, ఏ ట్రీట్‌మెంట్ తీసుకున్నప్పటికీ, ఆ ట్రీట్‌మెంట్‌లో ఎంత మంచి ఫలితం వచ్చినప్పటికీ సంతృప్తి చెందకపోవడం, తీవ్రమైన అసంతృప్తితో, ఎప్పుడూ అదే ఆలోచనలతో మానసిక ఒత్తిడికి లోనుకావడం వంటి పరిణామాలకు దారి తీస్తుంది. మెదడు ఇదే ఆలోచనలతో నిండిపోయినట్లయితే కొంతకాలానికి ఆ సమస్యకు వైద్యం చేయాల్సి వస్తుంది.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



సిలిచ్ కొత్త చరిత్ర... 777వ ర్యాంక్‌తో బరిలోకి దిగి ఏటీపీ సింగిల్స్ టైటిల్ సొంతం

హాంగ్జౌ (చైనా): క్రొయేషియా టెన్నిస్ ప్లేయర్ మారిన్ సిలిచ్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్ చరిత్రలో కొత్త ఘనతను నమోదు చేశాడు. ఏటీపీ టైటిల్ నెగ్గిన అతి తక్కువ ర్యాంకింగ్ ప్లేయర్‌గా అతను గుర్తింపు పొందాడు. మంగళవారం ముగిసిన హాంగ్జౌ ఓపెన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో సిలిచ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అతను 7-6 (7/5), 7-6 (7/5)తో చైనాకు చెందిన జాంగ్ జిజెన్‌ను ఓడించి తన కెరీర్‌లో 21వ టైటిల్ గెలుచుకున్నాడు. హాంగ్జౌ ఓపెన్‌లో బరిలోకి దిగే సమయానికి సిలిచ్ ఏటీపీ ర్యాంక్ 777 కావడం విశేషం. 35 ఏళ్ల సిలిచ్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా ఇక్కడ ఆడే అవకాశం లభించింది. ఒకప్పుడు పురుషుల సింగిల్స్‌లో మంచి విజయాలతో టాప్ ఆటగాళ్లలో ఒకడిగా సిలిచ్ కొనసాగాడు. 2014లో తన ఏకైక గ్రాండ్‌స్లామ్ (యూఎస్ ఓపెన్) నెగ్గిన అతను ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్‌లలో రన్నరప్‌గా నిలిచాడు. 2018లో అతను వరల్డ్ నంబర్‌వన్ ర్యాంకును కూడా అందుకున్నాడు. గత కొంత కాలంగా గాయాలతో అతను చాలా వరకు ఆటకు దూరమయ్యాడు.

సమరానికి సై

మహిళల టి20 ప్రపంచకప్‌పై భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వ్యాఖ్య
మెగా టోర్నీ కోసం యూఏఈ బయలుదేరిన టీమిండియా


హర్మన్‌ప్రీత్
అమోల్ మజుందార్

ముంబై: గతంలో జరిగిన తప్పిదాలను ఈసారి పునరావృతం చేయబోమని... ఈసారి విజేత హోదాతో స్వదేశానికి తిరిగి వస్తామని భారత మహిళల టి20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వ్యాఖ్యానించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా అక్టోబర్ 3 నుంచి 20 వరకు జరగనున్న మహిళల టి20 ప్రపంచకప్ కోసం భారత మహిళల జట్టు మంగళవారం బయలుదేరింది. గత జూలైలో ఆసియా కప్‌లో రన్నరప్‌గా నిలిచాక మరే టోర్నీలో ఆడని టీమిండియా... బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ప్రత్యేక శిబిరంలో పాల్గొంది. గత కొన్నాళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడ కొనసాగిస్తున్న భారత మహిళల జట్టు ఐసీసీ టోర్నీల్లో మాత్రం విజేతగా నిలువలేకపోయింది. 2017 వన్డే ప్రపంచకప్, 2020 టి20 ప్రపంచకప్‌లలో ఫైనల్‌కు చేరిన భారత అమ్మాయిలు... రెండు పర్యాయాలు ఆస్ట్రేలియా చేతిలో ఓడి రిక్తహస్తాలతో వెనుదిరిగారు. వరల్డ్‌కప్‌లో సత్తా చాటేందుకు కఠోర సాధన చేశామని, సమరానికి సిద్ధంగా ఉన్నామని హర్మన్‌ప్రీత్ పేర్కొంది. ముఖ్యంగా చాన్నాళ్లుగా జట్టును ఇబ్బంది పెడుతున్న ఫీల్డింగ్, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టినట్లు వెల్లడించింది. జట్టు యూఏఈ బయలుదేరడానికి ముందు మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హెడ్ కోచ్ అమోల్ మజుందార్, చీఫ్ సెలెక్టర్ నీతూ డేవిడ్‌తో కలిసి హర్మన్‌ప్రీత్ పాల్గొంది.

అడ్డంకులు అధిగమిస్తాం...

'అత్యుత్తమ జట్టుతో ప్రపంచకప్ ఆడనున్నాం. జట్టులోని ప్లేయర్లందరూ చాలా కాలం నుంచి కలిసి ఆడుతున్నారు. మా మధ్య చక్కటి సమన్వయం ఉంది. గతేడాది టి20 ప్రపంచకప్‌లో సెమీ ఫైనల్లో ఓడాం. ఈసారి అడ్డంకులన్నీ అధిగమించి విజేతగా నిలవాలని అనుకుంటున్నాం. శిక్షణ సమయంలో బలహీనంగా ఉన్న అంశాలపై మరింత దృష్టి పెట్టాం. అన్ని రంగాల్లో రాటుదేలాం. ఆసియా కప్‌లో మెరుగైన ప్రదర్శనే చేశాం. కానీ మాది కాని రోజు ఒకటి ఎదురైంది. దీంతో ఫైనల్లో పరాజయం పాలయ్యాం. నేను ఇప్పటి వరకు చాలా ప్రపంచకప్‌లు ఆడాను. అయినా మొదటి సారి మెగా టోర్నీలో బరిలోకి దిగుతున్నట్లే అనిపిస్తోంది. ఉత్సాహంలో ఏమాత్రం తేడా లేదు. మేము ఏ జట్టునైనా ఓడించగలం. ఆస్ట్రేలియాకు కూడా తెలుసు... ప్రపంచంలో వారిని ఓడించే జట్టు ఏదైనా ఉంది అంటే అది టీమిండియానే' అని హర్మన్ వివరించింది. 2009 నుంచి ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్ నిర్వహిస్తుండగా... ఇప్పటి వరకు జరిగిన 8 మెగా టోర్నీల్లోనూ 35 ఏళ్ల హర్మన్‌ప్రీత్ కౌర్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.

స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ను నియమించాం: మజుందార్

ఆసియా కప్ ఫైనల్లో శ్రీలంక చేతిలో పరాజయం అనంతరం జట్టుకు ఎలాంటి శిక్షణ అవసరమో ఆలోచించి దాన్నే ప్రత్యేక శిబిరం ద్వారా అందించామని మహిళల జట్టు హెడ్ కోచ్ అమోల్ మజుందార్ అన్నాడు. 'జట్టుకు ముందు ఫీల్డింగ్, ఫిట్‌నెస్ శిక్షణ అందించాం. ఆ తర్వాత పది రోజుల పాటు నైపుణ్యాన్ని పెంపొందించడంపై దృష్టి పెట్టాం. అమ్మాయిల కోసం ప్రత్యేకంగా స్పోర్ట్స్ సైకాలజిస్ట్ ముగ్ధా బావ్రేను నియమించాం. ప్లేయర్ల సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు ఫీల్డింగ్‌ను మెరుగు పరచడంపై మరింత దృష్టి సారించాం. శిబిరంలో భాగంగా యోగా సెషన్‌లు, మానసిక దృఢత్వానికి సంబంధించిన శిక్షణ అందించాం. అన్నిటికి సిద్ధంగా ఉండే విధంగా ప్లేయర్లకు తర్ఫీదునిచ్చాం. వరల్డ్‌కప్‌లో భాగంగా పది రోజుల వ్యవధిలో ఐదు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అన్ని విభాగాలను సరిచూసుకున్నాం. టాపార్డర్‌లో ఆరుగురు మంచి బ్యాటర్లు ఉన్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కో శైలి అయినా... అందరి లక్ష్యం జట్టును గెలిపించడమే. వన్‌డౌన్‌లో ఎవరిని ఆడించాలనే దానిపై ఒక నిర్ణయానికి వచ్చాం. యూఏఈలో పరిస్థితులు భారత్‌ను పోలే ఉంటాయి. ఆరంభంలో అధిక బౌన్స్ ఉండే అవకాశం ఉంది' అని మజుందార్ అన్నాడు. షెడ్యూల్ ప్రకారం మహిళల టి20 ప్రపంచ కప్‌నకు బంగ్లాదేశ్ ఆతిథ్యమివ్వాల్సి ఉండగా.. అక్కడ రాజకీయ అనిశ్చితి నెలకొనడంతో వేదికను యూఏఈకి మార్చారు.

నిరీక్షణ ముగిసె...

37 ఏళ్ల వయసులో తొలి టైటిల్ నెగ్గిన భారత టెన్నిస్ ప్లేయర్ విజయ్ సుందర్ ప్రశాంత్
జీవన్ నెడుంజెళియన్‌తో కలిసి హాంగ్జౌ ఓపెన్‌లో పురుషుల డబుల్స్ టైటిల్ సొంతం


జీవన్
విజయ్

హాంగ్జౌ (చైనా): భారత టెన్నిస్ ప్లేయర్ విజయ్ సుందర్ ప్రశాంత్ తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. 19 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర దించుతూ తన కెరీర్‌లో తొలి అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. తమిళనాడుకు చెందిన 37 ఏళ్ల విజయ్ మంగళవారం ముగిసిన హాంగ్జౌ ఓపెన్ టోర్నీలో భారత్‌కే చెందిన తమిళనాడు ప్లేయర్ జీవన్ నెడుంజెళియన్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో టైటిల్‌ను దక్కించుకున్నాడు. గంటా 49 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో విజయ్-జీవన్ ద్వయం 4-6, 7-6 (7/5), 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో కాన్‌స్టన్‌టిన్ ఫ్రాంట్‌జెన్-హెండ్రిక్ జెబెన్స్ (జర్మనీ) జోడీని ఓడించింది. విజయ్-జీవన్‌లకు 52,880 డాలర్ల (రూ. 44 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. టైటిల్ గెలిచే క్రమంలో రెండో సీడ్, మూడో సీడ్ జోడీలను విజయ్-జీవన్ ఓడించడం విశేషం. 35 ఏళ్ల జీవన్‌కిది రెండో ఏటీపీ డబుల్స్ టైటిల్. 2017లో రోహన్ బోపన్నతో కలిసి జీవన్ చెన్నై ఓపెన్ టైటిల్‌ను సాధించాడు.



రన్నరప్ యూకీ-ఒలివెట్టి ద్వయం

చైనాలోనే జరిగిన చెంగ్డూ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో భారత ప్లేయర్ యూకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో యూకీ-ఒలివెట్టి జోడీ 4-6, 6-4, 4-10తో టాప్ సీడ్ సాడియో-ఫాబియన్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడింది. యూకీ-ఒలివెట్టిలకు 33,130 డాలర్ల (రూ. 27 లక్షల 70 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 150 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ సీజన్‌లో యూకీ-ఒలివెట్టి జోడీ స్విస్ ఓపెన్, మ్యూనిక్ ఓపెన్ టోర్నీల్లో డబుల్స్ టైటిల్స్‌ను సాధించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఫైనల్లో కమల్ చావ్లా



ఉలాన్‌బాటర్ (మంగోలియా): అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ప్రపంచ పురుషుల 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్ కమల్ చావ్లా ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో కమల్ చావ్లా 6-5 (48-0, 43-15, 12-39, 57-19, 0-52, 16-41, 28-37, 54-12, 71-0, 25-39, 32-30) ఫ్రేమ్‌ల తేడాతో రిచర్డ్ వెనోల్డ్ (జర్మనీ)పై గెలిచాడు. ఇదే టోర్నీలో 2017లో కమల్ చావ్లా ఫైనల్లో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు. నేడు జరిగే ఫైనల్లో పాకిస్తాన్ ప్లేయర్ అస్జాద్ ఇక్బాల్‌తో తలపడతాడు. రెండో సెమీఫైనల్లో అస్జాద్ ఇక్బాల్ 6-0 ఫ్రేమ్‌ల తేడాతో భారత ఆటగాడు మల్కీత్ సింగ్‌పై గెలిచాడు.



చెస్ ఒలింపియాడ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకాలు సాధించిన తమిళనాడు చెస్ గ్రాండ్‌మాస్టర్లు గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలిలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలిలకు రూ. 25 లక్షల చొప్పున ఆయన నగదు పురస్కారాన్ని చెక్ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్ర క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు.

గాయత్రి-ట్రెసా జోడీ శుభారంభం



మకావ్: మకావ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో మూడో సీడ్ గాయత్రి-ట్రెసా ద్వయం 15-21, 21-16, 21-14తో అకారి సాటో-మాయా టగుచి (జపాన్) జోడీపై గెలిచింది. గద్దె రుత్విక శివాని-సిక్కి రెడ్డి ద్వయం మహిళల డబుల్స్‌లో మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది. క్వాలిఫయింగ్ ఫైనల్ మ్యాచ్‌లో రుత్విక-సిక్కి జంట 21-15, 21-10తో చెయుంగ్ యాన్ యు-చు వింగ్ చి (హాంకాంగ్) ద్వయంపై నెగ్గింది. పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ ఆలాప్ మిశ్రా మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ ఫైనల్ మ్యాచ్‌లో ఆలాప్ 21-10, 24-22తో భారత్‌కే చెందిన ఆర్యమాన్ టాండన్‌ను ఓడించాడు. పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో భారత్ నుంచి శ్రీకాంత్, మిథున్, సమీర్ వర్మ, ఆయూశ్, శంకర్ ముత్తుస్వామి, చిరాగ్ సేన్ పోటీపడనున్నారు. మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో అనుపమ, తాన్యా హేమంత్, తస్నిమ్ మీర్, దేవిక సిహాగ్, ఇషారాణి బారువా బరిలో ఉన్నారు.

మెయిన్ 'డ్రా'కు రుత్విక-సిక్కి జంట



సినిమా


● 'విశ్వం' పోస్టర్

చిన్నారి తల్లీ.. కలకు భయపడకు

గోపీచంద్, కావ్యా థాపర్ జంటగా నటించిన చిత్రం 'విశ్వం'. శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు. దోనేపూడి చక్రపాణి సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 11న విడుదల కానుంది. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'మొండి తల్లి పిల్ల నువ్వు..' అంటూ సాగే పాటని విడుదల చేసింది చిత్రయూనిట్. 'మొండి తల్లి పిల్ల నువ్వు.. అడుగే తడబడితే.. ఇదిగో.. నీ వెనకే ఉంటానులే.. చిన్నారి తల్లి, కలకు భయపడకు.. ఎపుడూ.. నీ కునుకై ఉంటానులే' అంటూ ఈ పాట సాగుతుంది. శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించిన ఈ పాటని సాహితీ చాగంటి పాడారు. ''హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'విశ్వం'. ఇటీవల విడుదలైన తొలి పాట 'మొరాకో మగువా..' కి మంచి స్పందన వచ్చింది. 'తల్లి, కూతురు నేపథ్యంలో వచ్చే 'మొండి తల్లి పిల్ల నువ్వు..' పాట కథలోని భావోద్వేగాల లోతును తెలియజేస్తుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేవీ గుహన్.

రెండు సినిమాలూ బ్లాక్ బస్టర్ కావాలి
- విశ్వక్ సేన్


● సునీల్, దగ్గుబాటి సురేష్, ప్రేమ్ కుమార్, విశ్వక్ సేన్, కార్తీ

''కార్తీగారంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని మన తెలుగు హీరో అని చెప్పుకుంటాం. '96' సినిమాకి పెద్ద ఫ్యాన్‌ని. ప్రేమ్ కుమార్‌గారు నా కలల దర్శకుడు. వారిద్దరూ కలిసి చేసిన 'సత్యం సుందరం' సినిమాని ఈ 28న చూడండి. అలాగే 27న 'దేవర' చిత్రం చూడండి. ఈ రెండు సినిమాలూ పెద్ద బ్లాక్ బస్టర్ కావాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో శ్రీదివ్య కీలక పాత్రలో నటించిన చిత్రం 'సత్యం సుందరం'. సి.ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో సూర్య, జ్యోతిక నిర్మించిన ఈ సినిమా తెలుగులో ఈ నెల 28న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ- ''కొన్ని నెలల క్రితం కార్తీగారిని కలిసి, కథ చెప్పాను. ఆయన ఓకే చేయడమే మిగిలి ఉంది. 'సత్యం సుందరం' ట్రైలర్, టీజర్ చాలా నచ్చాయి. ఈ సినిమా చూడ్డానికి ఎదురు చూస్తున్నాను'' అన్నారు. ''యుగానికి ఒక్కడు' సినిమా చూసినప్పుడే కార్తీగారు నాకు చాలా నచ్చేశారు. నాకు ఇష్టమైన హీరోతో పని చేయడం హ్యాపీ. మా సినిమాని చూడండి'' అని శ్రీదివ్య తెలిపారు. ''ఆర్య, జగడం' సినిమాలతో నా కెరీర్‌ని తెలుగులో ప్రారంభించాను. ఆ తర్వాత తమిళ పరిశ్రమకు వెళ్లాను. ఈ నెల 28న అందరం థియేటర్స్‌లో కలుద్దాం'' అని పేర్కొన్నారు ప్రేమ్ కుమార్. ''చాలా హార్ట్‌ఫుల్‌గా తీసిన సినిమా 'సత్యం సుందరం'' అని నిర్మాత సురేష్ బాబు చెప్పారు. రచయిత, నటుడు రాకేందు మౌళి మాట్లాడారు.

గాయని సుశీలకు కలైజ్ఞర్ స్మారక అవార్డు


● పి.సుశీల

ప్రముఖ గాయని గాన కోకిల పి. సుశీలకు 'కలైజ్ఞర్ స్మారక కళా విభాగం స్పెషలిస్ట్' అవార్డును తమిళనాడు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. దివంగత డీఎంకే అధినేత కరుణానిధి పేరిట తమిళనాడు ప్రభుత్వం తమిళాభివృద్ధి విభాగం నేతృత్వంలో కలైజ్ఞర్ నినైవు కళై తురై విత్తగర్ అవార్డుని (కలైజ్ఞర్ స్మారక కళా విభాగం స్పెషలిస్టు లేదా నిపుణులు) ఒకరికి ప్రదానం చేయడానికి 2022లో నిర్ణయించారు. మొదటి అవార్డు తిరువారూర్ ఆరూర్దాస్‌కు దక్కింది. గత ఏడాది మొత్తం కరుణానిధి శత జయంతి ఉత్సవాలు జరగడంతో ఈ అవార్డుని 2023కుగాను మహిళా ప్రముఖురాలికి ప్రదానం చేయాలని నిర్ణయించారు. ఈ అవార్డుకు పి. సుశీలను ఎంపిక చేసింది కమిటీ. అలాగే తమిళ భాషాభివృద్ధి కోసం శ్రమిస్తున్న రచయిత, కవి మహ్మద్ మెహతాను కూడా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 30న తమిళనాడు ముఖ్యమంత్రి సీఎం స్టాలిన్ చేతులమీదుగా ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

- సాక్షి, చెన్నై.

థ్రిల్లింగ్ జటాధర


● సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా రూపొందనున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకుడు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్ బ్యానర్‌పై శివివన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ నిర్మించనున్న 'జటాధర' సెకండ్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ- ''జటాధర' కథ శాస్త్రీయత, పౌరాణిక అంశాల కలయికలో ఉంటుంది. ఈ రెండు ప్రపంచాలను ప్రేక్షకులు వెండితెరపై చూస్తున్నప్పుడు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. ప్రేరణ అరోరాగారితో కలిసి ఈ సినిమా కోసం ప్రయాణం చేయటం గొప్ప అనుభూతి. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే అంశాలు ఎన్నో ఈ సినిమాలో ఉంటాయి'' అని తెలిపారు. ''జటాధర' సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్‌ని హైదరాబాద్‌లో ప్రారంభిస్తాం. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఓ బాలీవుడ్ స్టార్ నటించనున్నారు. అలాగే ప్రతినాయకి పాత్రలో మరో బాలీవుడ్ నటి నటిస్తారు. 2025 శివరాత్రికి పాన్ ఇండియా ప్రేక్షకులను ఈ మూవీ అలరించనుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

కన్‌ఫ్యూజ్ అవ్వరు
- దర్శకుడు హసిత్ గోలి



''మగవారు గొప్పా? ఆడవారు గొప్పా? అనే గొడవ ఎప్పట్నుంచో ఉంది. ఎప్పటికీ ఉంటుంది. అలాగే లింగ వివక్ష కూడా ఉంది. ఈ రెండింటినీ మేళవించి ఓ కథ రెడీ చేస్తే బాగుంటుందని భావించి, కల్పిత కథగా 'శ్వాగ్' సినిమా తీశాం. తరతరాలుగా మగ - ఆడ గొడవలు ఎలా మారుతూ వస్తున్నాయి? అనే అంశాన్ని ఆసక్తికరంగా చూపించే ప్రయత్నం చేశాం'' అని దర్శకుడు హసిత్ గోలి అన్నారు. 'రాజ రాజ చోర' (2021) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'శ్వాగ్'. రీతూ వర్మ హీరోయిన్‌గా నటించారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో హసిత్ గోలి పంచుకున్న విషయాలు.

● నాలుగు తరాలకు చెందిన కథ ఇది. ప్రతి తరంలోనూ హీరోగా శ్రీవిష్ణుగారే కనిపిస్తారు. ఒక తరంలో భవభూతిగా, మరో తరంలో యయాతిగా, ప్రస్తుత తరంలో సింగాగా కనిపిస్తారు. కథ, గెటప్స్, క్యారెక్టర్స్ పరంగా ప్రేక్షకులు కన్‌ఫ్యూజ్ అవ్వరు. ఆ విధంగా మంచి స్క్రీన్ ప్లేని తయారు చేశాం.

● శ్రీవిష్ణు గెటప్స్ కోసం ప్రోస్థెటిక్ మేకప్ చేశాం. జాతీయ అవార్డు గ్రహీత రషీద్‌గారు చాలా కష్టపడ్డారు. మగజాతి ఉనికిని నిలబెట్టే వంశమే శ్వాగణిక వంశమని, అతను లేకపోతే మగవారు అందరూ బానిసలుగానే ఉండిపోతారనేది భవభూతి (శ్రీవిష్ణు పాత్ర) మహారాజు ఫీలింగ్. ఈ వంశానికి అపోజిట్‌లో మాతృస్వామ్యం డామినేటెడ్‌గా ఉంటుంది వింజామర వంశం. ఈ వంశంలో రుక్మిణీ దేవిగా రీతూ వర్మ ఉంటారు.

● ఓ సీరియస్ సబ్జెక్ట్‌నే వినోద పంథాలో చెప్పే ప్రయత్నం చేశాం. ఇంట్రవెల్ ఆడియన్స్‌ని ఆశ్చర్య పరుస్తుంది. సినిమాలో కొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి. 'ఏడు తరాల' నవలకు, మా 'శ్వాగ్'కు ఏ సంబంధం లేదు. ఇక నా తర్వాతి సినిమాని ఫ్యాంటసీ జానర్‌లో తీయాలనుకుంటున్నాను.

ఆ భయాన్ని గౌరవించాలి
- దర్శకుడు కొరటాల శివ



''మనిషికి ధైర్యం అవసరమే కానీ మితి మీరిన ధైర్యం మంచిది కాదు. అలాగే మనకు తెలియకుండానే మనలో భయం ఉంటుంది. ఆ భయాన్ని గౌరవించాలి. భయమే మనల్ని సరైన దారిలో ఉంచుతుంది. ఈ విషయాన్నే 'దేవర'లో గట్టిగా చెప్పాను'' అని దర్శకుడు కొరటాల శివ అన్నారు. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దేవర'. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ నిర్మించిన ఈ చిత్రం తొలిభాగం 'దేవర: పార్టు 1' ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో కొరటాల శివ చెప్పిన విశేషాలు..

● 'దేవర' కథను చెప్పినప్పుడు ఎన్టీఆర్‌గారు స్పందించిన తీరుతోనే నెక్స్ట్ లెవల్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఇది పూర్తిగా కల్పిత కథ. 'దేవర' కథను ఎన్టీఆర్‌గారితోనే అనుకున్నా. ఈ సినిమాలోని దేవర పాత్రకు మరొకర్ని అనుకున్నాననే వార్తల్లో నిజం లేదు (ఈ చిత్రంలోని తండ్రీకొడుకులు 'దేవర', 'వర' పాత్రలను ఎన్టీఆర్ చేశారు). చెప్పాలంటే... దేవర పాత్రను మించి వర పాత్ర ఉంటుంది. మాస్ హీరోగా ఎన్టీఆర్‌గారి ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకునే 'దేవర' కథ రాశాను. ఇక అల్లు అర్జున్‌గారితో నేను అనుకున్న కథ వేరు. 'దేవర'కు ఆ కథకు ఏమాత్రం సంబంధం లేదు.

● పాన్ ఇండియా అనేది నాకు తెలియదు. కానీ 'దేవర' పెద్ద కథ. సెకండ్ షెడ్యూల్ చిత్రీకరణ సమయంలో మూడు గంటల్లో 'దేవర' కథను చెప్పలేమని అర్థమైంది. దాంతో ఈ సినిమాను రెండు భాగాలుగా చెప్పాలనుకున్నాం. ఇదేదో వ్యాపారం కోసమో లేక సంచలనం కోసమో చేసింది కాదు. ఒక భాగంలో కథ చెప్పలేనప్పుడు రెండు భాగాల్లో చెప్పాలి. అయితే 'దేవర 3, దేవర 4' అంటూ ఏమీ లేవు.

● మనిషిలో భయం ఉండాలని 'దేవర' సినిమాతో చెప్పాలనుకున్నా. కానీ ఈ భయాన్ని నేను జాన్వీ కపూర్‌లో చూశాను. తన డైలాగ్ పేపర్స్‌ను వారం రోజుల ముందే కావాలని అడిగి మరీ జాన్వీ సాధన చేసేది. తొలి రోజు సెట్స్‌లో జాన్వీ కపూర్ అడుగుపెట్టి డైలాగ్స్ చెప్పగానే ఎన్టీఆర్ ఫెంటాస్టిక్ అన్నారు.

● ఓ సినిమాను ప్రమోట్ చేయడం, మార్కెటింగ్ చేసే విషయాల్లో రాజమౌళిగారిలా నాకు మంచి ప్రావీణ్యం లేదు. అందుకే ఈ విషయాన్ని నేను నిర్మాతలకే వదిలేస్తాను. దర్శకుడిగా నా పనికి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాను. ఇక 'దేవర' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు కావడం దురదృష్టకరం. టీమ్ అంతా వారి స్పీచ్‌ల స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకున్నారు. కానీ ఇంతలో అలా జరిగిపోయింది.

చిరంజీవిగారితో నా అనుబంధం ఎప్పుడూ బాగానే ఉంటుంది. మేం చేసిన 'ఆచార్య' ఆశించిన స్థాయిలో ఆడలేదు. 'యూ విల్ బౌన్స్ బ్యాక్ శివ' అని నాకు మెసేజ్ పంపిన తొలి వ్యక్తి చిరంజీవిగారు. అయితే ఆయన ఓ సందర్భంలో మాట్లాడిన మాటలకు మరో అర్థం వచ్చేలా వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. మనం ఒక పరీక్ష సరిగ్గా రాయకపోతే తర్వాతి పరీక్ష బాగా రాయాలనుకుంటాం. ఇదీ అంతే. 'ఆచార్య' చిత్రం ఏప్రిల్ 29న (2022) విడుదలైంది. వెంటనే మే 19న (2022) 'దేవర' మోషన్ పోస్టర్‌ని రిలీజ్ చేయాలని ఆ పనిలో పడిపోయాను. అయితే 'దేవర' షూటింగ్ సముద్రంపై చేయాలి. ఇందుకు ఎలా ప్రిపేర్ అవ్వాలని ఆలోచించుకుని, ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి, సినిమాను సెట్స్‌పైకి తీసుకు వెళ్లడానికి నాకు కాస్త ఎక్కువ సమయం పట్టింది.

సోషల్ మీడియా మాధ్యమం నుంచి నేను బయటకు వచ్చాను. మెల్లి మెల్లిగా సోషల్ మీడియా లేకపోతే మనం జీవించలేమా? అన్న ధోరణిలోకి వెళ్లిపోతున్నాం. అలాగే సోషల్ మీడియాలో నెగిటివిటీ పెరిగిపోయింది. నెగిటివిటీ ఉండొచ్చు... కానీ ద్వేషం కూడా విపరీతంగా పెరిగిపోయింది. ఇది మంచిది కాదు.

సాక్షి బిజినెస్
బుధవారం
25-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
15	1
84,914	25,940

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,065	△ 90
డోజోన్స్	42,106	▽ 19
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,283	△ 23
డాక్స్	18,997	△ 150
షాంఘై	2,863	△ 114
నికాయ్	37,941	△ 217

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.ల్లో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	74,764	△ 297
బంగారం (99.5 స్వచ్ఛత)	74,465	△ 296
వెండి (కేజీ)	88,402	△ 646

ఫారెక్స్ రేట్లు (రూ.ల్లో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.15	84.17
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.42	113.04
€	యూరో	ఎస్‌బీఐ	91.77	94.16
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.57	58.89
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.37	58.33
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.77	67.44
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.41	22.97
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.89	23.67
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.02	12.85

క్విక్ విస్తరణ!

- భారీగా డార్క్ స్టోర్లను ఏర్పాటు చేస్తున్న క్విక్ కామర్స్ సంస్థలు
- జోరుగా సిబ్బంది నియామకాలు..
- అధిక వేల్యుయేషన్లు, పెట్టుబడుల వెల్లువతో జోష్
- కిరాణాతో పాటు కార్ట్‌లోకి ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ ప్రొడక్టులు

క్విక్ కామర్స్ కంపెనీలకు దండిగా నిధులు లభిస్తుండటంతో విస్తరణ జోరు పెంచాయి. నగరాల్లో ఈ మోడల్ మంచి సక్సెస్ సాధించడంతో జెప్టో, బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్ బాస్కెట్ తదితర సంస్థలు డార్క్ స్టోర్ల సంఖ్యను భారీగా పెంచడంపై దృష్టి పెడుతున్నాయి. కిరాణాతో మొదలు పెట్టిన కంపెనీలు ఇప్పుడు నెమ్మదిగా ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, మేకప్, టాయ్స్ వంటి ఇతర ప్రొడక్టులను కూడా కార్ట్‌లోకి చేర్చుతున్నాయి. అయితే, బడా నగరాల్లో ఈ మైక్రో వేర్‌హౌస్‌ల కోసం స్థలాల వేట కష్టతరంగా మారుతోందని పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. సమీపంలోని ప్రాంతాలకు 30 నిమిషాల్లోపే ఆర్డర్లను డెలివరీ చేయడానికి వీలుగా ఏర్పాటు చేసే చిన్న స్థాయి గోడౌన్లను డార్క్ స్టోర్లుగా పేర్కొంటారు. కిక్కిరిసిన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలంటే భారీ ఖర్చుతో కూడిన వ్యవహారం. అయినప్పటికీ కంపెనీలు తగ్గేదేలే అంటున్నాయి. మరోపక్క, రోజువారీ కార్యకలాపాల నిర్వహణ, క్విక్ డెలివరీ విషయంలో లోటుపాట్లు లేకుండా చూసేందుకు భారీ స్థాయిలో సిబ్బంది నియామకాలతో ఈ రంగంలో హైరింగ్ కళకళలాడుతోంది.

చిన్న నగరాల్లో స్పీడ్..

నగరాల్లోని కిక్కిరిసిన ప్రాంతాల్లో డార్క్ స్టోర్ల ఏర్పాటు సవాలుగా మారుతోందని జెప్టో సీఈఓ ఆదిత్ పలీచా చెబుతున్నారు. గత రెండు నెలల్లోనే బిలియన్ డాలర్లను (దాదాపు రూ.8,400 కోట్లు) సమీకరించడంతో కంపెనీ విలువ 5 బిలియన్ డాలర్లకు చేరుకుంది. కాగా, చండీగఢ్, భువనేశ్వర్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వేగంగా స్థలాలు దొరుకుతుండటంతో అక్కడ విస్తరణ స్పీడ్ పెంచుతున్నామని పలీచా పేర్కొన్నారు. 'ఈ రంగంలోకి నిధులు పుష్కలంగా వస్తున్నాయని పసిగట్టిన స్థిరాస్తి యజమానులు అద్దెలు భారీగా పెంచేస్తున్నారు. కొన్నిచోట్ల పోటీ కారణంగా బిడ్డింగ్‌లో పాల్గొనాల్సి వస్తోంది' అని పలీచా వివరించారు. జొమాటో బ్లింకిట్ సైతం భటిండా, హరిద్వార్, విజయవాడ వంటి నగరాల్లో అడుగుపెట్టింది. కస్టమర్లకు వేగంగా సేవలదించేలా డార్క్ స్టోర్ల సైజును కంపెనీలు పెంచుతున్నాయి. గతంలో సగటున 2,500 చదరపు అడుగులున్న ఈ స్టోర్ సైజు 4,000–5,000 చ.అ.కు పెరిగింది. కొన్నిచోట్ల 10,000 చ.అ., మరికొన్ని చోట్ల ఏకంగా 25,000 చ.అ. డార్క్ స్టోర్లు కూడా ఏర్పాటవుతుండటం ఈ రంగంలో జోరుకు నిదర్శనం.

'అమ్మతోడు అరగంటలోపే డెలివరీ చేసేస్తాం'
క్విక్ కామర్స్ దిగ్గజం జెప్టో స్లోగన్ ఇది!

ఇందుకు తగ్గట్టుగానే శరవేగంగా దూసుకెళ్తున్న క్విక్ కామర్స్ రంగంలో కంపెనీలు నువ్వానేనా అనేలా తలపడుతున్నాయి. బంపర్ వేల్యుయేషన్లతో ఈ రంగంలోకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటంతో సేవలను 'క్విక్'గా విస్తరించేందుకు పోటీ పడుతున్నాయి. సిబ్బంది నియామకాలతో పాటు డార్క్ స్టోర్ల సంఖ్య, సైజును కూడా భారీగా పెంచుకుంటున్నాయి. దీంతో కస్టమర్లకు మరిన్ని ఉత్పత్తులు లభించడంతో పాటు మరింత వేగంగా సేవలు లభించేందుకు దోహదం చేస్తోంది.



రూ. 300-500
సగటు ఆర్డర్ విలువ
(గతంలో ఇది 200-250గా ఉండేది)

4,000 చ. అ.
డార్క్ స్టోర్ ప్రస్తుత సగటు సైజు (అంతక్రితం 2,500 స్థాయిలో ఉండేది). కొన్ని ఏరియాల్లో 10,000 చ. అ. స్టోర్లు కూడా ఉన్నాయి.

మార్కెట్ పరిమాణం (జీఎంవీ)...

జీఎంవీ - స్థూల అమ్మకాల విలువ — బిలియన్ డాలర్లలో

	2023	2027
రిటైల్	854	1,283
ఈకామర్స్	65	132
క్విక్ కామర్స్	2.8	22

హైరింగ్.. ఫుల్ స్వింగ్

'క్విక్' విస్తరణ నేపథ్యంలో సిబ్బంది డిమాండ్ తారస్థాయికి చేరుకుంది. 'ఈ రంగంలో అన్ని విభాగాల్లోనూ హైరింగ్ ఫుల్ స్వింగ్‌లో నడుస్తోంది. ఐదు ప్రధాన కంపెనీలు అగ్ర స్థానం కోసం పోటీ పడుతుండటమే దీనికి ప్రధాన కారణం. ప్రధానంగా లాజిస్టిక్స్ ఇక్కడ అత్యంత కీలక పాత్ర పోషిస్తుండటంతో ఇతర కంపెనీల్లోని నిపుణులైన ఉద్యోగులకు గాలం వేస్తున్నాయి' అని ఒక క్విక్ కామర్స్ సంస్థ చీఫ్ వెల్లడించారు. 'మినిట్స్' పేరుతో లేటుగా ఈ విభాగంలోకి అడుగుపెట్టిన ఫ్లిప్‌కార్ట్ కార్యకలాపాల వేగం పెంచేందుకు బిగ్‌బాస్కెట్ వంటి ఇతర కంపెనీల నుంచి చాలా విభాగాల్లో సిబ్బందిని భర్తీ చేసుకుంటున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మరోపక్క, బిగ్‌బాస్కెట్ సైతం పూర్తి స్థాయి క్విక్ కామర్స్ మోడల్‌లోకి మారే ప్రయత్నాల్లో ఉండటం విశేషం. ఫ్లిప్‌కార్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమితేశ్ ఝా ఇటీవలే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సీఈఓగా చేరారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో పాటు మధ్య స్థాయి మేనేజర్లకు డిమాండ్ నెలకొంది. క్యూ-కామర్స్‌లోని మార్కెటింగ్, ఆపరేషన్స్, సప్లయ్ చైన్, ఫైనాన్స్ ఇలా అన్ని విభాగాల్లోనూ వలసలు జోరందుకోవడం గమనార్హం. జెప్టో కూడా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, జొమాటో, స్విగ్గీ, ఓలా, అర్బన్ కంపెనీ తదితర కంపెనీల నుంచి కీలక సిబ్బందిని భారీగా నియమించుకుంటోంది. కంపెనీ ప్రధాన కేంద్రాన్ని బెంగళూరు నుంచి ముంబైకి మార్చే సన్నాహాల్లో ఉన్న జెప్టో.. 500 మంది ఎగ్జిక్యూటివ్‌ల వేటలో ఉన్నట్లు పలీచా తెలిపారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

రెండు హిట్.. ఒకటి ఫట్

- ఆర్కేడ్, నార్తర్న్ ఆర్క్ బంపర్ లిస్టింగ్
- వెస్టర్న్ క్యారియర్స్ బోణీ.. ఫ్లాట్

స్టాక్ ఎక్స్ఛేంజీల్లోకి మంగళవారం ఎంట్రీ ఇచ్చిన మూడు ఐపీఓల్లో రెండు భారీ లాభాలను పంచగా.. ఒకటి మాత్రం నష్టాలను మిగిల్చింది. బీఎస్ఈలో ఆర్కేడ్ డెవలపర్స్ ఇష్యూ ధర 128తో పోలిస్తే 37 శాతం ప్రీమియంతో 176 వద్ద లిస్టయింది. ఒకదశలో 48 శాతం ఎగసి రూ.190 స్థాయిని కూడా తాకింది. చివరికి 30 శాతం లాభంతో రూ.166 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,079 కోట్లకు చేరింది.

నార్తర్న్ ఆర్క్ 33 శాతం జంప్

ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ మెరిసింది. ఇష్యూ ధర రూ.263తో పోలిస్తే బీఎస్ఈలో 33 శాతం ప్రీమియంతో రూ.351 వద్ద బోణీ కొట్టింది. చివర్లో కొంత వెనక్కి తగ్గడంతో 23 శాతం లాభపడి రూ.324 వద్ద స్థిరపడింది. మార్కెట్ విలువ రూ.5,222 కోట్లను తాకింది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.777 కోట్లు సమీకరించింది.

నిరాశపరిచిన వెస్టర్న్ క్యారియర్స్...

లాజిస్టిక్స్ కంపెనీ వెస్టర్న్ క్యారియర్స్ ఇన్వెస్టర్లను నిరాశకు గురిచేసింది. కంపెనీ ఇష్యూ ధర రూ.172తో పోలిస్తే 1 శాతం నష్టంతో లిస్టయింది. ఇంట్రాడేలో 8 శాతం క్షీణించి రూ. 158 స్థాయికి తగ్గింది. చివరకు 7% నష్టంతో రూ.159 వద్ద ముగిసింది.

రామ్‌కో సిమెంట్స్‌కు సీఐఐ అవార్డు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సిమెంటు తయారీ దిగ్గజం రామ్‌కో సిమెంట్స్‌కి చెందిన జగ్గయ్యపేట ప్లాంటుకు ప్రతిష్టాత్మక 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫీషియెంట్ యూనిట్' పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన 25వ నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ 2024 కార్యక్రమంలో భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) దీన్ని అందజేసింది. మొత్తం 26 ఎంట్రీలను షార్ట్‌లిస్ట్ చేయగా, వాటిలో తమ ప్లాంటు ఈ అవార్డును దక్కించుకున్నట్లు రామ్‌కో సిమెంట్స్ తెలిపింది.

సెన్సెక్స్ @ 85,000

26,000 పాయింట్లను తాకిన నిఫ్టీ • తొలిసారి సరికొత్త మైలురాళ్లు



ముంబై: స్టాక్ మార్కెట్లో బుల్ రంకెలు కొనసాగుతున్నాయి. తొలిసారిగా సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 మైలురాళ్లను అధిగమించి సరికొత్త రికార్డులను సృష్టించాయి. అయితే, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లు సూచీలను వెనక్కిలాగడంతో ఆరంభ లాభాలను కోల్పోయి దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. ఆర్థిక మందగమనం నుంచి గట్టెక్కేందుకు చైనా ఉద్దీపన చర్యలు ప్రకటించడంతో మెటల్ షేర్లు మెరిశాయి. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ 235 పాయింట్లు, ఎగబాకి 85,163 గరిష్టా స్థాయిని తాకింది. లాభాల స్వీకరణతో 84,716 పాయింట్లకు తగ్గింది. చివరికి 15 పాయింట్ల నష్టంతో 84,914 వద్ద క్లోజైంది. దీంతో మూడు రోజుల రికార్డు పరుగులకు బ్రేక్ పడింది. ఇక నిఫ్టీ సైతం 72 పాయింట్లు ఎగసి 26,012 గరిష్టానికి చేరింది. తుదకు 1 పాయింటు లాభపడి 25,940 వద్ద ముగిసింది. కాగా, నిఫ్టీ ఇంట్రాడే, క్లోజింగ్‌లోనూ సరికొత్త ఆల్‌టైమ్ రికార్డే. మెటల్ సూచీ అత్యధికంగా 2.78% దూసుకెళ్లింది. సెయిల్, వేదాంత, ఎన్ఎండీసీ, హిందాల్కో, టాటా స్టీల్, నాల్కో 3–6% ఎగిశాయి. కాగా, ఫెడ్ రేటు కోత తర్వాత డాలరుతో పుంజుకున్న రూపాయి మారకం విలువ మళ్లీ పతనమైంది. 11 పైసలు నష్టపోయి 83.65 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

రూ.4 లక్షల కోట్ల కార్పొరేట్ రుణ డిమాండ్: ఎస్‌బీఐ చీఫ్	ఐపీఓల హవా

తెలుగు రాష్ట్రాల్లో మరో 28 స్టోర్స్

రామ్‌రాజ్ కాటన్ చైర్మన్ నాగరాజన్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కార్యకలాపాల విస్తరణలో భాగంగా వచ్చే ఏడాది ఆఖరు నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 28 స్టోర్స్ ప్రారంభించనున్నట్లు రామ్‌రాజ్ కాటన్ చైర్మన్ కేఆర్ నాగరాజన్ తెలిపారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 82 స్టోర్స్ ఉన్నాయని వివరించారు. తమ సంస్థ ఆదాయాల్లో తెలుగు రాష్ట్రాల వాటా సుమారు 25 శాతం ఉంటుందని, దీన్ని మరింత పెంచుకోవడంపై దృష్టి పెడుతున్నామని ఆయన చెప్పారు. తమ ఉత్పత్తులన్నీ అందుబాటులో ఉండేలా హైదరాబాద్‌లో భారీ షోరూం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణాది మొత్తం మీద 300 స్టోర్స్ ఉండగా, మూడేళ్ల వ్యవధిలో మరో 200 ఏర్పాటు చేయనున్నట్లు నాగరాజన్ వివరించారు. తయారీ ప్లాంట్ సామర్థ్యాల విస్తరణపై అయిదేళ్లలో రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు చెప్పారు. కాగా, స్వదేశీ దుస్తులు, ఉత్పత్తులకు ప్రాధాన్యమిచ్చే ధోరణులు అన్నివర్గాల్లోనూ, యువతలోను కూడా పెరగాలని, అప్పుడే దేశం మరింత వేగవంతంగా వృద్ధి చెందగలదని నాగరాజన్ తెలిపారు. ఈ ఆలోచనతోనే నాలుగు దశాబ్దాలకు పైగా కార్యకలాపాలు సాగిస్తున్నామన్నారు. చేనేతకారులపై అభిమానం, ధోవతిని ధరించే తనకు ఎదురైన అవమానాలే స్ఫూర్తితో సంస్థను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పీఎస్‌యూ కొలువుకు గేట్ పిలుపు

గేట్.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్! ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ వంటి ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి గేట్ స్కోర్ తప్పనిసరి! దీంతో బీటెక్ విద్యార్థులు గేట్‌లో బెస్ట్ స్కోర్ కోసం ఇంజనీరింగ్ మూడో ఏడాది నుంచే ప్రిపరేషన్ సాగిస్తుంటారు. మరోవైపు గేట్ స్కోర్‌తో మహారత్న, నవరత్న, మినీరత్న హోదా పొందిన ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో ఉద్యోగాలు సైతం సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. గేట్-2025 వివరాలు, ఈ పరీక్షతో పీఎస్‌యూల్లో ఉద్యోగాలపై సమగ్ర కథనం..



» గేట్ స్కోర్‌తో పీఎస్‌యూల్లో నియామకాలు
» నవరత్న, మహారత్న, మినీరత్న సంస్థల్లో ఉద్యోగాలు
» మలి దశ ప్రక్రియపై అవగాహనతో కొలువు సులువు
» దరఖాస్తులకు చివరి తేది: 2024, సెప్టెంబర్ 26
» 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో గేట్ పరీక్ష

ప్రభుత్వ కొలువు దేశంలోని ఎక్కువ మంది యువత లక్ష్యం. ఇటీవల కాలంలో ఇంజనీరింగ్, టెక్నాలజీ వంటి ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు సైతం బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా నిర్వహించే ప్రభుత్వ నియామక పరీక్షలకు పోటీ పడుతున్నారు. అలాంటి వారికి అందుబాటులో ఉన్న మరోమార్గం.. గేట్. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు గేట్ స్కోర్ ఆధారంగా ఎంట్రీ లెవల్‌లో ఇంజనీర్స్ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయి. కాబట్టి బీటెక్ అభ్యర్థులు తమ డొమైన్ నాలెడ్జ్‌ను పెంచుకుంటూ గేట్‌కు ప్రిపరేషన్ సాగిస్తే.. ఒకే సమయంలో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలను అందుకునే అవకాశం లభిస్తుంది.

గేట్-2025కు అర్హతలు

బీటెక్ ఉత్తీర్ణులు, ప్రస్తుత విద్యా సంవత్సరం (2024–25)లో బీటెక్, ఇతర గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు మూడు, నాలుగు సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు సైతం గేట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

త్వరలో పీఎస్‌యూ నోటిఫికేషన్లు

గేట్ స్కోర్ ఆధారంగా నియామకాలు చేపడుతున్న ఓఎన్‌జీసీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్, హెచ్‌పీసీఎల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, కోల్ ఇండియా లిమిటెడ్, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తదితర పీఎస్‌యూలు త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వనున్నాయి. గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తాయి. ఆ తర్వాత ఆయా పీఎస్‌యూలు తమ సొంత ఎంపిక ప్రక్రియ చేపడుతున్నాయి.

మలిదశ ఎంపిక

- గేట్ స్కోర్ ఆధారంగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసే క్రమంలో పీఎస్‌యూలు రెండంచెల విధానాన్ని అమలు చేస్తున్నాయి. అవి.. గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ. తుది జాబితా ఖరారులో వీటికి వెయిటేజీ ఇస్తున్నాయి.
- గేట్ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ, తర్వాత దశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్/ గ్రూప్ టాస్క్‌లకు గరిష్టంగా పది శాతం; పర్సనల్ ఇంటర్వ్యూకు 15 శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నాయి. మరి కొన్ని పీఎస్‌యూలు గేట్ స్కోర్‌కు 60 నుంచి 65 శాతం వెయిటేజీ ఇస్తూ.. మిగతా మొత్తాన్ని జీడీ/పీఐలకు కేటాయిస్తున్నాయి.

గ్రూప్ డిస్కషన్

పీఎస్‌యూలు గేట్ స్కోర్‌తో చేపట్టే ఎంపిక ప్రక్రియలో భాగంగా ముందుగా గ్రూప్ డిస్కషన్‌ను నిర్వహిస్తున్నాయి. ఇందులో అభ్యర్థుల భావ వ్యక్తీకరణ నైపుణ్యం, సమకాలీన, సాంకేతిక అంశాలపై వారికున్న పరిజ్ఞానాన్ని పరిశీలిస్తారు. జీడీలో నిర్దిష్ట సంఖ్యలో అభ్యర్థులను వేర్వేరు బృందాలు (టీమ్స్)గా ఏర్పరుస్తాయి. ఒక్కో టీమ్‌లో అయిదు నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. ఆయా టీమ్‌కు ఏదైనా ఒక అంశం ఇచ్చి ప్రతి అభ్యర్థి మాట్లాడాలని సూచిస్తారు. ప్రతి అభ్యర్థికి సగటున అయిదు నుంచి ఆరు నిమిషాల సమయం లభిస్తుంది.

గ్రూప్ టాస్క్

పీఎస్‌యూలు ఎంపిక ప్రక్రియలో భాగంగా కొన్ని సందర్భాల్లో గ్రూప్ డిస్కషన్ బదులు గ్రూప్ టాస్క్‌ను నిర్వహిస్తున్నాయి. గ్రూప్ టాస్క్ అంటే.. నిర్దిష్టంగా ఒక వాస్తవ సమస్యను అభ్యర్థుల ముందుంచి.. పరిష్కారం కనుక్కోవాలని సూచిస్తారు. వీటిని కూడా అభ్యర్థులు టీమ్‌లుగా ఏర్పడి పరిష్కరించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇవి అభ్యర్థుల డొమైన్ టాపిక్స్‌కు సంబంధించినవిగా ఉంటాయి. దీని ద్వారా అభ్యర్థుల ప్రాక్టికల్ నైపుణ్యాలు తెలుసుకోవడమే కాకుండా.. సమస్యా పరిష్కార సామర్థ్యాన్ని అంచనా వేస్తారు.

చివరి దశ.. ఇంటర్వ్యూ

గేట్ స్కోర్ ఆధారంగా నియామక ప్రక్రియలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ. గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, టెక్నికల్ నాలెడ్జ్‌లను పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. బీటెక్‌లో చేసిన ప్రాజెక్ట్ వర్క్స్, మినీ ప్రాజెక్ట్స్, ఇంటర్న్‌షిప్స్‌తో అభ్యర్థులు సొంతం చేసుకున్న నైపుణ్యాలు తెలుసుకునే యత్నం చేస్తారు. దీంతో పాటు వ్యక్తిగతంగా సదరు పోస్ట్‌లకు సరిపడే ఆప్టిట్యూడ్, ఆటిట్యూడ్ అంచనా వేస్తారు. దరఖాస్తు చేసుకున్న పోస్ట్ పట్ల, సంస్థ పట్ల ఆసక్తికి కారణం, భవిష్యత్తు లక్ష్యాలు? వంటి ప్రశ్నలు అడుగుతున్నారు. అభ్యర్థుల సమాధానాలతో సంతృప్తి చెందితే.. అంతకుముందు దశల్లో పొందిన వెయిటేజీని, పర్సనల్ ఇంటర్వ్యూ వెయిటేజీని క్రోడీకరించి తుది జాబితాలో పేరు ఖరారు చేస్తారు.

కటాఫ్ నిబంధన

గేట్ స్కోర్ ఆధారంగా దరఖాస్తులు కోరుతున్న పీఎస్‌యూలు నిర్దిష్ట కటాఫ్ నిబంధనలను అమలు చేస్తున్నాయి. అందుబాటులో ఉన్న పోస్టుల సంఖ్య, వచ్చిన దరఖాస్తుల ఆధారంగా కటాఫ్‌ను నిర్ణయిస్తున్నాయి. గత రెండేళ్లుగా పీఎస్‌యూలకు దరఖాస్తు చేస్తున్న అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. దీంతో గేట్ స్కోర్ కటాఫ్ సైతం పెరుగుతూ వస్తోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024,సెప్టెంబర్ 26
- ఆలస్య రుసుముతో చివరి తేదీ: 2024, అక్టోబర్ 7
- అడ్మిట్ కార్డ్ నదుపాయం: 2025, జనవరి 2
- గేట్ పరీక్ష తేదీలు: 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీలు
- ఫలితాల వెల్లడి: 2025 మార్చి 19
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://gate2025.iitr.ac.in

గేట్ పరీక్ష ఇలా

గేట్-2025 పరీక్ష ఆన్‌లైన్ విధానంలో మొత్తం వంద మార్కులకు ఉంటుంది. రెండు విభాగాలుగా 65 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్-1లో జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగానికి 15 మార్కులు కేటాయిస్తారు. ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్‌కు 13 మార్కులు ఉంటాయి. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌తో పార్ట్-బిని నిర్వహిస్తారు. ఈ విభాగంలో 72 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

మంచి స్కోర్‌కు మార్గాలివే

పీఎస్‌యూలలో ఇంజనీర్ ట్రైనీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంటి ఉద్యోగ నియామకాలకు కీలకంగా నిలుస్తున్న గేట్‌లో బెస్ట్ స్కోర్ కోసం అభ్యర్థులు వ్యూహాత్మకంగా ప్రిపరేషన్ సాగించాలి. ఇందుకోసం తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌లో బేసిక్స్ నుంచి అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ వరకు పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతి టాపిక్‌ను చదివేటప్పుడు అందులోని ప్రశ్నార్హమైన అంశాలను గుర్తించడంతోపాటు దానికి సంబంధించి ప్రాథమిక భావనలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి. గేట్ సిలబస్‌ను అకడమిక్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. వీక్లీ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి.

టైమ్ ప్లాన్

గేట్ అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లోని టాపిక్స్, వాటికి గత అయిదారేళ్లుగా పరీక్షలో లభిస్తున్న వెయిటేజ్, అకడమిక్‌గా ఉన్న ప్రాధాన్యాన్ని అనుసరిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారానికి ప్రిపరేషన్ పూర్తి చేసుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఆ తర్వాత ఉన్న వ్యవధిలో ఆన్‌లైన్ మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరయ్యే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఇలా ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తే పరీక్షలో మంచి స్కోర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.



ఇండియన్ నేవీలో 250 ఎస్ఎస్‌సీ ఆఫీసర్ పోస్టులు

ఎజిమల(కేరళ)లోని ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో.. జూన్-2025 నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 250.
» **పోస్టుల వివరాలు:** జనరల్ సర్వీస్(జీఎస్-ఎక్స్/హైడ్రో క్యాడర్)-56,పైలట్-24,నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్(ఎయిర్ క్రూ)-21, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్-20,లాజిస్టిక్స్-20,నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్-16, ఎడ్యుకేషన్-15, ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)-36, ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్)-42.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీకాం, బీఈ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100, ఇతర అలవెన్సులు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు,ఇంటర్వ్యూ,డాక్యుమెంట్ వెరిఫికేషన్,మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.09.2024.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలు

డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ.. జూలై 2025లో ప్రారంభమయ్యే 141వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశానికి అర్హులైన అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 30.
» **కోర్ ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా ఇంజనీరింగ్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.07.2025 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్స్ షార్ట్‌లిస్ట్, స్టేజ్-1/స్టేజ్-2 టెస్ట్‌లు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.



ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.10.2024.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

ఎన్‌పీసీఐఎల్‌లో 70 అప్రెంటిస్‌లు

బులంద్‌సహార్(ఉత్తరప్రదేశ్)లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 70.
» **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్-50,డిప్లొమా అప్రెంటిస్-10, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-10.
» **విభాగాలు:** ఫిట్టర్,ఎలక్ట్రీషియన్,ఎలక్ట్రానిక్ మెకానిక్,మెకానికల్,ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్,సివిల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ,డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుకు రూ.7,700 నుంచి రూ.8,050, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000.
» **వయసు:** దరఖాస్తు చివరితేది నాటికి ట్రేడ్ అప్రెంటిస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, డిప్లొమా అప్రెంటిస్‌కు 18 నుంచి 25 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 18 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** అర్హత పరీక్షలో సాధించిన మార్కులు, షార్ట్‌లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **శిక్షణా ప్రదేశం:** నరోరా అటామిక్ పవర్ స్టేషన్, నరోరా, బులంద్‌షహర్, ఉత్తరప్రదేశ్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.10.2024.
» **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

ఏపీఎస్‌డీపీఎస్‌లో 24 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(ఏపీఎస్‌డీపీఎస్)-ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఒప్పంద ప్రాతిపదికన స్వర్ణాంధ్ర విజన్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎస్‌వీఎంయూ) ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** 01.01.2025 నాటికి 40 ఏళ్ల మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.60,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హత, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.09.2024.
» **వెబ్‌సైట్:** www.apsdps.ap.gov.in

ఆర్‌జీఐఏ నుంచి కొత్తగా 6 ఇండిగో సర్వీసులు

- అగర్తలా, జమ్మూ, ప్రయాగ్‌రాజ్, ఆగ్రాకు వారంలో మూడు సర్వీసులు
- 27 నుంచి కాన్పూర్, అయోధ్యకు వారంలో నాలుగు సర్వీసులు



విమాన సర్వీసులు ప్రారంభిస్తున్న ఇండిగో, జీఎంఆర్ ప్రతినిధులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) నుంచి మరో ఆరు కొత్త గమ్యస్థానాలకు నేరుగా రాకపోకలు సాగించేందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ విమాన సర్వీసులు ప్రారంభించింది. సోమ, మంగళవారం రోజుల్లో అగర్తలా, జమ్మూలకు విమాన సర్వీసులను జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో కలసి ప్రారంభించింది. అగర్తలాల, జమ్మూకు వారానికి మూడుసార్లు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ఈ నెల 27 నుంచి కాన్పూర్, అయోధ్యకు విమాన సర్వీసులు ప్రారంభించనుంది. ఈ రెండు సర్వీసులు వారంలో నాలుగు సార్లు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఈ నెల 28 నుంచి ప్రయాగ్‌రాజ్, ఆగ్రాకు కూడా మరో రెండు సర్వీసులను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ రెండు సర్వీసులు కూడా వారంలో మూడుసార్లు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ..ప్రయాణికుల సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దేశీయంగా అత్యంత ముఖ్యమైన గమ్యస్థానాలకు నేరుగా రాకపోకలు జరిపేందుకు వీలుగా సర్వీసులు పెంచుతున్నామన్నారు. ఆర్‌జీఐఏ నుంచి ఇప్పటికే 75కు పైగా దేశీయ, 18 అంతర్జాతీయ సర్వీసులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

హైదరాబాద్-తిరుపతి విమానంలో సాంకేతికలోపం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతి బయలుదేరిన విమానం తిరిగి వెనక్కి వచ్చి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగింది. మంగళవారం ఉదయం అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 91–877 విమానం ఉదయం 6.12 గంటలకు 66 మంది ప్రయాణికులతో తిరుపతికి బయలుదేరింది. సుమారు గంటకుపైగా ప్రయాణం చేసిన అనంతరం విమానంలో సాంకేతిక లోపం గుర్తించిన పైలట్ ఏటీసీ సమాచారంతో తిరిగి హైదరాబాద్‌కు మళ్లించారు. ఉదయం 8.17 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా ల్యాండైంది. విమానంలో సాంకేతిక సమస్య ఉండటంతో సర్వీసు రద్దు చేస్తున్నట్లు అలయన్స్ ఎయిర్‌లైన్స్ వెల్లడించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

రెడ్ కార్నర్ నోటీస్ జారీ సులువు కాదు

ఫోన్ ట్యాపింగ్ కేసులో రెడ్ కార్నర్ జారీ ప్రక్రియ సీబీఐ వద్ద ఉంది: డీజీపీ జితేందర్

- రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం లేదు
- పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉంది
- ఉగ్రవాదుల కదలికలపై పూర్తి స్థాయి నిఘా పెట్టాం



విలేకరులతో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు రెడ్‌కార్నర్ నోటీసు జారీ ప్రక్రియ సీబీఐ వద్ద ప్రాసెస్‌లో ఉందని డీజీపీ జితేందర్ చెప్పారు. రెడ్ కార్నర్ నోటీసు జారీకి సమయం పట్టొచ్చన్నారు. 'రెడ్ కార్నర్ నోటీస్ జారీ అనేది చాలా పెద్ద ప్రాసెస్. అందులో అంతర్జాతీయ మార్గదర్శకాలు, ఇంటర్‌పోల్ గైడ్‌లైన్స్ పాటించాలి. దేశాల మధ్య ఒప్పందాలనూ పరిశీలించాలి. ఇలా ఎన్నో స్థాయిల్లో ప్రొటోకాల్స్ పాటించాల్సి ఉంటుంది. స్థానికంగా ఒక పోలీస్‌స్టేషన్ నుంచి నోటీసులు ఇచ్చినట్టుగా రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయలేం. ఈ ప్రక్రియకు సమయం పడుతుంది'అని జితేందర్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును హైదరాబాద్ సీపీ, వెస్ట్‌జోన్ డీసీపీల పర్యవేక్షణలో స్పెషల్ టీం దర్యాప్తు చేస్తోందని, కేసు కోర్టు పరిధిలో ఉన్నందున తాను ఇంతకుమించి మాట్లాడలేనన్నారు. ఇటీవల గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ర్యాలీలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితులపై జితేందర్ మంగళవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

డీజేల వాడకాన్ని తగ్గిస్తున్నాం..: 'ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కదలికలు ఇంకా ఉన్నాయి. తెలంగాణలో మావోయిస్టుల ప్రభావం లేదు. పోలీసుల పట్టు కొనసాగుతోంది. తమ ఉనికి చాటుకునేందుకు కొన్నిసార్లు తెలంగాణ ప్రాంతంలోకి వచ్చినా.. పోలీసు బలగాలు గట్టిగా తిప్పికొడుతున్నాయి. రాష్ట్రంలో ఉగ్ర కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా కొనసాగుతోంది'అని డీజీపీ చెప్పారు. జైనూర్‌లో ఇటీవల ఓ గిరిజన మహిళపై జరిగిన అత్యాచార ఘటన అత్యంత దురదృష్టకరమని, తదనంతరం చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు బాధ్యులైన 38 మందిపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పండుగలు, ఉత్సవాల్లో డీజేలను వాడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని, వీలైనంత వరకు డీజేల వాడకాన్ని తగ్గిస్తూ వస్తున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన ఘటనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. సివిల్ తగాదాల్లో ఉన్నట్టుగా చిక్కడపల్లి ఏసీపీపై వచ్చిన ఆరోపణలపై హైదరాబాద్ సీపీ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ నవరాత్రులు, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ ర్యాలీలను విజయవంతంగా పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, ఐజీలు రమేశ్, సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు హయత్‌నగర్‌లో కేటాయించిన 600 చదరపు గజాల ఇంటి స్థలానికి సంబంధించిన పత్రాలను మంగళవారం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

యాదాద్రి రాజగోపురానికి బంగారు తాపడం

60 కేజీల బంగారం అవసరమని ప్రతిపాదనలు



సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ రాజగోపురం బంగారు తాపడం పనులకు మోక్షం కలగనుంది. సుమారు 60 కేజీల బంగారంతో తాపడం పనులను చేపట్టనున్నారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలని సంకల్పించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, ఉన్నతస్థాయి అధికారులు జరిపిన సమీక్షా సమావేశాల్లో యాదాద్రి ఆలయ రాజగోపురానికి బంగారు తాపడంపై చర్చించిన విషయం తెలిసిందే. బంగారు తాపడం పనులను దాతలు ఇచ్చిన విరాళాలు, దేవస్థానం నిధులతో చేయనున్నారు. ఇప్పటికే దాతలు ఇచ్చిన నగదు సుమారు రూ.25 కోట్లు నగదు, 11 కిలోల బంగారం దేవస్థానం వద్ద ఉంది. దేవస్థానం హుండీలో భక్తులు సమర్పించిన బంగారం, వెండిని మింట్‌కు పంపించి ప్యూర్ గోల్డ్ (24 క్యారెట్లు)గా మార్చనున్నారు. అయితే భక్తులు సమర్పించిన మిశ్రమ బంగారాన్ని ప్యూర్ గోల్డ్‌గా మార్చడం, వెండి ఆభరణాలను కరిగించి అందుకు సమానమైన సుమారు 25 కిలోల బంగారాన్ని మింట్ ద్వారా తీసుకోనున్నారు. రాజగోపురానికి 10,500 చదరపు అడుగుల మేరకు బంగారు తాపడం పనులకు అంచనా వేశారు. పనులు చేయడానికి రూ.6 కోట్లు మేకింగ్ చార్జీలు అవసరం అవుతాయని అంచనా వేశారు. గ్లోబల్ టెండర్ల ద్వారా బంగారు తాపడం తయారు పనులను అప్పగించనున్నారు.

సీఎం ఆమోదం పొందగానే పనులు: ఆలయ ఈవో భాస్కర్‌రావు

బంగారు తాపడం పనుల ఆమోదం ఫైలు సీఎంవోలో ఉంది. దేవాదాయ శాఖ నుంచి సీఎంకు ఫైల్ పంపించారు. సీఎం ఆమోదం లభించగానే పనులు ప్రారంభిస్తాం. స్వర్ణ తాపడం పనుల కోసం అవసరమైన ఖర్చును దేవస్థానం భరిస్తుంది.

క్యా(చ్)ట్..ఫిష్



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని జాతీయ రహదారిపై ఖమ్మం నుంచి వస్తున్న చేప (క్యాట్ ఫిష్)ల లోడు వాహనం బోల్తా పడటంతో చేపలన్నీ రోడ్డుపైకి వచ్చేశాయి. దీంతో స్థానికులు దొరికిన చేపలను దొరికినట్లు తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో వీరారం గ్రామానికి చెందిన జినుక ఐలయ్యకు గాయాలయ్యాయి. - మరిపెడ

ఎన్‌కౌంటర్ ముగ్గురు మావోయిస్టులు మృతి

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులుగా గుర్తింపు

నారాయణపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. వీరంతా దండ కారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులని, అందులో ఇద్దరు సీనియర్ మావోయిస్టులు రూపేష్, జగదీశ్‌ల తలపై రూ.41లక్షల రివార్డు కూడా ఉందని వెల్లడించారు. రూపేష్ ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు కాగా, జగదీశ్ మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌కు చెందినవారని వివరించారు. మృతి చెందిన మరో మహిళా మావోయిస్టును ఇంకా గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలంలో ఒక ఏకే 47, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ తుపాకులతోపాటు.. ఒక పాయింట్ 12 బోర్ రైఫిల్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.


గాంధీభవన్‌కు ఎమ్మెల్సీ కోదండరాం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎం.కోదండరాం మంగళవారం గాంధీభవన్‌కు వచ్చారు. టీపీసీసీ కొత్త అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కొద్దిసేపు మహేశ్‌గౌడ్‌తో రాష్ట్ర రాజకీయ అంశాలపై చర్చించారు.

న్యాయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ త్వరగా పూర్తి చేయండి

రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: న్యాయ విద్య పూర్తి చేసిన విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి వెంటనే న్యాయవాదులుగా నమోదు చేసుకునే చర్యలు చేపట్టాలని తెలంగాణ బార్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేయాలని స్పష్టం చేసింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) జూలై 31న రాసిన లేఖ ఆధారంగా ఎన్‌రోల్‌మెంట్‌ను ఆపేస్తూ తెలంగాణ బార్ కౌన్సిల్ ఆగస్టు 5న సర్క్యులర్ జారీ చేసింది. ఈ నిలిపివేతను సవాల్ చేస్తూ నిజామాబాద్‌కు చెందిన సాయితేజతో పాటు మరికొందరు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదన వినిపిస్తూ, న్యాయ విద్య పూర్తి చేసి ప్రొవిజినల్ సర్టిఫికెట్లను పిటిషనర్లు పొందారని, వారి ఎన్‌రోల్‌మెంట్‌కు తెలంగాణ బార్ కౌన్సిల్ తిరస్కరించిందని చెప్పారు. ఎన్‌రోల్‌మెంట్ ఫీజును రూ. 750 నుంచి రూ. 1,500కు పెంచడంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైందన్నారు. రూ. 750 మాత్రమే వసూలు చేయాలని ఆగస్టు 7న ఉత్తర్వులు కూడా వెలువడ్డాయని తెలిపారు. బీసీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ లీగల్ ఎయిడ్ అండ్ అడ్వైజ్–బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం న్యాయవాదులుగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే స్వేచ్ఛ రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు లభించిందన్నారు. ఈ విషయాన్ని వివరిస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆగస్టు 6న లేఖ కూడా రాసిందని చెప్పారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం స్వీకరించిన దరఖాస్తులను సర్టిఫికెట్ల పరిశీలన నిమిత్తం యూనివర్సిటీలకు పంపినట్లు చెప్పారు. వాటిపై పరిశీలన పూర్తికాగానే ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేస్తామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వీలైనంత త్వరగా దరఖాస్తులను పరిశీలించి ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను ఆదేశించారు.



సీఎం రేవంత్‌తో బీజేపీ నేతలు కుమ్మక్కు

బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి
అమృత్ కుంభకోణంపై బీజేపీ నేతలు నోరు విప్పాలి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ పథకం నిధుల దుర్వినియోగంపై కేంద్ర విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)కి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు రావుల శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తెలంగాణ బీజేపీ నేతలు కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం రావుల శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్రంలోని కాంగ్రెస్ పెద్దలను కాపాడేపనిలో బండి సంజయ్ ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. ఓ వైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు సీవీసీకి లేఖ రాస్తుందా అని ప్రశ్నించారు. అమృత్ పథకం నిధుల విషయంలో బీజేపీ శాసనసభాపక్షం నాయకుడు మహేశ్వర్‌రెడ్డి నోరు ఎందుకు మెదపడంలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ కోరాలని మహేశ్వర్‌రెడ్డి అంటున్నారని, అమృత్ నిధులు పక్కదారి పడుతుంటే కేంద్రం ఏం చేస్తోందని నిలదీశారు. ఈ అంశంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నోరు తెరవకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా బీజేపీ నేతలు అమృత్ కుంభకోణంపై విచారణ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

కనీసం రూ. 24 వేల వేతనం ఇప్పించండి

సీనియర్ ఐఏఎస్ అధికారి సవ్యసాచి ఘోష్‌కు
గోపాల మిత్రల వినతి

సాక్షి, హైదరాబాద్: గత 24 ఏళ్లుగా రాష్ట్రంలోని పశుజాతికి మేలైన సేవలందిస్తున్న గోపాల మిత్రలకు నెలకు రూ. 24 వేల వేతనం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోపాల మిత్రల సంఘం కోరింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి సవ్యసాచి ఘోష్‌ను సంఘం ప్రతినిధులు మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. మండల పశువైద్య అధికారి పర్యవేక్షణలో గోపాల మిత్రల సేవలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సవ్యసాచి ఘోష్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్, నేతలు కేశవులు, పి.నర్సింహులు తదితరులున్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: మోడల్ స్కూల్ టీచర్లకు పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ఎంఎస్ఎఫ్) కోరింది. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను టీఎస్ఎంఎస్ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండయ్య, సిల్వేరు మహేశ్‌లు కలిసి వినతిపత్రం సమర్పించారు. సీనియారిటీ ఆధారంగా పీజీటీలకు పదోన్నతి ఇవ్వాలని, పాఠశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా మోడల్ స్కూల్ టీచర్లకు ఆరోగ్య కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని వివరించారు.

చనిపోయిన వ్యక్తి ఖాతాలూ వదల్లేదు

- రిటైర్డ్ ఇరిగేషన్ అధికారి సిమ్‌కార్డు రీ యాక్టివేట్ చేసి రూ.20.18 లక్షల దోపిడీ
- కీలక నిందితుడిని అరెస్టు చేసిన టీజీ సీఎస్‌బీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: చనిపోయిన ఓ రిటైర్డ్ ఉద్యోగి సిమ్ కార్డుతో సైబర్ కేటుగాళ్లు రూ. లక్షలు కొట్టేశారు. ఈ మోసంలో కీలక నిందితుడు మహ్మద్ ఆసిఫ్ పాషాను కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసినట్టు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం..

పాత పరిచయాన్ని వాడి...

ఇరిగేషన్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేసి 2013లో పదవీ విరమణ చేసిన ఎండీ సమీఉద్దీన్ 2022లో చనిపోయారు. సమీఉద్దీన్‌కు చెందిన ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ ఖాతాలతోపాటు అతడి సోదరి సబిహా సుల్తానా ఎస్‌బీఐ ఖాతాకు సైతం సమీఉద్దీన్ ఫోన్‌నంబర్ లింక్ చేసి ఉంది. ఇరిగేషన్ విభాగంలో సమీఉద్దీన్ పనిచేసే సమయంలోనే జహంగీర్‌కు పాత పరిచయం ఉంది. దీంతో ఆయన వ్యక్తిగత విషయాలు తెలుసుకున్నాడు. సమీఉద్దీన్ చనిపోయిన తర్వాత అతడికి సంబంధించి వ్యక్తిగత వివరాలు తన వద్ద ఉండడంతో జహంగీర్ ఓ కుట్రకు తెరతీశాడు. మహ్మద్ ఆసిఫ్ పాషాకు ఈ విషయాలు చెప్పాడు. దీంతో మహ్మద్ ఆసిఫ్ పాషా ఈ ఏడాది జూన్‌లో సమీఉద్దీన్ ఎయిర్‌టెల్ సిమ్‌కార్డును బ్లాక్ చేయించాడు. తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి వాటితో మళ్లీ తన పేరిట ఆ సిమ్‌కార్డును రీ యాక్టివేట్ చేయించాడు. ఆ తర్వాత బ్యాంక్ ఖాతాలకు లింక్ అయి ఉన్న ఆ ఫోన్‌నంబర్‌తో ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే వంటి బ్యాంకింగ్ యాప్‌లు ఇన్‌స్టాల్ చేశాడు. వీటి ద్వారా సమీఉద్దీన్, ఆమె సోదరి సబిహా సుల్తానాల బ్యాంకు ఖాతాల నుంచి మొత్తం రూ.20,18,557 తమ ఖాతాల్లోకి నిందితులిద్దరూ ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. క్రెడిట్‌కార్డు బిల్లులు సైతం చెల్లించారు.

సబిహా సుల్తానా ఫిర్యాదుతో...

తమ బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు పోతుండడంతో సబిహా సుల్తానా కరీంనగర్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేసిన సైబర్‌క్రైం పోలీసులు ఈ కేసులో ఏ–1గా ఉన్న మహ్మద్ ఆసిఫ్ పాషాను ఈనెల 23న అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.18 లక్షల నగదు, సెల్‌ఫోన్, క్రెడిట్ కార్డు, క్రెడిట్ కార్డు బిల్లులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఏ–2 జహంగీర్ కోసం గాలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. డీఎస్పీ నర్సింహారెడ్డి నేతృత్వంలోని కరీంనగర్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ అభినందించారు. ప్రజలెవరూ బ్యాంకు ఖాతాలకు లింక్ అయి ఉన్న ఫోన్ నంబర్లు ఇతరులకు చెప్పవద్దని ఆమె హెచ్చరించారు.

రోగులతో మర్యాదగా మాట్లాడండి

- ఆ ప్రకారం కిందిస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వండి
- వైద్యాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఆసుపత్రులకు వచ్చే రోగులతో మర్యాద, ప్రేమగా మాట్లాడాలని.. అలా ఉంటేనే ప్రభుత్వ ఆసుపత్రులకు రావడానికి పేద రోగులు మొగ్గుచూపుతారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రోగులతో ఎలా మాట్లాడాలో కిందిస్థాయి సిబ్బందికి శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో దామోదర తన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోగులతో కటువుగా మాట్లాడి వారిని మరింత బాధపెట్టొద్దని హితవు పలికారు. సెక్యూరిటీ సిబ్బంది మొదలు డాక్టర్ల వరకు అందరూ రోగులతో సహనంతో మెలగాలని.. వారి అనుమానాలు నివృత్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రత, పేషెంట్ కేర్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ అంశాలపై అధ్యయనానికి నిపుణుల కమిటీని నియమించి 10 రోజుల్లో తనకు నివేదిక సమర్పించాలని నిర్దేశించారు. ఆసుపత్రుల సిబ్బందికి బయోమెట్రిక్ అటెండెన్స్‌ను తప్పనిసరి చేయాలని.. సూపరింటెండెంట్లతోపాటు డీఎంఈ, డీహెచ్, వైద్య విధాన కమిషనర్ వారి పరిధిలోని ఆసుపత్రుల్లో సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పర్యవేక్షించాలన్నారు. డైట్, శానిటేషన్ సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల పనితీరు, సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తు, ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాచ్చి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్, మెడికల్ కార్పొరేషన్ ఎండీ హేమంత్, డీఎంఈ వాణి, వీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్, ఎంఎన్‌జే డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు గాంధీ భవన్‌కు మంత్రి దామోదర

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రులతో చేపట్టిన ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం గాంధీ భవన్‌కు వెళ్లనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయన గాంధీభవన్‌లో ప్రజలు, పార్టీ కార్యకర్తలను కలవనున్నారు. ఈ సందర్భంగా ప్రజాసమస్యలపై అర్జీలు కూడా తీసుకుంటారని, ఈ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్‌తోపాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొంటారని గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి.

సింగరేణిపై చర్చకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమా?

ఐఎన్‌టీయూసీ నేత జనక్ ప్రసాద్

సాక్షి,హైదరాబాద్: సింగరేణి సంస్థలో ఎవరి హయాంలో ఏం జరిగిందో చర్చించేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమా అని ఐఎన్‌టీయూసీ జాతీయ నాయకుడు, కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 130 ఏళ్ల చరిత్రలో ఎన్నడూలేని విధంగా సంస్థ లాభాల్లో కార్మికులకు వాటా పంచామన్నారు. దీనిపై కూడా బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ అది బోనస్ కాదు బోగస్ అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ఏడాది కూడా సింగరేణికి వచ్చిన లాభాల గురించి చెప్పకుండా కేవలం బోనస్ ప్రకటించేవారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం లాభాలను ప్రకటించి పంచడమే కాక, సంస్థ భవిష్యత్తు కోసం పెట్టుబడి కింద నిధులు వెచ్చిస్తామని స్పష్టంగా చెప్పామని గుర్తు చేశారు.

'నేడు సమగ్ర కులగణనపై బీసీల విస్తృతస్థాయి సమావేశం'

సాక్షి, హైదరాబాద్: సమగ్ర కులగణనపై బుధవారం బీసీల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ విస్తృతస్థాయి సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, బీసీ మేధావులు, వివిధ బీసీ, కులసంఘాల నేతలు హాజరవుతారని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

జోగుళాంబ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు డీజీపీకి ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఏకైక శక్తిపీఠమైన అలంపురం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరిగే దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం తరఫున డీజీపీ జితేందర్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు మంగళవారం ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ దిండిగల్ ఆనంద్ శర్మ.. డీజీపీ జితేందర్, అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్, ఐజీ రమేశ్‌ను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేశారు. అలాగే దేవస్థానం ప్రసాదంతో పాటు అమ్మవారి శేష వస్త్రాలను అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

భవిష్యత్తు ప్రణాళిక బహు క్లిష్టం

ప్రణాళికల రూపకల్పనలో 69 శాతం భారతీయుల వెనకడుగు / భారతీయులకు తోడుగా 47 శాతం అమెరికన్లు... / హెచ్ఎస్‌బీసీ తాజా నివేదికలో వెల్లడి...

సాక్షి, హైదరాబాద్: సంస్థలు, కుటుంబాలు, వ్యక్తులు.. ఎవరైనా భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం కీలకం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో.. భవిష్యత్తు ప్రణాళిక క్లిష్టంగా మారుతోంది. భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు, స్తబ్ధతలో కూరుకుపోతున్నామనే భావనలో మెజారిటీ ప్రజలున్నారు. 69 శాతం మంది భారతీయులు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారని తేలింది. ఊహించని మార్పులను ఎదుర్కొంటున్నట్టుగా 91 శాతం మంది అంగీకరించారు. పరిస్థితుల ప్రభావంతో ఆత్మవిశ్వాసం, నమ్మకం సన్నగిల్లుతుండడంతో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేందుకు సన్నద్ధంగా లేమని 62 శాతం మంది అభిప్రాయపడ్డారు. వ్యక్తులుగా.. సరైన వేళకు.. సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నామని మథనపడుతున్నట్లు 57 శాతం పేర్కొన్నారు.

ఇదీ అధ్యయనం..

హెచ్ఎస్‌బీసీ సంస్థ ఆధ్వర్యంలో.. భారత్, హాంకాంగ్, సింగపూర్, యూఏఈ, యూకే, యూఎస్‌లలోని వివిధ రంగాలు, మార్కెట్లకు చెందిన దాదాపు 18వేల మంది వ్యక్తులు (దాదాపు 4 వేల బిజినెస్ లీడర్లు)పై జరిపిన గ్లోబల్ స్టడీ ఆధారంగా నివేదికను సిద్ధం చేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనలపై హెచ్ఎస్‌బీసీ ఇండియా హెడ్ (వెల్త్ అండ్ పర్సనల్ బ్యాంకింగ్) సందీప్ బాత్రా స్పందిస్తూ.. దైనందిన జీవనంలో సమస్యలు ఎదురైనపుడు వాటిని ఎదుర్కొనేందుకు.. ఏదో ఒక రూపంలో సహాయపడాలని హెచ్ఎస్‌బీసీ భావిస్తోందని తెలిపారు. వ్యాపార, వాణిజ్య, ఇతర రంగాల్లో ప్రజలకు తగిన సలహాలు, సూచనలిచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. జీవితంలో క్లిష్టమైన సవాళ్లు ఎదురైనపుడు అంతర్జాతీయ నెట్‌వర్క్ సహాయంతో అనిశ్చితిని అధిగమించేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు.



నివేదికలో ఏముందంటే..

- వేగంగా మార్పులు సంభవిస్తున్న యుగంలో తామున్నట్టు 91 శాతం మంది భారతీయుల భావన
- భవిష్యత్ ప్రణాళికల రచనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులు 69 శాతం మంది ఉన్నారు.
- తీసుకున్న నిర్ణయాల అమలుకు సిద్ధంగా లేమని భావిస్తున్నవారు, ఆత్మవిశ్వాసం సన్నగిల్లిందనుకున్నవారు 62 శాతం మంది ఉన్నారు.
- తగిన సమయంలో అవకాశాలు కోల్పోయినందుకు, తగిన నిర్ణయం తీసుకోలేకపోయినందుకు చింతిస్తున్నవారు 57 శాతం మంది ఉన్నారు.
- తాము తీసుకున్న నిర్ణయాలు చివరకు సరైనవి కావనే భావనలో 46 శాతం మంది ఉన్నారు.
- సరైన నిర్ణయాలు తీసుకోలేక.. వాటిని వీలైనంత వాయిదా వేస్తున్న వారు 42 శాతం మంది ఉన్నారు.
- నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులు 33 శాతం మంది ఉన్నారు.

భారత్‌కు యూఎస్ తోడు

ఈ అధ్యయనానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన పరిణామం ఏంటంటే.. భారత్‌లో మాదిరిగానే యూఎస్ఏలోనూ 47 శాతం మంది అమెరికన్లు సరైన నిర్ణయాలు తీసుకోవడంలో తప్పటడుగులు వేస్తున్నారు.

- అమెరికన్లలో 33 శాతం మంది తాము తీసుకున్న పాత నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
- ఐదేళ్లలో.. ఇతరులతో సంబంధం లేకుండా వేరుగా ఉన్నామనే భావనలో 43 శాతం అమెరికన్ మహిళలున్నారు. అదే పురుషుల విషయానికొస్తే 26 శాతంగా ఉంది.
- యూఎస్‌లో బిజినెస్ లీడర్లు సైతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంతో పోల్చితే భవిష్యత్ ప్రణాళికలు మరింతగా సవాళ్లతో కూడుకున్నవనే భావనలో 51 శాతం మంది ఉన్నారు.

విదేశీయుల చూపు.. ఏపీ సేంద్రియ సాగు వైపు



ఏపీ ప్రకృతి వ్యవసాయ విధానాలను తెలుసుకుంటున్న ఎన్‌ఆర్‌ఐలు

ఇక్కడి విధానాలతో అమెరికాలో సాగు చేసేలా ప్రణాళికలు

గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తపుంతలు తొక్కిన ప్రకృతి వ్యవసాయం



కాకినాడ జిల్లాలో ఏటీఎం ప్రకృతి వ్యవసాయ క్షేత్రం

పిఠాపురం: రసాయన ఎరువులకు స్వస్తి పలికి సేంద్రియ సాగులో ముందడుగు వేసిన ఏపీ రైతులు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఇతర దేశాల చూపు పడింది. రసాయనాలతో సహజత్వం కోల్పోయిన భూముల్లో తిరిగి సత్తువ పెంచేందుకు మన రైతులు ప్రకృతి మార్గాన్ని ఎంచుకున్నారు. రసాయనాల వాడకంతో పొంచి ఉన్న ప్రమాదాన్ని రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు చేసిన కృషి ఇతర దేశాలను సైతం ఆకర్షిస్తోంది. గడచిన ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో ప్రకృతి వ్యవసాయం కొత్త పుంతలు తొక్కింది. ఈ నేపథ్యంలోనే ఇతర దేశాల ప్రతినిధులు, ఆయా దేశాల్లోని ఔత్సాహిక రైతులు మన రాష్ట్రానికి వచ్చిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకుంటున్నారు. వివిధ దేశాల నుంచి ఎన్‌ఆర్‌ఐల రాకతో కాకినాడ జిల్లాలో మారుమూల గ్రామమైన గొల్లప్రోలు మండలం దుర్గాడ వస్తున్నారు. ఇక్కడి రైతులు అన్ని రకాల సేంద్రియ ఎరువులు, మందులు తయారు చేస్తున్నారో తెలుసుకుని.. ఏయే సందర్భాల్లో వాటిని వినియోగించాలని, ప్రకృతి సాగు ఎలా చేయాలనే వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది

మాది ఆంధ్రప్రదేశ్. నా చిన్నతనంలోనే అమెరికాలో సెటిలయ్యాం. అమెరికాలో ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన పంటలకు మంచి గిరాకీ ఉంది. రసాయనాలు వాడని వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే కొనడానికి ఇక్కడివారు ఇష్టపడుతున్నారు. అందుకే ఇక్కడి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేసి అమెరికాలో ఈ తరహా పంటలను పండించేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకే.. దుర్గాడ గ్రామానికి వచ్చాం. ఇక్కడి రైతులు అన్ని రకాల సేంద్రియ ఎరువులు, మందులు తయారు చేస్తున్నారు. బయో ఇన్‌పుట్ సెంటర్లు నిర్వహిస్తూ ఇతర రైతులకు సేంద్రియ ఎరువులు, మందులు సరఫరా చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సైతం మంచి ప్రోత్సాహాన్ని ఇచ్చారు. గత ఐదేళ్ల నుంచే ప్రకృతి వ్యవసాయం పెరిగిందని రైతులు చెప్పారు.

– ఎస్.దేవి, ఎన్‌ఆర్‌ఐ, కాలిఫోర్నియా, అమెరికా

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం పెరిగింది

గత ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేయడంతో మా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాం. ప్రత్యేక వ్యవసాయ క్షేత్రాలు ప్రారంభించి వివిధ రకాల పద్ధతులతో నిత్యం ఆదాయం వచ్చేవిధంగా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నాం. శాస్త్రవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు మమ్మల్ని సంప్రదించి ప్రకృతి వ్యవసాయ సాగు వివరాలు తెలుసుకుంటున్నారు. మా గ్రామంలో బయో ఇన్‌పుట్ సెంటర్లు ఏర్పాటు చేసి అన్ని రకాల సేంద్రియ ఎరువులు, కషాయాలు తయారు చేసి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నాం. మా ప్రాంతంలో చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు తెలుసుకునేందుకు విదేశీయులు రావడం గర్వకారణం.

– గుండ్ర శివచక్రం, ప్రకృతి వ్యవసాయ రైతు, దుర్గాడ

విదేశీ ప్రతినిధులు వస్తున్నారు

కాకినాడ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఐదేళ్లలో భారీగా పెరిగింది. ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం, జీవ ఉత్ప్రేరకాలు, బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, దశపర్ణి కషాయం, పుల్లటి మజ్జిగ, పంచగవ్య, మీనామృతం, చిల్లీ స్పెషల్ కషాయం, లింగాకర్షణ బుట్టలు, ఎల్లో–బ్లూ స్టిక్కీ ప్లేట్స్, పీఎండ్స్ (నవధాన్యాల విత్తనాలు) ఎలా తయారు చేస్తారనే విషయాలపై ఎన్‌ఆర్‌ఐలు ఎక్కువగా సంప్రదిస్తున్నారు. స్వయంగా వచ్చి తెలుసుకుంటున్నారు. ఎక్కువ మంది ఎన్‌ఆర్‌ఐలు దుర్గాడ వచ్చి ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్నారు. మరికొందరు విదేశీయులు త్వరలో రానున్నారు.

– ఎలియాజరు, జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి, కాకినాడ



సేంద్రియ ఎరువుల తయారీ విధానం తెలుసుకుంటున్న ఎన్‌ఆర్‌ఐ దేవి

ఎంఈవో–2 పోస్టులకు గుడ్‌బై!

- రద్దు దిశగా ప్రభుత్వం అడుగులు
- స్కూల్ కాంప్లెక్స్‌లు క్లస్టర్‌గా మార్పు
- క్లస్టర్ స్కూల్ హెచ్ఎంలకే డీడీవో బాధ్యతలు
- దాని పరిధిలోని అన్ని స్కూళ్లపై వారిదే పెత్తనం
- పాఠశాలల రేషనలైజేషన్ చేసే యోచనలో ప్రభుత్వం
- ఉపాధ్యాయ పోస్టుల కుదింపునకు రంగం సిద్ధం!

సాక్షి, అమరావతి: ఇప్పటికే టోఫెల్ శిక్షణ, సీబీఎస్ఈలకు మంగళం పాడి విద్యాశాఖ నిర్వీర్యమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి సర్కారు ఇప్పుడు ఎంఈవో–2 పోస్టుల రద్దుకు పావులు కదుపుతోంది. మండల స్థాయిలో కొనసాగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌ను క్లస్టర్‌గా మార్చి, ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు డీడీవో బాధ్యతలు అప్పగించనున్నారు. అంటే ఆ పాఠశాల పరిధిలోని (క్లస్టర్) ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపు బాధ్యతను క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు అప్పగించనున్నారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న 679 మంది ఎంఈవో–2లు తిరిగి ప్రధానోపాధ్యాయులుగా వెళ్లనున్నారు. ఎంఈవో–1కు కూడా డీడీవో బాధ్యతలు తొలగించనున్నారు. ఇక క్లస్టర్ స్కూళ్లకు సమీపంలో తక్కువ విద్యార్థులున్న ఏకోపాధ్యాయ పాఠశాలలను కూడా క్లస్టర్ స్కూళ్లలో విలీనం చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే పలు ప్రభుత్వ స్కూళ్లు మూతబడటం, ఉన్న ఉపాధ్యాయ పోస్టులు కూడా రద్దయ్యే అవకాశం ఉందని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లస్టర్ స్కూల్ హెచ్ఎంకే అజమాయిషీ

ప్రభుత్వ స్కూళ్లలో బోధనా అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ, ఆయా సబ్జెక్టులపై నిపుణులైన సీనియర్ ఉపాధ్యాయుల బోధనా అంశాలపై చర్చించేందుకు స్కూల్ కాంప్లెక్స్‌లు ఎప్పటి నుంచో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మండల పరిధిని బట్టి 8 నుంచి 12 స్కూళ్లకు కలిపి ఒక స్కూల్.. కాంప్లెక్స్‌గా ఉంది. ఇలా మండలంలో 4 నుంచి 6 కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో సుమారు 35 మంది వరకు ఉపాధ్యాయులు ఉంటారు. అయితే, ఇకపై ఈ స్కూల్ కాంప్లెక్స్‌లను క్లస్టర్‌గా మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఆ క్లస్టర్ పరిధిలో ఉండే ప్రాథమిక పాఠశాలల్లోని 35 మంది ఉపాధ్యాయులపై అజమాయిషీని క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు అప్పగించనున్నారు. ఎంఈవో–1కు ఉన్న వేతనాల డ్రా చేసే విధులు తొలగించి.. కేవలం మండలంలోని స్కూళ్లపై పర్యవేక్షణ బాధ్యత మాత్రమే ఉంచుతారు.

స్కూళ్ల రేషనలైజేషన్ కోసమే మార్పులు?

క్లస్టర్ విధానం ద్వారా స్కూళ్ల రేషనలైజేషన్ చేయవచ్చని ఉపాధ్యాయుల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. అంటే ఆ క్లస్టర్ స్కూల్ పరిధిలోని ఇతర పాఠశాలల్లో తక్కువ విద్యార్థులున్న స్కూళ్లను క్లస్టర్ స్కూల్‌లో కలిపేస్తారు. దీంతో కొన్ని స్కూళ్లు మూతబడవచ్చని టీచర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. అంతేగాక, మూతబడే స్కూళ్లలోని ఉపాధ్యాయ పోస్టులు కూడా రద్దు చేసేందుకే ప్రభుత్వం ఈ ప్రక్రియకు పావులు కదుపుతోందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దుపై విచారణ వాయిదా

- వివేకా హత్య కేసులో దాఖలైన పిటిషన్‌లన్నింటిని కలిపి విచారిస్తాం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ వివేకా హత్య కేసులో శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. శివశంకర్‌రెడ్డి బెయిల్ రద్దుతో పాటు..మిగిలిన నిందితులపై దాఖలైన పిటిషన్‌లు అన్ని కలిపి విచారించాలని వైఎస్ సునీతారెడ్డి వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. శివశంకర్ రెడ్డి కుమారుడు జైలులో ఉన్న అప్రూవర్‌ని బెదిరించిన వ్యవహారంతో పాటు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌లను కూడా కలిపి విచారించాలని సునీత తరఫు న్యాయవాది సిద్దార్థ లూథ్రా కోరారు.మిగిలిన నిందితులపై దాఖలైన పిటిషన్‌లు నవంబర్ 4న లిస్ట్ అయ్యినట్లు రిజిస్ట్రీలో చూపుతోందని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అందుకే అన్ని పిటిషన్లను కలిపి నవంబర్ 5న విచారణ చేపట్టాలని కోరారు. శివశంకర్ రెడ్డి కుమారుడు జైలు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యేందుకు అప్లికేషన్ దాఖలు చేసినట్లు ధర్మాసనం దృష్టికి తీసుకురాగా..పరిశీలిస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా చెప్పారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతివాదిగా ఉందని, బెయిల్ రద్దుకు..బెదిరించిన విషయానికి సంబంధం లేనందున ఈ రెండు అంశాలను వేరువేరుగా విచారించాలని శివశంకర్ రెడ్డి తరఫు న్యాయవాది కోరారు. అన్నింటికి అనుమతించిన ధర్మాసనం..నవంబర్ 5న అన్ని పిటిషన్లు ఒకేసారి విచారణ చేపడతామని తెలిపింది.

మురిపించిన మయూరాలు



అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ ఘాట్‌రోడ్డుపై మంగళవారం నెమళ్ల గుంపు కనువిందు చేసింది. ఘాట్‌రోడ్డు రక్షితగోడపై ఒకదానివెంట ఒకటి ఐదు నెమళ్లు వెళ్తూ సందర్శకులను కనువిందు చేశాయి. దీంతో నిశ్శబ్దంగా ఉన్న వాతావరణంలో నెమళ్ల కూతలతో సందర్శకులు ప్రత్యేకానుభూతి పొందారు. – బి.కొత్తకోట

ఏపీటీడీసీ ఈడీగా శేషగిరి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మేక శేషగిరిని నియమిస్తూ యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రెజరీ, అకౌంట్స్ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శేషగిరి ఏడాది పాటు డెప్యూటేషన్‌పై ఏపీటీడీసీలో ఈడీ (ప్రాజెక్ట్స్)గా విధులు నిర్వహించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుజరాత్ సీఎంతో మంత్రి జనార్దన్‌రెడ్డి భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, అధికారుల బృందం మంగళవారం అహ్మదాబాద్‌లో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్‌తో సమావేశమైంది. రాష్ట్రంలో పీపీపీ విధానంలో రోడ్ల నిర్మాణ అంశంపై ఆయనతో చర్చించింది. గుజరాత్‌లో పీపీపీ విధానంలో రోడ్లు నిర్మించిన తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో మొదటిదశలో 14 రోడ్లు నిర్మిస్తామని మంత్రి జనార్దన్‌రెడ్డి చెప్పారు. పోర్టు ఆధారిత పరిశ్రమల గురించి కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఏపీ ఆర్డీసీ ఈఎన్‌సీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాల్లో కౌలు రైతుల పేర్లు రాయడం లేదు

ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నేతల ఆగ్రహం

సాక్షి, అమరావతి: భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన వాస్తవ సాగుదారులైన కౌలు రైతులను ఆదుకునే విషయంలో సీఎం చంద్రబాబు ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేదని ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, వై.రాధాకృష్ణ, కె.ప్రభాకరరెడ్డి, ఎం.హరిబాబు ఆరోపించారు. వాస్తవ సాగుదారులకు పరిహారం దక్కేలా వారి పేర్లను మాత్రమే పంట నష్టం అంచనాల్లో నమోదు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు ఎక్కడా అమలుకు నోచుకోవడంలేదని, ఈ విషయం తమ క్షేత్ర స్థాయి పరిశీలనలో స్పష్టమైందని చెప్పారు. విజయవాడలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ–క్రాప్‌లో, పంట నష్టం అంచనాల్లో భూ యజమానుల పేర్లనే నమోదు చేస్తున్నారని తెలిపారు. ఫలితంగా వాస్తవ సాగుదారులైన కౌలురైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. వరికి ఎకరాకు రూ.35వేలు, వాణిజ్య పంటలకు రూ.3లక్షల వరకు పెట్టుబడులు పెట్టారని, అరకొరగా సాయం ఇవ్వడం సరికాదన్నారు.

'స్టీల్' మెల్ట్ షాప్–1లో ప్రమాదం

షిఫ్ట్ ఇన్‌చార్జ్‌కు తీవ్ర గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1లో జరిగిన ప్రమాదంలో విభాగం సీనియర్ మేనేజర్ సీహెచ్ మల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి.. విభాగంలోని ఎల్‌పీ బేలో స్టీల్ ట్రాన్స్‌ఫర్ కార్‌పై ఉన్న ల్యాడిల్‌లో ద్రవపు ఉక్కు ఉంది. కార్ కదులుతుండగా ల్యాడిల్‌లో పేలుడు సంభవించింది. దీంతో ల్యాడిల్‌లో ఉన్న ద్రవపు ఉక్కు పైభాగం ఒక్కసారిగా బయటకు విరజిమ్మింది. ఆ సమయంలో అక్కడ ఉన్న షిఫ్ట్ ఇన్‌చార్జ్ మల్లేశ్వరరావు శరీరంపై ద్రవపు ఉక్కు పడడంతో ఒళ్లంతా కాలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సహోద్యోగులు అతన్ని అంబులెన్స్‌లో ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నగరంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని శరీరం 80 శాతం మించి కాలినట్లు వైద్యులు పేర్కొంటున్నారు. మల్లేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ముందొక మాట.. తర్వాత ఒక మాట

టీటీడీ ఈవో మాటలపై అనుమానం

- సీబీఐ లేదా సుప్రీంకోర్టు జడ్జితో విచారించాలి
- హిందూ చైతన్య సమితి అధ్యక్షుడు ఓంకార్



సాక్షి ప్రతినిధి, తిరుపతి : లడ్డూ వివాదంపై టీటీడీ ఈవో శ్యామలరావు ముందు ఒక మాట.. తర్వాత ఒక మాట మాట్లాడుతున్నారని హిందూ చైతన్య సమితి అధ్యక్షుడు ఓంకార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివాదం నేపథ్యంలో మంగళవారం హిందూ చైతన్య సమితి ప్రతినిధులు ఈవోకు వినతిపత్రం ఇచ్చేందుకు టీటీడీ పరిపాలన భవనానికి చేరుకున్నారు. అయితే అక్కడ పోలీసులు, విజిలెన్స్ అధికారులు వారిని లోనికి అనుమతించలేదు. దీంతో కొంత సేపు స్వామీజీలు ఆందోళనకు దిగారు. సుమారు గంట తర్వాత వారిని లోపలికి అనుమతించగా, ఈవోకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. లడ్డూ నాణ్యత విషయంలో టీటీడీ ఈవో పోలీసులకు ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. ఈవో శ్యామల రావు ముందు ఒక మాట, తర్వాత మాట మార్చడంపై పలు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ విచారణ వల్ల వాస్తవం వెలుగులోకి వస్తుందన్న నమ్మకం లేదన్నారు. తక్షణం సీబీఐ విచారణకు ఆదేశించాలని, లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అధిక ధర పలికే చేప నూనె ఎలా కలుపుతారు?



నెయ్యి కంటే మూడు రెట్లు అధిక ధర కలిగిన చేప నూనెను కలిపారనడం విడ్డూరంగా ఉంది. జంతు కళేబరాలతో చేసే కొవ్వు సైతం కలపాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ. ఈ దుష్ప్రచారం వినడానికే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. టీటీడీ ఉద్యోగులు సైతం నివ్వెరపోతున్నారు. రాజకీయ ఆటలో శ్రీవారి ప్రసాదం కూడా చేరిందని పరిపాలనా భవనంలో చర్చించుకుంటున్నారు. విలువ తక్కువగా ఉన్న పదార్థంలో కల్తీ కోసం విలువ ఎక్కువగా ఉన్న వాటిని ఎలా ఉపయోగిస్తారో అసత్య ప్రచారం చెస్తున్న మేధావులు చెప్పాలి.

– శివకుమార్ యాదవ్, స్థానికుడు, తిరుపతి

దుష్ప్రచారానికి శ్రీవారి ప్రసాదమే దొరికిందా?



మేము ఇప్పటి వరకు 71 సార్లు అలిపిరి మెట్ల నుంచి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నాం. శ్రీవారి పరమ భక్తులమైన మాలాంటి వారి మనోభావాలను దెబ్బ తీసే ప్రయత్నం చేయడం దారుణం. నెయ్యిలో కల్తీ జరిగే ఆస్కారమే లేదు. మేము స్వతహాగా ఇంట్లో ఆవు నెయ్యి తయారు చేసుకుంటాం. నెయ్యితో వండిన పాత్రలో వేరే నూనె వేసి వంటకాలు చేస్తే అప్పుడే దుర్వాసన వస్తుంది. అలాంటిది కల్తీ నెయ్యితో ప్రసాదం చేస్తే అప్పుడు వాసన రాలేదా? రాజకీయ దుష్ప్రచారానికి శ్రీవారి ప్రసాదమే దొరికిందా?

– రాజేశ్వరమ్మ, శ్రీవారి ప్రతిమలు తయారు చేసే కార్మికురాలు, తిరుపతి

ప్రతి అడుగు రాజ్యాంగానికి లోబడి ఉండాలి

సీపీఏ కాన్ఫరెన్స్‌లో శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

సాక్షి, న్యూఢిల్లీ: మనం వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి చట్టం రాజ్యాంగానికి అనుగుణంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతలు తమ ఆలోచనల్లో ఇప్పటి కంటే కనీసం ఒక శతాబ్దం ముందున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని పార్లమెంటు పరిసరాల్లో ×సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిని సాధించడంలో శాసనసభల పాత్ర₹ అనే అంశంపై సోమవారం ప్రారంభమైన 10వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్ మంగళవారం ముగిసింది. ఈ సదస్సులో మోషేన్‌రాజు ప్రసంగిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ సుస్థిరమైన, సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలను రాజ్యాంగంలో పొందుపరచటం ద్వారా మానవాళికి విశేషమైన సేవ చేసిందని కొనియాడారు. సమానత్వ సూత్రాలు సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేశాయన్నారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా పాల్గొన్నారు.

తిరుమల లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ అవసరం

తిరుమల లడ్డూ తయారీలో నాణ్యత లేని నెయ్యి వినియోగించారని సీఎం చంద్రబాబు చెప్పడంతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఈ విషయంపై వాస్తవాలను వెలుగులోకి తెచ్చేందుకు సీబీఐతో విచారణ చేయించాలని మోషేన్‌రాజు అన్నారు. ఆయన ఢిల్లీలోని ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసిందని చెప్పారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమిలో ఉన్నందు వల్ల విభజన హామీలన్నీ అమలుకు కృషి చేయాలని పేర్కొన్నారు. సీపీఏ సదస్సుకు హాజరైన తనకు కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఆహ్వానం అందిందని తెలిపారు. శాసనసభలో స్పీకర్, శాసన మండలిలో చైర్మన్‌లు అవసరమైన ఖర్చు చేసే విధంగా కొంత బడ్జెట్ కేటాయించాలని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వరద బాధితులకు ఉచితంగా సర్టిఫికెట్లు

సాక్షి, అమరావతి: ఇటీవలి వరదల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు నష్టపోయినవారికి ఉచితంగా డూప్లికేట్ సర్టిఫికెట్లు లేదా డాక్యుమెంట్లు, సర్టిఫైడ్ కాపీలు జారీచేయాలని ప్రభుత్వం అన్ని శాఖలను ఆదేశించింది. వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు, ఆధార్ కార్డు, బర్త్, డెత్, మ్యారేజీ తదితర సర్టిఫికెట్లు పోగొట్టుకున్నా, నాశనమైనా వాటి డూప్లికేట్, సర్టిఫైడ్ కాపీలను ఇవ్వాలని సూచించింది. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని, నిబంధనలను అందుకనుగుణంగా సవరించాలని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక్క కంపార్ట్‌మెంట్ నిండింది. సోమవారం అర్ధరాత్రి వరకు 65,604 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,266 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 6 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.



పోలేరమ్మ జాతరకు సర్వం సిద్ధం

సైదాపురం/వెంకటగిరి రూరల్ : తిరుపతి జిల్లా వెంకటగిరిలో పండుగ వాతావరణం ఏర్పడింది. పోలేరమ్మ జాతర సందర్భంగా ఆర్చి వద్ద నుంచి అమ్మవారి గుడి వరకు విశేషంగా అలంకరించారు. బుధ,గురువారాల్లో అత్యంత వైభవంగా జరిగే జన జాతరకు సన్నాహాలు పూర్తి చేశారు. ఈ క్రమంలో పోలేరమ్మతల్లి బుధవారం రాత్రి జీనుగుల వారి వీధి నుంచి ప్రత్యేక రథంపై నగరోత్సవంగా అమ్మవారి ఆలయం వద్ద కొలువుదీరనున్నారు. అనంతరం భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సింహగిరిపై వైభవంగా శాంతి హోమం

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ఉదయం శాంతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో చక్రపెరుమాళ్లని హోమగుండం వద్ద కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రధాన కలశంలోని జలాలతో ప్రసాదాల తయారీశాలను సంప్రోక్షించారు.

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భాద్రపద మాసం మంగళవారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.

విద్యా సమాచారం

ఎస్వీయూలో జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: ఎస్వీయూ హిందీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'నఈ శిక్షా నీతి మే హిందీకి స్థితి' అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సును పలువురు ప్రముఖులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన విద్యావిధానంలో హిందీ సబ్జెక్ట్ పాత్రపై చర్చించారు. అనంతరం హిందీ సప్తాహ్ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పద్మనాభం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో అండర్–19 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ ఉదయం 9.30గంటలకు రేణిగుంట బాలికల జెడ్పీ హైస్కూల్‌లో సపక్‌తక్రా, 28 మధ్యాహ్నం 2గంటలకు చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సాఫ్ట్‌బాల్, 30 మధ్యాహ్నం 2గంటలకు తుమ్మలగుంట తుడా పార్కు మైదానంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న బాలబాలికలు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా 10వ తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.

క్రీడాకారులకు నగదు పురస్కారాలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో క్రీడాకారులకు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య కె. గంగాధరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల నిర్వహణకు వసతులు ఉన్నాయని గుర్తుచేవారు. క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయం అన్నారు. మరిన్ని పతకాలు సాధించి వర్సిటీ ప్రతిష్టను పెంచాలని కోరారు. ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో కాంస్య పతకం సాధించడంతోపాటు ప్యారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం విద్యార్థిని వై.జ్యోతికి రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. క్రీడా శాఖ ఆధ్వర్యంలోని వివిధ కళాశాలల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన క్రీడా అధ్యాపకులను సన్మానించారు.

సాక్షి ప్లస్
బుధవారం ॥ 25-9-2024

సాగుబడి

ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: 27 నుంచి

సేంద్రియ కర్బనం 6%కి.. ఒక్క ఏడాదిలోనే!



మట్టిలో సత్తువను లేదా ఉత్పాదక శక్తిని కొలిచేందుకు ఒక సాధనం సేంద్రియ కర్బనం (సాయిల్ ఆర్గానిక్ కార్బన్). ఇది మన భూముల్లో 0.2 నుంచి 0.5 మధ్యలో ఉంది. ఈ భూముల్లో పండించిన ఆహారంలో పోషకాల సాంద్రత లోపించి, ఆ ఆహారం తిన్నవారికి పౌష్టికాహార లోపం వస్తోంది. పదేళ్లు శ్రమించి 2%కి పెంచుకోవటమే రైతులకు కష్టమవుతోంది. అయితే, సేంద్రియ కర్బనాన్ని ఒక్క ఏడాదిలోనే 6 శాతానికి పెంచుకునే 'అద్భుత సజీవ సేద్య పద్ధతుల'ను కనిపెట్టాం. ట్యూబు జీవామృతం, కార్బన్ ఎన్‌రిచ్‌డ్ కంపోస్టు ద్వారా ఇది సాధ్యమే. రసాయనిక వ్యవసాయం నుంచి సేంద్రియ వ్యవసాయానికి మారే రైతులు తొలి ఏడాదిలోనే దిగుబడి పెంచుకునేందుకు ఈ పద్ధతులు తోడ్పడుతున్నాయి.

– మహేశ్ మహేశ్వరి, ఆవిష్కర్త, అహ్మదాబాద్

క్లైమెట్ మర్మాలు 1



వెదర్ Vs క్లైమెట్

భూ గ్రహంపై తాపం తీవ్రమవుతున్న సంక్షోభ వేళ క్లైమెట్ ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో క్లైమెట్‌కు సంబంధించిన విషయాలను ప్రజలంతా అర్థం చేసుకుంటే భూతాపాన్ని తగ్గించడానికి సంబంధించిన కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించే అవకాశం ఉంటుంది. ఈ విషయాలు అర్థం కావాలంటే పడికట్టు పదాలకు అసలైన అర్థాలు తెలుసుకోవటం అవసరం. వారానికో పదం లేదా పదబంధం గురించి ... మాటల మర్మాలు.. మీ కోసం..

వెదర్, క్లైమెట్.. ఈ రెండు మాటలకు సాధారణ అర్థం వాతావరణం అనే! అయితే, రెండిటి మధ్యా వ్యత్యాసం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఒక ప్రాంతంలో స్వల్పకాలిక వాతావరణ స్థితిగతుల గురించి వెదర్ చెబితే.. దీర్ఘకాలంలో వాతావరణంలో వస్తున్న మార్పుల గురించి క్లైమెట్ చెబుతుంది.

వెదర్.. ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిర్దిష్ట సమయంలో నెలకొన్న ఉష్ణోగ్రత, గాలిలో తేమ, వర్షం, మేఘాలు, గాలి తదితర వాతావరణ పరిస్థితులను గురించి చెప్పేటప్పుడు వెదర్ అనే పదం వాడుతుంటాం. వాతావరణ స్థితిగతులు ఎక్కడైనా విడిగా తమంతట తాము ఏర్పడేవి కాదు. ఒక ప్రాంతంలోని స్థానిక వాతావరణ పరిస్థితులు ఇతర ప్రాంతాల వాతావరణంపై ప్రభావం చూపుతాయి. చివరికి వందలు – వేల కిలోమీటర్ల దూరంలోని వాతావరణాన్ని సైతం ప్రభావితం చేస్తాయి.

క్లైమెట్.. ఒక నిర్దిష్ట ప్రాంతంలోని వాతావరణ పరిస్థితుల్లో సుదీర్ఘ కాలంలో (సాధారణంగా 30 లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలలో) వచ్చిన సగటు మార్పుల గురించి 'క్లైమెట్' చెబుతుంది. వాతావరణ వ్యవస్థ సంపూర్ణ స్థితిని వివరిస్తుంది.

ఈ పారిశ్రామిక యుగంలో, మరీ ముఖ్యంగా గత శతాబ్దంలో, మానవుల కార్యకాలాపాలు హానికరమైన హరిత గృహ వాయువుల విడుదల ద్వారా మన గ్రహం పైన వాతావరణాన్ని తీవ్రస్థాయిలో మార్చివేశాయి.

భూతాపం తగ్గుతుందా? ఆహార లభ్యత పెరుగుతుందా?

అర్బన్ అగ్రికల్చర్‌పై యూనివర్సిటీ ఆఫ్ టొరంటో పరిశోధన

'నగరాల దగ్గరే పంటలు పండించుకోవటం ద్వారా స్థానిక ఆహార భద్రతను పెంపొందించుకోవటం ఎంత అవసరమో కరోనా మహమ్మారి తెలియజెప్పింది. ఆహారోత్పత్తిని లోకలైజ్ చేయటం, వైవిధ్యపూరితమైన పంటలు పండించడం.. తద్వారా ప్రకృతి వైపరీత్యాలను దీటుగా తట్టుకొనేలా ఆహార వ్యవస్థను తీర్చిదిద్దడం కూడా సాధ్యమవుతుంది'



అర్బన్ అగ్రికల్చర్‌లో ముఖ్యాంశం రూఫ్‌టాప్‌పై పంటలు పండించటం



ఇంటి పంట

ప్రపంచవ్యాప్తంగా వేగంగా నగరీకరణ జరుగుతున్న నేపథ్యంలో అర్బన్ అగ్రికల్చర్‌పై అనేక దేశాలు పరిశోధనలను ముమ్మరం చేస్తున్నాయి. అమెరికా, కెనడా, జర్మనీ, చైనా తదితర పెద్ద దేశాలతో పాటు క్యూబా వంటి చిన్న దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. పరిశోధనలు చేయటానికి నిధులు కూడా ఆయా దేశాల్లో పెద్ద ఎత్తున కేటాయిస్తున్నారు. కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ టొరంటో ఇటీవల ఓ భారీ పరిశోధనా ప్రాజెక్టును చేపట్టింది.

అర్బన్ అగ్రికల్చర్ నగరాల్లో ఆహార లభ్యతను పెంపొందించటంతో పాటు ఏ విధంగా కర్బన ఉద్గారాలను తద్వారా భూతాపాన్ని తగ్గించేందుకు దోహదపడతాయి? అనే అంశంపై పరిశోధనకు 15 మంది శాస్త్రవేత్తల బృందాన్ని నియమించటంతో పాటు 3.9 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 32.56 కోట్లు) కేటాయించారు. ఇందులో 15 మంది ఇప్పటికే అర్బన్ అగ్రికల్చర్‌పై అనేక పరిశోధనలు చేసిన యూనివర్సిటీ ఆఫ్ టొరంటోకి చెందిన వారే.

ఆహారోత్పత్తి, ఆహార పంపిణీ, భూ యాజమాన్యం వంటి అంశాలపై పనిచేస్తున్న సంస్థలతో కలిసి యూనివర్సిటీ ఆఫ్ టొరంటో చేపట్టిన ఈ పరిశోధన అర్థవంతమైన ఫలితాలనిస్తుందని ఆశిస్తున్నారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద ఏర్పాటయ్యే ఎత్తయిన మడుల నుంచి అపార్ట్‌మెంట్ భవనాల రూఫ్‌టాప్‌లపై సాగు చేసే పంటల ద్వారా పెద్ద నగరాల్లో అనేక రకాల తాజా పంట ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావటంతో పాటు భూతాపాన్ని పెంచుతున్న కర్బన ఉద్గారాలను తగ్గించటం సుసాధ్యమేనని యూనివర్సిటీ ఆఫ్ టొరంటో పరిశోధకులు భావిస్తున్నారు.

'అర్బన్ ప్రాంతాల్లో ఆహారోత్పత్తుల సాగుకు చాలా అవకాశం ఉంది. అయితే, ఎలా పెంచాలి, ఎక్కడ పెంచాలి, ఎటువంటి పంటలు నగరాల్లో, నగర పరిసరాల్లో సాగుకు అనుకూలంగా ఉంటాయన్న ప్రశ్నలకు మాకు పెద్దగా తెలియదు' ప్రొఫెసర్ మార్నీ ఇసాక్ అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ టొరంటో స్కార్‌బోరో క్యాంపస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్‌గా మార్నీ పనిచేస్తున్నారు. కార్బన్ డయాక్సయిడ్ వంటి కర్బన ఉద్గారాలను అర్బన్ వ్యవసాయం ఎంత బాగా తగ్గించగలుగుతుందనే విషయంలో కూడా శాస్త్రీయ అవగాహన తక్కువగానే ఉందన్నారామె.



టొరంటో (కెనడా) పరిసరాల్లోని ఓ అర్బన్ ఫామ్ మట్టిలో సేంద్రియ కర్బనం ఎంత ఉందో యంత్రంతో పరీక్షిస్తున్న ప్రొఫెసర్ మార్నీ ఇసాక్



టొరంటోలోని బ్లాక్ క్రీక్ కమ్యూనిటీ అర్బన్ ఫామ్ మట్టిలో సేంద్రియ కర్బనం ఎంతమేరకు ఉందో పరీక్షిస్తున్న పోస్ట్‌డాక్టోరల్ రీసెర్చర్ లుప్మీ సుజీవున్

ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలతో కలిసి చేపట్టిన ఈ పరిశోధనా ప్రాజెక్టుకు సారథిగా మార్నీ ఇసాక్ నియమితులయ్యారు.

కెనడాలోని టొరంటో నగర పరిసరాల్లోని పెద్ద వ్యవసాయ కమతాలు, చిన్న కమతాలు, ప్రభుత్వ భూములు, హైడ్రో కారిడార్లు, కమ్యూనిటీ గార్డెన్లు, గ్రీన్ రూఫ్స్, ఉపయోగంలో లేని స్థలాల్లో పరిశోధన చేపట్టారు.

'మేం తినే ఆహారంలో చాలా వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. కాబట్టి, అర్బన్ అగ్రికల్చర్ ద్వారా ఆహార భద్రత ఎంతవరకు చేకూరుతుందో తెలుసుకోవటం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది' అని సుస్థిర వ్యవసాయ నిపుణురాలు కూడా అయిన ప్రొఫెసర్ మార్నీ ఇసాక్ వివరించారు.

ఇంకా ఇలా అన్నారు.. 'నగరాల దగ్గరే పంటలు పండించుకోవటం ద్వారా స్థానిక ఆహార భద్రతను పెంపొందించుకోవటం ఎంత అవసరమో కరోనా మహమ్మారి తెలియజెప్పింది.

ఆహారోత్పత్తిని లోకలైజ్ చేయటం, వైవిధ్యపూరితమైన పంటలు పండించటం ద్వారా ప్రకృతి వైపరీత్యాలను దీటుగా తట్టుకొనేలా ఆహార వ్యవస్థను తీర్చిదిద్దడం కూడా సాధ్యమవుతుంది' అని మార్నీ వివరించారు.



కొత్త పంట

స్నేక్ ఫ్రూట్!




'స్నేక్ ఫ్రూట్' లేదా సలక్ ఫ్రూట్. శాస్త్రీయ నామం సలక్క జలక్క. అరెకేసియే కుటుంబం. ఈత, ఖర్జూర వంటి పామ్ జాతికి చెందిన ఒక రకం. ఇండోనేషియాలోని జావా, సుమత్ర ప్రాంతం దీని పుట్టిల్లు. ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఈశాన్య ఆసియా దేశాల్లో విస్తారంగా సాగులో ఉన్న పండు. లేత కాఫీ రంగులో ఉండే ఈ పండు పైన పొలుసు పాము చర్మంపై పొలుసులను పోలి ఉంటుంది. అందుకే కాబోలు, దీనికి స్నేక్ ఫ్రూట్ లేదా స్నేక్ స్కిన్ ఫ్రూట్ అంటారు. పండిన అంజూర పండు సైజులో, అదే ఆకారంలో స్నేక్ ఫ్రూట్ ఉంటుంది. పైపొర పెళుసుగా ఉంటుంది.

పైపొరను ఒలిస్తే లోపల తెల్లటి రెబ్బలు (వెల్లుల్లి రెబ్బల మాదిరిగా) ఉంటాయి. వాటి లోపల గోధుమ రంగు గింజలు ఉంటాయి. గింజలు తీసేసి ఈ రెబ్బల్ని తినాలి. రుచి గమ్మత్తుగా, విలక్షణంగా ఉంటుంది. ద ఫ్యూచర్ ఆఫ్ ద హెల్త్ అని, సూపర్ హీరోస్ ఆఫ్ ఫంక్షనాలిటీ అని దీన్ని వ్యవహరిస్తుంటారు. సలక్‌కు ఇంకా చాలా పేర్లున్నాయి. ఇండోనేషియాలో పొందో, థాయ్‌లాండ్‌లో రకం, చైనాలో సలక లేదా షి పై గ్యో జాంగ్, మయన్మార్‌లో ఇంగన్ అని పిలుస్తున్నారు.

న్యూ గినియ, ఫిలిప్పీన్స్, క్వీన్స్‌లాండ్, ఉత్తర ఆస్ట్రేలియా, పొనపె ఐలాండ్ (కారోలిన్ అర్చిపెలాగో), చైనా, సూరినామ్, స్పెయిన్, ఫిజి తదితర దేశాల్లో స్నేక్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్నారు. ఇండోనేషియాలోని ఇతర ప్రాంతాల్లో దీన్ని ఆహార పంటగా సాగు చేస్తున్నారు.

20 అడుగుల ఎత్తు

స్నేక్ ఫ్రూట్ చెట్టుకు కాండం చాలా చిన్నది. అయితే, కొమ్మలు పెద్దగా 20 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. ప్రతి కొమ్మకు ముళ్లతో కూడిన 2 మీటర్ల పొడవైన తొడిమె ఉంటుంది. ముల్లు 6 అంగుళాల వరకు పొడవుంటుంది. కొమ్మకు చాలా ఆకులుంటాయి. ఈ చెట్టు కాండానికి కాయలు గెలలుగా కాస్తాయి. ఆకు అడుగున లేత ఆకుపచ్చగా, పైన ముదురు ఆకుపచ్చగా ఉంటుంది. స్నేక్ ఫ్రూట్ మొక్క నాటిన తర్వాత 3–4 ఏళ్లలో కాపుకొస్తుంది.



ఇప్పుడు ముళ్లు లేని వంగడాలు కూడా వచ్చాయి. ఆడ చెట్లు, మగ చెట్లు ఉంటాయి. కొన్ని రకాల స్నేక్ ఫ్రూట్ చెట్లలో (ఉదా.. సలక్ బాలి) ఆడ, మగ పూలు రెండూ ఒకే చెట్టుకు పూసి స్వపరాగ సంపర్కం చెందుతాయి. పూలు గుత్తులుగా పూస్తాయి. ఆడ పూలు 20–30 సెం.మీ., మగవి 50–100 సెం.మీ. పొడవు ఉంటాయి. పరాగ సంపర్కం కోసం మగ పూలలో 20%ని మాత్రమే ఉంచి, మిగతావి తొలగించాలి. మనుషులు చేతులతో పరాగ సంపర్కం చేయిస్తే పండ్ల దిగుబడి పెరుగుతుంది.

తీపి కాదు, వగరు

సలక్క చెట్ల రకాలు 21 జాతులున్నాయి. మలేషియాలో మూడు రకాలను పెంచుతున్నారు. ఎస్.గ్లాబెరెసెన్స్, ఎస్. ఎడ్యులిస్, ఎస్.సుమత్రాన. ఎస్. గ్లాబెరెసెన్స్‌ను లోకల్ సలక్‌గా భావిస్తారు. దీని నుంచి 9 క్లోన్స్‌ను తయారు చేశారు. ఎస్. ఎడ్యులిస్, ఎస్.సుమత్రాన రకాలు ఇండోనేషియా నుంచి మలేషియాకు వచ్చాయి. ఇక ఇండోనేషియాలో దేశీయ, విదేశీ మార్కెట్ల కోసం వాణిజ్యపరంగా ఎస్. జటక్క, ఎస్. ఎడ్యులిస్, ఎస్.సుమత్రాన రకాలను సాగు చేస్తున్నారు. మనోంజయ, బొంగ్‌కాక్, బంజార్నెగర, కొండెట్, పొందో, బాలి, ఎన్‌రెంకంగ్, సైడెంపుయన్ వంటి అనేక రకాల స్నేక్ ఫ్రూట్ వంగడాలు సాగులో ఉన్నాయి. స్నేక్ ఫ్రూట్ తియ్యని పండు కాదు, కొంచెం వగరు. బొంగ్‌కాక్ రకం పండు మరీ ఎక్కువ వగరు. మిగతా రకాల కన్నా తక్కువ తీపి కలిగి ఉంటుంది.

50 ఏళ్ల పాటు దిగుబడి

స్నేక్ ఫ్రూట్‌ను విత్తనాలతో మొక్కలు పెంచి నాటుకోవాలి. అయితే, 50% మాత్రమే ఆడ మొక్కలు వస్తాయి. పండు నాణ్యత ఒకే స్థాయిలో ఉంటుంది. తల్లి మొక్క లక్షణాలు పూర్తిగా రావాలంటే మాత్రం పిలకలు నాటుకోవాలి. 6–12 నెలల వయసు మొక్కను పైన ఆకుల నుంచి కింది వేర్ల వరకు నిలువుగా చీల్చి నాటుకోవచ్చు. పిహెచ్ 4.7 – 7.5 వరకు తట్టుకుంటుంది. లేత మొక్క నీడలో బాగా పెరుగుతుంది. వాణిజ్యపరంగా సాగయ్యే తోటల్లో కొబ్బరి, డ్యూరియన్ చెట్ల నీడన ఈ మొక్కల్ని పెంచుతుంటారు. నాటిన 3–4 ఏళ్లకు కాపు ప్రారంభం అవుతుంది. ఈ చెట్టు 50 ఏళ్ల పాటు హెక్టారుకు 5–15 టన్నుల పండ్ల దిగుబడినిస్తుంది. ఏటా నాలుగు సార్లు పూత వచ్చినప్పటికీ ఏప్రిల్ – అక్టోబర్ మధ్యలోనే పండ్లు వస్తాయి.

మొక్కలు 60–70 సెం.మీ. ఎత్తు పెరిగిన 5–7 నెలల తర్వాత నాటుకోవాలి. గుంతలు 40×40×40 సెం.మీ. సైజులో తవ్వాలి. 1.5 × 3 మీటర్ల నుంచి 2 × 2 మీటర్ల దూరంలో నాటుకోవాలి. కొమ్మకత్తిరింపు, కలుపు తీత ప్రతి రెండు నెలలకోసారి చేస్తే పూత బాగా వస్తుంది. సరిగ్గా లేని లేదా పాడైన పండ్లను ఏడాదికి ఒకటి లేదా రెండు సార్లు చేయాల్సి ఉంటుంది. గుత్తికి 20–25 పండ్లు ఉంటే దిగుబడి లాభదాయకంగా ఉంటుంది. సాధారణంగా వర్షాధారంగానే పెరుగుతుంది. కొమ్మ కత్తిరించినప్పుడు, పండ్లు ఎదుగుతున్న దశలో, వేడి సీజన్లలో నీరు అందించాలి. పూత దశలో, పండ్ల కోతకు ముందు రోజుల్లో తగుమాత్రంగా నీరివ్వాలి. ఎక్కువ నీరిస్తే కుళ్లిపోతాయి. వాణిజ్యపరంగా సాగు చేసే తోటల్లో అధిక దిగుబడి కోసం కూలీలతో పాలినేషన్ చేయిస్తారు. పువ్వు గట్టిపడితే పాలినేషన్ సక్సెస్ అయ్యిందని గుర్తు. మెత్తగానే ఉండిపోతే ఫెయిలైనట్లు గుర్తించి తొలగిస్తారు.

పండు తగిన సైజు, రంగు వచ్చి, పండుపై ఉన్న సన్నని ముళ్లు ఊడిపోయిందంటే పక్వానికి వచ్చినట్లు గుర్తిస్తారు. పండు 70–80% పండినప్పుడు కూలీలతో పండ్లు కోయిస్తారు. తాజా పండ్ల మార్కెట్‌లో విక్రయించటంతో పాటు స్నేక్ ఫ్రూట్స్‌ను ఊరగాయ పచ్చడి పెడతారు. సుగర్, ఈస్ట్ కలిపి వైన్ తయారీలో కూడా స్నేక్ ఫ్రూట్స్ వాడుతున్నారు.



పుష్కలంగా పోషకాలు

స్నేక్ ఫ్రూట్‌లో ఇతర పండ్లతో పోల్చినప్పుడు అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. సుక్రోజ్ (7.6 గ్రా/100 గ్రా.), ఫ్రక్టోజ్ (3.9 గ్రా/100 గ్రా.), టోటల్ సుగర్ (17.4 గ్రా./100 గ్రా.), జీర్ణమయ్యే పీచు (0.3 గ్రా./100 గ్రా.), జీర్ణం కాని పీచు (1.4 గ్రా./100 గ్రా.), టోటల్ డైటరీ ఫైబర్ (1.7 గ్రా./100 గ్రా.), నీరు (80గ్రా./100 గ్రా.), కేలరీలు (77 కిలోకేలరీలు/ 100 గ్రా.), ప్రొటీన్ (0.7గ్రా./100 గ్రా.), బూడిద (0.6గ్రా./100 గ్రా.), కొవ్వు (0.1 గ్రా./100 గ్రా.). ఉన్నాయి.

సహజ పీచు, సుగర్స్‌కు స్నేక్ ఫ్రూట్ చక్కని వనరు. దీని గుజ్జులో మినరల్స్, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఫాస్ఫరస్ (1161 ఎంజీ/కేజీ), పొటాషియం (11.339 ఎంజీ/కేజీ), కాల్షియం (220 ఎంజీ/కేజీ), మెగ్నీషియం (607 ఎంజీ/కేజీ), సోడియం (231 ఎంజీ/కేజీ), ఐరన్ (12.0 ఎంజీ/కేజీ), మాంగనీసు (10.4 ఎంజీ/కేజీ), రాగి (3.36 ఎంజీ/కేజీ), బోరాన్ (5.07 ఎంజీ/కేజీ), సల్ఫర్ (5.07 ఎంజీ/కేజీ), అస్కార్బిక్ ఆసిడ్ (400 ఎంజీ/కేజీ), కెరోటిన్ (5 ఎంజీ/కేజీ), థయామిన్ (20 ఎంజీ/కేజీ), నియాసిన్ (240 ఎంజీ/కేజీ), రిబోఫ్లావిన్ (0.8 ఎంజీ/కేజీ), ఫొలేట్ (6 ఎంజీ/కేజీ) మేరకు ఉన్నాయి.

స్నేక్ ఫ్రూట్‌లో ఆరోగ్యదాయకమైన పీచు, పిండి పదార్థం నిండుగా ఉన్నాయి. ఇతర విదేశీ పండ్లతో పోల్చితే దీని గుజ్జులో పుష్కలంగా యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఈ పండును నేరుగా తినొచ్చు లేదా జ్యూస్ చేసుకొని తాగొచ్చు. డ్రైఫ్రూట్స్, పచ్చళ్లు, చిప్స్, ఊరబెట్టి కూడా వాడుకుంటున్నారు. పొందో (ఇండోనేషియన్ సలక్) రకం లేత కాయలను గింజలతో సహా తినొచ్చు. స్నేక్ ఫ్రూట్ ఆకులను, రెమ్మలను కూడా చాపలు, బుట్టల అల్లికకు వాడుతున్నారు.

నిర్వహణ: **పంతంగి రాంబాబు** సాగుబడి డెస్క్

మీకు తెలుసా?



భూమిపైన 1 సెంటీ మీటర్ మట్టి సహజంగా ఏర్పడటానికి 1,000 సంవత్సరాలు పడుతుంది!

బహుళ ప్రయోజనకారి బయోఎంజైమ్



బయోఎంజైమ్.. ఇంట్లోనే సులువుగా తయారు చేసుకోదగినది. అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. బెలం, పండ్ల తొక్కలు, నీరు.. ఈ మూడింటిని 1:3:7 పాళ్లలో కలిపి.. బాటిళ్లలో నిల్వచేసి మూత గట్టిగా బిగించాలి గాలి పోకుండా.

మూడు నెలల్లో చక్కటి సేంద్రియ ద్రావణం (బయోఎంజైమ్) తయారవుతుంది. దీన్ని పంటలు/ మొక్కలకు నేలలో గ్రోత్ పమోటర్‌గా 1:20 నిష్పత్తిలో నీటిని కలిపి పోయవచ్చు. 1:10 పాళ్లలో నీరు కలిపి మొక్కలపై పిచికారీ చేయొచ్చు.

బత్తాయి, నిమ్మ, నారింజ వంటి సిట్రస్ జాతి పండ్ల తొక్కలు.. అరటి పండ్ల తొక్కలు.. ఉల్లిపాయ తొక్కలు.. లేదా రకరకాల పండ్ల తొక్కలు కలిపి బయోఎంజైమ్‌ను తయారు చేసుకోవచ్చు. ఇవి అద్భుతమైన పోషకాలను అందించటమే కాకుండా చీడపీడల నియంత్రణకు ఉపయోగపడతాయి.

ఇంకెందుకు ఆలస్యం.. ట్రై చెయ్యండి.. పండ్ల తొక్కలను చెత్తలో పారేయకుండా!

సాక్షి ప్లస్
బుధవారం । 25-9-2024

బిజినెస్ రీల్

ఎంటార్‌కి రూ. 15 కోట్ల ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిఫెన్స్ అవసరాలకు సంబంధించి అధునాతన ఇంజిన్ టెక్నాలజీల తయారీ కోసం కంబస్టర్లు సరఫరా చేసేందుకు రూ. 15.4 కోట్ల ఆర్డరు లభించినట్లు ఎంటార్ టెక్నాలజీస్ వెల్లడించింది. నిబంధనల ప్రకారం ఈ కాంట్రాక్టును 2025 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు వివరించింది. కంపెనీకి హైదరాబాద్‌లో ఏడు తయారీ యూనిట్లు ఉన్నాయి.

ఎయిర్‌బస్-టాటా స్ట్రయివ్ కేంద్రాల ఆవిష్కరణ

న్యూఢిల్లీ: నైపుణ్యాల అభివృద్ధిలో శిక్షణకు సంబంధించి ఎయిర్‌బస్-టాటా స్ట్రయివ్ కేంద్రాలను కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ప్రారంభించారు. పరిశ్రమ, జాబ్ మార్కెట్ అవసరాలకు తగ్గట్లుగా నైపుణ్యాల శిక్షణ ఉండాలని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ దిశగా ఉన్నత విద్యా సంస్థలతో భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఇరు సంస్థలకు చౌదరి సూచించారు. మరోవైపు అందరికీ ఉద్యోగాలు లభించకపోతుండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు పెరుగుతుండవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో యువతలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఢిల్లీ, బెంగళూరులో ఏర్పాటు చేసిన ఎయిర్‌బస్-టాటా స్ట్రయివ్ సెంటర్లలో సైబర్‌సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, వెబ్ డిజైనింగ్ వంటి కోర్సుల్లో వచ్చే మూడేళ్ల వ్యవధిలో ఆర్థికంగా వెనుకబడిన 900 మందికి శిక్షణనివ్వనున్నట్లు ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ రెమి మైయార్డ్ తెలిపారు. టాటా కమ్యూనిటీ ఇనీషియేటివ్స్ ట్రస్ట్‌లో భాగంగా నైపుణ్యాల్లో శిక్షణ కల్పించే విభాగంగా 2014లో టాటా స్ట్రయివ్ ఏర్పాటైంది. 2022 నుంచి ఎయిర్‌బస్ ఇండియా, టాటా స్ట్రయివ్ కలిసి పని చేస్తున్నాయి.

నిరుద్యోగ రేటు 3.2 శాతం

2023 జూలై 2024 జూన్ మధ్య స్థిరం

న్యూఢిల్లీ: నిరుద్యోగ రేటు 2023 జూలై నుంచి 2024 జూన్ కాలంలో స్థిరంగా 3.2 శాతం వద్దే కొనసాగినట్టు నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ నిర్వహించిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే'లో వెల్లడైంది. 15 ఏళ్లు, అంతకుమించి వయసులోని కార్మికుల వివరాలను గమనిస్తే.. నిరుద్యోగ రేటు పురుషుల్లో 3.2 శాతానికి తగ్గింది. 2022 జూలై నుంచి 2023 జూన్ కాలంలో ఇది 3.3 శాతంగా ఉంది. కార్మిక శక్తి భాగస్వామ్య రేటు ఇదే కాలంలో 57.9 శాతం నుంచి 60.1 శాతానికి పెరిగింది. పురుష కార్మికుల భాగస్వామ్యం 78.8 శాతంగా ఉంటే, మహిళల వైపు నుంచి ఇది 41.7 శాతంగా ఉంది. అంతకుముందు ఏడాది కాలంలో మహిళా కార్మికుల భాగస్వామ్యం 37 శాతం కాగా, పురుష కార్మికుల భాగస్వామ్య రేటు 78.5 శాతంగా ఉండడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-9-2024	
విశాఖ	555-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	160.65	4.32
HINDALCO	719	4.12
POWERGRID	350.6	2.77
TECHM	1,638.75	1.97
ADANIENT	3,100.45	1.86

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,866.70	-2.78
HINDUNILVR	2,952.65	-2.51
GRASIM	2,624.00	-1.61
ULTRACEMCO	11,781.25	-1.51
SHRIRAMFIN	3,518.00	-1.39

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,285
ఎన్ఎస్ఈ	1,25,748
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,49,264
ఎఫ్ఐఐ	- 2,784
డీఐఐ	+ 3,868

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.50	$ 70.37
బ్రెంట్	74.28	$ 73.21

కార్పొరేట్ల నుంచి

రూ.4 లక్షల కోట్ల రుణ డిమాండ్

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి



న్యూఢిల్లీ: భారత్ కార్పొరేట్ రంగం నుంచి ఎస్‌బీఐకి దాదాపు రూ.4 లక్షల కోట్ల పటిష్ట రుణ డిమాండ్ ఉందని ఎస్‌బీఐ చీఫ్ సీఎస్ శెట్టి ఒక ఇంటర్వ్యూలో తెలపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రైవేట్ రంగం మూలధన వ్యయం పెరుగుతుందన్న ఆశాభావాన్ని సీఎస్ శెట్టి వ్యక్తం చేశారు. 'మా బ్యాంక్ ప్రైవేట్ మూలధన వ్యయంపై మంచి ఆసక్తిని గమనిస్తోంది. మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్ ఇందులో కీలకమైనది. ప్రధానంగా రోడ్లు, పునరుత్పాదక ఇంధనం, కొన్ని రిఫైనరీల నుండి రుణ డిమాండ్ ఉంది'' అని అన్నారు.

సంక్షేమ కార్యక్రమాలకు ఎస్‌బీఐ దన్ను

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కమ్యూనిటీ సంక్షేమ, పర్యావరణహిత కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తోందని హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. ఇందులో భాగంగా దృష్టి లోపం ఉన్న వారి అభ్యున్నతికి పాటుపడుతున్న దేవనార్ ఫౌండేషన్‌కి బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి రూ. 51 లక్షల విరాళాన్ని అందించారు. ఫైర్‌ఫైటింగ్ సిస్టం, రూఫ్‌టాప్ సోలార్ ఫొటోవోల్టెయిక్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. మరోవైపు, ప్రకృతిని పరిరక్షించుకునేందుకు చేస్తున్న కృషిలో భాగంగా బ్యాంకు నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలోనూ శెట్టి పాల్గొన్నారు. గ్రామీణ భారత ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాలను చేపట్టే కార్యక్రమాలను ఎస్‌బీఐ ఫౌండేషన్ నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. అటు స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజీలో విజిలెన్స్ వర్క్‌షాప్‌ను శెట్టి ప్రారంభించారు.

ఐపీవోల హవా



- 2 కంపెనీలకు సెబీ గ్రీన్‌సిగ్నల్
- వారీ ఇంజినీర్స్, మొబిక్విక్‌కు సై
- కాసాగ్రాండ్ ప్రీమియర్ దరఖాస్తు
- నవంబర్‌లో ఎన్‌టీపీసీ గ్రీన్ రెడీ

రోజుకో కొత్త గరిష్టాన్ని తాకుతున్న సెకండరీ మార్కెట్ల బాటలో ప్రైమరీ మార్కెట్లు సైతం భారీ సంఖ్యలో ఇష్యూలతో కదం తొక్కుతున్నాయి. తాజాగా రెండు కంపెనీలకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. మరో రెండు కంపెనీలు ఐపీవో సన్నాహాల్లో ఉన్నాయి. వివరాలు ఇలా..

-సాక్షి, బిజినెస్‌డెస్క్

ఐపీవో చేపట్టేందుకు సోలార్ ప్యానళ్ల తయారీ కంపెనీ వారీ ఇంజినీర్స్.. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి పొందింది. ఇదేవిధంగా డిజిటల్ పేమెంట్ల సంస్థ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూకి సైతం సెబీ ఆమోదముద్ర వేసింది. వారీ సెబీకి 2023 డిసెంబర్‌లో, మొబిక్విక్ 2024 జనవరిలో దరఖాస్తు చేశాయి.

వారీ ఇంజినీర్స్.. రూ. 3,000 కోట్లకుపైగా



వారీ ఇంజినీర్స్ ఐపీవోలో భాగంగా రూ. 3,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా 32 లక్షల షేర్లను ప్రమోటర్‌తోపాటు ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను ఒడిషాలో 6 గిగావాట్ల ఇన్‌గాట్ వేఫర్, సోలార్ సెల్, సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ 2023 జూన్‌కల్లా 12 గిగావాట్ల పీవీ మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది.

మొబిక్విక్.. రూ. 700 కోట్లు



తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా మొబిక్విక్ రూ. 700 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. తద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సై అంటోంది. ఐపీవో నిధుల్లో రూ. 250 కోట్లు ఫైనాన్షియల్ సర్వీసుల బిజినెస్ వృద్ధికి వినియోగించనుంది. రూ. 135 కోట్లు పేమెంట్ సర్వీసుల బిజినెస్‌కు దన్నుగా వెచ్చించనుంది. మరో రూ. 135 కోట్లు డేటా, మెషీన్ లెర్నింగ్, ఏఐ, ప్రొడక్ట్ టెక్నాలజీలపై ఇన్వెస్ట్ చేయనుంది. ఈ బాటలో పేమెంట్ పరికరాలపై రూ. 70 కోట్లు పెట్టుబడి వ్యయాలుగా కేటాయించనుంది.

రూ. 10,000 కోట్లపై కన్ను



విద్యుత్ రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌టీపీసీ అనుబంధ కంపెనీ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ భారీ ఐపీవోకు సిద్ధపడుతోంది. ఇందుకు అనుగుణంగా గత వారమే సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. తద్వారా నవంబర్ తొలి వారంలో ఐపీవోకు వచ్చే వీలున్నట్లు తెలుస్తోంది. ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవో ద్వారా రూ. 10,000 కోట్లు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ముంబైసహా.. సింగపూర్ తదితర దేశాలలో రోడ్‌షోలకు ప్రణాళికలు వేసింది. ఇష్యూ నిధుల్లో రూ. 7,500 కోట్లు అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ రెనెవబుల్ ఎనర్జీ రుణ చెల్లింపులతోపాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఈ మహారత్న కంపెనీ 2024 ఆగస్టుకల్లా 3,071 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు, 100 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులను కలిగి ఉంది. ఈ ఏడాది ఇప్పటికే 60 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వచ్చిన నేపథ్యంలోనూ మరిన్ని కంపెనీలు ఇందుకు తెరతీస్తుండటం విశేషం!

ఇదే బాటలో లీలా ప్యాలెస్

లీలా ప్యాలెస్ హోటళ్ల నిర్వాహక సంస్థ ష్లాస్ బెంగళూరు లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. తద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. వెరసి దేశీ ఆతిథ్య రంగంలో అతిపెద్ద ఐపీవోగా నిలవనుంది. కాగా.. ఇష్యూలో భాగంగా లీలా ప్యాలెస్ రూ. 3,000 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్ సంస్థ డీఐఎఫ్‌సీ రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థల రుణ చెల్లింపులకు, ఇతర సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ దన్నుగల ష్లాస్ బెంగళూరు వెల్లడించింది.



2024 మార్చికల్లా కంపెనీ రుణ భారం రూ. 4,053 కోట్లుగా నమోదైంది. ద లీలా బ్రాండ్‌తో కంపెనీ విలాసవంత హోటళ్లను నిర్వహిస్తున్న విషయం విదితమే. మొత్తం 3,382 గదులను కలిగి ఉంది.

రూ. 1,100 కోట్ల సమీకరణ



రియల్టీ కంపెనీ కాసాగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలకు తెరతీసింది. ఇందుకు వీలుగా సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 1,100 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధులను కంపెనీతోపాటు అనుబంధ సంస్థల రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కాసాగ్రాండ్ బ్రాండుతో కంపెనీ రియల్టీ అభివృద్ధి కార్యకలాపాలు చేపడుతోంది. 2023-24లో రూ. 2,614 కోట్ల ఆదాయం, రూ. 257 కోట్ల నికర లాభం ఆర్జించింది.

నెక్సాన్ సీఎన్‌జీ వచ్చేసింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ నెక్సాన్ టర్బోచార్జ్‌డ్ ఐసీఎన్‌జీ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఎనిమిది వేరియంట్లలో లభిస్తుంది. ధర ఎక్స్‌షోరూంలో రూ.8.99 లక్షలతో ప్రారంభమై రూ.14.59 లక్షల వరకు ఉంది. 1.2 లీటర్ త్రీ సిలిండర్ ఇంజన్‌తో తయారైంది. కేజీకి 24 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది. మాన్యువల్ గేర్‌బాక్స్, ఆరు ఎయిర్‌బ్యాగ్స్, ఎల్రక్టానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ స్టాండర్డ్ ఫీచర్లు. 321 లీటర్ల బూట్ స్పేస్ ఉంది. టాప్ వేరియంట్‌కు 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ సన్‌రూఫ్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ టచ్‌స్క్రీన్, వైర్‌లెస్ చార్జర్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, టైర్ ప్రెజర్ మానిటర్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్స్, ఆటో హెడ్‌లైట్, ఆటో వైపర్స్ వంటివి జోడించారు.

ఈవీ 489 కిలోమీటర్లు..

టాటా మోటార్స్ తాజాగా 45 కిలోవాట్ అవర్ బ్యాటరీతో కూడిన నెక్సాన్ ఈవీని పరిచయం చేసింది. ధర రూ.13.99 లక్షల నుంచి రూ.16.99 లక్షల వరకు ఉంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 489 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. 48 నిముషాల్లో 80 శాతం చార్జింగ్ పూర్తి అవుతుంది. 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, టచ్ బేస్డ్ ఏసీ ప్యానెల్, సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, 6 ఎయిర్‌బ్యాగ్స్, 360 డిగ్రీ కెమెరా, ఎల్రక్టానిక్ స్టెబిలిటీ కంట్రోల్, పార్కింగ్ సెన్సార్స్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ వంటి ఫీచర్లు జోడించారు. కాగా, టాటా మోటార్స్ నెక్సాన్ ఈవీ రెడ్ డార్క్ ఎడిషన్‌ను రూ.17.19 లక్షల ధరతో ప్రవేశపెట్టింది.

అక్టోబర్‌లో 'రేటు' తగ్గొచ్చు: ఎస్అండ్‌పీ

న్యూఢిల్లీ: సరళతర వడ్డీరేట్ల విధానానికి తెరతీస్తూ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటు (ప్రస్తుతం 6.5 శాతం) అక్టోబర్‌లో తగ్గే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం- ఎస్అండ్‌పీ అభిప్రాయపడింది. అక్టోబర్ 7 నుంచి 9 మధ్య ఆర్‌బీఐ కీలక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నేపథ్యంలో ఎస్అండ్‌పీ ఈ అంచనాలకు వచ్చింది. 2024-25లో 6.8 శాతం, 2025-26లో 6.9 శాతం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు నమోదయ్యే అవకాశం ఉందని ఎస్అండ్‌పీ విశ్లేషించింది. 2023-24లో ఎకానమీ 8.2 శాతం వృద్ధి సాధించిన సంగతి తెలిసిందే. 2025 మార్చి నాటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.11.11 లక్షల కోట్ల బడ్జెటరీ మూలధన వ్యయాలు ఎకానమీకి ఊతం ఇచ్చే అంశంగా పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సగటున రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా ఉంటుందని అంచనావేసింది.

14ఏళ్లలో సెప్టెంబర్ బిజీ..బిజీ

ఐపీవోలకు 28 కంపెనీలు

ఈ నెల(సెప్టెంబర్) 14 ఏళ్ల తదుపరి సరికొత్త రికార్డుకు వేదిక కానుంది. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) వివరాల ప్రకారం సెప్టెంబర్‌లో ఇప్పటివరకూ 28 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి. మెయిన్ బోర్డ్, ఎస్ఎంఈలు కలిపి ఇప్పటికే 28 కంపెనీలు లిస్టింగ్‌కు తెరతీశాయి. ఫైనాన్షియల్ మార్కెట్లు పరివర్తనలో ఉన్నట్లు ఆర్థిక వ్యవస్థపై రూపొందించిన సెప్టెంబర్ బులెటిన్‌లో ఆర్‌బీఐ పేర్కొంది. ప్రైమరీ ఈక్విటీ మార్కెట్‌లో చిన్న, మధ్యతరహా సంస్థలు(ఎస్ఎంఈలు)సహా భారీ సందడి నెలకొన్నట్లు తెలియజేసింది. వెరసి 14 ఏళ్ల తరువాత ఈ సెప్టెంబర్ అత్యంత రద్దీగా మారినట్లు వ్యాఖ్యానించింది. దేశీ మ్యూచువల్ ఫండ్స్ తదితర ఇన్వెస్టర్ల ద్వారా ఇష్యూలు భారీస్థాయిలో సబ్‌స్క్రయిబ్ అవుతున్నట్లు వివరించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పరిశీలన ప్రకారం ఐపీవోలలో లభించిన షేర్లలో 54 శాతాన్ని ఇన్వెస్టర్లు లిస్టయిన వారం రోజుల్లోనే విక్రయించారు. 2024లో ఐపీవోల ద్వారా నిధుల సమీకరణ జోరు చూపుతున్నట్లు ఆర్‌బీఐ నివేదిక పేర్కొంది. ఈ బాటలో తొలి అర్ధభాగానికల్లా ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఐపీవోలు వెలువడిన దేశంగా భారత్ నిలిచినట్లు తెలియజేసింది. ఇందుకు ఎస్ఎంఈలు ప్రధానంగా దోహదపడినట్లు వెల్లడించింది.

నూనెల ధర ఎందుకు పెరిగింది?

కంపెనీల వివరణ కోరిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: వంటనూనెల రిటైల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఎడిబుల్ ఆయిల్ కంపెనీలను ప్రభుత్వం వివరణ కోరింది. పాత సుంకాల ఆధారంగా దిగుమతి చేసుకున్న నూనెల నిల్వలు తగినంత ఉన్నందున ధరలు స్థిరంగా ఉంచాలని ఈ సందర్భంగా సూచించింది. ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై 20 శాతం దిగుమతి సుంకం (బేసిక్ కస్టమ్స్ డ్యూటీ) విధిస్తూ కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 14న నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు వీటిపై ఎటువంటి సుంకం లేదు. అలాగే శుద్ధి చేసిన పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాన్ని ప్రస్తుతం ఉన్న 12.5 నుంచి 32.5 శాతానికి పెంచారు.

దిగుమతి సుంకంతోపాటు అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డెవలప్‌మెంట్ సెస్‌తోపాటు సోషల్ వెల్ఫేర్ సర్‌చార్జ్ అదనం. 'వచ్చే పండుగ సీజన్‌లో రిటైల్ ధరలను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. దిగుమతి సుంకం పెంపు ప్రకటన నుండి ధరలు ఎందుకు పెరుగుతున్నాయనే దానిపై కారణాలను వెల్లడించాలని పరిశ్రమను ప్రభుత్వం కోరింది' అని ఆహార మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. తక్కువ సుంకాలతో దిగుమతి చేసుకున్న నూనెలు సుమారు 30 లక్షల టన్నుల నిల్వ ఉందని, ఇవి సులభంగా 45-50 రోజుల డిమాండ్‌ను తీరుస్తాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. అందువల్ల ప్రాసెసింగ్ కంపెనీలు గరిష్ఠ రిటైల్ ధరలను పెంచడం మానుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ల్యాప్‌టాప్ 'దిగుమతులకు' డిసెంబర్ 31 వరకు గడువు

న్యూఢిల్లీ: ల్యాప్‌టాప్‌లు, ఐటీ హార్డ్‌వేర్ ఉత్పత్తుల దిగుమతులకు ప్రస్తుతమున్న అనుమతుల ప్రక్రియను డిసెంబర్ 31వరకు పొడిగిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ఈ గడువు సెప్టెంబర్ 30వరకే ఉంది. 2023-24లో 9.5 బిలియన్ డాలర్ల విలువ మేర దిగుమతులకు ప్రభుత్వ అనుమతులు మంజూరు చేయగా, వాస్తవ దిగుమతులు 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఎక్కువ భాగం చైనా నుంచే రావడం గమనార్హం. ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, ఆల్ ఇన్ వన్ పర్సనల్ కంప్యూటర్లు, అల్ట్రా స్మాల్ ఫామ్ ఫ్యాక్టర్ కంప్యూటర్ల దిగుమతులపై 2023 ఆగస్ట్ 3న కేంద్రం ఆంక్షలు



విధించింది. దీంతో స్థానికంగా వీటి సరఫరా సమస్యలు ఏర్పడతాయన్న పరిశ్రమ ఆందోళనతో, ప్రభుత్వం నుంచి అనుమతితో దిగుమతికి వీలు కల్పించింది.

తయారీకి బంగారు భవిష్యత్

- 'మేక్ ఇన్ ఇండియా'కి పదేళ్లు
- ఈ దిశగా గొప్ప విజయం సాధించాం
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ/సిడ్నీ: భారత్‌లో తయారీ కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో దేశంలో తయారీకి అద్భుతమైన భవిష్యత్ ఉందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మోదీ సర్కారు 2014 సెప్టెంబర్ 25న ప్రారంభించింది. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతోపాటు. తయారీ, డిజైన్, ఆవిష్కరణలకు భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాలు ఇందులో భాగంగా ఉన్నాయి. వ్యాపార సులభతర నిర్వహణ, అవినీతిని ఉపేక్షించకపోవడం, ఎల్రక్టానిక్స్ తదితర వర్ధమాన రంగాలపై దృష్టి సారించడం 'మేక్ ఇన్ ఇండియా' (భారత్‌లో తయారీ) విజయవంతం అయ్యేలా చేసినట్టు ప్రకటించారు. ఇది దేశంలో స్థానిక, విదేశీ పెట్టుబడులు ఇతోధికం కావడానికి సాయపడినట్టు చెప్పారు. భారీ పెట్టుబడుల ప్రణాళికలను చూస్తున్నామంటూ.. వీటి రాకతో లక్షలాది ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, దేశ ఆర్థిక వ్యవస్థలో తయారీ పాత్ర మరింత పెరుగుతుందని సిడ్నీ పర్యటనలో ఉన్న గోయల్ ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ విధాన నిర్ణయాల ఫలితం..

స్థానికంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల సెంటిమెంట్ బలహీనంగా ఉన్న తరుణంలో మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మోదీ సర్కారు చేపట్టినట్టు మంత్రి గోయల్ గుర్తు చేశారు. ''అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ట కొంత క్షీణించింది. బలహీన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా పేర్కొనేవారు. దీంతో ఇన్వెస్టర్ల విశ్వాసం తిరిగి పొందేందుకు ప్రభుత్వానికి కొంత సమయం పట్టింది. ఒకటే దేశం ఒకటే పన్ను - జీఎస్‌టీ, ఐబీసీ, పారదర్శకంగా గనుల వేలం తదితర ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో అది సాధ్యపడింది'' అని మంత్రి గోయల్ వివరించారు. స్థిరమైన, స్పష్టమైన విధానాలతో ఇన్వెస్టర్లలో విశ్వాసం ఏర్పడేలా చేసినట్టు చెప్పారు. ఈ చర్యలతో వ్యాపార సులభతర నిర్వహణలో భారత్ స్థానం 14 స్థానాలు మెరుగుపడి 190 దేశాల్లో 63కు చేరినట్టు తెలిపారు. 2020లో పీఎల్ఐ పథకాన్ని ప్రారంభించి, ఎన్నో రంగాల్లో తయారీకి ప్రోత్సాహకాలు కల్పించినట్టు చెప్పారు. ''పదేళ్ల తర్వాత నాటి చర్యల ఫలితాలను చూస్తున్నాం. భవిష్యత్‌పై ఉత్సాహంతో ఉన్నాం. మొబైల్స్ తయారీలో ఎంతో పురోగతి సాధించాం. ప్రపంచంలో ఇప్పుడు రెండో అతిపెద్ద మొబైల్స్ తయారీ కేంద్రంగా ఉన్నాం'' అని వివరించారు. టెక్స్‌టైల్స్, సిరామిక్స్, ఆటబొమ్మలు, ప్లాస్టిక్స్, కెమికల్స్, ఫార్మా రంగాల్లో దేశీ సామర్థ్యాలు ఇనుమడించాయన్నారు. దేశ అవసరాలు తీర్చడంతోపాటు ఎగుమతులు 2023-24లో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 778 బిలియన్ డాలర్లకు చేరుకునేలా సాయపడినట్టు మంత్రి తెలిపారు. కరోనా మహమ్మారి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రెడ్‌సీ సంక్షోభాల్లోనూ దేశ జీడీపీలో తయారీ రంగం వాటా యథావిధిగా కొనసాగుతున్నట్టు చెప్పారు.

విదేశీ పెట్టుబడుల ఆకర్షణ

అంతరిక్షం, బొగ్గు తవ్వకం, ఈ-కామర్స్, ఫార్మా, పౌర విమానయానం, కాంట్రాక్టు తయారీ తదితర రంగాల్లో స్థానిక తయారీ ప్రోత్సాహం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ఆకర్షణకు చర్యలు తీసుకున్నట్టు మంత్రి గోయల్ తెలిపారు. గడిచిన పది ఆర్థిక సంవత్సరాల్లో ఎఫ్‌డీఐ రాక, అంతకుముందు పదేళ్ల (యూపీఏ హయాం) కాలంతో పోల్చి చూస్తే 119 శాతం పెరిగి 667 బిలియన్ డాలర్లకు చేరుకుందని, ఇందులో 90 శాతం ఆటోమేటిక్ మార్గంలోనే వచ్చిందన్నారు.



భారత్- ఆస్ట్రేలియా బిజినెస్ అండ్ కమ్యూనిటీ అలయన్స్ (ఐఏబీసీఏ) సిడ్నీలో నిర్వహించిన 'ఎమర్జింగ్ బిజినెస్ లీడర్స్ రిసెప్షన్'లో సెల్ఫీలకు పోజులిచ్చిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.

ఆర్‌బీఐ దృష్టికి రియల్టర్ల నిధుల సమస్యలు

రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న రుణ లభ్యత సమస్యలను ఆర్‌బీఐ దృష్టికి తీసుకెళతానని మంత్రి పీయూష్ గోయల్ హామీ ఇచ్చారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో (మున్సిపాలిటీలు) మాట్లాడతానని భరోసా ఇచ్చారు. రెరా చట్టం రియల్ ఎస్టేట్ పరిశ్రమలో పారదర్శకతను తీసుకొచ్చినట్టు చెప్పారు. జాతి నిర్మాణ అవసరాలు, ఉపాధి కల్పన, జీడీపీలో పన్నుల పరంగా వాటా.. ఇలా రియల్ ఎస్టేట్ రంగం గొప్ప పాత్ర పోషిస్తోందని మంత్రి మెచ్చుకున్నారు.


జీఎస్ లక్ష్మి

అందరూ మహిళలే...

నారీ లోకం ప్రపంచకప్ కార్యసిద్ధికి సర్వసైన్యంతో నడుంబిగిస్తోంది. ఆ మెగా ఈవెంట్‌ను అంతా అతివలే చక్కబెట్టేందుకు సిద్ధమయ్యారు. టాస్ వేయడం, బ్రాడ్ కాస్టర్ మైక్‌తో కెప్టెన్ నిర్ణయమేంటో తెలుసుకోవడం, వ్యాఖ్యతలు, ఫీల్డ్ అంపైర్లు, థర్డ్ అంపైర్, మ్యాచ్ రిఫరీ ఇలా ఆది అంతం అంతా మహిళలే చూసుకుంటారు. యూఏఈలో ఇంకొన్ని రోజుల్లోనే జరిగే మహిళల టి20 ప్రపంచకప్ అంతా అతివల మయం కానుంది.

- నారీమణుల ఆధ్వర్యంలోనే టి20 ప్రపంచకప్ నిర్వహణ
- టాస్ నుంచి రిఫరీ నిర్ణయాల దాకా వనితలకే అధికారం
- రిఫరీల బృందంలో ఆంధ్ర మహిళ జీఎస్ లక్ష్మి

దుబాయ్: ఒక క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు 11+11 మంది ప్లేయర్లు సరిపోతారు. కానీ ఆటకు ముందు, ఆట నిర్వహణ, ఆట తర్వాత 'ప్రత్యక్ష ప్రసారాని'కి కంటబడని పనెంతో ఉంటుంది. దీన్ని పదులు, వందల సంఖ్యలో సిబ్బంది కంటికి రెప్పలా కనిపెట్టుకొని మరీ పనిచేస్తారు. టాస్ ప్రతినిధి, పిచ్ వద్ద బ్రాడ్‌కాస్టర్ తొలి వ్యాఖ్యానం, టీవీ వ్యాఖ్యాతల వాక్చాతుర్యం, అంపైర్లు బంతిని పట్టుకొని మైదానంలోకి దిగడం. తర్వాత ఫీల్డింగ్ జట్టు గుండ్రంగా ఒకరి భుజాలపై ఒకరు చేతులు వేసుకొని చేసే ప్రతిజ్ఞ... అనంతరం మెల్లిగా ఓపెనర్ల ఆగమనం, సెకన్ల కౌంట్‌డౌన్‌తో మ్యాచ్ షురూ! మధ్యలో విరామం... గ్రౌండ్‌సిబ్బంది పిచ్‌ను చదును చేయడం, ఆకస్మికంగా వర్షం పడితే కవర్లు పట్టుకొని పదుల సంఖ్యలో మైదానాన్ని కవర్ చేయడం, మ్యాచ్ రిఫరీ పర్యవేక్షణ ఇలా ఓ పెద్ద బృందమే మ్యాచ్‌ను మనముందుకు తెస్తుంది. క్రికెట్ అంటే ఫోర్, సిక్సర్, అవుట్, డకౌట్, ఎల్బీడబ్ల్యూ మాత్రమే కాదు... అంత కుమించిన శ్రమ, ప్రణాళికాబద్ధమైన నిర్వహణ ఉంటాయి. ఇదివరకే గత టి20 ప్రపంచకప్ బాధ్యతల్ని మహిళల బృందమే నిర్వహించడంతో ఇకపై కూడా అదే ఆనవాయితీని కొనసాగించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నిర్ణయించింది. మొత్తం మీద ఐసీసీ అతివలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడమే కాదు... గురుతర బాధ్యతలను కూడా పెట్టింది. తద్వారా ప్రపంచానికి ప్రపంచకప్‌తో నారీశక్తిని చాటే అవకాశమిచ్చింది.


వృందా రాఠి

అంపైర్ల జాబితాలో వృందా రాఠి

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) యూఏఈలో జరిగే మెగా ఈవెంట్ కోసం 13 మంది సభ్యులు గల అధికారిణిల బృందాన్ని ఎంపిక చేసింది. ఇందులో ముగ్గురు మ్యాచ్ రిఫరీలుండగా, 10 మంది అంపైర్లున్నారు. భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు రిఫరీగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవమున్న ఆంధ్రప్రదేశ్ మ్యాచ్ రిఫరీ మెగా ఈవెంట్ కోసం ఎంపిక చేసిన ముగ్గురు రిఫరీల్లో చోటు దక్కడం గొప్ప విశేషం. ఈ బృందంలో జెరెలిన్ మైకేల్ పెరీరా (శ్రీలంక), షాండ్రే ఫ్రిట్జ్ (దక్షిణాఫ్రికా) ఇతర సభ్యులుగా ఉన్నారు. మరో భారత అధికారిణి వృందా రాఠికి పదిమంది సభ్యులు గల ఐసీసీ ఎమిరేట్స్ అంపైర్ల బృందంలో స్థానం లభించింది.

ముక్కోణపు, ద్వైపాక్షిక సిరీస్‌లో మ్యాచ్ అధికారులు చూపిన నైపుణ్యం, కనబరిచిన ప్రదర్శన ఆధారంగా అర్హతగల అధికారులనే ప్రపంచకప్ నిర్వహణ బృందానికి ఎంపిక చేశాం. వాళ్లంతా తమ బాధ్యతల్ని సమర్థంగా నిర్వర్తిస్తారు. వాళ్లందరికీ ఈ సందర్భంగా బెస్ట్ ఆఫ్ లక్ తెలుపుతున్నాను' అని ఐసీసీ సీనియర్ మేనేజర్ (అంపైర్లు–రిఫరీలు) సియాన్ ఈసే తెలిపారు. మొత్తం పది జట్లు పోటీపడే ఈ మెగా టోర్నీలో 23 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అక్టోబర్ 3న బంగ్లాదేశ్, స్కాట్లాండ్‌ల మధ్య షార్జాలో జరిగే పోరుతో టోర్నీ షురూ అవుతుంది.ప్రధాన టోర్నీకి ముందు ప్రతీ జట్టు రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ నెల 28 నుంచి సన్నాహక మ్యాచ్‌లు జరుగుతాయి.

అంపైర్ల బృందం: లారెన్ అగెన్‌బ్యాగ్ (దక్షిణాఫ్రికా), కిమ్ కాటన్ (న్యూజిలాండ్), సారా దంబయెవానా (జింబాబ్వే), అనా హారిస్ (ఇంగ్లండ్), నిమాలి పెరీరా (శ్రీలంక), క్లైయిర్ పొలోసాక్ (ఆస్ట్రేలియా), వృందా రాఠి (భారత్), స్యూ రెడ్‌ఫెర్న్ (ఇంగ్లండ్), ఎలోయిస్ షెరిడాన్ (ఆస్ట్రేలియా), జాక్వెలిన్ విలియమ్స్ (వెస్టిండీస్). **మ్యాచ్ రిఫరీలు:** జీఎస్ లక్ష్మి (భారత్), జెరెలిన్ మైకేల్ పెరీరా (శ్రీలంక), షాండ్రే ఫ్రిట్జ్ (దక్షిణాఫ్రికా).



'ఇండి' టీమ్‌కు మూడో స్థానం

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ ఆఫ్ రోడ్ రేస్ ఎఫ్ఐఎం ఎక్స్‌ప్లోరర్ వరల్డ్ కప్‌లో భారత జట్టు 'ఇండి రేసింగ్' అరుదైన విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో 'ఇండి' టీమ్ ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచింది. ఈ ఘనత సాధించిన తొలి భారత టీమ్ 'ఇండి' కావడం విశేషం. 4 రౌండ్ల ద్వారా 'ఇండి రేసింగ్' మొత్తం 479 పాయింట్లు స్కోర్ చేసింది. బానెల్ (498), హోండా రేసింగ్ (490) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇదే టీమ్‌కు చెందిన మహిళా రైడర్ సాంద్రా గోమెజ్ సీజన్‌లో టాప్ స్కోరర్‌గా నిలవగా...పురుషుల విభాగంలో స్పెన్సర్ విల్టన్ – రునార్ సుడామన్ సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. ఈ ఏడాది ఒసాకా, ఓస్లో, క్రాస్–మాంటానాలలో రేసులు జరిగాయి. ఎఫ్ఐఎం ఎక్స్‌ప్లోరర్ వరల్డ్ కప్‌లో పాల్గొన్న మొదటిసారి మూడో స్థానంలో నిలిచిన తమ ప్రదర్శన పట్ల టీమ్ యజమాని అభిషేక్ కంకణాల సంతోషం వ్యక్తం చేశారు.

ఇక ప్రపంచ చాంపియన్‌షిప్‌పై దృష్టి

- ఒలింపియాడ్ స్ఫూర్తితో రాణిస్తా: గుకేశ్
- భారత్ చేరిన చెస్ విజేతలకు బ్రహ్మరథం


గుకేశ్





చెన్నై: చెస్ ఒలింపియాడ్ స్ఫూర్తితో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌పై దృష్టి కేంద్రీకరిస్తానని భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ చెప్పాడు. నవంబర్‌లో జరిగే ఈ మెగా ఈవెంట్ కోసం పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతానని తెలిపాడు. డిఫెండింగ్ చాంపియన్, చైనీస్ గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌తో భారత ఆటగాడు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతాడు. ఈ టోర్నీకి ఇంకా రెండు నెలల సమయం ఉండటంతో ఫామ్‌ను కాపాడుకునేందుకు... ఎత్తుల్లో ప్రావీణ్యం సంపాదించేందుకు కావాల్సినంత సమయం లభించిందని చెప్పాడు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 15 వరకు సింగపూర్‌లో గుకేశ్, లిరెన్‌ల మధ్య ప్రపంచ పోరు జరుగుతుంది. ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ టోర్నమెంట్ గెలుపొందడం ద్వారా ఈ మెగా టోర్నీకి గుకేశ్ అర్హత సంపాదించాడు. 18 ఏళ్ల ప్రపంచ చాంపియన్‌షిప్ చాలెంజర్ హంగేరిలో ముగిసిన చెస్ ఒలింపియాడ్‌లో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా పురుషుల టీమ్ విభాగంలో సహచరులు వెనుకబడిన ప్రతి సందర్భంలో కీలక విజయాలతో జట్టును అజేయంగా నిలపడంలో గుకేశ్ పాత్ర ఎంతో ఉంది. ఒలింపియాడ్‌పై మాట్లాడుతూ 'ఈ టోర్నీని నేను ఒక వ్యక్తిగత ఈవెంట్‌గా భావించాను. కాబట్టే ప్రతి గేమ్‌లో ఇతరుల ఫలితాలతో సంబంధం లేకుండా స్వేచ్ఛగా ఆడేందుకు ప్రయత్నించాడు. ఒలింపియాడ్‌లో నా ప్రదర్శన నాకెంతో సంతృప్తినిచ్చింది. జట్టు ప్రదర్శన కూడా బాగుంది' అని అన్నాడు. తాజా ఫలితం తమ సానుకూల దృక్పథానికి నిదర్శనమని అన్నాడు. భారత ఆటగాళ్లంతా సరైన దిశలో సాగుతున్నారని చెప్పుకొచ్చాడు.

ఘనస్వాగతం

అంతకుముందు బుడాపెస్ట్ నుంచి చెస్ ఒలింపియాడ్ విజేతలు తమ తమ స్వస్థలాలకు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలి, పురుషుల జట్టు కెప్టెన్ శ్రీనాథ్ నారాయణ్‌లకు చెన్నైలో చెస్ సంఘం అధికారులు, అభిమానులు, కుటుంబసభ్యులు ఘన స్వాగతం పలికారు. పూల బొకేలతో స్వాగతం పలికిన అభిమానులు పలువురు గ్రాండ్‌మాస్టర్లతో సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. చెస్ ఒలింపియాడ్‌లో గతంలో ఉన్న కాంస్యం రంగు మార్చి బంగారు మయం చేయడం చాలా సంతోషంగా ఉందని ప్రజ్ఞానంద అన్నాడు. అతని సోదరి వైశాలి మాట్లాడుతూ సొంతగడ్డపై జరిగిన గత ఈవెంట్‌లో కాంస్యంతో సరిపెట్టుకున్న తమ పసిడి కల తాజాగా హంగేరిలో సాకారమైందని హర్షం వ్యక్తం చేసింది. వంతిక అగర్వాల్, తానియా సచ్‌దేవ్‌లకు ఢిల్లీ చెస్ సంఘం అధికారులు, హైదరాబాద్‌లో ద్రోణవల్లి హారికకు భారత స్పోర్ట్స్ అథారిటీ అధికారులు స్వాగతం పలికి సన్మానం చేశారు.


సింధు


అనూప్ శ్రీధర్

మళ్లీ విజయాలు అందించడమే లక్ష్యం

సింధు తాత్కాలిక కోచ్ అనూప్ శ్రీధర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత మాజీ ఆటగాడు అనూప్ శ్రీధర్‌ను తాత్కాలిక కోచ్‌గా ఎంచుకున్న సింధు దాదాపు గత మూడు వారాలుగా అతనితో కలిసి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తోంది. ఆమె ఆటలో చాలా మెరుగుదల కనిపిస్తోందని, తన షెడ్యూల్ ప్రకారం శిక్షణ కొనసాగుతోందని శ్రీధర్ వెల్లడించాడు. 'సింధు ఆటలో కొన్ని చిన్న చిన్న లోపాలను సరిదిద్దడంతో పాటు కొన్ని కొత్త విషయాలు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నా. ఇప్పటి వరకు మేం ఒక్క షెడ్యూల్ కూడా తప్పకుండా పక్కా ప్రణాళికతో సాధన చేస్తున్నాం. ఈ మూడు వారాల్లో ఆమె ఆటలో చాలా మార్పు వచ్చింది. అయితే ఇంకా చేయాల్సింది చాలా ఉంది. సింధులో మరిన్ని విజయాలు సాధించాలనే తపన ఉంది. గతంలోకంటే ఇంకా ఎక్కువగా కష్టపడుతోంది. ఈ సాధనతో వచ్చే టోర్నీల్లో ప్రత్యర్థితో సంబంధం లేకుండా ఆరంభ రౌండ్లలో బాగా ఆడితే ఆ తర్వాత టైటిల్స్ సాధించడం లాంఛనమే అవుతుంది. ఆమె ఆటలో నిలకడ తీసుకొచ్చి మరిన్ని విజయాలు వచ్చేలా చేయడమే నా లక్ష్యం' అని అనూప్ శ్రీధర్ పేర్కొన్నాడు. ప్రస్తుతం తాను తాత్కాలిక కోచ్‌గానే వచ్చాను కాబట్టి ఒక్కో వారం చొప్పున సమీక్ష చేస్తూ కోచింగ్ కొనసాగిస్తున్నానన్న శ్రీధర్... ఇదే కారణంతో సుదీర్ఘ కాలపు ప్రణాళికలు వేయడం లేదని స్పష్టం చేశాడు.

సింధు కన్సల్టింగ్ కోచ్‌గా లీ హ్యూన్



పారిస్ ఒలింపిక్స్ తర్వాత మరో టోర్నీ ఆడని భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు మళ్లీ కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. వచ్చేనెలలో జరిగే ఫిన్లాండ్ ఓపెన్, డెన్మార్క్ ఓపెన్‌లతో పాటు ఆ తర్వాత యూరోప్ సర్క్యూట్‌లో వివిధ టోర్నీల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దక్షిణ కొరియా మాజీ ఆటగాడు లీ హ్యూన్ ఇల్‌ను కన్సల్టింగ్ కోచ్‌గా సింధు ఎంచుకుంది. ఇప్పటికే భారత మాజీ ఆటగాడు అనూప్ శ్రీధర్ సింధు తాత్కాలిక కోచ్‌గా పని చేస్తున్నాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన సింధు ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం పతకం సాధించడంలో విఫలమైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లోనే చైనా ప్లేయర్ బింగ్జియావో చేతిలో ఆమె ఓటమి పాలైంది. అంతకు కొంత కాలం ముందునుంచి కూడా సింధు చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించలేదు. 2022లో సింగపూర్ ఓపెన్ గెలిచిన తర్వాత మరే టైటిల్ నెగ్గని సింధు... గత రెండేళ్ల వ్యవధిలో రెండు టోర్నీల్లో రన్నరప్‌గా మాత్రమే నిలవగలిగింది. రియో ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన సమయంలో సింధు కోచ్‌గా ఉన్న పార్క్ సంగ్ కాంట్రాక్ ముగిసి 2023 ఆరంభంలోనే వెళ్లిపోగా... తాత్కాలికంగా 'సాయ్' కోచ్ విధి చౌదరితో కలిసి ఆమె పని చేసింది. దిగ్గజ ఆటగాడు హాఫిజ్ హషీమ్‌ను కోచ్‌గా తీసుకున్నా అదీ కొద్ది రోజులకే ముగిసింది. దాంతో బెంగళూరుకు వెళ్లి సింధు... ప్రకాశ్ పదుకోన్ వద్ద పారిస్ ఒలింపిక్స్‌కు సన్నద్ధమైంది. ప్రస్తుత సీజన్ ఇంకా పూర్తి కాకపోగా... కోచ్‌గా పని చేసిన ఆగస్ సాంటోసో కాంట్రాక్ట్ ఒలింపిక్స్‌తోనే ముగిసింది. దాంతో ఈ సీజన్ చివరి వరకు సింధుకు కొత్త కోచ్ అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అటు శ్రీధర్‌తో పాటు ఇటు లీ హ్యూన్‌తో కలిసి పని చేసేందుకు ఆమె సిద్ధమైంది. వీరిద్దరు డిసెంబర్ 2024 వరకు సింధుకు శిక్షణనిస్తారు. 'నా కెరీర్ కీలక దశలో అనూప్, లీ హ్యూన్‌లు కోచ్‌గా రావడం పట్ల సంతోషంగా ఉన్నా. భారత బ్యాడ్మింటన్‌పై అనూప్‌కు ఉన్న అవగాహన, ఆయన వ్యూహాలు నన్ను చాలా ఆకట్టుకున్నాయి. లీ హ్యూన్‌కు అపార అనుభవం ఉండటం నాకు కలిసొచ్చే అంశం. ఆటకు సంబంధించి ప్రతీ విషయంలో ఆయన సూక్ష్మ పరిశీలన నాకు మేలు చేస్తుంది. రాబోయే కొన్ని వారాల పాటు వీరిద్దరితో కలిసి పని చేసేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా' అని సింధు వ్యాఖ్యానించింది.

మాజీ వరల్డ్ నంబర్‌వన్ లీ హ్యూన్ అంతర్జాతీయ ఆటగాడిగా మంచి రికార్డు ఉంది. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన అతను సుదిర్మన్ కప్‌లో స్వర్ణం, 3 కాంస్యాలు గెలిచిన... థామస్ కప్‌లో 2 రజతాలు, 2 కాంస్యాలు గెలిచిన కొరియా జట్లలో సభ్యుడు. ఆసియా క్రీడల్లో లీ హ్యూన్ 2 స్వర్ణాలు, 3 రజతాలు, కాంస్యం గెలవడంతో పాటు ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ కాంస్యం అందుకున్నాడు. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో సింధు జట్టులో సభ్యుడిగా కలిసి ఆడాడు. ఐదేళ్ల క్రితం ఆటకు రిటైర్మెంట్ పలికిన అనంతరం అతను కోచింగ్ వైపు మారాడు.

సాయితేజా రెడ్డి సెంచరీ

- 'శత'క్కొట్టిన మిలింద్ కుమార్
- యూఏఈపై అమెరికా ఘనవిజయం


సాయితేజా రెడ్డి

విండ్‌హోక్: అమెరికా జాతీయ క్రికెట్ జట్టుకు ఆడుతున్న తెలుగు సంతతి క్రికెటర్ ముక్కామల సాయి తేజా రెడ్డి (99 బంతుల్లో 107; 15 ఫోర్లు, ఒక సిక్సర్) సెంచరీతో ఆకట్టుకున్నాడు. మరో ప్లేయర్ మిలింద్ కుమార్ (110 బంతుల్లో 155 నాటౌట్; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) కూడా శతకంతో చెలరేగాడు. ఫలితంగా ఐసీసీ పురుషుల ప్రపంచకప్ లీగ్–2లో భాగంగా మంగళవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అమెరికా 136 పరుగుల తేడాతో గెలిచింది. ఈ లీగ్‌లో భాగంగా ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన అమెరికా ఆరో విజయంతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన అమెరికా నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనలో యూఏఈ 36.2 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. ఆసిఫ్ ఖాన్ (51; 7 ఫోర్లు, ఒక సిక్సర్), రాహుల్ చోప్రా (52; 7 ఫోర్లు, ఒక సిక్సర్), హమీద్ (43 బంతుల్లో 50 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) హాఫ్ సెంచరీలు చేశారు. అమెరికా బౌలర్లలో సౌరభ్ నేత్రావల్కర్, నోస్తుష్ చెరో మూడు వికెట్లు తీశారు.

వచ్చే నెలలో భారత్, జర్మనీ జట్ల మధ్య హాకీ సిరీస్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత జర్మనీ హాకీ జట్టు వచ్చే నెలలో భారత్‌లో పర్యటించనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన భారత జట్టుతో అక్టోబర్ 23, 24 తేదీల్లో జర్మనీ జట్టు రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ జాతీయ స్టేడియంలో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. 'భారత్, జర్మనీ హాకీ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల సిరీస్ నిర్వహించనున్నాం. ఇది ఆట ఉన్నతితో పాటు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత దృఢమయ్యేందుకు తోడ్పడుతుంది' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేర్కొన్నాడు. ఇరు జట్ల మధ్య సమరం రసవత్తరంగా సాగడం ఖాయమని హాకీ ఇండియా కార్యదర్శి భోళానాథ్ సింగ్ పేర్కొన్నాడు. 'భారత్, జర్మనీ మధ్య హాకీ మ్యాచ్ అంటే ఎప్పుడూ ఆసక్తికరమే. హాకీలో ఇరు జట్లకు గొప్ప వారసత్వం ఉంది. జర్మనీ వంటి పటిష్ట జట్టుతో తలపడేందుకు టీమిండియా ప్లేయర్లు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు' అని భోళానాథ్ సింగ్ అన్నాడు.

రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టులో రికీ భుయ్

రంజీ చాంపియన్ ముంబైతో ఇరానీ కప్


రికీ భుయ్

న్యూఢిల్లీ: దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో సత్తా చాటిన ఆంధ్ర క్రికెటర్ రికీ భుయ్ రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టులోకి ఎంపికయ్యాడు. లక్నో వేదికగా అక్టోబర్ 1 నుంచి 5 వరకు రంజీ చాంపియన్ ముంబై జట్టుతో జరగనున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రికీ భుయ్ రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించనుండగా... దులీప్ ట్రోఫీలో రాణించిన ప్లేయర్లు అవకాశం దక్కించుకున్నారు. దులీప్ ట్రోఫీలో భారత్ 'డి' జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రికీ భుయ్ మూడు మ్యాచ్‌ల్లో కలిపి 359 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. భారత్ 'బి'తో జరిగిన చివరి మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీ (56), రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ (119 నాటౌట్)తో ఆకట్టుకున్న భుయ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. ఇరానీ కప్‌లో ఆడనున్న రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈ నెల 27 నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుండగా... ఈ మ్యాచ్ తుది జట్టులో చోటు దక్కించుకోకపోతే సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్, యశ్ దయాళ్ కూడా ఇరానీ కప్‌లో ఆడతారని బీసీసీఐ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'ప్రస్తుతం భారత జట్టులో సభ్యులైన ధ్రువ్ జురెల్, యశ్ దయాళ్... బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు మ్యాచ్ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోతే... ఈ ఇద్దరు ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తారు. కాన్పూర్ వేదికగా జరగనున్న టెస్టు మ్యాచ్ తుది జట్టులో సర్ఫరాజ్ ఖాన్‌కు చోటు దక్కకుంటే అతడు ముంబై జట్టు తరఫున బరిలోకి దిగుతాడు' అని బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. అజింక్యా రహానే సారథ్యంలోని ముంబై జట్టులో శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్, ముషీర్ ఖాన్, షమ్స్ ములానీ, తనుశ్ కొటియాన్‌తో పాటు శస్త్రచికిత్స నుంచి కోలుకున్న పేస్ ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ఉన్నారు. భారత టి20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్, పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే ఇరానీ కప్‌లో ఆడటం లేదు. ఈ ఇద్దరూ వచ్చే నెల 3 నుంచి గ్వాలియర్‌లో భారత జట్టుతో కలవనున్నారు.

రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, ఇషాన్ కిషన్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్, ప్రసిధ్ కృష్ణ, ముకేశ్ కుమార్, యశ్ దయాళ్, రికీ భుయ్, శాశ్వత్ రావత్, ఖలీల్ అహ్మద్, రాహుల్ చహర్.

పారా షట్లర్లకు రూ. 50 లక్షలు నజరానా


నితీశ్ కుమార్

న్యూఢిల్లీ: పారిస్ పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన ఐదుగురు పారా షట్లర్లకు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) రూ. 50 లక్షల నజరానా ప్రకటించింది. ఇటీవల జరిగిన దివ్యాంగుల విశ్వ క్రీడల్లో భారత షట్లర్లు ఐదు పతకాలు (ఒక స్వర్ణం, రెండు రజతాలు, రెండు కాంస్యాలు) సాధించారు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 విభాగంలో స్వర్ణం గెలిచిన నితీశ్ కుమార్‌కు రూ. 15 లక్షలు, రజత పతకాలు గెలిచిన సుహాస్ యతిరాజ్ (పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4), తులసిమతి మురుగేశన్ (మహిళల సింగిల్స్ ఎస్‌యూ5)లకు రూ. 10 లక్షల చొప్పున నగదు బహుమతి ప్రకటించింది. మహిళల సింగిల్స్ ఎస్‌యూ5లో కాంస్యం నెగ్గిన మనీషా రామదాస్, ఎస్‌యూ5లో కాంస్యం సాధించిన నిత్యశ్రీకి రూ. 7.5 లక్షల చొప్పున నజరానా ప్రకటించింది. 'అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత పారా షట్లర్లకు నగదు బహుమతి అందించాలని నిర్ణయించాం. పారాలింపిక్స్‌లో సాధించిన పతకాలకు ఇది గుర్తింపు లాంటిది. మరిన్ని పతకాలు సాధించేందుకు పారా షట్లర్లకు అన్ని విధాలుగా అండగా నిలుస్తాం' అని బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి సంజయ్ మిశ్రా పేర్కొన్నాడు.



ఆగ్రాలోని ప్రపంచ ప్రఖ్యాత తాజ్‌మహల్ గోడలో పెరుగుతున్న మర్రి మొక్క. చారిత్రక కట్టడం గోడలకు పగుళ్లు వచ్చే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది. నిర్వహణ లోపమే కారణమన్న విమర్శలున్నాయి



హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం నుహ్ జిల్లాలో బుల్‌డోజర్లపై ర్యాలీ చేపట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు



చైనా మంగళవారం ఓడలోని లాంచ్‌ప్యాడ్ నుంచి ఒకే విడతలో ఏకంగా 8 ఉపగ్రహాల్ని ప్రయోగించింది. షాన్‌డాంగ్ ప్రావిన్స్ తీరంలో ఉన్న అంతర్జాతీయ జలాల్లో హైయాంగ్ సీ లాంచ్‌ప్యాడ్ ఇందుకు వేదికగా నిలిచింది

● ఆరేళ్ల వయసులో కిడ్నాపై...

70 ఏళ్ల తర్వాత తనవారి చెంతకు

అమెరికాలో అరుదైన ఘటన



అన్న రోజర్‌తో లూయిస్ (కుడి)

ఆరేళ్ల వయసులో కిడ్నాపైన వ్యక్తి ఏకంగా 70 ఏళ్ల తర్వాత తిరిగి తనవారి దరికి చేరితే? ఆ అనుభూతిని వర్ణించడానికి ఏ మాటలూ చాలవు. నమ్మశక్యం కాని ఈ అద్భుతం అమెరికాలో అక్షరాలా జరిగింది. అతని మేనకోడలి పట్టుదలతో పాటు యాదృచ్ఛికంగా మ్యాచైన డీఎన్‌ఏ శాంపిళ్ల రూపంలో కలిసొచ్చిన అదృష్టం కూడా దీని వెనక ఉంది...

అది 1951 ఫిబ్రవరి 21. కాలిఫోర్నియాలో వెస్ట్ ఓక్లాండ్‌లోని ఓ పార్కు. ఆరేళ్ల లూయిస్ అర్మాండో అల్బినో తన పదేళ్ల సోదరుడు రోజర్‌తో కలిసి ఆడుకుంటున్నాడు ఓ మహిళ క్యాండీ కొనిస్తానని ఆశ పెట్టి అతన్ని వెంట తీసుకెళ్లింది. అనుమానించిన రోజర్ వారిని కాసేపు వెంబడించినా భయంతో వెనక్కొచ్చేశాడు. తలకు ఆకుపచ్చ గుడ్డ కట్టుకున్న మహిళ తమ్ముడిని తీసుకెళ్లిందంటూ పెద్దవాళ్లకు చెప్పాడు. పోలీసులు ఎంత గాలించినా లాభం లేకపోయింది. ప్రమాదవశాత్తూ సముద్రంలోకి వెళ్లి మునిగిపోయాడేమోనని భావించారు. గాలింపు కోసం కోస్ట్‌గార్డ్‌నూ రంగంలోకి దింపారు. ఒక దశలో రోజర్‌ను కూడా అనుమానించారు. అతను మాత్రం ఎంత అడిగినా ఆ మహిళే తీసుకెళ్లిందని చెప్పాడు. రోజులు గడుస్తున్న కొద్దీ తల్లి ఆంటోనియా తీవ్ర మనోవ్యథకు గురైంది. కొడుకు ఆచూకీ కోసం రోజూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆరా తీసేది. తన చిన్న కొడుకు ఎక్కడో బతికే ఉన్నాడనే చెప్పేది. 2005లో చనిపోయేదాకా అదే ఆశతో బతికింది.

పట్టిచ్చిన డీఎన్‌ఏ...

దశాబ్దాలు గడిచిపోయాయి. తప్పిపోయిన లూయిస్ మేనకోడలు అలిడా అలెక్సిస్ 2020లో సరదాగా డీఎన్‌ఏ పరీక్ష చేయించుకుంది. అలా చేయించుకున్న అనేక మంది డీఎన్‌ఏలను పరిశీలిస్తే లూయిస్ అనే వ్యక్తి డీఎన్‌ఏతో దాదాపుగా సరిపోలింది. తన మేనమామ చిన్నతనంలోనే తప్పిపోయిన వైనం గురించి తల్లి, అమ్మమ్మ నోట అప్పటికే ఎన్నోసార్లు విని ఉండటంతో అది ఈ వ్యక్తే కావచ్చని అనుమానించింది. ధ్రువీకరించుకోవడానికి ఆధారాలేవీ లేవు. అయినా వదలకుండా ప్రయత్నించింది. ఫొటోలతో కూడిన సాక్ష్యంతో పోలీసులను ఆశ్రయించింది. దాంతో ఎఫ్‌బీఐ దర్యాప్తుకు దిగింది. పాత న్యూస్ క్లిప్పింగులు, ఫొటోల సాయంతో గాలించారు. లూయిస్ ఈస్ట్‌కోస్ట్‌లో నివసిస్తున్నాడని కనిపెట్టారు. అతను అగ్నిమాపక అధికారిగా రిటైరయ్యాడు. అంతకుముందు మెరైన్ కార్ప్స్‌లో చేరి రెండుసార్లు వియత్నాం యుద్ధంలోనూ పనిచేశాడు. ఆయనకు మరోసారి డీఎన్‌ఏ పరీక్ష చేశారు. అలెక్సిస్ తల్లి డీఎన్‌ఏతో పోల్చి చూస్తే వారిద్దరూ తోబుట్టువులేనని తేలింది. అలా ఏకంగా 70 ఏళ్ల తర్వాత మేనకోడలి పట్టుదల ఆయనను సొంతవారికి దగ్గర చేర్చింది. 'నన్ను కనిపెట్టినందుకు ధన్యవాదాలు'అంటూ కోడలిని ముద్దాడి మురిసిపోయాడు లూయిస్.

వీడని కిడ్నాప్ మిస్టరీ...

లూయిస్ తన కుటుంబంతో కలిసి జూన్ 24న కాలిఫోర్నియా వెళ్లాడు. సోదరిని, మేనకోడలు అలెక్సిస్‌ను, ఇతర కుటుంబ సభ్యులను కలుసుకున్నాడు. మర్నాడే కాలిఫోర్నియాలోని స్టానిస్లాస్ కౌంటీలో ఉండే అన్న రోజర్ దగ్గరికి వెళ్లాడు. 70 ఏళ్ల తర్వాత తమ్ముణ్ని చూసి రోజర్ కన్నీటిపర్యంతమయ్యాడు. చాలాసేపటి దాకా గట్టిగా కౌగిలించుకుని ఉండిపోయారు. గంటల తరబడి మాట్లాడుకున్నారు. తప్పిపోయిన రోజు మొదలుకుని ఎన్నెన్నో విషయాలను పంచుకున్నారు. రెండు నెలల తరువాత ఆగస్టులో రోజర్ మరణించాడు. తమ్ముడు దొరికాడన్న తృప్తితో ప్రశాంతంగా తుదిశ్వాస విడిచాడు. అయితే లూయిస్ కిడ్నాప్ మిస్టరీ ఇంకా అలాగే ఉంది. ఆయన కూడా దాని గురించి తన కేమీ గుర్తు లేదని చెప్పడం విశేషం! - సాక్షి, నేషనల్ డెస్క్

● ఒక్క మొక్కజొన్న గింజ..

8.7 కోట్ల వీక్షణలు

సామాజిక మాధ్యమాల్లో కొత్తరకంగా కనిపించే ప్రతి ఒక్క వీడియోను కోట్ల మంది చూస్తారనడానికి నిదర్శనం ఈ వీడియో. అలోనా లోయిజెస్ అనే యువతి కంటెంట్ క్రియేటర్‌గా పేరొంది ఇన్‌స్టా గ్రామ్‌లో వీడియోలు చేస్తోంది. తాజాగా ఈమె చేసిన కొత్త రకం వీడియోను జనం అదేపనిగా చూస్తున్నారు. అసలు ఆ వీడియో చివర్లో ఏం జరుగుతుందా అని వీడియో చివరికంటా చూసి కోట్లాది మంది అవాక్కయ్యారు. అలా ఒకరి తర్వాత మరొకరు షేర్ చేస్తూ పోవడంతో ఇప్పుడా వీడియో వీక్షణలు ఏకంగా 8.7 కోట్లు దాటిపోయాయి.

ఏముందా వీడియోలో?

మొక్కజొన్న పొత్తును ఒలిచి అందులో ఒకే ఒక్క గింజను తీసుకుని వేడి నాన్‌స్టిక్ పెనం మీద వేసింది. దానిపై చాలా చిన్నగా ఉన్న చెంచాతో ఒకే ఒక్క చుక్క నూనె వేసింది. తర్వాత కాసింత ఉప్పు వేసి దోరగా కాల్చడం మొదలెట్టింది. గింజ కింద పడిపోకుండా మధ్యలో రంధ్రం ఉన్న చెక్క చెంచాను తీసుకుని దాని మధ్యలోకి గింజ వచ్చేలా చేసి గింజను బాగా వేడెక్కించింది. అలా గింజ వేడెక్కినంత సేపూ వీడియో చూస్తున్న ఇన్‌స్టా గ్రామ్ ఆప్ వీక్షకులు అలాగే కన్నార్పకుండా చూశారు. చిట్టచివరికి అది ఒక్కసారిగా పగిలి పాప్‌కార్న్ అయింది. అంతే..

వ్యాఖ్యానాల వెల్లువ

కొద్ది సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియో చూసి నవ్వుకున్న వారు కొందరైతే చిర్రెత్తిపోయిన వారు మరికొందరు. అసలు ఇందులో ఏముంది? అని ప్రశ్నించిన వారూ లేకపోలేదు. అయితే రోజువారీ రొటీన్ జీవితంలో బోరు కొట్టిన మాలాంటి వాళ్లకు ఒక్క మొక్కజొన్న గింజ మహా ఉపశమనం కల్పించిందని నవ్వుతూ కామెంట్లు పెట్టినవాళ్లు కూడా ఉన్నారు. తమ సహనాన్ని పరీక్షించిందని ఆగ్రహం వ్యక్తంచేసిన వాళ్లకు కొదువేలేదు. ''చివరిదాకా సస్పెన్స్ నన్ను చంపేసింది'అని ఒకతను పోస్ట్‌చేశాడు. 'ఒక్క గింజ పేలడం చూడ్డం కోసం ఇంత సేపు వీడియో చూశానా!'అని ఇంకొకరు వ్యాఖ్యానించారు. ''డైటింగ్ తొలి రోజు ఇంతే తినాలి', 'ఎట్టకేలకు అది పేలింది', 'మొత్తం వీడియో చూసే సరికి నా ఓపిక మొత్తం పోయింది'అని ఎవరికి నచ్చినట్లు వాళ్లు కామెంట్లు చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఆ ఎన్‌ఆర్‌ఐ కోటా మోసమే

పంజాబ్ ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి పంజాబ్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఎన్‌ఆర్‌ఐ కోటా'విధానంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ తరహా కోటా మోసమేనని ఆక్షేపించింది. ఆదాయం పెంచుకోవడానికి ఇలాంటి విధానాలు తీసుకురావొద్దని తేల్చి చెప్పింది. 'ఎన్‌ఆర్‌ఐ కోటా'అనే పదాన్ని విస్తృతపరుస్తూ పంజాబ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొన్ని రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విధానంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు పంజాబ్-హరియాణా హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కొట్టివేస్తూ హైకోర్టు ఈ నెల 10వ తేదీన తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పును సమర్థించింది.

మీ విషయాల్లోకి మమ్మల్ని లాగొద్దు: సుప్రీం

మిషనరీలపై ఎన్‌సీపీసీఆర్ పిటిషన్

న్యూఢిల్లీ: జార్ఖండ్‌లోని మిషనరీస్ ఆఫ్ చారిటీ షెల్టర్ హోమ్స్‌లో పిల్లల విక్రయం ఆరోపణలపై సిట్‌తో దర్యాప్తు చేయించాలంటూ పిల్లల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) వేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జార్ఖండ్‌లో బాలల హక్కుల ఉల్లంఘన కేసులను కమిషన్ ఉదహరించింది. మైనర్ల భద్రతను రాష్ట్ర యంత్రాంగం పట్టించుకోవడం లేదని పేర్కొంది. 'మీ విషయాల్లోకి మమ్మల్ని లాగొద్ద'ంటూ ఎన్‌సీపీసీఆర్‌ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్‌కే సింగ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'మీరెలాంటి పరిష్కారం ఆశిస్తున్నారు? అటువంటి ఉత్తర్వులను మేమెలా ఇవ్వగలం?'అంటూ నిలదీసింది. పిల్లల హక్కుల పరిరక్షణ చట్టం-2005ను అనుసరించి షెల్టర్ హోమ్స్‌లో నిర్వహణలోపాలు, అక్రమాలపై విచారణ చేపట్టే హక్కు ఎన్‌సీపీసీఆర్‌కు ఉంటుందని గుర్తు చేసింది.

కారణం ఉంటేనే సీబీఐ విచారణకు ఆదేశించాలి

కేసును సీబీఐకి బదలాయించడాన్ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సరైన కారణం ఉంటేనే రాష్ట్ర పోలీసుల నుంచి కేసును సీబీఐకి బదలాయించాలని కలకత్తా హైకోర్టును సుప్రీంకోర్టు మందలించింది. అయితే ఇప్పటికే కేసును సీబీఐకి బదిలీచేస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. గూర్ఖా ప్రాంతీయ పాలక మండలి(జీటీఏ)లో వలంటీర్ ఉపాధ్యాయుల నియామకాలు, క్రమబద్ధీకరణలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ ఆరోపణలు రావడంతో వాటిపై ఆరాతీయాలని రాష్ట్ర పోలీసులను పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర పోలీసులు చేపట్టిన దర్యాప్తును కాదని, ఆ కేసును సీబీఐకి బదిలీచేస్తూ హైకోర్టు జల్పాయ్‌గురి సర్క్యూట్ బెంచ్ ఏప్రిల్‌లో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను పశ్చిమబెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్‌చేసింది. ఈ కేసును జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం మంగళవారం విచారించింది. ''అవసరమైన సందర్భాల్లో కేసును సీబీఐకి బదిలీ చేసే అధికారం హైకోర్టులకు ఉంది. ఈ ఉదంతంలో రాష్ట్ర పోలీసుల దర్యాప్తు పక్షపాత ధోరణిలో కొనసాగుతోందని హైకోర్టు పేర్కొనలేదు. దర్యాప్తు పారదర్శకంగా జరగట్లేదనే కారణం కూడా చెప్పలేదు. కారణం లేకుండానే కేసును సీబీఐకి బదిలీచేయకూడదు. ఈ అంశంలో పెండింగ్‌లో ఉన్న కేసుపై ఏకసభ్య ధర్మాసనం నిర్ణయం తీసుకోవాలి'అని జల్పాయ్‌గురి సర్క్యూట్ బెంచ్‌కు సూచించింది.

ఆర్టీఐ పోర్టళ్లపై మీ వైఖరేంటి?

11 రాష్ట్రాలను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టాన్ని అత్యంత పారదర్శకంగా అమలుచేసేందుకు ఉద్దేశించిన ఆర్టీఐ పోర్టళ్ల ఏర్పాటుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 11 రాష్ట్రాలపై సుప్రీంకోర్టు మండిపడింది. మూడు నెలల్లోపు ఆర్టీఐ వెబ్‌సైట్లను ఏర్పాటుచేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచిస్తూ 2023 మార్చి 20వ తేదీన సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. అయినాసరే ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్ సహా 11 రాష్ట్రాలు, యూటీల్లో జిల్లా, హైకోర్టు స్థాయిలో ఆర్టీఐ వెబ్‌సైట్లను ఏర్పాటుచేయలేదంటూ దాఖలైన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది.''మిగతా రాష్ట్రాల్లో ఆయా వెబ్‌సైట్లు ప్రారంభమైనా ప్రామాణికంగా లేవు. ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఆప్‌ల చట్టాలు, నియమనిబంధనలకు అనుగుణంగా అవి లేవు''అని లాయర్ విన్నవించారు. దీంతో ధర్మాసనం ''ఆర్టీఐ పోర్టల్‌పై పలు ప్రభుత్వాధికారులు స్పందించట్లేరు. పోర్టళ్ల ఏర్పాటుచేయని రాష్ట్రాలు, యూటీలకు నోటీసులు ఇస్తున్నాం. అక్టోబర్ 21 కల్లా స్పందన తెలపాలి''అని సూచించింది.

ఉక్రెయిన్‌కు రూ.3,136 కోట్ల అమెరికా ఆయుధాలు!

వాషింగ్టన్: రష్యాతో పోరు కొనసాగిస్తున్న ఉక్రెయిన్‌కు బాసటగా ఆ దేశానికి దాదాపు రూ.3,136 కోట్ల విలువైన ఆయుధాలను అందించేందుకు అమెరికా సిద్ధమైంది. ఇందులోభాగంగా రాకెట్లు, మధ్య స్థాయి క్లస్టర్ బాంబులు, మందుగుండు, సైనిక వాహనాలను పంపనుంది. తమకు సాయం చేయాలని న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల ప్రపంచదేశాధినేతలను కోరిన తరుణంలో అమెరికా నుంచి ఈ భారీ సాయుధ సాయం అందనుండటం గమనార్హం. మొత్తంగా 600 కోట్ల డాలర్ల సాయం చేసేందుకు బైడెన్ సర్కార్‌కు అమెరికా పార్లమెంట్ గతంలో ఇచ్చిన గడువు ఈ నెలలో ముగుస్తుండటంతో హడావిడిగా వీటి సరఫరాకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన కొత్త ఫోను

- ఫోన్ కొన్నందుకు పార్టీ ఇవ్వలేదని టీనేజర్‌ను పొడిచి చంపిన స్నేహితులు
- నిందితులంతా 9వ తరగతి విద్యార్థులే
- ఢిల్లీలో దారుణం

న్యూఢిల్లీ: కొత్త ఫోన్ కొన్న స్నేహితుడి నుంచి చిన్న పార్టీ ఆశించి భంగపడిన తోటి స్నేహితులు అతడిని దారుణంగా పొడిచి చంపిన విషాద ఘటన దేశ రాజధానిలో చోటుచేసుకుంది. నిందితులు ముగ్గురు 9వ తరగతి చదివే 16 ఏళ్ల టీనేజర్లు కావడం గమనార్హం. తూర్పు ఢిల్లీ పరిధిలోని షకర్‌పుర్ ప్రాంతం రాంజీ సమోసా దుకాణం దగ్గర అందరూ చూస్తుండగానే ఈ హత్య జరిగింది. మంగళవారం ఢిల్లీ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఈస్ట్) అపూర్వ గుప్తా తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి సచిన్ అనే 16 ఏళ్ల టీనేజర్ ఫోన్ కొనేందుకు స్నేహితుడిని వెంట తీసుకెళ్లాడు. వారికి మరో ముగ్గురు స్నేహితులను కలుపుకున్నారు. కొత్త ఫోన్ చూశాక స్నేహితులంతా పార్టీ ఇవ్వాల్సిందేనని సచిన్‌పై ఒత్తిడి తెచ్చారు. అందుకు సచిన్ ససేమిరా అన్నాడు. దీంతో మాటామాటా పెరిగింది. స్నేహితుల్లో ఒకడు సచిన్‌ను వెనుక నుంచి కత్తితో రెండుసార్లు పొడిచి హత్యచేశాడు. నడి రోడ్డుపై అందరూ చూస్తుండగానే ఈ హత్యోదంతం చోటుచేసుకుంది. రక్తమోడుతున్న సచిన్ ఆస్పత్రిలో చనిపోయాడు. ఘటనా స్థలి మీదుగా వెళ్తున్న పోలీస్ పెట్రోలింగ్ బృందం రోడ్డుపై ఉన్న రక్తపు మరకలను చూసి ఆగి ఆరా తీశారు. స్థానికంగా ఉండే ఆ ముగ్గురు టీనేజర్లను అరెస్ట్‌చేశారు. భారతీయ న్యాయ సంహిత చట్టంలోని 103(1), 3(5) సెక్షన్లకింద కేసు నమోదుచేసి దర్యాప్తు మొదలెట్టారు. ఘటనాస్థలిలో హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.



కొత్త దెయ్యం షార్క్ దొరికింది

అత్యంత లోతుల్లో సంచరించే కొత్త రకం చేపను కనుగొన్న శాస్త్రవేత్తలు

విల్లింగ్టన్: పసిఫిక్ మహాసముద్రంలో అత్యంత లోతుల్లో సంచరించే కొత్త రకం చేపను న్యూజిలాండ్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ చేప కళ్లు చాలా నల్లగా ఉండటంతోపాటు చిమ్మచీకటిమయమైన సముద్రం లోతుల్లో సంచరిస్తుండటంతో దీనిని 'ఘోస్ట్ షార్క్'గా పేర్కొంటున్నారు. ఘోస్ట్ షార్క్‌లను స్పూక్ ఫిష్ లేదా చిమేరా అని కూడా అంటారు. వీటిలో ముళ్లులు, పొలుసులు ఉండవు. శరీరం మొత్తం మెత్తగా మృదులాస్థితోనే తయారై ఉంటుంది. న్యూజిలాండ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ అండ్ అట్మాస్ఫిరికల్ రీసెర్చ్ బృందం ఈ చేప జాతిని కనుగొంది. న్యూజిలాండ్‌కు తూర్పున ఉన్న ఛాథమ్ రైస్ అనే సముద్రజలాల ప్రాంతంలో ఈ చేపలు జీవిస్తున్నాయి. ఉపరితలం నుంచి దాదాపు 2,600 మీటర్లలోతు మాత్రమే సంచరిస్తుంటాయి. మొత్తం పొడవులో సగం ఉండే పొడవాటి ముక్కు లాంటి నోరు వీటి ప్రత్యేకత. ''లాటిన్‌లో అవియా అంటే బామ్మ. అందుకే దీనిని హరియోటా అవియా అని పేరు పెట్టాం. అంతరించి పోతున్న జాతుల జాబితాలో చేర్చే విషయమై ఆలోచిస్తున్నట్లు నిపుణులు తెలిపారు.

పెన్షన్ కోసం 2 కి.మీ.లు పాక్కుంటూ వెళ్లిన 80 ఏళ్ల బామ్మ

ఒడిశాలో వృద్ధురాలి కష్టాలు

కియోంఝర్(ఒడిశా): వృద్ధాప్య పెన్షన్ కోసం పండుటాకులాంటి బామ్మ పడరాని పాట్లు పడుతున్న దృశ్యం ఒడిశాలో కనిపించింది. పెన్షన్ కావాలంటే పంచాయతీ ఆఫీస్‌దాకా వచ్చి నువ్వే తీసుకో అని అధికారులు తెగేసి చెప్పడంతో 80 ఏళ్ల బామ్మ 2 కి.మీ.లు పాక్కుంటూ వెళ్లింది. శనివారం జరిగిన ఈ ఘటన తాలూకు వీడియో వైరల్ కావడంతో అధికారులపై అందరూ మండిపడుతున్నారు. ఒడిశా రాష్ట్రంలోని సీఎం మోహన్ చరణ్ మాఝీ సొంత జిల్లా కియోంఝర్‌లోని రైసాన్‌లో ఘటన జరిగింది. గ్రామంలోని పథూరీ దేహరీ అనే బామ్మ నడవలేని దుస్థితి. ఇలాంటి వృద్ధులకు ఇంటి వద్దే పెన్షన్ అందజేయాలని ఉత్తర్వులు ఉన్నాయి. కానీ వాటిని అమలుచేసిన నాథుడే లేడు. శనివారం గ్రామ పంచాయతీలో పెన్షన్లు ఇస్తున్న విషయం తెల్సుకుని బామ్మ బురద ఉన్న ఎర్రమట్టి బాట గుండా పాకుతూ వచ్చి పెన్షన్ తీసుకున్నారు. వృద్ధురాలు ఇంత కష్టపడి కార్యాలయానికి వస్తుంటే పట్టించుకోరా? అని బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గీతా ముర్మును కొందరు నిలదీశారు. విమర్శలు వెల్లువెత్తడంతో ఇకపై బామ్మకు ఇంటి వద్దే పెన్షన్ ఇస్తామని మాటిచ్చారు. ఆమెకు ఒక చక్రాల కుర్చీని సైతం అందజేశారు. ఇకపై ఇంటి వద్దే రేషన్ సైతం అందిస్తామని స్పష్టంచేశారు.

ముగిసిపోనున్న 150 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం

- బ్రిటిష్ పాలకుల హయాంలో 1873 నుంచి సేవలు
- 1969 నుంచి ఆరంభమైన క్షీణదశ
- ట్రామ్‌లపై వచ్చే ఏడాది జనవరిలో హైకోర్టు విచారణ

ట్రామ్‌ల కథ కంచికి!



కోల్‌కతాలో ట్రామ్ ప్రారంభమైన తొలినాళ్లలో స్టేషన్‌లో ప్రజలు

150 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న కోల్‌కతా ట్రామ్‌ల కథ ముగిసిపోతోంది. ట్రామ్‌ల సేవలను నిలిపేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో రోడ్లపై ట్రామ్‌లు కనిపించవు. కేవలం ఒక మార్గంలో ట్రామ్‌లు నడిపిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అది కూడా ఎక్కువ రోజులు కొనసాగకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కోల్‌కతాకు పర్యాయపదమైన ఈ ప్రజా రవాణా వాహనాలు ప్రస్థానం ముగిసిపోతుండడం నగర ప్రజలను, పర్యాటకులను ఆవేదనకు గురిచేస్తోంది. ట్రామ్‌ల విషయంలో నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జనం ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రామ్‌ల గురించి తెలుసుకోవడం ఆసక్తికరం.

సుదీర్ఘ ప్రయాణం

- కోల్‌కతాలో(అప్పటి కలకత్తా) బ్రిటిష్ ప్రభుత్వం 1873 ఫిబ్రవరి 24న ట్రామ్‌లను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. తొలుత ఉత్తర కలకత్తాలోని సీల్దా–అర్మేనియా ఘాట్ మధ్య 3.9 కిలోమీటర్ల మార్గంలో ట్రామ్‌లు అందుబాటులోకి వచ్చాయి. గుర్రాలు ఈ ట్రామ్‌లను లాగేవి.
- ట్రామ్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో 1873 నవంబర్‌లో సేవలు నిలిపివేశారు.
- 1880 నవంబర్‌లో ట్రామ్‌లు మళ్లీ పట్టాలెక్కాయి. లండన్‌లో రిజిస్టరైన 'కలకత్తా ట్రామ్‌వేస్ కంపెనీ' ఆధ్వర్యంలో మీటర్ గేజ్ ట్రామ్‌లను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ట్రామ్‌లకు ఎదురే లేకుండాపోయింది.
- 1882లో స్టీమ్ ఇంజన్లు వచ్చాయి. 1900వ సంవత్సరం నుంచి ఎలక్ట్రిక్ ఇంజన్లు దశలవారీగా ప్రారంభించారు.
- 1943 నాటికి కోల్‌కతాతోపాటు హౌరాలోనూ ట్రామ్‌లు విస్తరించాయి. ప్రయాణ మార్గం దాదాపు 70 కిలోమీటర్లకు చేరుకుంది. 1960 నాటికి 'కలకత్తా ట్రామ్‌వేస్ కంపెనీ'ఆధ్వర్యంలో ట్రామ్‌ల సంఖ్య 450కి చేరింది.
- 1969 దాకా ట్రామ్‌లు వైభోగం అనుభవించాయి. విపరీతమైన ఆదరణ ఉండేది. ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. క్షీణదశ ఆరంభమైంది.
- 1970 అక్టోబర్‌లో హౌరాలోని బంధాఘాట్‌లో, 1971 డిసెంబర్‌లో శివపూర్‌లో ట్రామ్‌లను నిలిపివేశారు. 1973 మే నెలలో కోల్‌కతాలోని నిమ్‌తాలా ఘాట్‌లో ట్రామ్ సేవలకు తెరపడింది.
- వేర్వేరు ప్రయాణ సాధనాలు, ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులోకి రావడంతో ట్రామ్‌లకు ఆదరణ పడిపోయింది.
- కోల్‌కతాలో 1948లో బస్సులు, 1984ల మెట్రో రైళ్లను ప్రారంభించారు. ప్రైవేట్ రంగంలో ఎల్లో ట్యాక్సీలు, ఓలా, ఉబర్ వంటివి వచ్చాయి. ట్రామ్‌లతో పోలిస్తే ఇవన్నీ వేగవంతమైన ప్రయాణ సాధనాలే. అందుకే జనం అటువైపు మొగ్గుచూపారు.
- 1969లో మొత్తం 70.74 కిలోమీటర్ల మార్గాల్లో పరుగులు పెట్టిన ట్రామ్‌లు ఇప్పుడు కేవలం 3 మార్గాల్లో 19.4 కిలోమీటర్లకు పరిమితం అయ్యాయి. నిత్యం కేవలం 3 వేల మంది ట్రామ్‌ల్లో ప్రయాణిస్తున్నారు.
- 2011లో మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రామ్‌ల సంఖ్యను, ప్రయాణ మార్గాలను భారీగా తగ్గించారు.

కోర్టు ఏం చెబుతుందో?

ట్రామ్‌ల సంఖ్యలో ప్రభుత్వం కోత విధించడాన్ని సవాలు చేస్తూ కలకత్తా హైకోర్టులో 2021, 2022లో రెండు వేర్వేరు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం బెంగాల్ రవాణా సంస్థ చైర్మన్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ట్రామ్‌లను ఆధునీకరించేందుకు చేపట్టాల్సిన చర్యలను సిఫార్సు చేయాలని కమిటీకి సూచించింది. అధిక జనాభాతో కిక్కిరిసిపోతున్న కోల్‌కతాలో ఈ ట్రామ్‌ల వ్యవస్థ ఇకపై అవసరం లేదని కోల్‌కతా ట్రాఫిక్ పోలీసులు స్పష్టంచేశారు. ఈ మేరకు ఒక నివేదికను రాష్ట్ర రవాణా శాఖ కార్యదర్శికి అందజేశారు. ఈ నివేదికను హైకోర్టులో సమర్పించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మరోవైపు ట్రామ్‌లపై హైకోర్టులో తదుపరి విచారణ వచ్చే ఏడాది 8న జరుగనుంది. న్యాయస్థానం ఇచ్చే తీర్పు కోసం ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్



మొదట్లో ట్రామ్‌ను గుర్రాలే లాగేవి.. (నమూనా)



ఆధునిక వెర్షన్ ట్రామ్

సాక్షి ప్లస్
బుధవారం। 25-9-2024

సారవంత మైదానాలను ఏర్పరిచే సంక్లిష్ట ప్రక్రియ

ఉపరితలంపై ప్రవహించే నదులు, హిమనీ నదాలు, పవనాలు, వేలా తరంగాల లాంటి బాహ్య బలాల ప్రభావం వల్ల భూపటల శిలలు శైథిల్యమవడాన్నే 'క్రమక్షయం'గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం భూగోళం కవోష్ణ యుగంలో ఉండటం వల్ల నదులు ప్రధాన క్రమక్షయ కారకాలు. ఎత్తైన పర్వతాలు, పీఠభూములు నదుల క్రమక్షయ ప్రక్రియ వల్ల క్రమంగా శిథిలమై వివిధ రకాల భూస్వరూపాలు రూపాంతరం చెందుతున్నాయి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

నదులు - క్రమక్షయం

నదులు శైథిల్య శిలా పదార్థాన్ని రవాణా చేసి లోతట్టు హరివాణాలు లేదా సముద్ర భూతలంపై నిక్షిప్తం చేస్తాయి. అందువల్ల వివిధ రకాల క్రమక్షయ, నిక్షేపణా భూ స్వరూపాలు ఏర్పడతాయి. గంగా-సింధు మైదానం, నైలు నదీ లోయ, మిసిసిపీ - మిస్సోరి మైదానం తదితరాలను ప్రపంచంలోని ప్రధాన నదీ హరివాణాలు, నదీ భూ దృశ్యాలకు (Fluvial landscape) ఉదాహరణగా పేర్కొనవచ్చు. నదులు క్రమక్షయ శక్తి వల్ల అవి ప్రవహించే లోయలను కోతకు గురి చేస్తాయి. ఈ కోత క్షితిజ లంబ దిశలో (అథో క్రమక్షయం) లేదా క్షితిజ సమాంతర దిశలో (పార్శ్వ క్రమక్షయం) ఉండవచ్చు. శైథిల్య శిలా పదార్థాన్ని నదులు తమతో పాటు ద్రావణం రూపంలో, చోదక రూపంలో లేదా తేలియాడటం ద్వారా రవాణా చేస్తాయి. నదీ భారం బాగా అధికమైనప్పుడు, నదీ వేగం క్షీణించినప్పుడు శిలా పదార్థం అనువైన ప్రదేశాల్లో నిక్షిప్తమవుతుంది. శిలా పదార్థాన్ని కణాల పరిమాణం ఆధారంగా వేరు చేసిన తర్వాతే నది నిక్షేపిస్తుంది. అందువల్ల నదీ హరివాణం ఎగువ భాగంలో స్థూల రేణువులతో కూడిన ఇసుక, మధ్య భాగంలో సిల్ట్, చివరగా నదీ ముఖద్వారాల వద్ద సూక్ష్మ రేణు నిర్మితమైన బంకమన్ను ఉంటుంది.

క్రమక్షయ దశలు

నదులు.. అవి ఆవిర్భవించిన ఎత్తైన పర్వతాలు, పీఠభూముల ప్రాంతాల్లో వేగంగా ప్రవహిస్తూ అధిక క్రమక్షయ శక్తి కలిగి ఉంటాయి. అందువల్ల ఈ ప్రాంతాల్లో నదులు కేవలం క్రమక్షయాన్ని.. ముఖ్యంగా అథో క్రమక్షయాన్ని మాత్రమే కలిగిస్తాయి. పర్వతాలు, పీఠభూముల ద్వారా మైదానాలను చేరిన తర్వాత నదుల క్రమక్షయ శక్తి బాగా క్షీణిస్తుంది. ఈ సమయంలో అవి పార్శ్వ క్రమక్షయం మాత్రమే చేస్తాయి. క్రమంగా ఇది స్వల్ప పరిమాణంలో నిక్షేపణ చేసే దశకు చేరుకుంటుంది. సముద్రాల్లో కలిసే దశలో నదులు అధిక నదీ భారం వల్ల పెద్ద మొత్తాల్లో నిక్షేపణ చేస్తాయి. క్రమక్షయం పూర్తిగా స్తంభించిపోతుంది.

భూ స్వరూపాలు

నదీ హరివాణంలో ఆవిర్భావ ప్రాంతం నుంచి నదీ ముఖ ద్వారం మధ్య అనేక రకాల భూ స్వరూపాలను గమనించవచ్చు. ఆవిర్భావ ప్రాంతాల్లో క్రమక్షయ భూ స్వరూపాలు, మధ్య భాగంలో క్రమక్షయ, నిక్షేపణా భూ స్వరూపాల మిశ్రమం, ముఖ ద్వారాల వద్ద నిక్షేపణ భూ స్వరూపాలు స్పష్టంగా కనిపిస్తాయి. నది ఎగువ భాగాల్లో కింద పేర్కొన్న క్రమక్షయ భూ స్వరూపాలు ఏర్పడతాయి.

- 'V' ఆకారపు లోయలు, గార్జ్‌లు, కానియన్‌లు
- నదీ గ్రహణం, ప్లంజ్ పూల్స్
- జలపాతాలు, రాపిడ్స్, కాస్కేడ్స్

క్షితిజ లంబదిశలో అథో క్రమక్షయం వల్ల నదుల్లో లోతైన 'V' ఆకారం సంతరించుకుంటుంది. కొన్ని సందర్భాల్లో ఇవి చాలా లోతుగా ఉండి నిటారు వాలులు ఏర్పడినప్పుడు గార్జ్‌లు, కానియన్లుగా పిలుస్తారు. ఉదాహరణకు హిమాలయ నదులు శివాలిక్ కొండలు దాటేటప్పుడు లోతైన గార్జ్‌ల ద్వారా ప్రవహిస్తాయి. బ్రహ్మపుత్రా నది భారతదేశంలోకి అరుణాచల్ ప్రదేశ్‌లోని 'సయాడియా' గార్జ్ నుంచి ప్రవేశిస్తుంది. యూఎస్ఏలోని కొలరాడో నది ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'గ్రాండ్ కానియన్' నుంచి ప్రవహిస్తుంది.

ఎత్తైన పర్వత ప్రాంతాల్లో అనేక నదులు వేగంగా ప్రవహిస్తూ భారీ జలపాతాలను ఏర్పరుస్తాయి. సహ్యాద్రి కొండల్లోని శరావతి నది మన దేశంలోకెల్లా ఎత్తైన 'జోగ్' జలపాతాన్ని ఏర్పరుస్తుంది. నయాగరా, లివింగ్ స్టోన్, ఏంజిల్ లాంటి ప్రపంచ ప్రసిద్ధ జలపాతాలు నదుల క్రమక్షయం వల్లే ఏర్పడ్డాయి. కావేరి నది ఎత్తైన కర్ణాటక పీఠభూమిని వదిలి తమిళనాడు పీఠభూమిని చేరేటప్పుడు శివసముద్రం, హోగెంకల్ జలపాతాలు ఏర్పడ్డాయి. ఆవిర్భావ ప్రాంతాల్లో వేగంగా ప్రవహించే నదులు సమాంతరంగా ప్రవహించే చిన్న నదులను క్రమంగా తమలో కలుపుకుంటాయి. ఈ ప్రక్రియనే 'నదీ గ్రహణం'గా పిలుస్తారు. భగీరథీ నది సమీపంలోని అలక్‌నందా నదిని కలుపుకోవడం ద్వారా గంగానది ఆవిర్భవిస్తుంది. సమాంతర నదులను వేరుచేసే ఎత్తైన ప్రాంతాన్ని వేగంగా ప్రవహించే నది శిథిలం చేయడంతో నదీ గ్రహణం సంభవిస్తుంది. ప్రవాహ దిశ మరలించిన చిన్న నది లోయ ఎండిపోతుంది.

గిరిపద మైదానాలు

నదులు పర్వతాలను వీడి మైదానాలను చేరినప్పుడు అకస్మాత్తుగా తమ గతిశక్తిని కోల్పోవడంతో పర్వతపాదాల వద్ద కొంత శిథిల శిలా పదార్థాన్ని నిక్షేపిస్తాయి. ఈ రకంగా ఏర్పడిన మైదానాలనే 'గిరిపద మైదానాలు' (Peidmont plains) గా పిలుస్తారు. శివాలిక్ కొండలు -గంగా మైదానానికి సంధి ప్రాంతంలో హిమాలయ నదీ నిక్షేపణం వల్ల ఏర్పడిన గిరిపద మైదానాన్ని భాబర్, టెరాయి మండలాలుగా విభజిస్తారు. భాబర్ మండలం గులకరాళ్లు, ఇసుకతో కూడి ఉంటుంది. అధిక సచ్ఛిద్రత వల్ల భాబర్ మండలంలో హిమాలయ నదుల నీరు ఇంకిపోయి లోయలు ఎండిపోతాయి. టెరాయి మండలంలో ఇంకిన నీరు పైకి ఉబికి వచ్చి చిత్తడి నేలలు ఏర్పడతాయి. టెరాయి మండలంలో దట్టమైన అరణ్యాలు విస్తరించి ఉన్నాయి.

మైదాన ప్రాంతాల్లో పార్శ్వ క్రమక్షయం వల్ల విశాలమైన 'U' ఆకారపు లోయల నుంచి నదులు ప్రవహిస్తాయి. కఠిన శిలా ప్రాంతాలను క్రమక్షయం చేసే శక్తి లేకపోవడంతో నదులు వంకలు తిరిగి ప్రవహిస్తాయి. ఈ నదీ మార్గాలను 'నది వక్రతలు'గా పిలుస్తారు. 'U' ఆకారపు లోయలతో కూడిన వక్రతల ద్వారా ప్రవహించేటప్పుడు అంతర్ వక్రతల తలాల వెంట శిలా పదార్థం నిక్షేపితమై ఇసుక దిబ్బలుగా ఏర్పడతాయి. ఈ ఇసుక దిబ్బలనే 'స్పర్స్' అంటారు. నదుల్లోకి వరదలు వస్తే లోయను వీడిన నది ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతాలను ముంచేస్తుంది. ఈ వరద నీటిలో ఉన్న శిలా పదార్థం నదీ లోయకు ఇరువైపులా నిక్షిప్తమవుతుంది. దీనివల్ల ఏర్పడే మైదానాలను 'వరద మైదానాలు' అంటారు. ఇవి చాలా సారవంతమైనవి. గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానం అనేక వరద మైదానాలతో కూడి ఉంది. గంగా మైదానంలోని వరద మైదానాన్ని 'ఖాదర్', భంగర్ అనే రెండు భాగాలుగా విభజిస్తారు. వరద మైదానంలో నదీ లోయకు సమీపంలోని లోతట్టు ప్రాంతాన్ని ఖాదర్ మైదానంగా పిలుస్తారు. ఇది తరచుగా వరద ముంపునకు గురవడం వల్ల నవీన ఒండ్రుమట్టితో నిండి ఉంటుంది. వరద మైదానంలో లోయకు దూరంగా ఉన్న ఎత్తైన ప్రాంతాలను 'భంగర్ మైదానం'గా పిలుస్తారు. ఈ మండలం పురాతన ఒండ్రుమట్టితో నిండి ఉంటుంది. ఈ ప్రాంతంలో వరద ముంపు తక్కువ. వరద మైదానంలో అర్ధ చంద్రాకృతిలో ఉండే ఆక్స్‌బో సరస్సులు కూడా ఏర్పడతాయి. నదీ లోయలకు ఇరువైపులా ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే ఎత్తైన ఇసుకదిబ్బలను సహజ లెవీలుగా పిలుస్తారు. ఇవి వరద మైదానాన్ని భవిష్యత్‌లో సంభవించే వరదల నుంచి కాపాడతాయి. కొన్ని సందర్భాల్లో ఈ లెవీలు, ఉప నదుల సంగమాన్ని నిరోధిస్తాయి. ఉప నదులు సహజ లెవీలకు సమాంతరంగా ప్రవహించి చాలా దూరం తర్వాత ప్రధాన నదిలో కలుస్తాయి. ఈ రకమైన సంగమ ప్రాంతాలను 'యాజూ సంగమాలు'గా పిలుస్తారు.

నదీ ముఖద్వారాలు

నదులు.. సముద్రాల్లో కలిసే ప్రాంతాల (నదీ ముఖద్వారాలు) వద్ద ఒండ్రుమట్టిని లోయల్లోనే నిక్షేపించడంతో శాఖోపశాఖలుగా చీలిపోతాయి. ఈ శాఖల మధ్య ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే మైదానాలను 'డెల్టాలు' అంటారు. ఇవి చాలా సారవంతమైనవి. అనాదిగా డెల్టా ప్రాంతాల్లో సాంద్ర వ్యవసాయం అభివృద్ధి చెందింది. గోదావరి నది రాజమండ్రికి దిగువ మూడు ప్రధాన పాయలుగా చీలిపోతుంది. ఈ పాయల మధ్య గోదావరి డెల్టా ఏర్పడింది. గంగా-హుగ్లీ-బ్రహ్మపుత్ర డెల్టా పక్షిపాద ఆకారంలో ఉంటుంది. కృష్ణా డెల్టా డిజిటేట్ తరగతికి, గోదావరి డెల్టా లోబేట్ రకానికి చెందింది. నర్మద, తపతి నదులు వాటి ముఖద్వారాల వద్ద కాకుండా శైథిల్య శిలా పదార్థాన్ని సముద్ర భూతలంపై నిక్షేపిస్తాయి. అందువల్ల అవి డెల్టాలను ఏర్పరచవు. వీటి ముఖద్వారాలను 'ఎస్ట్యూరీలు'గా పిలుస్తారు.

హిమనీనదాలతో క్రమక్షయం..

కదిలే హిమ భాగాలనే హిమనీనదాలుగా పిలుస్తారు. ఇవి వేగంగా ప్రవహించే పర్వతీయ (లోయ) లేదా నెమ్మదిగా కదిలే విశాలమైన ఖండాంతర హిమనీనదాల రూపంలో ఉండవచ్చు. హిమనీనదాలు ఉత్పాతనం, అపఘర్షణ లేదా ఫ్రాస్ట్ వెడ్జింగ్ ప్రక్రియల ద్వారా పటల శిలలను శైథిల్యం చేస్తాయి. గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, అంటార్కిటికా లాంటి ధ్రువ ప్రాంతాలు, ఆల్ప్స్-హిమాలయాల లాంటి ఎత్తైన పర్వత శిఖరాల ప్రాంతాల్లో హిమనీనద క్రమక్షయం ఉంది. ఉత్తర అమెరికాలోని మహా సరస్సుల ప్రాంతం, ఐరోపా, సైబీరియా హిమనీనద భూదృశ్యాలకు మంచి ఉదాహరణలు. శైథిల్య శిలా పదార్థాన్ని హిమనీనదాలు పరిమాణాన్ని అనుసరించి వేరు చేయకుండా నిక్షేపిస్తాయి. అంటే ఈ నిక్షేపాల్లో స్థూల, సూక్ష్మ రేణువులు గుట్టగా ఉంటాయి.

పర్వత వాలులపై ప్రవహించే హిమనీనదాలు లోతు తక్కువ ఉన్న విశాలమైన 'U' ఆకారపు లోయల ద్వారా ప్రవహిస్తాయి. వీటి క్రమక్షయ ప్రభావంతో పర్వత వాలుల వెంట పడక కుర్చీ ఆకారంలో ఉండే లోతైన గుంటలు ఏర్పడతాయి. వీటిని 'సర్క్' (Cirque) అంటారు. పర్వతం లేదా కొండ వివిధ వాలులపై వేర్వేరు హిమనీనదాలు ప్రవహిస్తూ సర్క్‌లను ఏర్పాటు చేస్తుంటాయి. వివిధ తలాలపై ఏర్పడిన సర్క్‌లు విశాలమై, క్రమంగా కొండను పదునైన అంచుతో కూడిన పిరమిడ్‌గా మారుస్తాయి. వీటిని ఏరేట్‌లు అంటారు. ఏరేట్‌లు మరింత క్రమక్షయం చెంది శృంగాకారంలోకి మారతాయి. వీటిని 'హార్న్'గా వ్యవహరిస్తారు. ఉదాహరణకు ఆల్ప్స్ పర్వతాల్లోని 'మాటర్ హార్న్' శృంగాలు మరింత హిమనీనద క్రమక్షయానికి లోనవడంతో కొండ దాదాపుగా అదృశ్యమై 'కనుమ'గా రూపొందుతుంది. హిమాలయాల్లోని కారంకోరం, షిప్కిలా, జోజిలా, బనిహాల్ కనుమలు ఈ కోవకు చెందినవే. ఖండ భాగాల్లో ప్రవహించే హిమనీనదాలు వాటి ప్రవాహ మార్గంలోని పెద్ద పెద్ద శిలలను క్రమక్షయం చేయడం వల్ల క్రాగ్ అండ్ టెయిల్, రోచే మాంటేన్ లాంటి భూ స్వరూపాలు ఏర్పడతాయి. క్రాగ్ అండ్ టెయిల్‌లో కఠిన శిలా భాగం క్రమక్షయాన్ని నిరోధించడంతో నిట్రాలుగా ఏర్పడగా, మృదువైన శిలా భాగంలో తిన్నని వాలుగా ఏర్పడుతుంది. హిమనీ నది ప్రవాహ దిశలో శిలల తలాలపై అపఘర్షణ వల్ల అవి మృదువుగా తయారవుతాయి. పరాన్ముఖ దిశలో ఉత్పాతన వల్ల గరుకైన తలాలు ఏర్పడతాయి. ఈ రకంగా ఒకవైపు మృదు, ఇంకోవైపు గరుకైన తలాలతో కూడిన శిలలనే 'రోచేమాంటేన్'గా పిలుస్తారు.

మొరైన్‌లు

హిమనీనదాలు శిలా పదార్థాన్ని తీసుకొచ్చి అనువైన ప్రాంతాల్లో నిక్షేపించడం వల్ల వివిధ రకాల భూ స్వరూపాలు ఏర్పడతాయి. రేఖీయంగా ఎత్తు తక్కువలో ఉండే దిబ్బల లాంటి హిమనీనద నిక్షేపాలను 'మొరైన్'లుగా పిలుస్తారు. ఇవి పొరలతో కాకుండా వివిధ పరిమాణాల రేణువులతో కూడి ఉంటాయి. కోడిగుడ్డు ఆకారంలో ఉండే నిక్షేపణా భూ స్వరూపాలను 'డ్రమ్లిన్లు' అంటారు. ఉత్తర ఐర్లాండ్ ప్రాంతంలో కొన్ని వేల సంఖ్యలో డ్రమ్లిన్‌లు వరసగా అమరి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 'ఎగ్ బాస్కెట్ కంట్రీ' అంటారు.

హిమనీనదాల అంత్య దశలో మంచు క్రమంగా కరిగి నీరుగా మారడం ప్రారంభమవుతుంది. అందువల్ల అంత్య దశలో హిమనీనదాల్లో మంచుతో పాటు నీరు కూడా ప్రవహిస్తుంది. దీంతో హిమనీనద క్రమక్షయానికి నదీ క్రమక్షయం కూడా తోడవుతుంది. నీటి ప్రక్రియ వల్ల హిమనీనదాల అంత్య దశలో రేఖీయంగా ఉండే పొడవైన దిబ్బల మాదిరిగా మెత్తని ఇసుక నిక్షిప్తమవుతుంది. ఈ ఇసుక దిబ్బలను 'ఎస్కర్లు'గా పిలుస్తారు. ఇవి కొన్ని కిలోమీటర్ల దూరం వ్యాపించి ఉంటాయి. ఇవి హిమనీనద లోయలకు సమాంతరంగా ఏర్పడతాయి. వీటిలో కేవలం సూక్ష్మ ఇసుక రేణువులు మాత్రమే ఉంటాయి.

ఎర్రాటిక్స్

తిన్నని వాలులతో కూడిన శంఖు ఆకారపు ఒండ్రుమట్టి దిబ్బలు కూడా హిమనీనద నిక్షేపణ వల్ల అంత్య దశలో ఏర్పడతాయి. వీటిని 'కేమ్స్'గా పిలుస్తారు. ఇవి సాధారణంగా హిమనీనద ముఖద్వారం వద్ద ఏర్పడతాయి. హిమనీనదాలు తమతో పాటు పెద్ద బండరాళ్లను చాలా దూరం తీసుకొచ్చి అంత్య దశలో నిక్షేపం చేస్తాయి. ఈ బండరాళ్లకు, స్థానిక శిలలకు పోలికలుండవు. వీటిని 'ఎర్రాటిక్స్' అంటారు. 'ఎర్రాటిక్స్' హిమనీనదాల ప్రయాణ దిశను సూచిస్తాయి. అంత్యదశలో మెత్తని గులకరాళ్లు, ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే సమతల మైదానాలను 'అవుట్ వాష్ మైదానాలు' అంటారు. వీటి ఏర్పాటులో నీరు కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ మైదానంలో హిమనీనదం అనేక చిన్న పాయలుగా చీలిపోతుంది. ఈ మైదానంలో ఉండే చిన్నచిన్న గుంటల లాంటి హరివాణాలను 'కెటిల్ రంధ్రాలు' అంటారు.

రాష్ట్రకూట వంశానికి చెందిన వారే కాకతీయులు!

గ్రూప్స్ - ప్రత్యేకం

హిస్టరీ

కాకతీయులు రాష్ట్రకూట వంశానికి చెందినవారు. కర్ణాటక నుంచి తెలంగాణకు వచ్చి, ఆ తర్వాత ఆంధ్ర ప్రాంతమంతటా విస్తరించారు. మొదట రాష్ట్రకూట, కల్యాణీ (పశ్చిమ) చాళుక్య రాజులకు సైన్యాధ్యక్షులు, మాండలికులు, సామంతులుగా ఉండి తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. ప్రత్యర్థులుగా ఉన్న ముదిగొండ చాళుక్యులను, వేములవాడ చాళుక్యులను, కందూరు చోడులను, పాలవాస రాజులను, నగునూరు రాజులను ఓడించి తెలంగాణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు.



తొలి కాకతీయులు

తొలి కాకతీయులు (కాకతీయ వంశంలోని ఆదిపురుషులు) రాష్ట్రకూటుల సేనానులుగా తెలంగాణకు వచ్చారని పీవీ పరబ్రహ్మశాస్త్రి నిరూపించారు. వీరు తమ పేరు చివరన రాష్ట్రకూట నామాన్ని (గుండియ రాష్ట్రకూట, ఎర్రయ రాష్ట్రకూట) ధరించేవారు. రాష్ట్రకూటుల రాజ చిహ్నమైన 'గరుడ'(గరుడబేతయ)ను తమ పతాకాలపై ఉంచుకునేవారు. రాష్ట్రకూటుల ఆస్థాన మతమైన జైనాన్ని అవలంభించడం, వారి వృష్టి వంశాన్నే తమ వంశంగా చెప్పుకోవడం లాంటి కారణాల వల్ల కాకతీయులు రాష్ట్రకూట వంశస్థులేనని స్పష్టమవుతోంది. స్థానిక (తెలంగాణ) బోయ, పుళింద జాతులవారు జైనమతం ద్వారా సాంఘికోన్నతి సాధించి రాష్ట్రకూటుల వద్ద సైనికోద్యోగులుగా చేరి క్రమంగా సామంతులయ్యారనే అభిప్రాయమూ ఉంది. ఈ వంశానికి ఆద్యుడైన వెన్నరాజు (క్రీ.శ.750-768) రాష్ట్రకూట సేనాని, సామంతుడు. ఆదిలాబాద్ పశ్చిమప్రాంతం, బాసర, ముథోల్, కుబేరు (కుబీర్), భైంసా(మహిషా) ప్రాంతాలు ఇతని రాజ్యంలో ఉండేవి. ఇతడి తర్వాత మొదటి గుండరాజు (క్రీ.శ.768-824), రెండో గుండరాజు (క్రీ.శ. 824 - 870), మూడో గుండరాజు (క్రీ.శ.870 - 895) రాష్ట్రకూటుల సేనానులుగా, సామంతులుగా పనిచేశారు. వీరి కాలం తదితర విషయాల్లో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి.

ఎర్రయరాజు (895-940)

ఈ వంశంలో మొదటి నలుగురి తర్వాత ఎర్రయరాజు (క్రీ.శ.895-940) కూడా రాష్ట్రకూటుల సేనానిగా కురవాడి సీమను పాలించాడు. వేంగి చాళుక్యులకు లోబడి ముదిగొండ చాళుక్యులు పాలించిన నేటి ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కొరవి ప్రాంతమే కురవాడి సీమ. ముదిగొండ చాళుక్యులను తరిమేసి రాష్ట్రకూటులు ఎర్రయరాజును ఈ ప్రాంతానికి సామంతుడిగా నియమించారు. అయితే క్రీ.శ.934లో ముదిగొండ చాళుక్యులు ఆ ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించారు. ఎర్రయ కొడుకు బేతియకు పెద్ద ప్రాధాన్యం లేదు. తర్వాత బేతియ కొడుకు నాలుగో గుండరాజు(క్రీ.శ.955-990) రాష్ట్రకూటుల సేనానిగా నియమితుడై కొరవిసీమను తిరిగి ఆక్రమించాడు. తూర్పు చాళుక్యులైన రెండో అమ్మరాజు, దానార్ణవుడి మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. నాలుగో గుండరాజు దానార్ణవుడి పక్షం వహించి కొరవిసీమను పొందాడు.

క్రీ.శ.973లో కల్యాణీ చాళుక్య రెండో తైలపుడు రాష్ట్రకూట రాజ్యాన్ని ఆక్రమించాడు. దీంతో తైలపుణ్ని ఆశ్రయించిన ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజు.. విరియాల ఎర్రసేనాని ద్వారా తిరిగి కొరవిసీమను పొందగలిగాడు. దీంతో కాకతీయులు గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. కానీ తన భార్య విరియాల కామసాని వినతి మేరకు ఎర్రసేనాని కల్యాణీ చాళుక్య చక్రవర్తిని ఒప్పించి మొదటి బేతరాజు(క్రీ.శ.992-1052)ను అనుమకొండ విషయపాలకుడిగా నియమించాడు. కామసాని మొదటి బేతరాజు (గరుడ బేతరాజు) మేనత్త, గుండరాజు సోదరి.

మొదటి ప్రోలరాజు

బేతరాజు కల్యాణీ చాళుక్య సామంతుడిగా స్థిరపడ్డాడు. ఇతడి రాజ్యం కొరివిసీమ సరిహద్దు నుంచి కరీంనగర్ మండలంలో ఉన్న శనిగరం వరకు వ్యాపించింది. బేతరాజు తర్వాత అతడి కొడుకు మొదటి ప్రోలరాజు (క్రీ.శ.1052-1076) రాజ్యానికొచ్చాడు. ఇతడు వేములవాడ చాళుక్యరాజు భద్రగుణ్ణి (మూడో బద్దెగుడు) ఓడించి సబ్బిసాయర మండలం(కరీంనగర్ ప్రాంతం)లోని కొన్ని ప్రాంతాలను జయించాడు. అనుమకొండ విషయాన్ని మొదటి బేతరాజు తొలుత పొందినప్పటికీ శాశ్వత మాన్యంగా పొందింది మాత్రం ప్రోలరాజే. ప్రోలుడు చిత్రకూటలో అరాచకత్వాన్ని అణచివేయడం, బద్దెగుణ్ని జయించడం, కొంకణంపై విజయం సాధించడం వల్ల అతడి శౌర్యప్రతాపాలకు గుర్తింపుగా చక్రవర్తి అనుమకొండను శాశ్వతమాన్యంగా ఇచ్చాడు.

రెండో బేతరాజు

ఒకటో సోమేశ్వరుడు క్రీ.శ.1068లో మరణించాడు. తర్వాత చక్రవర్తిగా వచ్చిన రెండో సోమేశ్వరుణ్ని తొలగించి అధికారంలోకి రావాలని ఆరో విక్రమాదిత్యుడు వీలైనంత మంది మాండలికులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రోలుడు, అతడి కుమారుడు రెండో బేతరాజు.. ఆరో విక్రమాదిత్యుడికి అండగా నిలిచారు. అది ప్రోలుడి తర్వాత రాజైన రెండో బేతరాజు (క్రీ.శ.1076-1108)కు ఉపయోగపడింది. పారమార జగద్దేవుడు స్వాతంత్ర్యం ప్రకటించుకోవడమూ దీనికి దోహదం చేసింది. జగద్దేవుడి నుంచి సబ్బి సహస్రం మొత్తాన్ని విక్రమాదిత్యుడు బేతరాజుకు ఇచ్చినట్లు పద్మాక్షి ఆలయ శాసనం ద్వారా తెలుస్తోంది. శనిగరం ప్రాంతంతోపాటు సబ్బి సహస్రం కాకతీయ రాజ్యంలో చేరాయి. ముదిగొండ చాళుక్యుల రాజ్యంలోని కొన్ని భాగాలు కూడా ఇతడి రాజ్యంలో చేరాయి. ఇతడు అనుమకొండలో బేతేశ్వరాలయాన్ని, తన తండ్రి పేరుతో ప్రోలేశ్వరాలయాన్ని నిర్మించాడు.

రెండో ప్రోలరాజు

బేతరాజు తర్వాత ఇతడి పెద్ద కొడుకు దుర్గరాజు (క్రీ.శ.1108-క్రీ.శ.1116) రాజయ్యాడు. పదవీచ్యుతుడైన కొలనుపాక రాజు జగద్దేవుని ప్రోత్సాహంతో పొలవాస పాలకుడు మేడరాజు స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో పారమార జగద్దేవుని స్థానంలో కుమార సోమేశ్వరుడు(క్రీ.శ.1108-1125) కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడయ్యాడు. ఈ తిరుగుబాట్లను అణచడానికి కుమార సోమేశ్వరుడికి అండగా నిలిచిన రెండో ప్రోలరాజు(క్రీ.శ.1116-1157) జగద్దేవుడిని పారదోలి సోదరుడు దుర్గరాజును పదవీచ్యుతుణ్ని చేసి సింహాసనం అధిష్ఠించాడు. చాళుక్య చక్రవర్తుల నుంచి స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించిన సామంతులందరితో యుద్ధం చేసి ఓడించాడు. ఈ రకంగా తెలంగాణ మొత్తాన్ని జయించి కల్యాణీ చాళుక్య ప్రతాపచక్రవర్తి రెండో జగద్దేకమల్లుడు (క్రీ.శ.1138-1150)కి విధేయుడిగా ఉన్నాడు.

రెండో ప్రోలరాజు విజయాలు

కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడైన కుమార సోమేశ్వరుడు తన తండ్రి విక్రమాదిత్యుడి అనంతరం క్రీ.శ.1126లో మూడో సోమేశ్వరుడిగా రాజ్యానికొచ్చాడు. అంతకుముందు నుంచే కందూరునాడును పాలిస్తున్న యువరాజు కుమార తైలపుడు (క్రీ.శ.1110-1137) తన సోదరుడు మూడో సోమేశ్వరుడికి వ్యతిరేకంగా దక్షిణ తెలంగాణలో స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ ప్రయత్నంలోనే మూడో సోమేశ్వరుడికి అనుకూలుడైన కందూరి చోడ మొదటి గోకర్ణుడిని చంపించి కందూరునాడును శ్రీదేవి తొండయ, గోవింద దండేశులకు పంచి సామంతులుగా చేసుకున్నాడు. దీంతో మొదటి గోకర్ణుడి కుమారుడు రెండో ఉదయచోడుడు మూడో సోమేశ్వరుణ్ని ఆశ్రయించాడు. సోమేశ్వరుడి ఆదేశంతో రెండో ప్రోలుడు శ్రీదేవి తొండయ, గోవింద దండేశులను ఓడించి ఉదయ చోడుడికి(క్రీ.శ.1131-36) పట్టం కట్టాడు. ఈ రకంగా దక్షిణ తెలంగాణ మీద ప్రోలుడు ఆధిక్యం సాధించాడు.

తన అనుయాయుల ఓటమిని జీర్ణించుకోలేని తైలపుడు కాకతీయుల ఉత్తర సరిహద్దులో ఉన్న పొలవాస రాజైన మేడరాజును, అతడి తమ్ముడు గుండరాజును ప్రేరేపించాడు. అప్పటికే వీరు చాళుక్య చక్రవర్తుల పట్ల అవిధేయులుగా ఉన్నారు. రెండో జగద్దేకమల్లుడి(క్రీ.శ.1138-1150) పక్షాన నిలబడి ప్రోలరాజు గుండనను సంహరించాడు. గుండన కుటుంబానికి చెందిన ఏడో రాజును పారదోలాడు.

ఈ విజయంతో ప్రోలరాజు ఉత్తర తెలంగాణ మీద ఆధిక్యత సాధించాడు. చక్రవర్తి పక్షాన కుమార తైలపుడిని ఓడించాడు. ఈ విజయోత్సాహంతో కృష్ణానది దాటి శ్రీశైలంలో విజయస్తంభం నాటించాడు. తెలంగాణపై ఆధిక్యం సాధించాక తీరాంధ్రను జయించే ప్రయత్నంలో మరణించాడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని ఇతడే ప్రారంభించాడు. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ప్రోలరాజు భార్య. వీరి కుమారులు.. రుద్రదేవుడు, మహాదేవుడు, హరిహరుడు, గణపతి, రేపొల్ల దుర్గరాజు. తండ్రి మరణానంతరం పెద్దకుమారుడైన రుద్రదేవుడు(క్రీ.శ.1158-క్రీ.శ.1195) రాజ్యానికొచ్చాడు.

మూడు సామంత రాజ్యాలు

కాకతీయ రాజ్య పరిసరాల్లో మూడు సామంత రాజ్యాలు ఉండేవి. తూర్పున ముదిగొండ చాళుక్యులు, వాయవ్యంగా కరీంనగర్ జిల్లాలో పొలవాస నాయకులు, దక్షిణాన కందూరు చోడులు ఉండేవారు. అనుమకొండ విషయానికి పశ్చిమాన ఉన్న ప్రాంతం రాజు ప్రత్యక్ష ఆధీనంలో ఉండేది. అనుమకొండకు నైరుతి దిశగా కొలనుపాక కేంద్రంగా రాజప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పాలించేవారు. ప్రోలరాజు వీరిపై ఆధిక్యత సాధించిన సందర్భంలో రుద్రదేవుడు సింహాసనం అధిష్ఠించాడు.

రుద్రదేవుడు

తైలపుడు తన సోదరుడు జగదేక మల్లుని పదవీచిత్యుణ్ని చేసి అధికారంలోకి వచ్చాడు. కాబట్టి పరబ్రహ్మ శాస్త్రి పేర్కొన్న తైలపుడు ఈ మూడో తైలపుడు కావడానికే ఎక్కువ అవకాశం ఉంది. పదవీభ్రష్టులైన కల్యాణి చాళుక్య రాజులు తమ పూర్వవైభవాన్ని తిరిగి సంతరించుకోలేరని నిర్ధయించుకున్న రుద్రదేవుడు క్రీ.శ.1162/3లో సార్వభౌమత్వాన్ని ప్రకటించుకున్నాడు. తెలంగాణలో తిరుగులేని ప్రభువుగా మారిన తర్వాత తీరాంధ్రపై దృష్టి పెట్టాడు.

వేయి స్తంభాల గుడి

రుద్రదేవుడు(క్రీ.శ.1158-క్రీ.శ.1195) తన తండ్రిని చంపిన వెలనాటి రాజుపై మొదట విజృంభించాడు. పల్నాటి యుద్ధంలో నలగామరాజుకు సహాయపడ్డాడు. ధాన్యకటకాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దుర్జయులను ఓడించి త్రిపురాంతకాన్ని జయించాడు. క్రీ.శ.1186 నాటికి తీరాంధ్రను గెలిచాడు. ఈ రకంగా రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్యానికి గట్టి పునాదులు వేశాడు. ఈ విజయాల్లో సహాయం చేసిన రేచర్ల బేతిరెడ్డికి నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లును, చెరకు రెడ్లకు జమ్ములూరును ఇచ్చాడు. ఇతడి రాజ్యం ఉత్తరాన గోదావరి, పశ్చిమాన బీదరు, దక్షిణాన శ్రీశైలం, తూర్పున సముద్రం వరకు విస్తరించిందని వేయి స్తంభాల గుడి శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రదేవుడు ఓరుగల్లు కోట నిర్మాణాన్ని కొంతమేర పూర్తిచేశాడు. రుద్రేశ్వర దేవాలయాన్ని కట్టించాడు. ఇదే వేయి స్తంభాల గుడి.

మహాదేవుడు

రుద్రదేవుడికి కుమారులు లేకపోవడం వల్ల తమ్ముడు మహాదేవుడు(క్రీ.శ.1195-1198) రాజ్యానికి వచ్చాడు. ఇతడు జైతుగి (క్రీ.శ.1192-1200) కాలంలో యాదవరాజ్యం మీద చేసిన యుద్ధంలో మరణించాడు. మహాదేవుని భార్య రాణి బయ్యాంబ. గణపతిదేవుడు, మైలాంబ, కుందమాంబ వీరి సంతానం. యాదవరాజులు గణపతిని బంధించారు. ఇదే అదనుగా ముదిగొండ చాళుక్యులు, వెలనాటి చోళులు, చోళరాజులు కాకతీయ సామ్రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. కానీ సామంతసేనానైన రేచర్ల రుద్రారెడ్డి(రుద్రసేనాని) మిగతా సేనానులు, సామంతులైన విరియాల, మాల్యాల సహాయంతో వీరిని ఓడించినట్లు పాలంపేట శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రసేనాని గణపతి దేవుడిని విడిపించి క్రీ.శ.1199లో కాకతీయ రాజ్య పట్టాభిషిక్తుడిని చేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. కాకతీయ వంశానికి ఆద్యుడు?
   1) గణపతిదేవుడు 2) మొదటి గుండన
   3) వెన్నరాజు 4) మొదటి బేతరాజు
2. ఓరుగల్లు కోట నిర్మాణానికి పునాదులు వేసినవాడు?
   1) మొదటి ప్రోలరాజు
   2) రెండో ప్రోలరాజు
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
3. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ఎవరి భార్య?
   1) మొదటి ప్రోలరాజు
   2) గణపతిదేవుడు 3) మొదటి బేతరాజు
   4) రెండో ప్రోలరాజు
4. తొలి కాకతీయులు ఎవరికి సామంతులుగా ఉన్నారు?
   1) శాతవాహనులు 2) రాష్ట్రకూటులు
   3) బాదామి చాళుక్యులు 4) ఇక్ష్వాకులు
5. మలి కాకతీయులు ఎవరి సామంతులు?
   1) రాష్ట్రకూటులు
   2) కల్యాణి చాళుక్యులు
   3) బాదామి చాళుక్యులు
   4) కందూరి చాళుక్యులు
6. రుద్రదేవుడు ఏ కాలంనాటికి తీరాంధ్రను జయించాడు?
   1) క్రీ.శ. 1186 2) క్రీ.శ. 1180
   3) క్రీ.శ. 1176 4) క్రీ.శ. 1190
7. పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సహాయపడ్డ కాకతీయ రాజు?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండోబేతరాజు
8. రుద్రదేవుడు యుద్ధాల్లో తనకు సహాయం చేసిన ఏ రాజును ఆమనగల్లు సామంతునిగా నియమించాడు?
   1) రేచర్ల నామిరెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
   3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల బేతిరెడ్డి
9. వేయి స్తంభాల గుడి (రుద్రేశ్వరాలయం) ని కట్టించినవారు?
   1) రుద్రదేవుడు 2) గణపతిదేవుడు
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3 2) 2 3) 4 4) 2 5) 2
6) 1 7) 3 8) 4 9) 1

శీతల ప్రాంతాల్లో ఉపయోగించే ఉష్ణమాపకం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

ఉష్ణం

ఉష్ణం ఒక శక్తి స్వరూపం. ఇది ఎల్లప్పుడూ అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువు వైపు ప్రయాణిస్తుంది.

ప్రమాణాలు: ఎర్గ్, జౌల్, కెలోరీ

- ఒక వస్తువు ఉష్ణాన్ని అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'కెలోరీమెట్రీ' అంటారు.
- వస్తువు నుంచి వెలువడే ఉష్ణరాశిని కొలవడానికి బాంబ్ కెలోరీ మీటర్‌ను వాడతారు.

ఉష్ణ ప్రసారం

అధిక ఉష్ణోగ్రత ఉన్న వస్తువు నుంచి అల్ప ఉష్ణోగ్రత ఉన్న వస్తువులోకి ఉష్ణం ప్రయాణించడాన్ని ఉష్ణ ప్రసారం అంటారు. ఇది మూడు పద్ధతుల్లో జరుగుతుంది.

- ఉష్ణ వహనం
- ఉష్ణ సంవహనం
- ఉష్ణ వికిరణం

ఉష్ణ వహనం:
ఒక పదార్థం లేదా వస్తువులోని కణాలు లేదా అణువులు ఎలాంటి స్థానాంతర చలనం చెందకుండా ఉష్ణప్రసారం జరగడాన్ని ఉష్ణ వహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ఘన పదార్థాలు, ద్రవస్థితిలో ఉన్న పాదరసం.

ధర్మాలు:
- ఈ ప్రక్రియలో ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఉష్ణ ప్రసారం జరుగుతున్నప్పుడు కణాలకు ఎలాంటి స్థానభ్రంశం ఉండదు.
- ఈ పద్ధతిలో ఉష్ణప్రసారం జరుగుతున్నప్పుడు యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

ఉష్ణ సంవహనం:
ఒక వస్తువు లేదా పదార్థంలోని అణువులు లేదా కణాల స్థానాంతర చలనం వల్ల ఉష్ణప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ సంవహనం అంటారు.

ఉదాహరణ: అన్ని ద్రవ పదార్థాలు (పాదరసం మినహా), వాయు పదార్థాలు.

ధర్మాలు:
- ఈ ప్రక్రియలో కూడా ఉష్ణ ప్రసారం ఆలస్యంగా జరుగుతుంది.
- ఈ పద్ధతిలో కణాలు స్థానాంతరం చెందుతాయి.
- యానకం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

అనువర్తనాలు:
- ఉష్ణ సంవహనం సూత్రం ఆధారంగా పొగ గొట్టాలు, పరిశ్రమల్లో చిమ్నీలు, వెంటిలేటర్లు మొదలైనవి పనిచేస్తాయి.
- భూ పవనాలు, సముద్ర పవనాలు అనేవి కూడా ఉష్ణ సంవహన ధర్మం ఆధారంగా ఏర్పడతాయి. పూర్వకాలంలో తెరచాపలను ఉపయోగించి సముద్ర పవనాల సహాయంతో సరుకులను రవాణా చేసి వ్యాపారం నిర్వహించేవారు. కాబట్టి ఈ సముద్ర పవనాలను వ్యాపార పవనాలు అంటారు.

ఉష్ణ వికిరణం:
యానకంతో నిమిత్తం లేకుండా ఉష్ణ ప్రసారం జరిగే పద్ధతిని ఉష్ణ వికిరణం అంటారు.

ఉదాహరణలు:
- సూర్యుడి నుంచి బయలుదేరిన కాంతి కిరణాలు శూన్యం ద్వారా ప్రసరిస్తూ భూవాతావరణ పొరల్లోకి ప్రవేశించి భూమికి చేరతాయి.
- ఈ విశ్వంలో నక్షత్రాల మధ్య ఉష్ణప్రసారం వికిరణ పద్ధతిలో జరుగుతుంది.
- మండుతున్న జ్వాలకు కొంత దూరంలో ఉన్న వ్యక్తి ఉష్ణశక్తిని వికిరణ రూపంలో పొందుతాడు.

ధర్మాలు:
- ఇది చాలా వేగంగా జరిగే ప్రక్రియ.
- ఈ పద్ధతిలో యానకం ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది.

గమనిక: ఉష్ణవహనం, సంవహన ప్రక్రియల్లో ఉష్ణ ప్రసారం చాలా మెల్లగా జరుగుతుంది. కానీ వికిరణ పద్ధతిలో కాంతి వేగానికి($3\times10^8\ ms^{-1}$) సమానమైన వేగంతో ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

అనువర్తనాలు:
- ఒక పాత్రలోని వేడి ద్రవాన్ని స్టీలు చెంచాతో తిప్పినప్పుడు ఆ చెంచా వేడెక్కుతుంది. దీనికి కారణం ఉష్ణ వహన ప్రక్రియ.
- ఒక రాగి పాత్ర(ఉష్ణవాహక పదార్థం)లో వేడి ద్రవాన్ని నింపి చెక్క బల్ల(ఉష్ణబంధకం)పై ఉంచినప్పుడు ఆ ద్రవం ఉష్ణాన్ని పరిసరాల్లోని గాలికి కోల్పోయి చల్లబడుతుంది. అంటే ఉష్ణ సంవహన పద్ధతి ద్వారా వేడి ద్రవం తన ఉష్ణాన్ని కోల్పోయి చల్లారుతుంది.
- ఒకవేళ ఈ వేడి పాత్రను ఇనుప బల్లపై ఉంచినప్పుడు ఉష్ణ వహనం(ఇనుప బల్ల), ఉష్ణ సంవహనం(గాలి) పద్ధతుల ద్వారా ద్రవం చల్లారుతుంది.
- భూగోళం.. ఉష్ణ వహనం, ఉష్ణసంవహనం, ఉష్ణవికిరణం పద్ధతుల్లో వేడెక్కుతుంది.

థర్మాస్ ఫ్లాస్క్(శూన్యనాళిక ఫ్లాస్క్)

థర్మాస్‌ఫ్లాస్క్‌ను సర్ జేమ్స్ డివర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. దీనిలో వేర్వేరు వ్యాసాలున్న రెండు గాజు నాళాలను ఒకదానిలో మరొకదాన్ని అమరుస్తారు. ఈ గాజు నాళాల అవతలి వైపు సిల్వర్ బ్రోమైడ్ అనే రసాయన పదార్థంతో పూత పూస్తారు. ఈ రెండు నాళాల మధ్యలో శూన్యం ఉండేట్లు చేసి వీటిని ఉష్ణబంధక పదార్థమైన ప్లాస్టిక్ డబ్బాలో అమర్చుతారు.

థర్మాస్‌ఫ్లాస్క్‌లో నింపిన వేడి ద్రవం ఉష్ణ వహనం, సంవహనం, ఉష్ణ వికిరణం అనే మూడు పద్ధతుల్లో కూడా ఉష్ణాన్ని కోల్పోదు. అందువల్ల కొంత సేపటి వరకు ద్రవం వేడిగా ఉంటుంది. అనంతరం ద్రవం ఉష్ణశక్తి యాంత్రిక శక్తిగా మారి క్రమంగా చల్లబడుతుంది.



గమనిక: వస్తువు ఉష్ణాన్ని కోల్పోవడం లేదా గ్రహించడం అనేది దాని స్వభావం, ఉపరితల వైశాల్యంపై ఆధారపడి ఉంటుంది.

- బావిలోని నీటి ఉపరితల వైశాల్యం కంటే చెరువులోని నీటి ఉపరితల వైశాల్యం ఎక్కువ. అందువల్ల చెరువు గ్రహించే, కోల్పోయే ఉష్ణరాశి ఎక్కువ.
- చలి ప్రదేశంలో ఉన్న జంతువులు శరీరాన్ని ముడుచుకోవడం ద్వారా తమలోని ఉష్ణాన్ని కోల్పోకుండా కాపాడుకుంటాయి.

పదార్థాలు - రకాలు

ఉష్ణాన్ని తమ ద్వారా ప్రసారం చేసే ధర్మం ఆధారంగా పదార్థాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

ఉష్ణ వాహకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరుగుతుంది.

ఉదాహరణ: లోహాల్లో అత్యుత్తమ ఉష్ణవాహక పదార్థం వెండి. తర్వాత రాగి, అల్యూమినియం, ఇనుము, పాదరసం, ఉక్కు మొదలైనవి ఉత్తమ ఉష్ణ వాహకాలు.

ఉష్ణ బంధకాలు: ఈ పదార్థాల ద్వారా ఉష్ణ ప్రసారం జరగదు.

ఉదాహరణ: అత్యుత్తమ ఉష్ణబంధక పదార్థం వజ్రం. తర్వాత ప్లాస్టిక్ వస్తువులు, రబ్బరు, చెక్కదిమ్మె, దూది, దుస్తులు, కాగితం, థర్మోకోల్ మొదలైనవి ఉత్తమ ఉష్ణ బంధకాలు.

- వంటపాత్రల తయారీకి ఉష్ణ వాహక పదార్థాలను వాడతారు. వాటి పిడుల తయారీకి మాత్రం ఉష్ణ బంధక పదార్థాలను వినియోగిస్తారు.
- నీరు, గాలి అధమ ఉష్ణ వాహకాలు.
- మంచు, మానవ శరీరం మంచి విద్యుత్ వాహకాలు. కానీ ఉష్ణం దృష్ట్యా బంధక ధర్మాన్ని ప్రదర్శిస్తాయి.

ఉష్ణోగ్రత

ఒక వస్తువు ఉష్ణ తీవ్రత(చల్లదనం లేదా వెచ్చదనం)ను ఉష్ణోగ్రత అంటారు.

ప్రమాణాలు:
- సెల్సియస్ లేదా సెంటీగ్రేడ్ (°C)
- ఫారన్‌హీట్ (F)
- కెల్విన్- K(అంతర్జాతీయ ప్రమాణం)
- రేమర్
- రాంకైన్
- ప్రస్తుతం రేమర్, రాంకైన్ ప్రమాణాలను ఉపయోగించడం లేదు.
- సెంటీగ్రేడ్, ఫారన్‌హీట్, కెల్విన్ ప్రమాణాల మధ్య సంబంధం.

$$\frac{C-0}{100} = \frac{F-32}{180} = \frac{K-273}{100}$$

ఉష్ణ మాపకాలను స్థూపాకారంలో నిర్మించడం వల్ల వాటి సున్నితత్వం పెరిగి కచ్చితమైన రీడింగ్‌లను సూచిస్తాయి.

- సెల్సియస్‌లు, ఫారన్‌హీట్‌లు ఒకదానితో ఒకటి ఏకీభవించే రీడింగ్ – 40.

C = F = x అనుకుంటే

$$\frac{C-0}{100} = \frac{F-32}{180}$$

$$\frac{x}{100} = \frac{x-32}{180}$$

$10x–320=18x$

$8x = –320$

$x = – 40$

సెల్సియస్, కెల్విన్‌ల మధ్య సంబంధం:

$$\frac{C-0}{100} = \frac{K-273}{100}$$

C= K –273

$$K = (C + 273)\ Kelvins$$

i) మంచు ఉష్ణోగ్రతను కెల్విన్‌లలో తెలిపినప్పుడు..
= (°C+ 273)
= 0°C+273= 273K

ii) నీటి ఆవిరి ఉష్ణోగ్రత 100°C, చంద్రుడిపై పగటి సగటు ఉష్ణోగ్రత 100°C అనుకుంటే అవి కెల్విన్‌లలో..
= 100°C+ 273= 373 K

iii) నీటి అసంగత వ్యాకోచ ఉష్ణోగ్రత 4°C అయితే కెల్విన్‌లలో..
= °C+273
= 4°C+ 273
= 277 Kelvins

iv) ఆరోగ్యవంతుడైన మానవుడి శరీర ఉష్ణోగ్రత 37°C అయితే కెల్విన్‌లలో..
= °C+273
= 37°C+ 273
= 310 Kelvins

v) పాల పాశ్చరైజేషన్ ఉష్ణోగ్రత 67°C. ఈ విలువ కెల్విన్‌లలో..
K= °C+273
K= 67°C+ 273
K= 340 Kelvins

vi) గది ఉష్ణోగ్రత(25°C) వద్ద ఒక పాత్రలో బంధించి ఉన్న వాయువులు –273°Cకు చల్లార్చినప్పుడు ద్రవాలుగా మారి పీడనం శూన్యమవుతుంది.

–273°C కెల్విన్‌లలో..
K= °C+273
K= –273 + 273
K= 0 Kelvin (పరమశూన్య ఉష్ణోగ్రత)

ఉష్ణమాపకాలు- రకాలు

ఒక వస్తువు ఉష్ణోగ్రతను కొలవడానికి ఉష్ణ మాపకాన్ని ఉపయోగిస్తారు. దీన్ని 16వ శతాబ్దంలో గెలీలియో కనుగొన్నాడు.

ఘన పదార్థ ఉష్ణ మాపకాలు

ఘన పదార్థాలను వేడిచేసినప్పుడు అవి వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ఈ ఉష్ణ మాపకాలు పనిచేస్తాయి. అయితే భిన్నమైన ఘన పదార్థాల ఉష్ణ వ్యాకోచాలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి ఇలాంటి ఉష్ణ మాపకాలను ఉపయోగించి వస్తువుల ఉష్ణోగ్రతలను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు. అందువల్ల ఇలాంటి మాపకాల్ని ప్రస్తుతం ఉపయోగించడం లేదు.

ద్రవ పదార్థ ఉష్ణ మాపకాలు

ద్రవ పదార్థాలను వేడి చేసినప్పుడు వాటి ఘన పరిమాణాలు వ్యాకోచిస్తాయి. ఈ సూత్రం ఆధారంగా ద్రవ పదార్థ ఉష్ణమాపకాలు పనిచేస్తాయి. వీటిలో పాదరసం, ఆల్కహాల్ లేదా నీటిని ఉపయోగిస్తారు.

- శీతల ప్రాంతాల్లో వస్తువుల ఉష్ణోగ్రతలను కొలవడానికి ఉపయోగించే ఉష్ణమాపకాన్ని క్రయోమీటర్ (Cryometer) అంటారు. సాధారణంగా వీటిలో ఆల్కహాల్ ఉష్ణమాపకాలను ఉపయోగిస్తారు.
- నీటి విశిష్టోష్ణం ఎక్కువ ఉండి, ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లబడే గుణాన్ని కలిగి ఉండటం వల్ల వాహనాల రేడియేటర్లలో కూలెంట్ (శీతలీకరణి)గా నీటిని ఉపయోగిస్తారు.

ద్రవ పదార్థ ఉష్ణమాపకాల్లో నీటికి బదులుగా పాదరసాన్ని ఉపయోగించడానికి కారణాలు..

పాదరసం	నీరు
పాదరసం సంకోచ, వ్యాకోచాలు పరస్పరం సమానంగా ఉంటాయి.	నీటి సంకోచ, వ్యాకోచాలు సమానంగా ఉండవు.
పాదరసం.. మాపకాల గోడలకు అంటుకోదు.	నీటి అణువులు మాపకాల గోడలకు అంటుకుంటాయి.
స్వభావరీత్యా పాదరసం వెండిలా మెరుస్తుంది. అందువల్ల రీడింగ్‌లను కచ్చితంగా గుర్తించవచ్చు.	నీటికి రంగు ఉండదు. కాబట్టి రీడింగ్‌లను కచ్చితంగా కొలవడం సాధ్యం కాదు.
అన్ని ద్రవపదార్థాలతో పోల్చినప్పుడు పాదరసం విశిష్టోష్ణం కనిష్ఠం. కాబట్టి ఇది త్వరగా వేడెక్కి త్వరగా చల్లబడుతుంది.	నీటి విశిష్టోష్ణం అన్ని ద్రవపదార్థాల కంటే ఎక్కువ. అందువల్ల ఆలస్యంగా వేడెక్కి, ఆలస్యంగా చల్లారుతుంది.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

అంతర్జాతీయ ఆపరేషన్లు

ఆపరేషన్ సైలెన్స్: లాల్ మసీదులోని మత ఛాందసవాదులను, తీవ్రవాదులను ఏరివేయడానికి పాకిస్తాన్ సైన్యం చేపట్టిన చర్య.

ఆపరేషన్ ఖుక్రీ: 222 మంది భారత సైనికులను విడిపించడానికి ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక దళాలు సియెర్రా లియోన్‌లో చేపట్టిన చర్య. ఇది రివెల్యూషనరీ యునైటెడ్ ఫ్రంట్‌కు వ్యతిరేకంగా జరిగింది.

ఆపరేషన్ తొపక్: భారతీయ యువకులకు ధనాశ చూపి సైనిక శిక్షణ ఇచ్చి భారతదేశంలో అలజడులు సృష్టించడం ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం. దీన్ని 1988లో జనరల్ జియా-ఉల్-హక్ (పాకిస్తాన్) ప్రారంభించారు.

MODEL QUESTIONS

A European visitor to the..

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, i"f any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)

2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3)/ is not possible. (4)/ No error (5)

3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)

4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)

5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
1) Much books 2) few books
3) some books 4) more books
5) No correction required

7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
1) Himself to 2) his self to
3) himself for 4) his self from
5) No correction required

8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
1) from previous three years
2) during the previous three years
3) three years previous
4) during the three previous years
5) No correction required

9. She always <u>manage</u> to hurt her mother's feelings.
1) do manage
2) does manage
3) did manages
4) do managed
5) No correction required

10. It is the people <u>who matters</u> in a democracy.
1) whom matters
2) whoes matters
3) whose matter
4) who matter
5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
1) dissent 2) decent
3) descent 4) dissaude
5) dispute

12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
1) Fight, draw
2) Position, aspect
3) Plight, drain
4) Struggle, issue
5) Rank, exhaust

13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
1) proper, for
2) correct, along
3) suitable, among
4) valid, from
5) compelling, counter

14. The modern ______ of communication have ______ distance.
1) ways, deep
2) methods, destroyed
3) paths, shortened
4) means, annihilated
5) gadgets, developed

15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
1) apposite, position
2) opposite, fact
3) relevance, media
4) significance, party
5) applaudable, generation



Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F

17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

18. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E

20. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the _______ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelslam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above
4) always 5) alone

22. 1) lost 2) last 3) late
4) lastly 5) lasted

23. 1) urge 2) urging 3) urged
4) pledged 5) plead

24. 1) tight 2) treat 3) tread
4) tough 5) track

25. 1) hate 2) hurt 3) heat
4) hurt 5) hunt

26. 1) thought 2) thinking
3) think 4) thinned
5) thanked

27. 1) from 2) with 3) for
4) form 5) firm

28. 1) suspense 2) suspect
3) suspected 4) suspecting
5) suspects

29. 1) convicted 2) allowed
3) acquitted 4) arrested
5) prosecuted

30. 1) are to 2) will be
3) will been 4) have been
5) were

KEY

1) 3	2) 2	3) 4	4) 5	5) 4
6) 3	7) 1	8) 2	9) 2	10) 4
11) 3	12) 3	13) 4	14) 4	15) 1
16) 4	17) 1	18) 5	19) 1	20) 3
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 2	28) 3	29) 4	30) 5

ఉద్యోగాలు

సీఎస్ఐఆర్-సీఎంఈఆర్ఐలో 74 పోస్టులు

దుర్గాపూర్(పశ్చిమ బెంగాల్)లోని సెంట్రల్ మెకానికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఈఆర్ఐ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 74.
- » **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్-1, ప్రాజెక్ట్ అసోసియేట్ 1-/ప్రాజెక్ట్ అసోసియేట్ 2-, ప్రాజెక్ట్ జేఆర్ఎఫ్/ప్రాజెక్ట్ అసోసియేట్ 1-, ప్రాజెక్ట్ జూనియర్ రీసెర్చ్ ఫెలో-, ప్రాజెక్ట్ జూనియర్ రీసెర్చ్ ఫెలో/జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్/ప్రాజెక్ట్ అసోసియేట్1-, ప్రాజెక్ట్ అసోసియేట్2-, ప్రాజెక్ట్ అసిస్టెంట్2-, ప్రాజెక్ట్ అసోసియేట్2/ప్రాజెక్ట్ అసోసియేట్1-.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ, యూజీసీ నెట్, గేట్ స్కోరు, పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 30.09.2024, 01.10.2024.
- » **ఇంటర్వ్యూ వేదిక:** సీఎస్ఐఆర్- సెంట్రల్ మెకానికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, మహాత్మా గాంధీ అవెన్యూ, దుర్గాపూర్, పశ్చిమ బెంగాల్.
- » **వెబ్‌సైట్:** https://www.cmeri.res.in

అడ్మిషన్స్

మనూలో దూరవిద్యలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ వర్సిటీ(మనూ), డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు:
- » **పీజీ కోర్సులు:** ఎంఏ: ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, హిందీ.
- » **కోర్సువ్యవధి:** రెండేళ్ల వ్యవధి (నాలుగుసెమిస్టర్లు).
- » **యూజీ కోర్సులు:** బీఏ, బీకాం, బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస్).
- » **కోర్సు వ్యవధి:** మూడేళ్ల వ్యవధి (ఆరు సెమిస్టర్లు).
- » **డిప్లొమా కోర్సులు(రెండు సెమిస్టర్లు):** టీచ్ ఇంగ్లిష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్.
- » **సర్టిఫికేట్ కోర్సులు(ఒక సెమిస్టర్):** ఫంక్షనల్ ఇంగ్లిష్, ప్రొఫిషియన్సీ ఇన్ ఉర్దూ త్రూ ఇంగ్లిష్.
- » **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024.
- » **వెబ్‌సైట్:** https://manuu.edu.in